ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
fb.com/vaartha Digital
Published from Srikakulam ,Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
25-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 114 పేజీలు: 16 వెల: 6.50

జులై 1నుంచి వివిజి రామ్‌జీ అమలులోకి 3లో
క్వెట్టాలో రైలు పట్టాలపై భారీ పేలుడు, 24మంది దుర్మరణం 5లో

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోడీ (ఫైల్)

ప్రధాని మోడీకి నేను మెగా ఫ్యాన్‌ను.. ఆయన గొప్ప ఫ్రెండ్
పొగడ్తలతో ముంచెత్తిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్

న్యూఢిల్లీ, మే 24: ప్రధానిమోడీ ఒక గొప్ప వ్యక్తి. నేను ఆయన్ను ఎంతో అభిమానిస్తా, ఆయనకు మెగా ఫ్యాన్‌ను అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పొగడ్తలతో ప్రధానిమోడీని ముంచెత్తారు. మా రెండుదేశాల్లోను గొప్ప ఆర్థిక వ్యవస్థ ఉంది. రికార్డుస్థాయి స్టాక్ మార్కెట్లు పనిచేస్తున్నాయి. అమెరికానుంచి ఏది కావాలనుకుంటే భారత్ అది సాధించుకోగలదు. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చి 250 సంవత్సరాలు అయిన సందర్భంగా భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ఏర్పాటుచేసిన మెగా కార్యక్రమంలో ట్రంప్ చేసిన విడియోకాల్ వైరల్ అయింది. అతిపెద్దస్క్రీన్‌పై మోడీని ప్రశంసిస్తున్న ట్రంప్‌ను చూసి ప్రేక్షకులు చప్పట్లు మారుమోగించారు. మోడీ తన ప్రసంగంలో భారత్‌కు ఏదికావాలన్నా ఎవరికి కాల్‌చేయాలో భారత్‌కు తెలుసునని, నేరుగా తమకే కాల్‌చేస్తారని, మా ఇద్దరిమధ్య మంచి స్నేహబంధం ఉందంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇద్దరం కలిసి రికార్డులు నమోదుచేయగలమని ట్రంప్ ధీమా ప్రకటించారు. అలాగే అమెరికా రాయబారి సెర్గియోగోరే, అమెరికా విదేశాంగమంత్రి మార్కోరుబియోలను కూడాప్రశంసించారు. అమెరికాకు ఒక గొప్ప విదేశాంగ కార్యదర్శి రుబియో అని అమెరికా చరిత్రలోనే ఇంతటి >>2

48.3°
తూ.గో జిల్లా చిట్యాలలో ఉష్ణోగ్రత అత్యధికం
తణుకు, పిడుగురాళ్ల: 48.1°
వడదెబ్బకు మరో 18 మంది బలి

విజయవాడ,మే 24, ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. రోహిణీ కార్తె ప్రవేశానికి ముందే ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరింది. వడగాలుల తీవ్రత తోడవడంతో జనం బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. రాష్ట్రంలోని 17 జిల్లాల పరిధిలోని దాదాపు 174 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటేశాయి. ముఖ్యంగా కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత తీవ్రంగా మారింది. తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో అత్యధికంగా 48.3 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అటు పల్నాడు జిల్లా పిడుగురాళ్లతో పాటు పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 48.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలో ఎండ తీవ్రత రికార్డుస్థాయిలో నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. మరో మూడు రోజులు పాటు ఇదే తీవ్రత కొనసాగే అవకాశం ఉందన్నారు. వీలైనంత వరకు ఉదయం 11నుంచి సాయంత్రం 4 మధ్య ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. అత్యవసర ప్రయాణాల్లో తప్పనిసరిగా మంచినీరు వెంట తీసుకుని >>2

రైతులకు ఎలాంటి నష్టం రానివ్వం

ఉద్యాన, ఆక్వారంగాల సమస్యలు పరిష్కరిస్తాం
యూరియా కొరతలేదు: మంత్రి అచ్చెన్నాయుడు

విజయవాడ మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో రైతులు, పౌల్ట్రీ, ఉద్యాన, ఆక్వారంగాలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై కూటమి ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా పనిచేస్తోందని, రైతాంగ ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. యూరియా లభ్యత నుంచి మొక్కజొన్న ధరలు, రొయ్యల మార్కెట్ పరిస్థితులు, కొబ్బరి రైతులు సమస్యలు అనంతపురం నీటి ఎద్దడి వరకు ప్రతి అంశంపై వ్యవసాయ అనుబంధ శాఖల డైరెక్టర్స్ తో మంత్రి జూమ్ సమావేశం నిర్వహించి ప్రతి అంశంపై లోతైన చర్చ జరిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతు సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రాజీ పడదు. ప్రజా సమస్యలను పరిష్కరించడం మా లక్ష్యం. కానీ వైసీపీ నాయకులు మాత్రం సమస్యల పరిష్కారంపై కాకుండా రాజకీయ లాభాల కోసం అబద్దాల ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలు వాస్తవాలను బాగా అర్థం చేసుకుంటున్నారు అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేకుండా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అధికారులు వివరించారు. అవసరమైన నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు గిట్టుబాటు దరలు అందేలా మార్కెట్ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తోంది. మధ్యవర్తుల దోపిడిని అరికట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం కారణంగా వచ్చిన తాత్కాలి పరిస్థితులను అధిగమించేందుకు మత్స్య శాఖ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడు >>2

అనుబంధ రంగాలలో పరిశ్రమల వెల్లువ



ఇంటికో పారిశ్రామికవేత్త ప్రభుత్వ లక్ష్యం
వివిధ ఉత్పత్తులు గ్లోబల్ బ్రాండ్స్ కావాలి
15 లేబర్ అడ్డాలు నిర్మిస్తున్నాం
కార్మికులకు నైపుణ్య అభివృద్ధిలో శిక్షణ: సిఎం చంద్రబాబు

విజయవాడ, మే 24, ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో ఏర్పడే భారీ పరిశ్రమలకు అనుబంధ రంగాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలకు అవకాశం ఉందని. సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ పరిశ్రమకు ఎంఎస్‌ఎంఈ రంగంలో ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందన్నారు రాష్ట్రానికి భారీ పరిశ్రమలు వస్తున్న సందర్భంలో ఏర్పడే ఎకో సిస్టంలో ఎంఎస్‌ఎంఈలు కీలక పాత్ర పోషించేలా కార్యచరణ చేపడుతున్నట్లు వివరించారు. విజయవాడలో ఈ నెల 26న ఎంఎస్‌ఎంఈల గ్లోబల్ సమ్మిట్ జరుగుతుంది, ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఎంఎస్‌ఎంఈ ద్వారా ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ క్రమంలోనే సోమవారం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గ్రోత్ సమ్మిట్‌ను అన్నిశాఖల అధికారులు విజయవంతం చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ ఔత్సాహికులను ఈ కార్యక్రమంలో ఎలా సమీకృతం చేస్తూ ముందుకు తీసుకువెళ్తామన్నారు. "పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన సంస్థలకు భూ కేటాయింపులు వంటి విషయాల్లో ఏమైనా ఇబ్బందులుంటే వాటిని వెంటనే పరిష్కరించాలి. 22ఏ పరిధిలో ఉన్న ఏపీఐఐసీ భూములను నిషేధిత జాబితా నుంచి తప్పించాలి. రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీల ద్వారా నిషేధిత భూములను క్లియర్ చేయాలి. జిల్లాల్లోని వివిధ ఉత్పత్తులు పాన్ ఇండియా, గ్లోబల్ బ్రాండ్స్ కావాలి. అరకు కాఫీ లాంటి బ్రాండింగ్ ఏపీ ఉత్పత్తులకు రావాలి. మనం రోజూ వారీగా వినియోగించే చాలా ఉత్పత్తుల కొనుగోలు ద్వారా విదేశాలకు డబ్బులు చెల్లిస్తున్నాం. ఏపీ ఉత్పత్తులకు క్వాలిటీ, బ్రాండింగ్ వంటివి వస్తే ఆ ఆదాయం మనకే వస్తుంది. పారిశ్రామిక పార్కులు, ఉత్పత్తి యూనిట్ల వద్ద ఎంఎస్‌ఎంఈ ఎకోసిస్టమ్ అభివృద్ధి కావాలి. భారీ పరిశ్రమలకు అనుబంధ పరిశ్రమలుగా ఎంఎస్‌ఎంఈలు అభివృద్ధి కావాలి. గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ ఏపీకి రావడంతో క్యారియర్ ఏసీ సంస్థ రాష్ట్రానికి వచ్చింది. డేటా సెంటర్లకు, క్వాంటం కంప్యూటింగ్ వంటి వ్యవస్థలకు బల్క్ చిల్లర్స్ ను ఏపీకి వచ్చిన ఏసీ సంస్థలే సరఫరా చేస్తాయి. అమరావతిలో క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ ఏర్పాటు అయ్యింది. క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ పని చేయటం ప్రారంభిస్తే వాటికి కావాల్సిన పరికరాల ఉత్పత్తి కూడా చేసేలా ఎకోసిస్టమ్ >>2

ఎబోలాపై హై అలర్ట్
కాంగో, ఉగాండాల నుంచి వచ్చే ప్రయాణికులకు వైద్య పరీక్షలు
విశాఖ, తిరుపతి, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయాలపై నిఘా
అన్ని జిల్లాలకు ప్రత్యేక ఆదేశాలు: మంత్రి సత్యకుమార్

విజయవాడ,మే24,ప్రభాతవార్తప్రతినిధి: ఆఫ్రికా ఖండంలోని పలు దేశాల్లో ఎబోలా వైరస్ విస్తృతి, కేసులు, మరణాల నమోదు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మ్నుఖ్యగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాల్లో 'ఏబోలా' వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీచేసిన హెచ్చరికలు, కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు వస్తున్న ప్రత్యేక మార్గదర్శకాలు, సలహాలు, సూచనల ఆధారంగా 'ఎబోలా' వైరస్ వ్యాప్తి, కేసులను సమర్థంగా ఎదుర్కొనేందుకు వైద్య, ఆరోగ్య శాఖ సిద్దంగా ఉందని మంత్రి ప్రకటించారు. ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా దేశాల్లో ఎబోలా తీవ్రత రోజురోజుకీ పెరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో సదరు దేశాల నుంచి రాష్ట్రంలోనికి వైజాగ్, తిరుపతి, విజయవాడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుల ద్వారా వచ్చే ప్రయాణికులు, పర్యాటకులను (ట్రావెల్ హిస్టరీ ఆధారంగా) వైరస్ >>2

ఆఫ్రికా దేశాలకు వెళ్లొద్దు: కేంద్రం

న్యూఢిల్లీ, మే 24: ఆఫ్రికన్ దేశాలలో ఎబోలా వ్యాధి వ్యాప్తి చెందినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో ప్రస్తుతం కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు అత్యవసరం కాని ప్రయాణాలను మానుకోవాలని కేంద్రం దేశ ప్రజలకు సూచించింది. ఆయా దేశాలలో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న భారత పౌరులు, స్థానిక అధికారులు జారీ చేసిన ప్రజారోగ్య మార్గదర్శ కాలను ఖచ్చితంగా పాటించాలని, అధిక జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదివారం సూచించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్ఒ) ఈ పరిస్థితిని అంతర్జాతీయ ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి గా ప్రకటించింది. డెమొక్రాటిక్‌రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఇతర ప్రభావిత దేశాలలో మారుతున్న పరిస్థితి దృష్ట్యా, డబ్ల్యూహెచ్ఒ సిఫార్సులకు అనుగుణంగా, తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్‌కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్‌లకు అత్యవసరంకాని ప్రయాణాలను మానుకోవాలని భారత ప్రభుత్వం >>2

విద్యార్థి మిత్ర కిట్లు రద్దు చేయలేదు
-మంత్రి లోకేష్

విజయవాడ.మే 24, ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిగా నిలిపివేసిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం వందశాతం అవాస్తవమని, కిట్ల పంపిణీని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొన్ని అంతర్జాతీయ కారణాల వల్ల కిట్ల సరఫరాలో సుమారు నెల రోజుల జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నిజాయతీగా జాప్యం గురించి వెల్లడిస్తే, దానిని వక్రీకరించి అసలు కిట్లే ఇవ్వరంటూ వైసీపీ పార్టీ విషప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ముడిసరుకుల ధరలు పెరగడం, రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో యూనిఫాం క్లాత్, బూట్లు, బ్యాగుల సరఫరా ఆలస్యమవుతోందని విద్యాశాఖ అధికారులు తెలిపినట్లు లోకేష్ వివరించారు. అయితే, జూన్ 12న పాఠశాలలు >>2

కోళ్లు విలవిల
ఉష్ణోగ్రత 45° దాటడంతో పౌల్ట్రీ రంగానికి దెబ్బ
ఎపిలో రెండు రోజుల్లో 10లక్షలు పైగా కోళ్ల మృతి
తెలంగాణలోనూ పెద్ద సంఖ్యలో బలవుతున్న వైనం

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త: భానుడి భగభగలకు పౌల్ట్రీ పరిశ్రమ కుదేలవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటిపోవడంతో మూగజీవాలు ఎండ వేడిని తట్టుకోలేక ప్రాణాలు విడు స్తున్నాయి. ముఖ్యంగా గుడ్లు పెట్టే లేయర్ ఫారాలపై ఈ ఎండల ప్రభావం తీవ్రంగా చూపిస్తోంది. చనిపోయిన కోళ్లను గుంతలు తీసి పూడ్చిపెడుతున్న దృశ్యాలు స్థానికంగా కలచివేస్తున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో కోళ్లను కాపాడుకోవడం పౌల్ట్రి రైతులకు కత్తిమీద సాములా మారింది. షెడ్లలో చల్లదనం కోసం అదనంగా లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. కోళ్ల ఫారాల చుట్టూ గోనె సంచులు కట్టి నిరంతరం తడపడం, షెడ్ల పైన గడ్డి వేయడం, లోపల కూలర్లు, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నా ఎండ తీవ్రతకు తట్టుకోలేక కోళ్ల ప్రాణాలు విడుస్తున్నాయి. రాష్ట్రంలోని ఉమ్మడి వరంగల్, రంగారెడ్డి, కరింనగర్, జగిత్యాల, నల్గొండ, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల్లో పెద్దసంఖ్యలో పౌల్ట్రి రైతులు ఉన్నారు.

దేశీయంగా కోళ్లు, గుడ్లఉత్పత్తి, మాంసం లభ్యతలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉంది. పౌల్ట్రి పరిశ్రమపై ఆధారపడి రాష్ట్రంలో దాదాపు 5లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. దేశంలోని కోళ్లలో తెలంగాణలో రాష్ట్రంలోనే 9.39 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో రోజుకు 1,397.2 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతుండగా సగటున 5.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్టు తేలింది. నెల రోజులుగా ప్రతీ రోజూ 45 డిగ్రీలకు పైగా ఎండలు నమోదవుతుం డడంతో ఎండవేడిని తట్టుకోలేక ఫారాల్లోని కోళ్లు ఊపిరాడక కుప్పకూలిపోతున్నాయి. మండే ఎండలకు తోడు తీవ్రమైన >>2

వెంపటి, గరిమెళ్లకు నేడు 'పద్మశ్రీ'లు

వెంపటి కుటుంబశాస్త్రి

ప్రదానం చేయనున్న రాష్ట్రపతి ముర్ము

బాలకృష్ణప్రసాద్(ఫైల్)

విజయవాడ,మే24, ప్రభాతవార్తప్రతినిధి: అన్నమయ్య సంకీర్తనాచార్యుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం), ప్రొఫెసర్ వెంపటి కుటుంబ శాస్త్రిలకు పద్మశ్రీ అవార్డులను ఈ నెల 25వ తేదీన ప్రదానం చేయ నున్నారు. అన్నమయ్య కీర్తనకారులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, కేవలం తాళపత్ర గ్రంథాలకే పరిమితమైన అన్నమయ్య కీర్తనలను అద్భుతమైన రాగయుక్తంగా స్వరకల్పన చేసి, ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లిన అత్యంత ప్రతిభావంతుడైన వాగ్గేయకారుడు ఆయన. 1948 నవంబర్ 9న ఆంధ్రప్రదేశ్‌లో జన్మించిన బాలకృష్ణ ప్రసాద్, చిన్ననాడే తల్లిదండ్రుల వద్ద ప్రాథమిక సంగీత పాఠాలు నేర్చుకున్నారు. అనంతరం ప్రముఖ సంగీత సమ్రాట్ డాక్టర్ నేదునూరి కృష్ణమూర్తి వద్ద శిష్యరికం చేసి, తన శాస్త్రీయ >>2

ఎవరెస్ట్ నుంచి దిగుతూ సందీప్ మృత్యువాత
అమెరికాలో జాబ్ చేస్తున్న హిందూపురం వాసి

సందీప్ (ఫైల్)

హిందూపురం, మే 24 ప్రభాతవార్త: ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్టు శిఖరం విజయవంతంగా అధిరోహించి కిందకి దిగివస్తూ ఉన్నట్టుండి తీవ్ర అస్వస్థతకు గురై హిందూపురానికి చెందిన సందీప్ ఆరే(47) మృతి చెందడం ఈ ప్రాంతంలో వారి సన్నిధిలో విషాదఛాయలు నెలకొన్నాయి. హిందూపురం పట్టణం మేళాపురం తెలుగుతల్లి సర్కిల్ సమీపంలో సొంత ఇల్లు కలిగి బెంగళూరులో స్థిరపడిన ఆర్అండ్‌బి శాఖ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణస్వామికి ఏకైక కుమారుడు సందీప్ స్థానిక దీప్తి స్కూల్ విద్యార్థి. తదుపరి బెంగళూరులో పీజీ చేసి వృత్తిరీత్యా అమెరికాలో స్థిరపడి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసేవారు. పర్వతారోహణపై తీవ్ర మక్కువ కలిగిన సందీప్ ఇందుకోసం లక్షల రూపాయలు వెచ్చించి ట్రెక్కింగ్ చేయడంలో శిక్షణ తీసుకున్నారు. ఈ క్రమంలో ప్రపంచంలోని కష్టసాధ్యమైన పర్వతాలను ట్రెక్కింగ్ విజయవంతంగా పూర్తి >>2

విజయవాడకు మళ్లీ సినిమా వైభవం
స్టూడియోల నిర్మాణానికి సినీప్రముఖులు ముందుకు రావాలి: మంత్రి కందుల దుర్గేష్
చలనచిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా భరత్ భూషణ్ బాధ్యతల స్వీకారం

ఆదివారం విజయవాడలో ఏపీఎస్ఎఫ్టీవీటీడీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్. చిత్రంలో బాలకృష్ణ తదితరులు

విజయవాడ,మే 24,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పి. భరత్ భూషణ్, వైస్ చైర్మన్‌గా సీహెచ్ మెహర్ రమేష్‌లు బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎన్టీఆర్ పరిపాలనా భవనంలోని ఆ సంస్థ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పి.భరత్ భూషణ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో సినిమా, కళలు, నాటకరంగ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి ద్వారా సేవచేసే అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. 1984లో నందమూరి తారకరామారావు డి.వి.యస్.రాజు అధ్యక్షతన ఇలాంటి పూర్తి స్థాయి కమిటీని వేశారని, మళ్లీ ఇన్నేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం సినిమా రంగానికి సంబంధించి కొత్త కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, సినీ రంగంపై ఉన్న ప్రేమతో, ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమ అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో తనకు పూర్తి సహకారం అందించారని, అందుకు వారికి జీవితకాలం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్, కందుల దుర్గేష్‌ల సహకారంతో ఆంధ్ర రాష్ట్రంలో తెలుగు చలన చిత్రరంగ అభివృద్ధికి, సినీ పరిశ్రమ విస్తరణకు తన వంతు బాధ్యతగా పూర్తి కృషి చేస్తానని సభాముఖంగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, >>2

25-05pg2exHMNWJQE.qxd:25-05pg2exHMNWJQE.qxd 1/1/02 7:28 AM Page 1

అనుబంధ రంగాల్లో పరిశ్రమల వెల్లువ

>> వస్తుంది. ఈ విధంగా అభివృద్ధి చెందే ఎకో సిస్టంలో ఎంఎస్ఎంఈలు కీలకంగా ఉండాలి." అని ముఖ్యమంత్రి చెప్పారు.

లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించేలా ప్రణాళికలు: రాష్ట్రంలో 15 లేబర్ అడ్డాలు నిర్మిస్తున్నాం. కార్మికులు పని కోసం రోడ్ల మీద వేచి ఉండకుండా. లేబర్ అడ్డాల్లో కూర్చొంటారు. పని లేని సమయంలో కార్మికులకు స్కిల్ డెవలప్మెంటులో శిక్షణ ఇస్తాం. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వారిలో ఆరోగ్య అవగాహన కల్పించాలి. ప్రివెంటివ్ హెల్త్ సక్సెస్ అయితే ప్రజలకు వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. జిల్లాల వారీగా హెల్త్ స్కోర్ లు తయారు చేయాలి. సోలార్ రూఫ్ టాప్, కుసుమ్ స్కీంలను ఇంటిగ్రేట్ చేసి ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలపై సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, పాఠశాలలు, కళాశాలలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలి. రానున్న కాలంలో విద్యుత్ నిమిత్తం ఒక్క పైసా కూడా ఖర్చు చేయాల్సిన అవసరం రానంతగా ప్రభుత్వ

కార్యాలయాల వద్ద సోలార్ పవర్ ఉత్పత్తి జరగాలి. 22 లక్షల పంపు సెట్లకు పీఎం కుసుమ్ ద్వారా సోలార్ పవర్ పెట్టుకుంటే మంచి ప్రయోజనం ఉంటుంది. బెస్ట్ ప్రాక్టీసెస్ కు మెంటార్లుగా జిల్లాల కలెక్టర్లను నియమిస్తాం. లాజిస్టిక్స్ పార్కులు వస్తే పెద్ద ఎత్తున ఎకనామిక్ యాక్టివిటీ వస్తుంది. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువ పడే అవకాశం ఉంది... దీనికి తగ్గట్టు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. వర్షాధార పంటలు, మెట్ట పంటలు, ఉద్యాన పంటలకు అనుగుణంగా నీటి ప్రణాళికలు చేసుకోవాలి. పశువులకు దాణాకు ఇబ్బంది లేకుం డా జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రీన్ కవర్ పెరగాలి.. అటవీ శాఖ దీనిపై చర్యలు తీసుకోవాలి. స్వచ్ఛ రథాల ద్వారా వ్యర్థాల సేకరణ... స్వచ్ఛ పథాల రహదారుల శుభ్రతపై దృష్టి పెట్టాలి. స్థానిక సంస్థల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తాం." అని సీఎం చంద్రబాబు తెలిపాం రైలు మార్గం ద్వారా ప్రతీ కిలో మీటరుకు రూ. 1.83 వ్యయం అవుతోంది. రహదారి మార్గంలో జరిగే రవాణాపై రూ.3.40 ఖర్చు చేయాల్సి వస్తోంది. రవాణా వ్యయం గణనీయంగా తగ్గితేనే ఏపీకి గరిష్టంగా ప్రయోజనం కలుగుతుంది. పారిశ్రామిక పార్కులకు రోడ్, రైల్ కనెక్టివిటీ పెరగాలి. రాష్ట్రానికి రూ.1 లక్ష కోట్లకు పైగా విలువైన 64 జాతీయ రహదారి ప్రాజెక్టులు వస్తున్నాయి. రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు.. రూ. 2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయి. ఎక్స్ ప్రెస్, లోకల్ ట్రైన్స్ లాంటి ప్రాజెక్టులు వస్తాయి. 4 లేన్లతో రైల్వే మార్గాల విస్తరణ జరగ బోతోంది. ఆర్వోబీలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి కావాలన్నారు.ఇవన్నీ అత్యంత కీలకంశాలు ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఆ దిశలో కార్యాచరణ ఉంటుందన్నారు.

శాంతి ఒప్పందంవైపు అమెరికా, ఇరాన్ అడుగులు..

టెహ్రాన్,వాషింగ్టన్, మే 24: అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన అమెరికా, ఇరాన్ మధ్య వివాదానికి తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి దగ్గరగా ఉన్నాయని, దీనికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ తన చమురును అమ్ముకోవడానికి అనుమతించడం, కీలకమైన హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, వివాదాస్పద అణు కార్యక్రమాన్ని నిలువరించడం వంటి అంశాలు లీక్ అయ్యాయి. ఈ 60 రోజుల ఒప్పందంలో భాగంగా హార్మూజ్ జలసంధిని ఎలాంటి సుంకాలు లేకుండా తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. నౌకల స్వేచ్ఛా రాకపోకల కోసం అక్కడ ఏర్పాటు చేసిన మైన్‌లను తొలగించనుంది. దీనికి బదులుగా, అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేయ నుంది. ఇరాన్ చమురు అమ్మకాలకు వీలుగా కొన్ని ఆంక్షలను సడలించడంతో పాటు స్తంభింపజేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేయనుంది. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన ఇరాన్ అణు కార్యక్రమంపై మాత్రం ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. అణ్వాయుధాలను తయారు చేయబోమని, యురేనియం శుద్ధిని నిలిపివేస్తామని ఇరాన్ హామీ ఇవ్వాలని ఒప్పంద ముసాయిదాలో ఉన్నట్లు ఆక్సియోస్ పేర్కొంది. ప్రాథమిక చర్చల్లో అణు కార్యక్రమం అంశం ఉండదని ఇరాన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇరుపక్షాలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చిన తర్వాతే ఈ క్లిష్టమైన అంశంపై చర్చిస్తారని తెలుస్తోంది. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఈ ఒప్పందంపై కొన్ని గంటల్లో ప్రపంచం ఒక శుభవార్త వినే అవకాశం ఉందని ఆదివారం ఢిల్లీలో వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఒప్పందం చాలావరకు కొలిక్కి వచ్చిందని, అయితే తుదిరూపు రావాల్సి ఉందని తెలిపారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి మాట్లాడుతూ అమెరికాతో సానుకూల వాతావరణం ఏర్పడుతున్నప్పటికీ, కీలక అంశాలపై ఒప్పందం కుదురుతుందని చెప్పలేమన్నారు. ఈ చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్, త్వరలోనే మరో విడత చర్చలు నిర్వహించాలని ఆశిస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ అమెరికా మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తే ఇదివరకటి కంటే తీవ్రమైన పరి ణామాలు ఉంటాయని ఇరాన్ చీఫ్ నెగోషియేటర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ హెచ్చరించడం ఉద్రిక్తతల తీవ్రతకు అద్దం పడుతోంది.

ఇరాన్‌తో శాంతి ఒప్పందం ఖరారు: డొనాల్డ్‌ట్రంప్

ఇరాన్‌తో ఒక విస్తృత శాంతి ఒప్పందం దాదాపు ఖరారైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ ఒప్పందం తుది దశలో ఉందని, త్వరలోనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఒప్పందంపై పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, టర్కీ, ఈజిప్ట్, జోర్డాన్, బహ్రెయిన్ దేశాల అధినేతలతో ఫోన్‌లో చర్చలు జరిపినట్లు తెలిపారు. అమెరికా, ఇరాన్‌తోపాటు పలు ఇతర దేశాల మధ్య ఈ ఒప్పందంపై చర్చలు చాలా వరకు పూర్తయ్యాయని ట్రంప్ పేర్కొన్నారు. కేవలం తుది మెరుగులు మాత్రమే మిగిలి ఉన్నాయని అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో కూడా తాను ప్రత్యేకంగా మాట్లాడానని, ఆ చర్చలు కూడా సఫలమయ్యాయని ట్రంప్ చెప్పారు. ఒప్పందంలోని కీలక అంశాలను ప్రస్తావిస్తూ ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హార్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో తెరవనున్నట్లు స్పష్టం చేశారు.

ఈ పరిణామం భారత్‌కు ఎంతో ముఖ్యమైనదని, గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు అధికంగా చమురు దిగుమతులు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గితే ఇంధన ధరలు, సరఫరా వ్యవస్థపై సానుకూల ప్రభా వం పడే అవకాశం ఉందని అన్నారు. ఈ ఒప్పందం పూర్తి స్వరూపం, ఏ దేశం పాత్ర ఏంటి అనే వివరాలను ట్రంప్ వెల్లడించలేదు

కోళ్లు విలవిల

>> వడగాల్పులు వీస్తుండడంతో ప్రతీ రోజూ వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. ఎండ వేడిని తట్టుకోలేక అటు బ్రాయిలర్, ఇటు లేయర్ కోళ్లు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతుండటంతో పౌల్ట్రి రైతులకు భారీ నష్టాలు తప్పడం లేదు. మునుపెన్నడూ లేని విధంగా ఒకేసారి ఎండలు ముదరడంతో ఏం చేయాలో పాలుపోక రైతులు ఆందోళన చెందుతున్నారు. పొరుగు రాష్ట్రం ఏపిలో రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 10 లక్షల కోళ్లు చనిపోవడంతో వేసవి తాపం పౌల్ట్రీ రైతులకు ఎంతటి నష్టాలను మిగులుస్తుందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఎండల ప్రభావం కేవలం కోళ్ల మరణాలకే పరిమితం కాకుండా కోడి గుడ్ల ఉత్పత్తిని కూడా కోలుకోకుండా దెబ్బతీసింది. ఫారాలలో గుడ్ల దిగుబడి దాదాపు 5 నుండి 10 శాతం వరకు పడిపోయిందని పౌల్ట్రీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్లు మేత సరిగ్గా తినకపోవడం, నీరసించిపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా మారుతోంది. వేసవి ఎండల కారణంగా రైతులు కూడా కొత్త బ్యాచ్‌లు వేయడానికి భయపడుతున్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే రానున్న రోజుల్లో మార్కెట్‌లో చికెన్, కోడిగుడ్ల కొరత ఏర్పడి, వాటి ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. వాస్తవానికి పౌల్ట్రీ రంగానికి ఈ యేడాది అస్సలు కలిసిరాలేదు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన వ్యాధుల కారణంగా అప్పట్లో ఒక బ్యాచ్ పూర్తిగా నష్టపోయింది. ఆ నష్టం నుంచి తేరుకోకముందే.. అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ యుద్ధ వాతావరణం పౌల్ట్రీపై గట్టి దెబ్బకొట్టింది. యుద్ధ ప్రభావంతో కోడిగుడ్ల ఎగుమతులు నిలిచిపోయి, మార్కెట్‌లో ధరలు పాతాళానికి పడిపోయాయి. ఒకవైపు వ్యాధులు, మరోవైపు మార్కెట్ లేకపోవడం, ఇప్పుడు ఊపిరాడకుండా చేస్తున్న ఉక్కపోత.. ఇలా వరుస సంక్షోభాలు పౌల్ట్రీ రంగాన్ని ముంచేస్తున్నాయి.అప్పుల ఊబిలో రైతులు..ఈ ప్రాంతంలో ఆక్వా రంగం తర్వాత ఎన్నో కుటుంబాలు పౌల్ట్రీ పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. రూపాయి రూపాయి కూడబెట్టి, బ్యాంకుల దగ్గర ఆస్తులు తాకట్టు పెట్టి కోట్లలో అప్పులు తెచ్చిన నిర్వాహకులు ఇప్పుడు ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు. లక్షలకు లక్షలు బ్యాంకు రుణాలు తెచ్చి, అప్పులు చేసి పౌల్ట్రి ఫారాలను ఏర్పాటు చేస్తే వేసవి ఎండల కారణంగా కోళ్లు చనిపోతుండడంతో చేతికి పైసా రాకపోగా, ప్రతి నెలా బ్యాంకు వడ్డీలు, మేత (ఫీడ్) ఖర్చుల కోసం రైతులు మళ్లీ అప్పులు చేయాల్సి వస్తోంది. ఈ నష్టాలను భరించలేక కొందరు రైతులు తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యలకు పాల్పడుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

రైతులకు ఎలాంటి నష్టం రానివ్వం

>>తున్నట్లు సమావేశంలో చర్చించారు. కొబ్బరి రైతులకు మద్దతుగా చర్చించారు. కొబ్బరి రైతులకు మద్దతుగా మార్కెటింగ్ అవకాశాలు పెంచడం, సహాయక చర్యలు చేపట్టడంపై ఉద్యానవన శాఖకు మంత్రి దిశానిర్దేశం చేశారు. నీటి ఎద్దడిపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని సాగు తాగునీటి అవసరాల కోసం ప్రత్యామ్నాయ చర్యలు అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

వెంపటి, గరిమెళ్లకు నేడు 'పద్మశ్రీ'లు

>> సంగీత పటిమను మరింత పదును పెట్టుకున్నారు. 1978లో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రారంభించిన అన్నమాచార్య ప్రాజెక్ట్ లో చేరి, దాదాపు మూడు దశాబ్దాల పాటు నిరంతరాయంగా సేవలు అందించారు. ఆ తర్వాత కూడా జీవితాంతం టిటిడి ఆస్థాన విద్వాంసునిగా కొనసాగుతూ అన్నమయ్య సంకీర్తనల వ్యాప్తికి అహర్నిశలు శ్రమించారు.ఆయన ఆరు దశాబ్దాల సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో దేశవిదేశాలలో 6,000కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత లోకానికి ఆయన చేసిన ఈ అనన్య సామాన్యమైన సేవలకు గాను భారత ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ అవార్డు (2020) తో గౌరవించింది. తిరుమల తిరుపతి దేవస్థానం, కంచి కామకోటి పీఠం, అహోబిల మఠంల నుంచి ఆస్థాన విద్వాన్‌బిరుదులను పొందారు. 2025 మార్చి 9న ఈ సంగీత శిఖరం శివైక్యం చెందింది. రాష్ట్రపతి భవన్లో జరిగిన వైభవ వేడుకలో ఆయన తరపున వారి కుటుంబ సభ్యులు ఈ విశిష్ట పురస్కారాన్ని రాష్ట్రపతి చే అందుకుంటారు.ప్రొఫెసర్ వెంపటి కుటుంబశాస్త్రి భాషా సేవలకు గుర్తింపుగా ఇప్పటికే 2014లో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా సర్టిఫికేట్ ఆఫ్ ఆనర్ లభించింది.

ఎబోలాపై హై అలర్ట్

>> నిర్ధారణ పరీక్షలు చేసే విషయంలో ఎయిర్ పోర్ట్ అథార్టీ, సదరు జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నేడొక ప్రకటనలో తెలిపారు. వైరస్ లక్షణాలు కలిగిన వారిని వెంటనే క్వారంటైన్ చేసి, పక్కనున్న వారికి కూడా వెంటనే వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. విశాఖ ఓడరేవు అధికారులతో కూడా మాట్లాడి, ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగాన్ని ఆదేశించామని చెప్పారు. విమానాల ద్వారా కాకుండా రోడ్డు మార్గాల ద్వారా వచ్చే వారి విషయంలోనూ అవసరమైన చర్యలు ఉంటాయన్నారు. ఎబోలా వైరస్ పీడిత దేశాలనుంచి వచ్చే ప్రయాణికుల వివరాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, ఇందుకు అనుగుణంగా అవసరమైన సమాచారాన్ని సదరు రాష్ట్రాలకు పంపుతోందని తెలిపారు.కొవిడ్ హయాంనాటి అనుభవాలు దృష్టిలో పెట్టుకుని 'ఏబోలా' విషయంలో ముందస్తు జాగ్ర త్తలు, అత్యవసర పరిస్థితులుతలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

ఐసోలేషన్ వార్డులు సిద్ధం: అంతర్జాతీయ విమానాశ్రయాల నగరాల్లోని టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసే ఐసోలేషన్ వార్డుల్లో 15 పడకల చొప్పున ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రం నుంచి వస్తున్న సమాచారాన్ని జిల్లాలకు పంపుతూ అందర్ని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. పీపీఈ , వైరస్ నిర్ధారణ పరీక్షల కిట్లు తక్షణ అవసరాలకు సరిపడ ఉన్నాయని తెలిపారు.

లక్షణాలు ఏలా ఉంటాయంటే: ఎబోలా (బుండిబుగ్యో) వైరస్ కేవలం వారాల వ్యవధిలోనే మూడు దేశాల్లోని అనేకమందికి సోకింది. భౌగోళికంగా కూడా ఈ వ్యాధి వ్యాపించిన ప్రదేశంలో కట్టడి చేయడం కష్టం. వైరస్ సోకిన వారికి కొన్నివారాలపాటు లక్షణాలు బయటపడవు. దీనివల్ల ఎక్కువ మందికి తక్కువ వ్యవధిలో సోకే అవకాశం ఉంది. సాధారణ జ్వరం, అకస్మాత్తుగా జ్వరం పెరిగిపోవడం, శరీరం మొత్తం బలహీనంగా అనిపించడం, తీవ్ర తలనొప్పి, గొంతునొప్పి, కండరాల నొప్పులు, రోజురోజుకి నొప్పులు తీవ్రమవుతుండటం, వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి, కళ్ల ఎర్రబారడం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు ఎబోలా వైరస్ బారినపడిన వారిలో కనిపిస్తున్నాయి.

ఆఫ్రికా దేశాలకు వెళ్లొద్దు: కేంద్రం

>> భారత పౌరులందరికీ సూచిస్తోంది అని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. బండిబుగ్యో వైరస్ స్ట్రెయిన్ వల్ల కలిగే ఎబోలా వ్యాధికి సంబంధించిన ఒక్క కేసు కూడా భారతదేశంలో నమోదు కాలేదని మంత్రిత్వ శాఖ తెలిపింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండాలను ప్రభావితం చేస్తున్న బండిబుగ్యో స్ట్రెయిన్ ఎబోలా వైరస్ కొనసాగుతున్న వ్యాప్తిని, ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (ఆఫ్రికా సిడిసి) అధికారికంగా ఖండాంతర భద్రత దృష్ట్యా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించింది. అంతేకాకుండా, మే 22న డబ్ల్యూహెచ్ఓ ఐహెచ్ఆర్ అత్యవసర కమిటీ, "బండిబుగ్యో వైరస్ ఉన్నట్లు నమోదు చేయబడిన ప్రాంతాల నుండి వచ్చే, కారణం తెలియని జ్వరంతో బాధపడుతున్న ప్రయాణికులను గుర్తించడం, అంచనా వేయడం, నివేదించడం, నిర్వహించడం"తో పాటు "బండిబుగ్యో వైరస్ ఉన్నట్లు నమోదు చేయబడిన ప్రాంతాలకు ప్రయాణించకుండా నిరుత్సాహపరచడం" కోసం ప్రవేశ ద్వారాల వద్ద వ్యాధి నిఘాను బలోపేతం చేయడానికి తాత్కాలిక సిఫార్సులను జారీ చేసింది. ఎబోలా వ్యాధి అనేది ఎబోలా వైరస్ యొక్క బండిబుగ్యో వైరస్ స్ట్రెయిన్ సంక్రమణ వలన కలిగే ఒక వైరల్ హెమరేజిక్ జ్వరం. ఇది అధిక మరణాల రేటు కలిగిన ఒక తీవ్రమైన వ్యాధి. ప్రస్తుతం బుండిబుగ్యో వైరస్ జాతి వల్ల కలిగే ఎబోలా వ్యాధిని నివారించడానికి లేదా చికిత్స చేయడానికి ఎలాంటి టీకాలు లేదా నిర్దిష్ట చికిత్సలు ఆమోదించబడలేదు. బుండిబుగ్యో వైరస్ చాలా ప్రమాదకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది.

హస్త కళాకారులకు గౌరవ ప్రద జీవనమే లక్ష్యం

తరంగా ఏఐ ఆధారిత డిజిటల్ వ్యవస్థ రూపకల్పన

రాష్ట్ర స్థాయి నుంచే లేపాక్షి షో రూమ్‌ల పర్యవేక్షణ: మంత్రి సవిత

విజయవాడ,మే 24,ప్రభాతవార్తప్రతినిధి: హస్త కళారూపాలు కేవలం వస్తువులే కాదు ఆయా ప్రాంతాల సాంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నాలు. వారసత్వ ప్రదాతలు హస్త కళాకారులు. చరిత్రకు ఆనవాలుగా నిలిచే హస్త కళలకు, హస్త కళాకారులకు కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. హస్త కళా కారులకు గౌరవప్రదమైన జీవనం అందిస్తూనే, హస్త కళారూపాలకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని నిర్ణయించింది. ఇందుకు సాంకేతికతను సాధనంగా వినియోగిస్తోంది. రెండేళ్ళ కాలంలో లేపాక్షి ప్రగతి నివేదికను మంత్రి సవిత ఒక ప్రకటనగా వెల్లడించారు. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణతో పాటు కళాకారుల గుర్తింపు, సృజనాత్మకతతో వారు రూపొందించే కళా రూపాలను సామాన్య ప్రజలకు సైతం సకాలంలో అందించేలా ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించింది. ఆయా కళారూపాల విశిష్టత, సాంస్కృతి సంప్రదాయలను తెలిపేలా ఏఐ టూల్ ను వినియోగిస్తూ మరో ప్రత్యేక యాప్ ను తీసుకొచ్చింది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న వినియోగదారుల అభిరుచులకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో హస్త కళలకు ప్రాచుర్యం కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాచీన భారతీయ సాంస్కృతి, సంప్రదాయాలను హస్త కళారూపాల్లో ప్రస్తుత తరానికి హస్త కళాకారులు అందిస్తూ వస్తున్నారు. సరైన ప్రాచుర్యం, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో హస్త కళాకారుల జీవనం భారంగా గడుస్తోంది. లేపాక్షి షో రూమ్ ల నిర్వహణతో ప్రభుత్వాలు హస్త కళలకు ప్రోత్సహిస్తూ వస్తున్నాయి. అవి పూర్తిస్థాయిలో హస్త కళాకారులకు భరోసా కల్పించలేకపోతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అటు కళలను ప్రోత్సాహిస్తూనే, ఇటు హస్త కళాకారులకు మెరుగైన జీవనం అందించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీహెచ్డీసీ) ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఒకవైపు నేటితరం అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తూ, లేపాక్షి షో రూమ్ లకు నూతన హంగులు కల్పిస్తోంది. మరో వైపు హస్త కళాకారులకు నూతన ఆవిష్కరణలు చేసేలా శిక్షణ అందజేస్తోంది. అదే సమయంలో హస్త కళాకారులు రూపొందించిన కళారూపాలను వినియోగదారుల చెంతకు చేర్చేలా ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు తరంగా అనే రియల్ టైమ్ వ్యవస్థను,ఏఐ టూల్‌తో కళాక్షి అనే యాప్ ను రూపొందించింది. ఈ రెండింటినీ త్వరలోనే ప్రారం భించి, హస్త కళల అమ్మకాలు పెంచేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది.

తరంగాతో లేపాక్షినిర్వహణ: ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరే షన్(ఏపీ హెచ్డీసీ) ఆధ్వర్యంలో 19 లేపాక్షి షో రూమ్ లున్నాయి. వాటిలో ఢిల్లీ, కోల్ కత్తా, హైదరా బాద్ మినహా మిగిలిన 16 షో రూమ్ లూ ఏపీలోనే ఉన్నాయి. ప్రస్తుతం ఆయా షో రూమ్ ల నిర్వహణలో జిల్లా స్థాయి అధికారుల నేతృత్వంలో సాగుతోంది.ఇకపై అన్ని షో రూమ్‌ల నిర్వహణకు రాష్ట్ర స్థాయి అధికారుల పర్యవేక్షణలో జరిగేలా తరంగా పేరుతో ఏఐ ఆధారిత కమాండ్ కంట్రోల్ వ్యవస్థను రూపొందించారు.

రద్దు చేయలేదు

>> పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని లోకేష్ పేర్కొన్నారు.

ఆయన గొప్ప ఫ్రెండ్

>> గొప్ప నాయకుడు లేడని కొనియాడారు. అంతకు ముందురోజే అమెరికా రాయబారి సెర్గియోగోరే ప్రధాని మోడీని అమెరికా సందర్శనకు రావాలని ట్రంప్ చేసిన ఆహ్వానాన్ని అందచేసారు. రుబియో తన పర్యటనలో మాట్లాడుతూ భారత్, అమెరికాలమధ్య సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుతోందన్నారు.

48.3°

>> వెళ్లాలన్నారు. ఇవాళ సీజన్లోనే గరిష్ఠ ఉష్ణోగ్రత తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా తణుకు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1డిగ్రీలు నమోదైందని పేర్కొన్నారు. 13 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు దాటినట్లు తెలిపారు.17 జిల్లాల పరిధిలోని 174 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని ఆయన వెల్లడించారు.ఇందులో ముఖ్యంగా ఏలూరు 23, తూర్పుగోదావరి 21, పశ్చిమగోదావరి 17, కృష్ణా 16, బాపట్ల 15, ఎన్టీఆర్ 14, పల్నాడు 13, కోనసీమ 12, కాకినాడ 11 మండలాల్లో ఎండ ఉధృతి ఎక్కువగా చూపిందన్నారు.ఆదివారం తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3డిగ్రీలు, పశ్చిమగోదావరిజిల్లా తణుకు, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 48.1,ఏలూరుజిల్లా కుక్కునూరు పోలవరం(జి)కూనవరం లో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1, కోనసీమజిల్లా రామచంద్రాపురం, కాకినాడజిల్లా కాజులూరులో 46.5, బాపట్లజిల్లా కూచినపూడిలో 46.2, ఎన్టీఆర్‌జిల్లా మైలవరంలో 45.7, విశాఖ రూరల్ 45.6, ప్రకాశంజిల్లా కారేడులో 45.5, నెల్లూరుజిల్లా కొమ్మిపాడులో 45.2, మార్కాపురంజిల్లా నందనమారెళ్లలో 44.6 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు.ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక అంచనాలను అనుసరించి రాష్ట్రంలో ఆదివారం 18 మరణించినట్లు ఆయా మృతుల కుటుం బాల సమాచారాన్ని అనుసరించి అధికార యంత్రాంగం అనుమానిస్తుంది.ఒక్క విజయవాడ నగరంలో పాత బస్తీ(వన్‌టౌన్)9, గుంటూరులో ఇద్దరు, మచిలీపట్టణం ఒకరు,జగ్గయ్యపేటలో ఇద్దరు, నందిగామ, ఏలూరు, విశాఖ, పాడేరు లో ఒక్కొక్కరు వడదెబ్బకు మృతి చెందినట్లు సమాచారం.

విస్తరిస్తున్న ద్రోణి: ఒడిశా నుంచి ఉత్తరాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉంది దీని ప్రభావంతో మార్కాపురం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అలాగే మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు.

విజయవాడకు మళ్లీ సినిమా వైభవం

>> టెలివిజన్ మరియు నాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ చిక్కాల మెహర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సినిమా పరిశ్రమ పురోగతి సాధిస్తుందన్నారు. ఒకప్పుడు తమి ళనాడు, ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలివెళ్లిన చిత్ర పరిశ్రమను, మళ్లీ ఆంధ్రప్రదేశ్‌లో ఒక మంచి 'ఫిలిం ఫ్రెండ్లీ' వాతావరణం కల్పించేందుకు ఈ బోర్డుని ఎంపిక చేశారని తెలిపారు. రాష్ట్రంలో సినిమా మౌలిక వసతుల అభివృద్ధి చేయడంతో పాటు, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడమే తమ లక్ష్యమని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతోనే తాను ఈ బోర్డులోకి వచ్చానన్నారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ మరియు సాంస్కృతిక వ్యవ హారాలు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు రాష్ట్రంలో కళలు, సినిమా, నాటకం మరియు టీవీ రంగాలకు ఎలాంటి ప్రోత్సాహం లభించలేదని, ఈ రంగాలు పూర్తిగా నిర్లక్ష్యం చేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ప్రధాని నరేంద్ర మోదీల నాయకత్వంలో రాష్ట్రంలో కళల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో షూటింగ్ లొకేషన్లకు కొదవలేదని, అయితే సినిమా స్టూడియోలు, డబ్బింగ్ థియేటర్లు, రికార్డింగ్ థియేటర్లు వంటి మౌలిక సదుపాయాలను నిర్మించడానికి నిర్మాతలు, సినీ పెద్దలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు సినిమా పరిశ్రమకు కీలక కేంద్రంగా ఉన్న విజయవాడకు, అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చలన చిత్ర రంగంలో మళ్లీ పూర్వవైభవం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్, నాటకరంగ అభివృద్ధి సంస్థ నూతన చైర్మన్‌గా నియమితులైన పి. భరత్ భూషణ్, వైఎస్ చైర్మన్ గా చిక్కాల మెహర్ రమేష్, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్. విశ్వనాథన్, కమిటీ డైరెక్టర్లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 1975లో ప్రారంభమైన ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రాష్ట్ర విభజన అనంతరం 2017లో నవ్యాంధ్రలో అంబికా కృష్ణ చైర్మన్‌షిప్‌లో తిరిగి ఏర్పాటైన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కూడా చిత్ర పరిశ్రమకు విజయవాడ ఒక రాజధానిగా, ప్రధాన కేంద్రంగా విలసిల్లిందని, ఇప్పటికీ సినిమాల ఆదాయంలో 65 నుండి 70 వరకు ఆంధ్రప్రదేశ్ నుంచే వస్తుందని పేర్కొన్నారు.రాష్ట్రంలో చలనచిత్ర, టెలివిజన్ మరియు నాటకరంగాల సమగ్ర అభివృద్ధికి ఊతమిచ్చేలా చైర్మన్‌తో పాటు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, కళాకారులు, ఉన్నతాధికారులతో కూడిన 17 మంది సభ్యులు డైరెక్టర్లుగా ప్రభుత్వం నియమించింది.

సందీప్ మృత్యువాత

>> చేశారు. చిరకాల వాంఛ ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించేందుకు ఈనెల 20వ తేదీన మిత్ర బృందంతో కలిసి విజయవంతంగా అధిరోహించారు. మువ్వన్నెల భారత జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి కిందకి దిగివస్తూ కంటి సంబంధిత సమస్యతో ప్రారంభమై అనారోగ్యంతో ఆ వెంటనే కన్నుమూశారు. ఈ విషయం నారాయణస్వామి సన్నిహితులు హిందూపురానికి చెందిన వైసీ చంద్రశేఖర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. మృతదేహాన్ని నేపాల్ నుంచి వీలైనంత తొందరగా భారత్‌కు తరలించి బెంగళూరుకు తీసుకువచ్చేలా ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర బాలయ్యతో చర్చించారు. మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడి ఢిల్లీలోని హోం శాఖ కార్యదర్శి, విదేశీ వ్యవహారాల శాఖతో సంప్రదింపులు జరుపుతున్నారు. సోమవారం భౌతిక కాయం బెంగళూరు చేరుకునే అవకాశం ఉందని సన్నిహితులు తెలిపారు.

వారం - వర్జ్యం

25-05-2026, అధికజ్యేష్ఠ సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
దశమి తె.5.11
ఉత్తరఫల్గుణి తె.4.09
వర్జ్యం : ఉ.10.27-మ.12.09
దు.మ.12.30-మ.1.22, 2) మ.3.06-3.58
శుభసమయం:ఉ.6.30-7.30
రాహుకాలం - ఉ.7.30-9.00

వార్తాఫలం

మేషం : విదేశములో నున్న మిత్రుల నుండి కానుకలు, ధనము, లభించు అవకాశము కనిపిస్తున్నది. బంధువుల కలయిక.

వృషభం: నూతన వ్యాపార యత్నమును కొద్ది కాలము పాటు వాయిదాను వేయుటం మంచిది. నూతన విద్యావకాశాలు కలవు.

మిథునం: దూరపు బంధువుల రాక విందులు, సమావేశములు,మిత్రులతో సంప్రదింపులు, ఆనందము నిస్తాయి.

కర్కాటకం: వృత్తి విషయములో కొంత ఓర్పును పాటించుట అవసరము. వృత్తిలో మీ తెలివితేటలు బాగా ఉపకరిస్తాయి.

సింహం: రాజకీయములు, సంఘములు, యూనియన్‌లు మొదలగు కార్యములకు అనుకూలం. స్పెక్యులేషన్ దూరంగా ఉండండి.

కన్య : మీ నిపుణతలకు సమర్థతలకు సదవకాశము లభిస్తుంది. ఆధ్యాత్మికత పట్ల శ్రద్ధ కనబరుస్తారు. బంధువుల కలయిక.

తుల : సహోద్యోగులతో అనుబంధములు మెరుగు పడతాయి. పాత ఋణములు వసులౌతాయి. వాహన సౌఖ్యం కలదు.

వృశ్చికం: కష్టమునకు తగిన ఫలితము వస్తుంది. సంతానము విద్యా విషయములో మిత్రుల సలహాలు ఉపయోగపడతాయి.

ధనుస్సు: బ్యాంక్ ఖాతాలను, లాకర్స్‌ను ప్రారంభించుటకు, అనుకూలమైన సమయం. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

మకరం: సమయమునకు ఆహారము తీసికొని మీ ఆరోగ్యమును పరిరక్షించుకోండి.వ్యవహారాలు సాఫీగా సాగుతాయి.

కుంభం: సంస్థలో మీరు ఆశించిన మార్పును పొందగలుగుతారు. కుటుంబ వ్యవహారాలు సైతం సానుకూలంగా ఉంటాయి.

మీనం : ముఖ్యమైన కార్యక్రమములను గురించి ప్రాథమిక చర్చలను వ్రాత, కోతలను పూర్తి చేస్తారు. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

25-5Pg3exHMNWJQE.qxd:25-5Pg3exHMNWJQE.qxd 1/1/02 6:52 AM Page 1

తిరుమల సమాచారం

చిన్నశేషుడిపై గోవిందుడి దివ్యమహిమ

తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన ఆదివారం గోవిందరాజస్వామి చిన్నశేష వాహనంపై భక్తులకు దివ్య దర్శనం ఇచ్చి అనుగ్రహించారు. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. ముందుగా గజరాజులు ఠీవిగా నడుస్తుండగా, భక్తబృందాలు చెక్క భజనలు, కోలాటాలు, గోవింద నామసంకీర్తనలతో మాడవీధులను భక్తిరస మయం చేశాయి. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి చిన్నశేష వాహనం దివ్యశోభను సంతరించుకుంది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి గోవిందుడిని దర్శించుకొని పరవశించారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో భగవంతుడు "శేషి", జగత్తు "శేషభూతం"గా భావించబడుతుంది. ఈ శేషశేషి తత్వానికి ప్రతీకగా చిన్నశేష వాహనం నిలుస్తుంది. చిన్నశేష వాహనసేవను దర్శించిన భక్తులకు కుండలినీ యోగసిద్ధి ఫలం లభిస్తుందని ఆధ్యాత్మిక విశ్వాసం. అనంతరం ఉదయం 10 గంటల నుండి కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, వివిధ రకాల పండ్లరసాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల నుండి 6 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు ఊంజల్‌సేవ నిర్వహించారు., రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ నారాయణ చౌదరి, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు
సర్వదర్శనానికి 30 గంటలు

తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమలలో విపరీతమైన భక్తుల రద్దీ కొనసాగుతోంది. వేసవిసెలవులు ఆపై వారాంతం రావడంతో ఆదివారం శ్రీవారి సర్వదర్శనానికి దాదాపు 30 గంటల సమయం నిరీక్షిస్తున్నారు. ఆలయం వెలుపల బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లు నిండి పోయాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోవడంతో వెలుపల వచ్చాయి. శనివారం 97,561వేల మందికి పైగా స్వామివారి దర్శనం చేసుకున్నారు. శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. యాత్రికుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి దాదాపు 30 గంటల సమయం పడుతున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి సెలవులు, వారాంతం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తిరుమలకు తరలివచ్చారు. రద్దీ తీవ్రతకు అనుగుణంగా టిటిడి అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. క్యూలైన్లలో వేచి ఉన్నవారికి తాగునీరు, అల్పాహారం వంటివి అందిస్తున్నారు. శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 97,561 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 57,780 మంది యాత్రికులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీవారి హుండీకి రూ.3.76 కోట్ల ఆదాయం వచ్చింది. భక్తులకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని టిటిడి అధికారులు సూచించారు. సమాచారం అందిన వెంటనే స్పందించే విధంగా ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. రైల్వే స్టేషన్, బస్టాండ్, శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి, శ్రీవారి మెట్లు తదితర ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు.

కాలినడకన తిరుమలకు కేంద్ర మంత్రి రామ్మోహన్

తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు ఆదివారం మధ్యాహ్నం కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. ఉదయం ఢిల్లీ నుండి విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుకు తిరుపతిలో టిడిపి నేతలు స్వాగతం పలికారు. అలిపిరి నుండి కాలినడకన తిరుమలకు వచ్చారు. మెట్లమార్గంలో భక్తులను పలకరిస్తూ తదేకంగా భక్తిభావంతో తిరుమలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శ్రీవారి దర్శనంతో మనసు ఆనందం

తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ బుర్రా వంశీరామమోహన్, భారత క్రికెట్‌జట్టు ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ కుటుంబ సభ్యులతో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

టిటిడి ట్రస్ట్‌లకు రూ.20 లక్షలు విరాళం

తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడికి చెందిన పలు ట్రస్ట్‌లకు దాతలు విరాళాలందించారు. గుంటూరుకు చెందిన మాదాల శేషగిరిరావు ఆదివారం శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10,01,116 లక్షలు విరాళంగా అందించారు. అలాగే గుంటూరుకు చెందిన వడ్లమూడి మిత్రేష్ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,01,111 లక్షలు విరాళంగా అందించారు. దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు విరాళం డీడీలను అందజేశారు. ఈ కార్యక్రమంలోటిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

శ్రమకు గుర్తింపు... శ్రామికులకు గౌరవం

● లేబర్ అడ్డాలతో నూతన అధ్యాయం ● కార్మికుల నైపుణ్యాలకు పదును పెట్టేలా స్కిల్ ట్రైనింగ్ ● వివాహం నుంచి ప్రసూతి వరకు కార్మిక కుటుంబాలకు ఆర్థిక రక్ష ● సేఫ్టీ ఫస్ట్ నినాదంతో పారిశ్రామిక భద్రతలో నూతన ప్రమాణాలు ● భవన నిర్మాణ కార్మికులకు కూటమి భరోసా ● ఇఎస్ఐ ఆస్పత్రులలో సరికొత్త డిజిటల్ విప్లవం ● రెక్కల కష్టానికి రక్షణగా నిలిచిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో కార్మిక శాఖ

విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర నిర్మాణంలో అహర్నిశలు శ్రమిస్తూ, సమాజానికి వెన్నెముకలా నిలిచే సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లల్లో విప్లవాత్మక అడుగులు వేసింది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక విధాన లోపాలు, నిధుల దారిమళ్లింపుతో కుదేలైన నిర్మాణ రంగాన్ని, కార్మిక వ్యవస్థలను పునరుద్ధరిస్తూ కొత్త ఆశలు చిగురింపజేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతతో, అటు పారిశ్రామిక అభివృద్ధిని, ఇటు కార్మికుల ప్రాణ భద్రతను సమానంగా ముందుకు తీసుకెళ్తూ కార్మిక శాఖలో సరికొత్త ప్రగతి ఆవిష్కృతమైంది. కార్మికుని సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యం, రక్షణే ధ్యేయంగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. వివిధ రంగాల్లోని కార్మికులకు స్కిల్ అప్ గ్రేడ్ అయ్యేలా వారికి ట్రైనింగ్ ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇప్పించడంపై ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇదే సమయంలో వారి గౌరవాన్ని మరింత పెంచేలా లేబర్ అడ్డాలను నిర్మించడం.. వారి సంక్షేమం కోసం నిధులు కేటాయించడం.. అలాగే వారి ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆస్పత్రుల నిర్మాణం వంటివి చేపట్టడం వంటి చర్యలు తీసుకుని కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఈ రెండేళ్ల పాలనలో జరిగిన పరిణామాల బట్టి కచ్చితంగా చెప్పొచ్చు.

లేబర్ అడ్డాలతో కార్మికులకు సరికొత్త వైభవం: రోజువారీ ఉపాధి కోసం ఉదయాన్నే రోడ్ల పక్కన, కూడళ్లలో ఎండనక, వాననక నిలబడి ఎదురుచూసే దినసరి కూలీల కష్టాలకు పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు వంటి ప్రాంతాలతోపాటు ఉమ్మడి జిల్లాల కేంద్రంగా లేబర్ అడ్డాల నిర్మాణాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆధునిక ఇంటిగ్రేటెడ్ లేబర్ అమెనిటీస్ సెంటర్స్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ లేబర్ అడ్డాల ద్వారా కార్మికులకు ఒకే చోట స్వచ్ఛమైన తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులతో పాటు ఉద్యోగ సమాచారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను అందిస్తున్నారు. పని ఉన్నప్పుడు అక్కడి నుంచి పనులకు వెళ్తారు.. పనులు లేనప్పుడు ఆ సమయాన్ని స్కిల్ అప్ గ్రేడ్ చేసుకునేలా కార్యాచరణను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లోని కార్మికులకు ఉన్న అనుభవానికి టెక్నాలజీని జోడిస్తే.. వారికి మరింత మెరుగైన ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో నైపుణ్యాలు కల్పించేలా కటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కార్మికులను కేవలం ఓటర్లుగా కాకుండా రాష్ట్ర నిర్మాణంలో వారిని కీలక భాగస్వాములను చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది. రాష్ట్రంలో దాదాపు 88 లక్షల మందికి పైగా నమోదైన అసంఘటిత కార్మికులు ఉండగా, అందులో 18 లక్షలకు పైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. గత ఐదేళ్ల కాలంలో డూప్లికేషన్ సాకుల పేరిట, నిధుల దారి మళ్లింపుతో నిలిచిపోయిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించింది. ప్రస్తుతం కార్మిక కుటుంబాలకు ధీమా కల్పిస్తూ ప్రసూతి సహాయం కింద రూ.20 వేలు, వివాహ కానుకగా రూ.40 వేలు అందిస్తోంది. అలాగే ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం సంభవిస్తే రూ.20 వేల సహాయం, అంత్య క్రియల ఖర్చుల నిమిత్తం రూ.60 వేలు అందించడంతో పాటు ఉచిత వైద్య పరీక్షలు అందిస్తోంది. పారదర్శకత, బాధ్యత, భద్రత అనే మూడు సూత్రాలతో ఫ్యాక్టరీల శాఖను ప్రభుత్వం బలోపేతం చేసింది. ప్లాంట్లలో ప్రమాదాల నివారణకు జులై 2024లో ప్రత్యేక భద్రతా తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన 23 ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు తీసుకుంది. కార్మికుల ప్రాణాలకు రక్షణగా సేఫ్టీ అలర్ట్, ఇన్సిడెంట్ అలర్ట్ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రారంభించడమే కాకుండా, ప్రమాదకర రసాయన కర్మాగారాల పర్యవేక్షణకు కెమికల్ ఇన్‌స్పెక్టర్ల పోస్టుల సృష్టికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. జెఎన్‌టియు, ఎస్‌వియు వంటి ప్రతిష్టాత్మక యూనివర్శిటీలతో ఒప్పందాలు కుదుర్చుకుని, 360 పరిశ్రమల్లో థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్లు, వందలాది మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా పారిశ్రామిక భద్రతలో ఏపి దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది.

ఇఎస్ఐ వైద్య సేవల్లో చారిత్రాత్మక మార్పులు: రాష్ట్రంలోని 15 లక్షల మంది ఇన్సూర్డ్ పర్సన్స్ ఆరోగ్య రక్షణే ధ్యేయంగా భీమా వైద్య సేవల శాఖను ప్రభుత్వం పూర్తిగా ఆధునీకరించింది. అచ్యుతాపురంలో కొత్త ఇఎస్ఐ ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగగా, తిరుపతి ఆసుపత్రి పడకల సామర్థ్యాన్ని 100కు పెంచింది. గుంటూరు, కర్నూలు, శ్రీసిటీ, నెల్లూరు ప్రాంతాలలో కొత్త ఆసుపత్రుల కోసం భూములను కేటాయించారు. విశాఖపట్నంలో 50 సీట్లతో కూడిన ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ మంజూరు కావడం, అమరావతిలో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలతో భవిష్యత్ వైద్య అవసరాలకు ఇప్పటి నుంచే కార్మిక శాఖ సన్నద్ధమవుతోంది. ఐదేళ్లుగా పెండింగులో ఉన్న శస్త్రచికిత్స సామగ్రి కొనుగోళ్లను రూ.78 లక్షలతో పునరుద్ధరించి, సరికొత్త మొబైల్ యాప్‌ల (మైహెల్త్.ఈ ఔషది) ద్వారా ఔషధాల పంపిణీలో కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకతను తెచ్చింది. పెట్టుబడుల రాకతో పరిశ్రమలు వృద్ధి చెందడమే కాకుండా, కార్మికుల ప్రాణాలకు, ఆరోగ్యానికి ధోకా ఉండకూడదనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన సాగింది.

పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

● మంత్రి అనగాని సత్యప్రసాద్ ● విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్‌ల పంపిణి

విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామనే మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను, ఎల్‌ఒసి లను ఎప్పటికప్పుడు అందిస్తూ, పేద, మధ్యతరగతి ప్రజలకు కష్టకాలంలో అండగా నిలబడుతున్నామని పేర్కొన్నారు. సిఎం సహాయనిధి పేదల పాలిట సంజీవనిగా మారిందని తెలిపారు. జగన్ హయాంలో సకాలంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు చెల్లించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ధ్వజమెత్తారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కావాలని సిఎం చంద్రబాబు మొదటి నుంచి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. పేదలకు ఆర్థికంగా చేయూతను ఇచ్చేలా సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల ద్వారా సిఎం సాయం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి పేదవాడికి సిఎం రిలీఫ్ ఫండ్ రూపంలో రూ.8 కోట్లు ఇప్పటి వరకు అందజేశామని తెలిపారు. ఆదివారం విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ క్యాంపు కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయ నిధి కింద 63 మంది లబ్దిదారులకు మంజూరైన రూ.87 లక్షల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను, ఎల్‌ఒసిలను ఎమ్మెల్యేతో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవ చేస్తున్నారని ప్రశంసించారు. రాత్రింబవళ్లు కష్టపడుతూ, ఎక్కడ ఎవరికీ ఏ ఇబ్బంది వచ్చినా ఆయన సొంతంగా సాయం అందజేస్తున్నారని కొనియాడారు. 20 సంవత్సరాల నుంచి ఇక్కడ పేదవాళ్లకు తోపుడు బండ్లు, టిఫిన్ సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారన్నారు. తాము ప్రతిపక్షంలో ఉండి పోరాటం చేసినప్పుడు కూడా తమ అందరికీ అన్నగా ఉండి, తమకొక దిక్సూచిగా గద్దె రామ్మోహన్ ఉన్నారని మంత్రి అనగాని ప్రస్తావించారు. విజయవాడలో 22,000 మందికి రాబోయే రోజుల్లో పట్టాలు రానున్నాయని తెలిపారు. గద్దె రామ్మోహన్‌తో పాటు, ఇతర ఎమ్మెల్యేలు విజ్ఞప్తి మేరకు సిఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఇవన్నీ రాబోయే ఒకటి, రెండు నెలల్లో రూపకల్పన కాబోతున్నాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి అనగాని

నేడు విజయవాడలో ఎంఎస్‌ఎంఇ గ్రోత్ సమిట్

విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలో ఈ నెల 25న ఎంఎస్‌ఎంఇ గ్రోత్ సమిట్ 2026 ప్రభుత్వం నిర్వహిస్తుంది. అంబేద్కర్ స్మృతివనంలోని భారీ కళావేదికలో నిర్వహిస్తున్న అతి పెద్ద ప్రభుత్వ కార్యక్రమం ఇది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు హాజరై రాష్ట్రంలో 38 ఎంఎస్‌ఎంఇ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500 మందికి పైగా ఎంఎస్‌ఎంఇ రంగానికి చెందిన పారిశ్రామిక వేత్తలు, పిఎం విశ్వకర్మ లబ్ధిదారులు, విధానకర్తలు, ఆర్థిక సంస్థలు సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారు. రాష్ట్రంలో ప్లగ్‌అండ్‌ప్లే పారిశ్రామిక మౌలిక వసతులను కల్పించే లక్ష్యంతో ఈ సదస్సు వేదికగా ముఖ్యమంత్రి పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ నియోజక వర్గంలో 175 ఎంఎస్‌ఎంఇ పార్కులను ఏర్పాటు చేసే లక్ష్యంలో భాగంగా మూడో విడతలో ఈ 38 ఎంఎస్‌ఎంఇ పార్కులకు వర్చువల్‌గా సిఎం శంకుస్థాపన చేయనున్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ఎంఎస్‌ఎంఇల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్ సహా పలువురు మంత్రులు పారిశ్రామిక వేత్తలు సదస్సులో పాల్గొననున్నారు.

కార్యకర్తలే బిజెపికి అసలైన బలం

● కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ● స్పష్టమైన సిద్ధాంతం, జాతీయవాదం పునాదిగా ఏర్పడిన ఒక గొప్ప కుటుంబం బిజెపి ● బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు నాయకులను తీర్చిదిద్దడమే ప్రశిక్షణ లక్ష్యం ● పునాదిపాడులో ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్

విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: పోలింగ్ బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ప్రతి బిజెపి కార్యకర్తను ఒక సమర్థవంతమైన నాయకుడిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా ప్రశిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం, పునాదిపాడు గ్రామంలోని కనకమేడల గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్‌శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, స్పష్టమైన సిద్ధాంతం, జాతీయవాదం పునాదిగా ఏర్పడిన ఒక గొప్ప కుటుంబమని కొనియాడారు. జిల్లా ప్రశిక్షణ వర్గ్‌లో భాగంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ బిజెపి ఘన చరిత్ర, పార్టీ నడుస్తున్న సిద్ధాంత పటిమ, అంత్యోదయ విలువల గురించి సవివరంగా వివరించారు. దేశాభివృద్ధే ఏకైక లక్ష్యంగా, పార్టీ ఆశయాలకు కట్టుబడి నిరంతరం శ్రమించే ప్రతి కార్యకర్తే భారతీయ జనతా పార్టీకి నిజమైన బలమని ఆయన స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, సమాజ నిర్మాణంలోనూ కార్యకర్తలు పోషించాల్సిన బాధ్యతలపై ఆయన దిశానిర్దేశం చేశారు. అంతకుముందు బిజెపి ముఖ్య నాయకుల చరిత్ర, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ ప్రశిక్షణ కార్యక్రమంలో పార్టీకి చెందిన జిల్లా ముఖ్య నాయకులు, నియోజకవర్గ బాధ్యులు, వివిధ మండలాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జులై 1 నుంచి 'విబి-జి రామ్‌జి' అమలులోకి

● ఉపాధి హామీ 125 రోజులకు పెంపు ● మౌలిక వనరులు, ఆస్తులు సృష్టి పనులే ఎక్కువ ● జిల్లా స్థాయిలో కలెక్టర్, క్షేత్రస్థాయిలో పంచాయితీ అధికారులే సమన్వయకర్తలు

న్యూఢిల్లీ, మే 24: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి గ్రామీణ పథకం స్థానంలో ఎన్డీయే ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన విబి జి రామ్‌జీ 2026 చట్టాన్ని జులై ఒకటినుంచి అమలులోకి తెస్తోంది. గ్రామీణ వేతన ఉపాధిని మరింత విస్తృత పరిచి ఉత్పాదక ఆస్తుల సృష్టికి ప్రాధాన్యతనిస్తున్న ఈ చట్టం వికసిత్ భారత్ 2047 సాధన దిశగా మరింత పటిష్టంగా పనిచేస్తుందని కేంద్రం చెపుతోంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీని 100 రోజుల నుంచి 125 రోజులకు పెంచారు. కొత్త పథకానికి గ్యారంటీ కార్డులు జారీ అయ్యే వరకూ ప్రస్తుత ఎంఎన్‌జిరేగా కార్డులు చెల్లుబాటు అవుతాయని, దరఖాస్తు చేసిన 15 రోజుల లోపు ఉపాధిని విడిగా కల్పించాలని చట్టంలో సూచించారు. కూలీ వేతనాలను డిబిటి ద్వారా నేరుగా కార్మికుల బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతాల్లోకి వారానికి ఒకసారి లేదా గరిష్టంగా పని ముగిసిన పక్షం రోజులలోపు చెల్లించాలి. వేతనాలు 15 రోజులకు మించి జాప్యం జరిగితే, అప్పటినుంచి ప్రతిరోజుకు చెల్లించని వేతనాల్లో 0.05శాతం చొప్పున కార్మికులు నష్టపరిహారం పొందే అర్హత కూడా కలిగి ఉంటారు. మొదటి 30 రోజులకు ప్రకటించిన వేతన రేటులో కనీసం నాలుగో వంతు ఆ తర్వాత కనీస ఉపాధి అంతరాయం లేకుండా చూపించాల్సి ఉంటుంది. జులై ఒకటవ తేదీనాటికి కొనసాగుతున్న పనులన్నీ కూడా కొత్తచట్టంపరిధిలో కొనసాగుతాయని, వాటిని కూడా పూర్తిచేయాల్సి ఉంటుందని చట్టం చెపుతోంది. పనులు అంతరాయం లేకుండా ఉపాధికి అడ్డంకి లేకుండా కేంద్రం అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలకు తగినంత కార్మిక బడ్జెట్‌లు అందు బాటులో ఉంచింది. సరిపోని పక్షంలో కొత్త చట్టంలోని షెడ్యూల్‌కి అనుగుణంగా రాష్ట్రాలు కొత్తపనులు చేపట్టాలి. ముఖ దృవీకరణద్వారా కార్మిక నమోదు జరుగు తుంది. కనెక్టివిటీ లేని ప్రాంతాలకు మినహా యింపు ఉంది. ఇంటికి వీలైనంత దగ్గరగా పని కల్పించాలి. ఐదు కిలోమీటర్ల పరిధిలోనే ఉండాలి. ఆదూరం దాటితే కార్మికులకు లదనంగా 10శాతం చెల్లిస్తారు. ఈ పనులన్నీ కూడా మానవ వనరులతోనే జరగాలని, యంత్రాలను వినియోగిస్తే కఠిన చర్యలుంటాయని కేంద్రం చెపుతోంది. వికసిత్‌గ్రామ్ పంచాయతీ ప్రణాళిక కేంద్రంగా ఈ పనులుంటాయి. పంచాయితీ పరిధిలోనే పనులన్నీ చేపట్టాల్సి ఉంటుంది. ఒకే ప్రణాళిక బహుళ నిధులు అనే వ్యవస్థనుప్రోత్సహిస్తూ కేంద్రరాష్ట్ర స్థానిక పథకాలతో సమన్వయానికి వీలు కల్పిస్తుంది. పిఎంఎవై జి కింద చేపట్టే గృహనిర్మాణ పనులను కూడా 90నుంచి 95రోజుల వేతన మద్దతుకింద పనులు చేపట్టవచ్చని కొత్తచట్టం చెపుతోంది.

జిల్లా స్థాయిలో కలెక్టర్ సమన్వయకర్త అవుతారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పనుల నమోదు అమలు రికార్డుల నిర్వహణ వంటివి చేపడతాయి. ఈశాన్య, హిమాలయ ప్రాంత రాష్ట్రాలకు కేంద్రం 90శాతం, రాష్ట్రాలు 10శాం నిదులు భరిస్తాయి. ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం నిధులు భర్తీచేస్తాయి. శాసనసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు నూరుశాతం కేంద్ర నిధులు అందుతాయి.

కొత్తచట్టం కింద పెంచిన వేతన రేట్లను కూడా నోటిఫై చేస్తారని అప్పటివరకూ ఎంజిఎన్‌రేగా వేతనరేట్లే అమలవుతాయని కేంద్రం వివరించింది. గ్రామీణ స్థాయిలో మౌలిక వనరుల సృష్టి, నీటివనరుల సంరక్షణ, వంటి అత్యవసర పనులకు కూడా విబిజిరామ్‌జీ చట్టంకింద ఉపాధి కల్పించాలని ఎన్డీయే సర్కారు ఉత్తర్వులు జారీచేసింది.

వార్త

సర్వ ప్రపంచాన్ని సైతం శాసిస్తూ మనిషి అసంతృప్తితో బాధపడతాడు. తనను తాను సంతోషంగా ఉంచుకోవడం చేతకాకపోతే.

న- సెనెకా

సమ్మె హక్కుకు సర్వోన్నత ముద్ర!

కార్మికుడి గళం 'సమ్మె హక్కు'కు అంతర్జాతీయ న్యాయస్థానం రాజముద్ర వేసింది. ప్రపంచ కార్మిక చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టం. కార్మికుడు తన గళాన్నివినిపించే ఒకేఒక సాధనం సమ్మె. తద్వారా తమ డిమాండ్లను వినిపించడం, చర్చించడం, దాని లోతుపాతుల విషయమై యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్ళడంలోని ఔచిత్యాన్ని అంతర్జాతీయ కార్మిక న్యాయ స్థానం సబబేనని పేర్కొనడమంటే కార్మిక లోకపు హక్కుల మీద పాలు పోసినట్లే. జీతాలు పెంచమని అర్థించినా, పని గంటలు తగ్గించమన్నా, భద్రత కల్పించమని కోరినా, లింగ వివక్ష చూపవద్దని ప్రాధేయపడినా యజమాన్యం సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉంది. వినకపోతే కార్మికుడి చేతికి అందిన చివరి ఆయుధం సమ్మె మాత్రమే. అందుకే సమ్మె హక్కును నిరాకరించడం అంటే కార్మికుడిని మౌన బానిసగా మార్చడమే. 2024 గ్లోబల్ రైట్స్ ఇండెక్స్ ప్రకారం, ప్రపంచంలోని చాలా దేశాలు సమ్మె హక్కును పరిమితం చేయడం మొదలు పెట్టాయి. అనేకచోట్ల యూనియన్ నాయకుల అరెస్టులు కూడా పెరిగాయి. ఇలాంటి నేపథ్యంలో అంతర్జాతీయ న్యాయస్థానం వెలువరించిన అభిప్రాయం కార్మిక వర్గాలకు ఒక మానసిక బలాన్ని అందిస్తోంది. ఐక్యరాజ్యసమితి అత్యున్నత న్యాయస్థానం అయిన ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ జస్టిస్ కార్మికులకు 'సమ్మె హక్కు' అంతర్జాతీయ కార్మిక హక్కులలో అంతర్భాగమని స్పష్టంచేసింది. ఈ అభిప్రాయం అంతర్జాతీయ కార్మిక సంస్థ కోరిన మేరకు సలహా అభిప్రాయం రూపంలో వెలువడింది. ప్రపంచ వ్యాప్తంగా కార్మికోద్యమాలకు, ట్రేడ్ యూనియన్లకు, శ్రమ హక్కుల ఉద్యమాలకు ఒక నూతన నైతిక బలం.1948లో ఆమోదించబడిన ఐఎల్ఓ కన్వెన్షన్ నం. 87లో 'సమ్మె' అనే పదం ప్రత్యక్షంగా లేకపోయినా, 'సంఘ స్వేచ్ఛ'లహక్కులో భాగంగానే సమ్మెహక్కు ఉందని ఐఎల్ఓ నిపుణుల కమిటీ దశాబ్దాలుగా భావిస్తోంది. అయితే 2012 తర్వాత కొన్ని యజమాన్య వర్గాలు ఈ వ్యాఖ్యానాన్ని వ్యతిరేకించాయి. ఒప్పందంలో స్పష్టంగా లేని హక్కును ఎలా చట్టపరంగా గుర్తిస్తారు? ఈ వివాదం అంతర్జాతీయ కార్మిక వ్యవస్థలోనే సంక్షోభాన్ని తెచ్చింది. చివరకు ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఐఎల్ఓ, అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఎనిమిది గంటల పని విధానం, కనీస వేతనం, ప్రసూతి సెలవులు, బాలకార్మిక నిషేధం ఇవన్నీ సమ్మెల కారణంగా సాధించుకున్న ఫలితాలే. వాటి పర్యవసానం కార్మిక సంక్షేమమే అయినప్పుడు, వాటిని వద్దనే పరిస్థితి ఉండదు. అందుకే ఉద్యమాలే ఆధునిక కార్మిక చట్టాలకు పునాదిగా భావించాలి.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ కార్మిక సంక్షోభ సమయంలో ఈ తీర్పు అందరికీ శిరోధార్యమే. ప్రపంచవ్యాప్తంగా 'గిగ్ ఎకానమీ', కాంట్రాక్టు ఉద్యోగాలు, ప్రైవేటీకరణ, ఆటోమేషన్ పెరుగుతున్నాయి. ఉద్యోగ భద్రత తగ్గుతోంది.ట్రేడ్ యూనియన్ల శక్తి క్షీ ణిస్తోంది.భారత రాజ్యాంగం ప్రత్యక్షం గా 'సమ్మెహక్కు'ని ప్రాథమిక హక్కుగా గుర్తించక పోయి నా సామాజిక స్వేచ్ఛకు శిఖరాయమాన ప్రాధాన్యతనిస్తూ_నే ఉంది. భారతదేశంలో తరచుగా ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెలపై ఆంక్షలు,నిత్యావసర సర్వీసుల చట్టాలు,కార్మిక చట్టాల మార్పులు వివాదాలకు దారితీస్తుంటాయి. కొత్త లేబర్ కోడ్స్ అమలులోకి వస్తున్న తరుణంలో ఈ అభి ప్రాయానికి ప్రాముఖ్యత సంతరించుకుంది.భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో కార్మికుడి గొంతుకను వినడం ప్రభుత్వ బాధ్యత.సమ్మెను శత్రుత్వంగా కాకుండా సామా జిక సంభాషణలో భాగంగా చూడాల్సిన అవసరాన్ని గుర్తించడం అవసరం. అంతర్జాతీయ న్యాయస్థానం ప్రస్తావించిన అంశాలలోసమ్మె హక్కు అపరిమితం కాదు. అత్యవసర సేవలు, ప్రజాభద్రత, ఆరోగ్య రంగం వంటి కొన్ని సందర్భాల్లో పరిమితులు ఉండవచ్చు.కానీ ఆ పరిమితులు ప్రజాస్వామ్యబద్ధంగా, న్యాయబద్ధంగాఉండాలి. సమ్మెలు లేకపోతే తక్కువ జీతాలు,అధిక పని గంటలు, అసురక్షి త పరిస్థితులు పెరిగే ప్రమాదంఉంటుంది. ఎక్క డైనా, ఏసందర్భంలోనైనా హక్కులతో పాటు బాధ్యతల గుర్తుంచుకుని ప్రవర్తించినప్పుడే వర్గ ప్రయోజనాలు కాపా డబడతాయి. ప్రస్తుతం కొత్త లేబర్ కోడ్స్ నేపథ్యంలో సమ్మె హక్కుపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. సమ్మె ఒక శక్తివంతమైన ఆయుధం కాబట్టి, దాని వినియోగం లో సమతౌల్యం అవసరం. అలాంటప్పుడే హక్కుల సంరక్షణకు తిరుగులేదన్న మాటే! తరచుగా సమ్మెలు జరిగే ప్రాంతాల్లో పెట్టుబడిదారులు వెనుకంజవేయవచ్చు.దీంతో కొత్త పరిశ్రమలు రావడం తగ్గుతుంది.కొన్ని సందర్భాల్లో సమ్మెలు కార్మిక సమస్యలకంటే రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించబడతాయి.అసలు కార్మిక సమస్యలు పక్కకు వెళ్లిపోతాయి, ఈ విషయంలో జాగ్రత్త పడాల్సి ఉంటుంది. ప్రజల్లో సమ్మెలపై వ్యతిరేక భావన పెరుగుతుంది.ఎక్కడైనా, ఏ సందర్భంలోనైనా హక్కులతోపాటు బాధ్యతల గుర్తుంచుకుని ప్రవర్తించినప్పుడే వర్గ ప్రయోజనాలు కాపాడబడతాయి. భారత రాజ్యాంగం ప్రత్యక్షంగా సమ్మె హక్కును ప్రాథమిక హక్కుగా గుర్తించలేదు. కానీ సంఘస్వేచ్ఛను హామీఇస్తుంది.భారత కోర్టులుపలుమార్లు సమ్మెల సందర్భంగా హితవుపలికినసందర్భాలున్నాయి. ప్రస్తుతం కొత్త లేబర్ కోడ్స్ నేపథ్యంలో సమ్మెహక్కుపై దేశవ్యాప్తంగా చర్చజరుగుతున్న సందర్భంలో ఈతీర్పు స్వాగతించదగినది. నియంత్రణలేని సమ్మెలు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తాయి. కార్మికుడి గౌరాన్ని కాపాడే సాధనం.సమ్మెలవల్ల సమాజంలో అనేక చారిత్రాత్మక మార్పు

ఒక అవకాశం చేజారిపోతే కళ్ల నీళ్లు పెట్టుకోకు. మరొక అవకాశం చేజారి పోకుండా జాగ్రత్తపడు.



అబ్రహాం లింకన్

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె.స్టాన్‌స్లావిస్కి

ప్రజావాక్కు

'బొద్దింక'ల పార్టీ

ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లోబొద్దింకల జనతా పార్టీ ఒక సెన్సేషన్. కుక్కకీ ఒక రోజొస్తుంది అన్న ఇంగ్లీషు సామెత లాగానే బొద్దింకలకీ ఒకరోజు వచ్చినట్టుంది. ఇప్పుడా పేరుట్రెండ్ అయ్యింది దేశమంతా.సాధారణంగా బొద్దింకల్ని చూడడానికి ఎవరూ ఇష్టపడరు. చివరకి హిట్ యాడ్‌లో కూడా. అబ్బే,తిండి తింటున్న టైమ్‌లో టీవీలోఈయాడ్ ఏమిట్రా బాబూ అనుకుంటారు ఎక్కువ మంది. అలాంటిది దేశమంతా ఈ పేరు ట్రెండ్ అవ్వడం అంటే దాన్నే 'టైమ్ బాబూ టైమ్' అంటారు.ఇక విషయానికి వస్తే అసలు బొద్దింకకీ ,దీనికీ ఏ సంబంధమూ లేదు. ఒక రకంగా ఇది బుద్ధింకల పార్టీ. ఎందుకంటే దీన్నిస్థాపించింది, ప్రాచుర్యం చేస్తున్నదీ బుద్ధిమంతులైన యువకులు. దేశ ప్రధాన న్యాయమూర్తి ఒక తీర్పులో కొందరు యువకుల్ని ఉద్దేశించి బొద్దింకలతో పోల్చారన్న వార్తకి స్పందనగా ఈ వ్యంగ్య పక్షం అంకురం దాల్చింది. యువత పెద్ద ఎత్తున రాజకీయాల పట్ల, సామాజిక సమస్యల పట్ల దృష్టి సారిస్తే అది దేశానికి మంచిది.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

ఏదీ శాశ్వతం కాదు

అద్దెఇంట్లో కొందరు కొంతకాలం ఉంటారు. మరికొందరు చాలా కాలం ఉంటారు.అంతేకాని అద్దె ఇంట్లో ఎల్లకాలం ఉండటానికి ఎవరికి కుదరదు. లోక్‌సభ, శాసనసభలు కూడా అద్దె ఇళ్ల లాంటివే.అందులో ఉండే ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులు,ఎమ్మెల్యేలు, ఎంపిలు మంత్రులుఎప్పుడో ఒకప్పుడు వాటినుంచి బయటికి పోవల సిందే. వారి స్థానంలో మరొకరు రావలసిందే. గతంలో ఇలా ఎంతోమంది వచ్చారు,పోయారు.అలానే ఎక్కడో ముఖ్యమంత్రులు అద్దెఇళ్లని ఖాళీచేస్తే ఇక్కడసంబరాలు ఎంటో.

- మిథునం,హైదరాబాద్

రైతులకు ఆసరా కల్పించాలి

ఈ సీజన్లో తెలంగాణలో ఎక్కువ మొత్తంలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి.తెలంగాణ వ్యవసాయంలో ఉత్పత్తి ఉత్పాదకతను పెంచడంలో పూడిక తీత పనులు ఉపయోగపడుతాయి.తెలంగాణలో నీటి వసతులు వివిధ మార్గాల ద్వారా పెరిగినా ఇప్పటికీ స్థిర నీటి వసతిలేని మారుమూల గిరిజన గ్రామాలున్నాయి.కుంటలు చెరువులు పూడికతీయించడం ఉపాధి హామీపథకం కిందవచ్చేట్టు చూసిరైతులకు ఎంతోకొంత ఆసరా కల్పించాలి.

- భారత అవినాష్, జనగామ

పంటలను కొనుగోలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు రైతులు పండించిన మొక్కజొన్న, వరివంటి పంటలు కలలాల్లో కొనుగోలు చేయక తడిసిపోతుంటే మరో పక్క ప్రగతి పేరిట 99 రోజుల సంబరాలు చేస్తుంది. రైతులు తాము పండిచ పంటను కలలాల్లో పెట్టుకొనిరోజులు తరబడి ఎదురుచూస్తున్న అధికారులు రావడం లేదంటూకొనుగోలు చేయక రైతులు ఆవేదనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరో వైపు ఈదురుగాలులవల్ల మామిడి రైతులు నష్టపోతున్నారు.వారికి భరోసా కల్పించి ఆదుకోవడంలో ప్రభుత్వంవిఫలమైందని చెప్పవచ్చు. రైతులపట్లప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. భవిష్యత్తు ప్రణాళికలు లేక యూరియా కష్టాలు వంటివి ఎన్నో చూశాం. కాంగ్రెస్ ప్రభుత్వంలోఒకరకంగా రైతులు అసంతృప్తిగా ఉన్నారని తెలుస్తుంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

పెరుగుతున్న లింగ వివక్ష

భారతదేశంలో ఆర్థిక,సాంకేతిక రంగాలు వృద్ధి చెందుతున్నప్పటికీ లింగ వివక్షరూపం మార్చుకుని కొనసాగుతోంది. క్షేత్రస్థాయి పరిశీలనలు భిన్నమైన వాస్తవాలను చూపుతున్నాయి. గ్రామీణప్రాంతాలలో సాంప్రదాయక పురుషాధిక్య ధోరణులు, బాల్యవివాహాలు, చదువు ఆపివేయడం వంటి సమస్యలు ఉన్నాయి. వ్యవసాయ రంగంలో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ మహిళా కూలీలకు తక్కువ వేతనాలు ఇస్తున్నారు. భూమిపై యాజమాన్య హక్కులు లేకపోవడం వల్ల మహిళలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించలేకపోతున్నారు. పట్టణ ప్రాంతాలలో కార్పొరేట్ సంస్థల ఉన్నత పదవులలో మహిళల భాగస్వామ్యం తక్కువగా ఉంది. వివాహం, పిల్లల పెంపకం వల్ల కెరీర్ మధ్యలోనే ఉద్యోగాలు వదిలివేయాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో భద్రతా లోపాలు, వేధింపులు వేధిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

ధైర్యమే ఆయుధం

నేటి సమాజంలో యువత పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననో, ఇంటర్వ్యూలోఉద్యోగంరాలేదని క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్న యువతరం పిల్లలు ఎంతో మందిని చూస్తున్నాం. మనకోసం మన కుటుంబం ఎల్లప్పుడూ వేచింటుంది అనేది ఆలోచన చేయాలి. రాబోయే భవిష్యత్ కాలం అంత మనదే, ఈ ఉద్యోగం కాకపోతే ఇంకో జాబ్ అనే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితేనే భవిష్యత్ జీవితాలు బాగుంటాయి.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

ఆదాయార్జనకే పెట్రో వడ్డింపులా?

ఇథనాల్‌కు సులభంగా మండే గుణం వుంది. ఈ కారణంగానే పెట్రోల్లో కలుపుతున్నప్పటికీ మోటారు వాహనాల ఇంజన్లకు హాని చేస్తుంది. ప్రస్తుతం నిపుణల సూచనలమేరకు 10 శాతం వరకు ఇథనాలు పెట్రోల్లో కలుపుతున్నారు. అయితే 10శాతానికి మించి పెట్రోల్లో ఇథనాల్ కలిపే పక్షంలో వాహనాల ఇంజన్లు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రజలు ఎలాపోతే మాకేంటి అనే ధోరణిలో ఇథనాల్ ద్వారా ఆదాయం పెంచుకోవాలని ఆయిల్ కంపెనీలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు ధరలతో సంబంధం లేకుండానే రష్యా మనకు తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తోంది. మీడియా ప్రభావం నేపథ్యంలో ప్రజలు ఈ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే వున్నారు. అధికారంలో వున్న ప్రభుత్వాలు ఎవరి కోసం పనిచేస్తున్నాయని సులభంగా అర్థం చేసుకొంటారు. కొందరిని కొంత కాలమే మోసం చేయగలరు అందరినీ అన్ని సమయాలలో మోసం చేయడం సాధ్యం కాదనే విషయం గుర్తించాలి.

అన్నవరపు బ్రహ్మయ్య

కేంద్ర ప్రభుత్వం ఆదాయమే పరమార్థంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచడంతోపాటు పెట్రోల్లో ఎథనాల్ కల్తీ చేయటానికి సిద్ధమవుతోంది. అమెరికా, ఇరాన్ యుద్ధం పేరు చెప్పి అనుకొన్నట్టుగానే కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు 3 నుంచి 3.50 రూపాయలకు పెంచింది. ఇదే సమయంలో పెట్రల్లో ప్రస్తుతం కలుపుతున్న 10 శాతం ఇథనాల్‌ను 20 శాతానికి పెంచడానికి రంగం సిద్ధం చేస్తోంది. పెరిగిన ధరలు ప్రజలకు భారంగా అనిపించకూడదనే ఎత్తుగడలో భాగంగా ఆయిల్ కంపెనీల ద్వారా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌కు కృత్రిమ కొరతను సృష్టించి, ధర సంగతి ఎలా వున్నా అసలు పెట్రోల్, డీజిల్ దొరికితే చాలనే రీతిలో ప్రజలను మానసికంగా సిద్ధం చేసి, తర్వాత రెండు దఫాలుగా ధర పెంచింది. అయినా పెరిగిన ముడిచమురు ధరలతో పోల్చితే పెరిగిన, పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలు చాలా తక్కువ అంటూ ఆంగ్ల జాతీయ పత్రికలలో వార్తలను వండి వడ్డిస్తోంది. దీనిని బట్టి మరోసారి పెట్రోలియం ధరల పెంపునకు రంగం సిద్ధం అవుతున్నట్లు అర్థం అవుతోంది. ప్రజలపై పన్నుల భారం మోపడంలో ముందుండే కేంద్ర ప్రభుత్వం నిజానికి యుద్ధం ప్రారంభమైన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచివుండేది. కానీ ఇటీవల వివిధ రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల పుణ్యమా అని కొంత అలక్ష్యం గా ధరలు పెంచింది. పెట్రోలియం ధరలతో మాకేమి సం బంధం లేదు, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ఆయిల్ కంపెనీలు ధరలు స్థిరీకరించుకొంటాయంటూ కేంద్రప్రభు త్వం అనేకమార్లు ప్రకటించింది. కాని అదే కేంద్రప్రభుత్వం అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు గణనీ యంగా పడిపోతున్నప్పుడు పన్నుల మీద పన్నులు, సెస్లను విధిస్తూ తగ్గిన పెట్రోలియం ధరలు ప్రజలకు అందకుండా శాయశక్తులా ప్రయత్నం చేసింది.మనదేశంలో ఆర్థిక సంస్కరణలు అమలులోకి రావడానికి పూర్వంఅంటే 1980 సంవత్సరానికి ముందు వరకు దాదాపు లక్ష కోట్ల రూపాయల పెట్రోలియం రిజర్వుపూల్ మనీ వుంది. అంతర్జాతీయంగా పెట్రోలియ ఉత్పత్తుల ధరలలో ఒడిదుడుకులు వచ్చినప్పుడు ధర నియంత్రణ, క్రమబద్ధీకరణ నిమిత్తం ఈ నిధిని వినియోగించేవారు. అయితే ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో దేశంలోని చమురు కంపెనీలకు ధరల నిర్ణయంలో స్వేచ్ఛనిచ్చి, ఇక ధరలతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని చెప్పి క్రమంగా రిజర్వుపూల్ మనీని కేంద్రప్రభుత్వం వినియోగించుకొంది. ధరల నిర్ణయం విషయంలో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛనివ్వడంతో అంతర్జాతీయం పెట్రోలియం ధరలను చూపిస్తూ ఆయిల్ కంపెనీలు మూడు అడుగులు ముందుకి, ఒక అడుగు వెనక్కి అన్న తరహాలో పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచాయి. కోట్ల రూపాయల లాభాలు పొందాయి. కొన్ని ప్రైవేటు సంస్థలు విపరీతమైన లాభాలు పొందాయి. యుపిఎ ప్రభుత్వం తరపున మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా వున్న సమయంలో అంతర్జాతీయంగా క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 160 డాలర్లు వుంది. అయినా లీటరు పెట్రోల్ ధర 74 రూపాయలకే అందించారు. ఎన్డీయే ప్రభుత్వం తర్వాత అంతర్జాతీయ చమురు కంపెనీల మధ్య పోటీ పెరగడంతోపాటు రష్యాపై అమెరికా ఆంక్షల నేపథ్యంలో బ్యారెల్ ధర రెండొంతులకు పడిపోయి బ్యారెల్ 46డాలర్లకు చేరింది. ఆ సమయంలో అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా కనీసం లీటరుపెట్రోల్

25 రూపాయలకు తగ్గిపోవాలి. కానీ ఎన్డీఎ ప్రభుత్వం ధర తగ్గించకపోగా వివిధకారణాలు చెబుతూ పెట్రోలియం ఉత్పత్తులపై పన్నుల మీద పన్నులు, సెస్లు విధిస్తూ క్రమంగా లీటరు పెట్రోల్ ధరను 74 నుంచి 109 రూపాయలకు పెంచుతూ వచ్చింది. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలో దాదాపు 50శాతం పన్నులే వున్నాయి.నిజానికి కేంద్ర ప్రభుత్వం తొలుత పెట్రోలియం ఉత్పత్తులపై సెంట్రల్ ఎక్సయిజ్ (దిగుమతి సుంకం) విధించాలి. ఆ తర్వాత పెట్రోల్, డీజిల్ రిటైల్గా అమ్ముతున్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సేల్స్ టాక్స్, టర్నోవర్ టాక్స్ విధించాలి. అయితే కేంద్రం ప్రభుత్వంపెట్రోలియం ఉత్పత్తులపై బేసిక్ ఎక్సైజ్‌టాక్స్ మాత్రమే విధించాలి.కానీ బేసిక్ టాక్స్ పూర్తిస్థాయిలో పెంచిన తర్వాత ఇంకా పెంచడానికి అవకాశం లేకపోవడంతో సెస్ ఆన్ ఎక్సయిజ్, మౌలిక సదుపాయాల సెస్ పేరుతో నాలుగు రకాలుగా విభజించి పన్నువేస్తోంది. ఈ కారణంగా అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పుడు ఆ ఫలితం ప్రజలకు చేరకుండా లక్షల కోట్ల రూపాయలను కేంద్రప్రభుత్వం కాజేసింది. ఇక రాష్ట్ర ప్రభుత్వాలు బంక్ల నుంచి అమ్మకపు పన్నుతోపాటు టర్నోవరు టాక్స్‌తోపాటు రోడ్ సెస్, ఎడ్యుకేషన్ సెస్ పేరుతో లీటరు రూపాయి వంతున అదనంగా వసూలు చేస్తున్నారు. యుద్ధం నేపథ్యంలో బ్యారెల్ ధర 100 నుంచి 110 డాలర్ల మధ్య వున్నప్పటికీ మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా వున్న సమయంలో క్రూడ్ అయిల్ బారెల్ ధర 148 డాలర్లతో పోల్చితే తక్కువగానే వుంది. అయినా ఏదో కారణంగా ఏదో జరిగిపోతుందనే ధోరణిలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం మరల సిద్ధం అవుతోంది. ప్రస్తుతం క్రూడ్‌ఆయిల్ ధరలు 110 డాలర్లకు చేరినప్పటికీ పన్నుల మీద పన్నులు, అన్యాయంగా విధిస్తున్న సెస్లలు లేకపోతే మనకు లీటరు పెట్రోల్ న్యాయబద్ధంగా వసూలు చేసే పన్నులతో కలుపుకొని 82 రూపాయలకే లభిస్తుందని ఆయిల్ రంగనిపుణలు చెబుతున్నారు.ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా రష్యాకు చెందిన క్రూడ్ ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు వున్నాయి. ఆ సమయంలో రష్యాతో మన దేశానికి వున్న స్నేహసంబంధాల నేపథ్యంలో రష్యా చాలా చౌకగా క్రూడ్ ఆయిల్ సరఫరా చేసింది.అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెట్రోల్,డీజిల్ ధరలు ఏమాత్రం తగ్గించలేదు. ఇరాన్ అమెరికా యుద్ధం జరుగుతున్నప్పటికీ రష్యా మన దేశానికి అంతర్జాతీయ ధరల కంటే తక్కువ ధరకే క్రూడ్ ఆయిల్ సరఫరా చేస్తూనే వుంది. ఈ విషయాన్ని బహిర్గతం చేయకుండా మరల పెరిగిన క్రూడ్‌ఆయిల్ ధరలకు అనుగుణంగా ధరలు పెంచలేదని, అందువల్ల మరోసారి ధరలు పెంచడానికి సిద్ధం అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇక ఇథనాల్ విషయానికి వస్తే దేశీయంగా చౌకగా లభించే ఇథనాల్ ద్వారా కూడా కేంద్రప్రభుత్వం భారీగా ఆదాయం పొందుతోంది. మనదేశంలో దాదాపు 10 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం సూచన మేరకు ఆయిల్ కంపెనీలు 10 శాతం మేరకు పెట్రోల్లో ఇథనాల్ కలుపుతోంది. ఈ మొత్తాన్ని 20 శాతానికి పెంచే ఆలోచన చేస్తున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి. ఈ ఇథనాల్ చెరకు పిప్పి, మొక్కజొన్న నుంచి దేశీయంగా, చౌకగా తయారవుతుంది. దీనికి ఎక్సైజ్‌సుంకం వుండదు. కానీ ప్రభుత్వం పెట్రోల్లో కలపడం ద్వారా ఇథనాలు కూడా ఎక్సైజ్ సుంకం కలపడంతోపాటు పెట్రోల్తో సమానంగా ప్రజల నుంచి ధరవసూలు చేస్తోంది.ఇథనాల్‌కు సులభంగా మండే గుణం వుంది. ఈ కారణంగానే పెట్రోల్లో కలుపుతున్నప్పటికీ మోటారు వాహనాల ఇంజన్లకు హాని చేస్తుంది. ప్రస్తుతం నిపుణల సూచనల మేరకు 10 శాతం వరకు ఇథనాలు పెట్రోల్లో కలుపుతున్నారు. అయితే 10 శాతానికి మించి పెట్రోల్లో ఇథనాల్ కలిపే పక్షంలో వాహనాల ఇంజన్లు దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ప్రజలు ఎలాపోతే మాకేంటి అనే ధోరణిలో ఇథనాల్ ద్వారా ఆదాయం పెంచుకొనేందుకు ఆయిల్ కంపెనీలు భావిస్తున్నాయి. అంతర్జాతీయ చమురు ధరలతో సంబంధం లేకుండానే రష్యా మనకు తక్కువ ధరకే క్రూడ్ అయిల్ సరఫరా చేస్తోంది. మీడియా ప్రభావం నేపథ్యంలో ప్రజలు ఈ విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొంటూనే వున్నారు. అధికారంలో వున్న ప్రభుత్వాలు ఎవరి కోసం పనిచేస్తున్నాయని సులభంగా అర్థం చేసుకొంటారు. కొందరిని కొంత కాలమే మోసం చేయగలరు అందరినీ అన్ని సమయాల లో

పొగాకు విషవాయువు పట్ల బహు పరాక్!

బుగ్గన మధుసూదనరెడ్డి

ప్రపంచ మానవాళికి పెనుశాపంగా పరిణమించిన ఈ పొగాకు వాడకం మూలాన ప్రపంచవ్యాప్తంగా ఏటా 80 లక్షల మంది మరణించడమే కాదు, వీరిలో 12 లక్షల మంది పరోక్ష ధూమపానం వల్ల కూడా మృత్యువాత పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ గణ్నాకాలు తెలియజేయడంతో వీటి వాడకం ఎంతటి ప్రమాద ఘంటికాలు మ్రోగిస్తున్నాయో మనం ఇట్టే ఊహించవచ్చు. ముఖ్యంగా ప్రపంచ మానవాళి విలువైన ప్రాణాలను అనంత వాయువుల్లో కలిపి వేస్తున్న ఈ పొగాకు విష వాయువులో భాగమైన హుక్కా, చుట్ట, బీడీ, సిగరెట్, ఖైనీవాడకం మూలాన అవి మన ఆరోగ్యంపై పలువిధాలా దుష్పరిణామాలు చూపుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం. అంతేగాకుండా పొగాకు వాడకంలో భారతదేశం రెండవ స్థానంలో ఉండటం, పొగాకు నుంచి వెలువడే పొగలో 40,000 పైగా హానికరమైన రసాయనాలు ఉండటం, అందులో 70కి పైగా అత్యంత అపాయకరమైన క్యాన్సర్ కారకాలు ఉండటం మనల్ని ఎంతో గగ్గుర్పాటుకు, ఒకింత భయాందోళనలకు గురిచేస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అదేవిధంగా పొగాకు వాడకంలో భాగమైన ధూమపానం చేసే వారికే కాకుండా ప్రక్కన ఉండి ఆ పొగ పీల్చేవారికి కూడా పెను ప్రమాదం పొంచి ఉండటం తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం. ఇంకా చెప్పుకుంటూపోతే ధూమపానం వల్ల వచ్చే క్యాన్సర్‌లలో ఊపిరితిత్తుల క్యాన్సర్లు, నోటి క్యాన్సర్లు, అన్నవాహిక, కడుపు,మూత్రాశయం, మూత్రపిండాల క్యాన్సర్లు ముఖ్యమైనవిగాప్రపంచ

ఆరోగ్య సంస్థ నిపుణులు నిర్ణయించిన నేపథ్యంలోయావత్ ప్రపంచ మానవాళి ఈ పొగాకు వాడకం విషయంలో ఎంతటి అప్రమత్తాన్ని పాటించాలో,వాటిని ఎంత దూరం పెట్టి మన విలువైన ఆరోగ్యాలను కాపాడుకోవాలో అంతా మన వివేకంపై ఆధారపడి ఉంటుంది. ఒక విధంగా చెప్పాలంటే యావత్తు మానవాళి పొగాకు వాడకానికి ఎంత దూరంగా ఉంటే అంతగా మన జీవితాలు నిండు,నూరేళ్ల ఆరోగ్యవంతంగా, పిల్లాపాపలతో అత్యంత దిగ్విజయంగా సాగిపోవడం తథ్యం. అన్నింటికి మించి మన పెద్దలు సెలవిచ్చినట్లుగా 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నీతి సూత్రానికి మనమంతా కట్టుబడి ఉండాలంటే మాత్రం పొగాకు వాడకానికి అల్లంతా దూరంలో ఉంటూ,దానికి సంపూర్ణంగా రాం రాం చెప్పడం,పూర్తిగా మంగళం పాడటం మనందరికీ కూడా ఎంతైనా సర్వదా శ్రేయస్కరం. ఏదిఏమైనా పొగాకులో వుండే క్యాన్సర్ కారక రసాయనాల వల్ల కేవలం ఒకే రకమైన క్యాన్సర్ వచ్చే ప్రమాదమే గాక 36 రకాల క్యాన్సర్లు సైతం వచ్చే అవకాశాలు పొంచి ఉండటంతో ఈ పొగాకు విషవాయువు ఏ స్థాయిలో మానవాళి ప్రాణాలతో చెలగాటమాడుతుందో మనం ఇట్టే ఊహించవచ్చు. ఏమైన మనం పొరపాటున ఈ పొగాకు వాడకానికి అలవాటు పడ్డామంటే మన రోగనిరోధక శక్తి తగ్గటంతో పాటు గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్, ఊపిరితిత్తుల వ్యాధి, మూత్రపిండాలు చెడిపోవడం, టీబీ వ్యాధులు, మధుమేహం, కంటి, వినికిడి సమస్యలు, చిగుర్లకు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశాలు మెండుగా ఉండటంతో, మనకు ఒకవేళ పొగాకు వాడకం అలవాటు వుంటే ఎలాగైనా ఈ పొగాకు వాడకానికి గుడ్ బై చెప్పాల్సిందే. లేదంటే మన అమూల్యమైన ఆరోగ్యాన్ని కోరికోరి మనమే పాడుచేసుకున్న వారమవుతాము.తద్వారా మనకు మరణం సంభవించడానికిమనంతకు మనమే రాచబాట ఏర్పరచుకొన్న వారమవుతాం.

సమగ్ర జనగణనే అభివృద్ధికి మూలం!

డాక్టర్ సమర్ స్నేహ ఎనుగొండ

అనేక గణాంక వివరాల ప్రకారం దేశంలో 80శాతం జనాభా ప్రభుత్వ రాయితీలతో అభివృద్ధిలోకి రావాలని తాపత్రయపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోయాయి. పేదరికం పెరిగిపోయింది. కులాల గణాంకాలు తెలియకపోతే పేదరికాన్ని అంచనా వేయలేం. ఇటు రాజ్యాంగం అటు ప్రజాస్వామ్యం వైఫల్యంతో దేశంలో 80శాతం మంది తమను ఆదుకోవా లని అంటున్నారు అంటే ప్రజల ఈ దుస్థితిని మార్చాలి. కులం వర్గం ఒకటిగా ఉన్న మన సమాజాన్ని సమసమాజంగా ఎలా మార్చేది. నిలువునా చీలిన సమాజాన్ని సమాంతర పరిచేదెవరు? కులాల సామా జిక ఆర్థిక స్థితులు తెలియకుంటే ప్రభుత్వాలు చేపట్టే పథ:కాలు,ఉపాధి అవకాశాలు ఎలా పేదలకు చేరుతాయి? దేశ వ్యాప్త జనాభా గణనలో భాగంగా కులాల వివరాలను తెలుసుకోవడంలో ఎలాంటి తప్పులేదని సుప్రీంకోర్టు పేర్కొంది. 'ఏ ప్రభుత్వానికైనా ఏ రోజుకైనా ఎంతమంది వెనుకబడి ఉన్నారో, ఎంతమందికి సంక్షేమం అవసరమో తెలియాలి. ఇది విధానపరమైన (పాలసీ) విషయం, అని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు.అటు కాంగ్రెస్ ఇటు బిజెపి పోటీపడి కులగణన కోసం విధాన నిర్ణయా లను రూపొందించుకోవడం నిజంగా అణగారిన వర్గాల శ్రేయస్సు కోసమేనని భావించాలి. కులాల గణాంకాలు లేకపోతే పేదలను, నిరుద్యోగులను అంచనా వేయలేం. కులం వర్గం ఒకటిగా ఉన్న మన సమాజాన్ని సమసమా జంగా మార్చలేము.కులగణన వలన మాత్రమే సమానత్వం, సామాజిక న్యాయం, సాధ్యమవుతుంది. అంటే వారి సామా జిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనం కులగణన వల్ల తేట తెల్లమవుతుంది కాబట్టి. దానికి అనుగుణంగా ప్రణాళికలు రచించి వారి అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయడానికి వీలు ఏర్పడుతుంది. కులగణన ఈ దేశానికి ఒక దిశానిర్దేశం చేస్తుంది. దేశ ప్రగతికి దిక్సూచిగా మారుతుంది. సామాజిక న్యాయానికి బాటలు వేస్తుంది. దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించే ప్రక్రియలో భాగంగా కులాన్ని నిర్ధారించడంలో ఏ ప్రభుత్వ తప్పిదమూ ఏమీ వుండదని సుప్రీం కోర్టువ్యాఖ్యానించింది. 2027 జనగణనలో కుల గణనను చేర్చా లని గతేడాది ఏప్రిల్‌లో జరిగిన సమావేశంలో రాజకీయ వ్యవహారాలపై కేబినెట్ కమిటీ నిర్ణయించింది. 2027 జనా భా లెక్కల రెండవ దశలో కుల గణనను పొందుపరచను న్నట్లు పార్లమెంట్‌లో ప్రభుత్వం తెలియజేసింది. తొలి దశ లో ప్రతి ఒక్క కుటుంబం ఇళ్ల పరిస్థితులు, ఆస్తులు, సదుపాయాలు వంటి వాటికి సంబంధించి హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (హెచ్ఎల్ఎ) సేకరణ వుంటుంది. రెండో దశలో,

ప్రజల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, ఇతర వివరాలు సేకరిస్తారు. 2011 జనాభా లెక్కల ప్రకారం,ఈ ప్రక్రియలో కేవలం ఎస్సీ, ఎస్టీలను మాత్రమే లెక్కించేవారు. బడుగు బలహీన వర్గాలుగా ఎవరున్నారో అనేది తెలుసుకోవాలంటే కులగణన తక్షణ అవసరం. అప్పుడు పేదలు ఎవరో తెలుస్తుంది. తద్వారా ఉత్పత్తి పద్ధతులను ఎంపిక చేయాలి. ఆ విధంగా పెట్టుబడులు పెట్టాలి. తద్వారా ఆదాయ కల్పనలు జరగాలి. అదే సంక్షేమ రాజ్యం ఇలా సామ్యవాద తరహా సమాజాన్ని నిర్మించుకోవాలని దిశానిర్దేశం చేసింది మన రాజ్యాంగం. ఆర్థిక సంస్కరణలు చేపట్టిన తర్వాత దేశంలో సంపద కేంద్రీకరణ జరగడం వలన పేదలు నిరుపేదలుగా సంపన్నులు ఎక్కువ సంపదను పోగు చేసుకుంటున్న తరుణంలో ఆర్థిక అభివృద్ధి ఫలాలు అందరికీ అందేదిగా చూసే బాధ్యత ప్రభుత్వాలదే. ఈ నేపథ్యంలో కులాలమయమైన ఈ దేశంలో ఏ కులం వెనుకబడిపోయిందో తెలుసుకోకుంటే ప్రభుత్వం సంతులిత వృద్ధినిసాధించలేదు. ఉత్పత్తి ఫలాలు అందరికీ చేరవు. ఆర్థిక అభివృద్ధి అంటే కేవలం స్థూల జాతియోత్పత్తి పెరుగుదల మాత్రమే కాదు అది ఆర్థిక వృద్ధి మాత్రమే అవుతుంది. ఈ వైరుధ్యాన్ని తొలగించాలంటే అసలైన ఆర్థిక అభివృద్ధిని సాధించాలంటే ఈ వృద్ధి ప్రక్రియలో ప్రజలందరూ మమేకం కావాలి. దేశంలో అత్యంత సంపన్నులైన ఒక శాతం వద్ద స్వాతంత్ర్యం వచ్చే నాటికి జాతీయాదాయంలో 12 శాతం వాటా కలిగి ఉంటే, 1982 నాటికి వారి వాటా 6శాతానికి పడిపోయింది. నయా ఉదారవాద విధానాలు చేపట్టిన తరువాత 2022-23 నాటికి అది ఏకంగా 23 శాతానికి పెరిగింది. గత 100 సంవత్సరాలలోనూ ఆదాయాల అసమానతలు ఇంత దారుణంగా ఎన్నడూ లేవు. ఆర్థికాభివృద్ధికి సరైన కొలమానం ఏది? ప్రజాతంత్ర రాజ్యాంగ వ్యవస్థను కలిగి వున్న ఏ దేశంలోనైనా రాజకీయాధికారం అంతిమంగా ప్రజల చేతుల్లో ఉంటుంది. అటువంటి దేశంలో ఆర్థిక వృద్ధి సాధనతోబాటు సమాంతరంగా ప్రజలను ఆర్థికంగా శక్తివంతులుగా చేయడం అన్నది కూడా కొలమానంగా ఉండాలి. దేశంలో అత్యధిక శాతంగా ఉన్న శ్రామిక ప్రజల సగటు వాస్తవ ఆదాయాలలో పెరుగుదలను పరిగణనలోకి తీసుకోవాలి. దేశ జనాభాను మొత్తంగా ఒక్కటిగానే పరిగణించి సగటు ఆదాయ పెరుగుదలను లెక్కించడం వలన ఉపయోగం లేదు. అత్యంత సంపన్నులైన ఒక్క శాతం ప్రజలవార్షికాదాయం 5.5 శాతం చొప్పున పెరిగింది. తక్కిన 99 శాతంప్రజల వార్షికాదాయాలు కేవలం 1.5 శాతం చొప్పున మాత్రమే పెరిగాయి. కాని దేశ జనాభానంతటినీ ఒక్కటిగానే పరిగణిస్తూ లెక్కిస్తే సగటు ఆదాయ వృద్ధిరేటు 2 శాతం మాత్రమే ఉంది.అత్యంత సంపన్నులైన ఒక్క శాతం జనాభాను, కడు పేదరికంలో ఉన్న జనాభాను కలిపి ఒక్కటిగానే లెక్కిస్తే ఏమిటి ప్రయోజనం? కావున కుల గణన ద్వారానే ఎవరు పేదలు ఎవరు ధనికులు తెలుసుకోవాలి. అంతేగాని కులగణనను వ్యతిరేకించడం సమాజ శ్రేయస్సుకి సంతులిత అభివృద్ధికి వ్యతిరేకం అవుతుంది.

కీవ్‌పై 'ఒరెష్నిక్' ప్రయోగం

- హైపర్ సోనిక్ బాలిస్టిక్ క్షిపణితో దాడి
- నలుగురు మృతి, 60మందికి పైగా గాయాలు, భారీగా ఆస్తి నష్టం
- నాలుగేళ్ల యుద్ధంలో ఒరెష్నిక్ ప్రయోగించడం ఇది మూడోసారి

కీవ్, మే 24: రష్యా ఆక్రమిత తూర్పు ఉక్రెయిన్‌లో జరిగిన దాడులకు ప్రతీకారంగా మాస్కో హెచ్చరించిన నేపథ్యంలో, కీవ్, దాని పరిసర ప్రాంతాలపై క్రెమ్లిన్ భారీ క్షి పణి, డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో నలుగురు మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి జరిగిన దాడుల్లో ఉక్రెయిన్‌పై ఒరెష్నిక్ హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షి పణిని ప్రయోగించినట్లు రష్యా ధ్రువీకరించింది. నాలుగేళ్లుగా జరుగుతున్న ఈ యుద్ధంలో అణ్వాయుధ సామర్థ్యం గల ఈ ఆయుధాన్ని ఉపయోగించడం ఇది మూడవసారి. ధ్వని వేగం కంటే 10 రెట్లు ఎక్కువ వేగంతో ప్రయాణిస్తుందని, అందువల్ల దీనిని అడ్డుకోవడం అసాధ్యమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గొప్పగా చెప్పుకుంటున్న ఒరెష్నిక్ క్షిపణితో రష్యా ఇప్పటికే ఉక్రెయిన్‌పై రెండుసార్లు దాడి చేసిన విషయం తెలిసిందే. రష్యా భూభాగంలోని పౌర మౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ జరిపిన ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందనగా, రష్యన్ ఫెడరేషన్ సాయుధ దళాలు ఒరెష్నిక్ బాలిస్టిక్ క్షిపణులు, ఇస్కాండర్ గగనతల ప్రయోగ బాలిస్టిక్ క్షిపణులు, కింజల్ హైపర్‌సోనిక్ గగనతల ప్రయోగ బాలిస్టిక్ క్షిపణులు, సిర్కాన్ క్రూయిజ్ క్షి పణులతో పాటు డ్రోన్‌లను ఉపయోగించి భారీ దాడి చేశాయని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షి పణిని ప్రయోగించవచ్చని ఉక్రెయిన్ వైమానిక దళం హెచ్చరించిన నేపథ్యంలో, ఆదివారం తెల్లవారుజామున 1 గంట దాటిన వెంటనే పేలుళ్లు ప్రారంభమయ్యాయి. ఉక్రెయిన్ వైమానిక దళం ప్రకారం, ఈ దాడిలో 600 డ్రోన్‌లు, 90 గగనతల, సముద్ర, భూ మార్గ ప్రయోగ క్షి పణులను కూడా ఉపయోగించారు. ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థలు 549 డ్రోన్‌లను, 55 క్షి పణులను ధ్వంసం చేసి, వాటి పనితీరును నిలిపివేశాయని, మరో 19 క్షిపణులు తమ లక్ష్యాలను చేరడంలో విఫలమయ్యాయని వైమానిక దళం తెలిపింది. రాజధానిలో ఇద్దరు మరణించగా, 56 మంది గాయపడ్డారని కీవ్ మేయర్ విటాలి క్లిట్ష్కో తెలిపారు. కీవ్ పరిసర ప్రాంత అధిపతి కూడా అక్కడ ఇద్దరు మరణించగా, తొమ్మిది మంది గాయపడ్డారని చెప్పారు. రాజధానిలోని పలు జిల్లాల్లోని నివాస భవనాలతో సహా 40 ప్రాంతాల్లో నష్టం వాటిల్లిందని కీవ్ సైనిక పరిపాలన అధిపతి టైమూర్ త్కాచెంకో ఒక టెలిగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. "రాజధానిపై భారీ బాలిస్టిక్ క్షి పణి దాడి జరిగింది" అని ఆయన అన్నారు. తూర్పు ఉక్రెయిన్‌లోని తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఘోరమైన దాడులకు బాధ్యులైన వారిని "శిక్షిస్తామని" రష్యా ప్రకటించిన తర్వాత, కీవ్‌పై దాడి జరిగే అవకాశం ఉందని ఉక్రెయిన్ అధికారులు, అమెరికా రాయబార కార్యాలయం అంతకుముందు హెచ్చరించాయి.

ఈ దాడుల్లో ఒక కళాశాల వసతిగృహంపై దాడి జరిగి కనీసం 18 మంది మరణించారని మాస్కో పేర్కొంది. గురువారం రాత్రి నుండి శుక్రవారం తెల్లవారుజాము వరకు జరిపిన ఈ డ్రోన్ దాడి గత కొన్ని నెలల్లో ఉక్రెయిన్‌పై జరిగిన అత్యంత ఘోరమైన దాడులలో ఒకటి. ఆక్రమిత లుహాన్స్క్ ప్రాంతంలోని స్టారోబిల్స్క్‌లో 42 మందిని గాయపరిచింది, శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయారు.

కీవ్‌లో, కార్యాలయాలు, దుకాణాలు, ఒక మెట్రో స్టేషన్ ఫోయర్‌కు నష్టం వాటిల్లిందని అధికారులు నివేదించారు. నగరంలోని ఇండిపెండెన్స్ స్క్వేర్‌లో, ఒక పోస్ట్ ఆఫీస్ దెబ్బతింది.

క్వెట్టాలో రైలుపట్టాలపై భారీ పేలుడు

24 మంది దుర్మరణం, 50 మందికిపైగా తీవ్ర గాయాలు

పేలుడు పదార్థాలున్న కారు ట్రాక్‌పైకి దూసుకురావడంతో ప్రమాదం

మృతుల్లో పాక్ ఆర్మీ సిబ్బంది, కుటుంబ సభ్యులే ఎక్కువ

ఇస్లామాబాద్, మే 24: పాకిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో 24 మంది మరణించగా, 50 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘటన ఆదివారం బలూచిస్థాన్ ప్రావిన్స్‌లని క్వెట్టాలోని చమాన్ పాతక్ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆర్మీ జవాన్లు, వారి కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న రైలు అక్కడి సిగ్నల్ దాటుతుండగా, పేలుడు పదార్థాలతో ఉన్న ఒక కార్ ట్రాక్‌పైకి దూసుకొచ్చి, రైలును ఢీకొని పేలిపోయింది. ఈ ఘటనలో 24 మంది మరణించగా, 50 మంది వరకు గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువగా పాక్ ఆర్మీ సిబ్బంది, వారి కుటుంబసభ్యులే ఉన్నారు. ఇది ఆత్మాహుతి దాడిగా అధికారులు భావిస్తున్నారు. ఈ పేలుడు ధాటికి రైల్వే స్టేషన్ సమీపంలో పార్క్ చేసిన పలు కార్లు దెబ్బతిన్నాయి. రైలు బోగి కూడ ధ్వంసమైంది. పేలుడు తీవ్రతతో వాహనాలకు చెందిన గ్లాస్‌లు, వాహన భాగాలు ఎగిరిపోయి సమీపంలోని బిల్డింగ్‌లపై పడ్డాయి. పేలుడు జరగగానే స్థానికులు భయాందోళనతో పరుగులు తీశారు. ఘటన సమాచారం అందుకున్న అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ఘటనతో అధికారులు క్వెట్టాలోని ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు. డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి సెలవులు రద్దు చేసి అందరూ విధులకు హాజరుకావాలని ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

మేమే దాడి చేశాం: బలోచ్ లిబరేషన్ ఆర్మీ

రైల్వే స్టేషన్ సమీపంలో పేలుడు ఘటన తమ పనేనని బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) ప్రకటించింది. క్వెట్టా కంటోన్మెంట్ నుంచి పాక్ దళాల సిబ్బందిని తీసుకువెళ్తున్న రైలును లక్ష్యంగా చేసుకున్నామని బలోచ్ ఆర్మీ ప్రతినిధి జీయాండ్ బలోచ్ వెల్లడించారు. బలోచ్ ఆర్మీలోని మహిళా షైనాజ్ బలోచ్ ఓ విడియోలో మాట్లాడుతూ.. పాక్ నేతలు తమ ప్రజలను అణచివేస్తున్నారని అన్నారు. తమ సంస్కృతి, గుర్తింపు, హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. అణచివేతకు గురైన ప్రతి బలోచ్ బిడ్డ తన మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నాడని ఆమె పేర్కొన్నారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్‌కు కొన్నేళ్లుగా ముప్పు పొంచి ఉంది. బలోచ్ రెబల్స్, తెహ్రీకే తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) గ్రూప్ ఈ రైలును పలుమార్లు లక్ష్యంగా చేసుకొన్నాయి. దీనికి చాలా వ్యూహాత్మక కారణాలున్నాయి. ఈ రైలులో తరచూ సైనిక దళాలను క్వెట్టా నుంచి పంజాబ్‌కు తరలిస్తుంటారు. తాజాగా కూడా సైనిక కుటుంబాలు ప్రయాణిస్తుండగానే దాడి చోటుచేసుకుంది. 2025లో కూడా పాక్‌లోని బోలన్ జిల్లాలో హైజాక్‌కు గురైన జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి వందల మంది బందీలను భద్రతా దళాలు సురక్షితంగా కాపాడాయి.

అడుగున్నర భూమికోసం కర్రలు రాడ్లతో దాడి: ఇద్దరు మృతి

భోజ్‌పూర్,మే 24: బీహార్‌లో కేవలం అడుగున్నర భూమి కోసం చెలరేగిన వివాదం తీవ్ర హింసకు దారి తీసి ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఈ దారుణ ఘర్షణలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. భోజ్‌పూర్ జిల్లాలోని చార్‌పోఖరి పోలీస్ స్టేషన్ పరిధిలోని మాద్రై గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఈ ఘోరం చోటుచేసుకుంది. మృతులను అదే గ్రామానికి చెందిన రాధేశ్యామ్ సింగ్ (30), రాజ్నాథ్ సింగ్ (72)గా గుర్తించారు. ఘర్షణ సమయంలో కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేయడంతో తల, ఛాతీ, మెడ భాగాల్లో తీవ్ర గాయాలై వారు అక్కడికక్కడే మరణించారు. గ్రామస్థుల కథనం ప్రకారం ఈ అడుగున్నర భూమి విషయంలో ఇరు వర్గాల మధ్య ఏడాది కాలంగా వివాదం నడుస్తోంది. శుక్రవారం సాయంత్రం వివాదాస్పద స్థలంలో ఇటుకలతో నిర్మాణం చేపట్టే విషయమై మాటామాటా పెరిగి, అది కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది.

ముస్లిం మైనార్టీల పరిరక్షణకు కట్టుబడిన కాంగ్రెస్!

మైనార్టీల సమావేశంలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, మే 24: కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మద్దతు ఇచ్చే విషయంలో ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ మైనారిటీ సలహా కమిటీ సమావేశంలో తమ అధినేత ముందు పలువురు నేతలు ఆందోళనల్ని వ్యక్తపరిచారు. రాహుల్ గాంధీ తమ నేతల్ని ఉద్దేశించి మాట్లాడుతూ ముస్లింలకు మద్దతు నిలిచే విషయంలో భయపడొద్దని సూచించారు. ఇదే సమయంలో వచ్చే ఏడాదిలోగా ప్రధాని నరేంద్రమోడీ పదవి నుంచి తప్పుకోవాల్సి వస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఆర్థిక అసంతృప్తి, అంతర్జాతీయ పరిస్థితులు మోడీ ప్రభుత్వంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని అంచనా వేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత ఇమ్రాన్ మసూద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముస్లింలు కేవలం బీజేపీని ఓడించడానికి మాత్రమే కాంగ్రెస్‌కు ఓటు వేస్తారే అభిప్రాయాన్ని పార్టీ మార్చుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లిం సమాజం కోసం చేసిన పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఇది పార్టీకి మద్దతు పెంచుతుందని చెప్పారు. ఇదే సమయంలో మరికొందరు నేతలు, మైనారిటీ సమస్యలపై ఇతర సీనియర్ నేతలు మాట్లాడేందుకు వెనుకంజ వేస్తున్నారని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో కొంత మంది నేతలు ముస్లిం అనే పదానికి బదులుగా "మైనారిటీ అనే పదాన్ని ఉపయోగించాలని కోరారు. దీనితో రాహుల్ గాంధీ విభేదిస్తూ భయపడాల్సిన అవసరం లేదని, అన్యాయాన్ని ఎదుర్కొంటున్న ఏ సమాజానికైనా బహిరంగ మద్దతు ఇవ్వాలని అన్నారు. హిందువులు, దళితులు, అగ్రవర్ణాలు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు,జైనులు ఎవరైనా సరే కాంగ్రెస్ అందరి హక్కుల కోసం మాట్లాడుతుందని ఆయన చెప్పారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

భారతీయులకోసమే అమెరికా ఫస్ట్ వీసా వ్యవస్థ!

అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో

న్యూఢిల్లీ, మే 24: అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా ఒక కీలకమైన అమెరికా ఫస్ట్ వీసా వ్యవస్థనుప్రకటించారు. అమెరికా కాన్సులేట్ కార్యకలాపాలను ఆధునికీకరించే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా ఫస్ట్ పేరుతో ఒక కొత్త వీసా షెడ్యూలింగ్ టూల్‌ను ఆయన పరిచయం చేశారు. భారత్‌లో నాలుగు రోజుల పర్యటనలో ఉన్న ఆయన, ఈ కొత్త విధానం ద్వారా అమెరికాతో ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను పటిష్టం చేసే ప్రయాణికులకు వీసా అపాయింట్‌మెంట్లలో ప్రాధాన్యత లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ఒక్కటేనని రూబియో వివరించారు. అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసే దరఖాస్తుదారులకు షెడ్యూలింగ్‌లో తొలి అవకాశం కల్పించడం దీని లక్ష్యం. ముఖ్యంగా, వ్యాపార ఒప్పందాలు కుదుర్చుకోవడానికి, కార్యకలాపాలు విస్తరించడానికి, లేదా అమెరికా మార్కెట్లలో పెట్టుబడులు పెట్టే భారతీయ కంపెనీల ప్రతినిధులు వంటి వారికి ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటువంటి వారికి వీసా అపాయింట్‌మెంట్లు వేగంగా లభిస్తాయి. భారత్ అమెరికా సంబంధాలు తరచూ వార్తల్లో కనిపించకపోయినా, ఎన్నో విధాలుగా బలపడుతున్నాయని రూబియో అన్నారు. భారత కంపెనీల నుంచి అమెరికాలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని, ఇండోపసిఫిక్‌లో సైనిక విన్యాసాల ద్వారా భద్రతా భాగస్వామ్యం కూడా విస్తరించిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత వీసా ప్రక్రియలో జాప్యం, అనిశ్చితి వల్ల వ్యాపార పర్యటనలు, పెట్టుబడి సమావేశాలు వంటి కీలకమైన కార్యకలాపాలకు ఆటంకం కలుగుతోందని ఆయన అంగీకరించారు. ఈ అడ్డంకులను తొలగించడానికి ఒక స్మార్ట్ షెడ్యూలింగ్ వ్యవస్థ అవసరం. పటిష్టమైన, సురక్షితమైన కాన్సులర్ వ్యవస్థ ఈ ముఖ్యమైన సంబంధానికి జీవనాడి అని రుబియో అభిప్రాయపడ్డారు. ఈ కొత్త సౌకర్యం కేవలం వీసా దరఖాస్తుదారుల కోసమే కాదని, అమెరికా జాతీయ ప్రయోజనాల కోసం ఫ్రంట్ లైన్స్ లో పనిచేస్తున్న కాన్సులర్ అధికారులు, సిబ్బంది పనితీరును కూడా ఇది మెరుగుపరుస్తుందని చెప్పారు. ఈ విధానం అమెరికన్ల డబ్బును ఆదా చేస్తుంది, ఎందుకంటే ఇది మమ్మల్ని మరింత సమర్థవంతంగా మారుస్తుంది. చేయాల్సిన పనిని మరింత కచ్చితంగా, వేగంగా చేయడానికి ఇది అనుమతిస్తుందని ఆయన వివరించారు.

పెన్షన్ కోసం కష్టాల ప్రయాణం..

అత్తను వీపుపై 9 కి.మీ. మోసిన కోడలు

చత్తీస్‌గఢ్, మే 24: చత్తీస్‌గఢ్‌లోని మారుమూల ప్రాంతంలో చోటుచేసుకున్న ఒక హృదయవిదారక ఘటన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. 90 ఏళ్ల వయసున్న అత్తను వీపుపై మోసుకుంటూ ఓ మహిళ ఎండలో అడవులు, రాతి మార్గాలు, వాగులు దాటుకుంటూ కిలోమీటర్ల కొద్దీ నడుస్తున్న దృశ్యాలు విక్రమ్, భేతాళ కథలను గుర్తుకు తెస్తున్నాయి. సర్గుజా జిల్లాలోని మైన్‌పాట్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. సుఖ్మానియా బాయి అనే మహిళ తన 90 ఏళ్ల అత్తకు పింఛను డబ్బులు ఇప్పించడం కోసం ఆమెను తన వీపుపై మోస్తూ దాదాపు 9 కిలోమీటర్ల దూరంలోని బ్యాంకుకు తీసుకెళ్లింది. ఈ ప్రాంతంలో సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రాథమిక అవసరాల కోసం కూడా ప్రజలు ఇలాగే కాలినడకన ప్రమాదకర మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. పింఛను డబ్బులు లబ్దిదారులకు అందచేయాలంటే వారు తప్పనిసరిగా బ్యాంకుకు వచ్చి వేలిముద్రలు వేయాలన్న నిబంధన ఉంది. ఈ కారణంగానే సుఖ్మానియా బాయి గత కొన్ని నెలలుగా ఇదే విధంగా తన అత్తను బ్యాంకుకు తీసుకెళుతున్నట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియో తీస్తున్న వ్యక్తి ఇంత కష్టపడి ఎందుకు మోసుకెళ్తున్నావని స్థానిక భాషలో అడగగా సుఖ్మానియా బాయి తన ఆవేదనను వెళ్లగక్కింది. బ్యాంకుకు స్వయంగా తీసుకెళితేనే పింఛను డబ్బులు ఇస్తున్నారు. మా ఊరికి బస్సు సౌకర్యం లేదు. అడవులు, వాగులు దాటుకుంటూ వెళ్లాలి. నెలనెలా వచ్చే రూ.1500 కోసం ఈ కష్టం తప్పడం లేదు అని ఆమె వివరించింది. గతంలో పింఛను డబ్బులు స్థానికంగానే అందేవని, కానీ ఇప్పుడు ఈ కష్టాలు పడాల్సి వస్తోందని ఆమె తెలిపింది. ఈ వీడియో చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. డిజిటల్ ఇండియా, ఇంటి వద్దకే సేవలు అంటూ ప్రభుత్వాలు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయి వాస్తవాలకు మధ్య ఉన్న వ్యత్యాసానికి ఈ ఘటనే నిదర్శనమని విమర్శిస్తున్నారు.

దేశాన్ని అస్థిరపరిచే కుట్రలుచేస్తున్న కాంగ్రెస్, రాహుల్!

కేంద్ర మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ, మే 26: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, విపక్ష పార్టీలపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆదివారంనాడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశాన్ని అస్థిరపరచేందుకు వీరంతా కుట్రపన్నుతున్నారని, హింసను రెచ్చగొడుతున్నారని అన్నారు. పాలకపక్షాన్ని ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎదుర్కోవడంలో విఫలం కావడంతో ఉద్దేశపూర్వకంగా దేశంలో అశాంతి సృష్టించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపిస్తూ సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. దేశాన్ని అస్థిరపరచేందుకు కాంగ్రెస్, విపక్ష పార్టీలు కుట్ర పన్నుతున్నాయి. దేశాన్ని అస్థిరపరచాలని ఈ టూల్‌కిట్ గ్యాంగ్ కలలు కంటోంది. రాహుల్ గాంధీ ప్రకటన ఆషామాషీగా చేసినది కాదు. దేశంలో అరాచకం వ్యాప్తి చేసేందుకు జరుగుతున్న కుట్రలో భాగం. రాజకీయ నిరాశానిస్పృహలే ఇందుకు కారణం.

ఫాల్టా ఉప ఎన్నికలో బిజెపి అభ్యర్థి ఘనవిజయం

ఫాల్టా,(బెంగాల్),మే 24: పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్టా అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన రీపోలింగ్ ఓట్ల లెక్కింపులో బీజేపీ ఘన విజయం సాధించింది. ఆదివారం వెలువడిన ఫలితాల్లో బీజేపీ అభ్యర్థి దేబాంగ్షు పండా ఏకంగా 1,09,021 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి నాలుగో స్థానానికి పడిపోయి, డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. అయితే పోలింగ్‌కు ముందే తాను ఎన్నికల బరిసుంచి వైదొలుగుతున్నట్లు జహంగీర్‌ఖాన్‌ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనివల్లనే ఆయన లెక్కింపులో నాలుగోస్థానానికి పడిపోయారు. ఓట్ల లెక్కింపులో దేబాంగ్షు పండాకు 1,49,666 ఓట్లు రాగా, సీపీఐ(ఎం) అభ్యర్థి శంభునాథ్ కుర్మీ 40,645 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అబ్దుర్ రజాక్‌కు 10,084 ఓట్లు, తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి జహంగీర్ ఖాన్‌కు కేవలం 7,783 ఓట్లు మాత్రమే వచ్చాయి.

ఫాల్టా ఫలితాలు రెండు విధాలుగా చారిత్రాత్మకమైనవి. 1988లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్థాపించిన తర్వాత ఒక ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థి నాలుగో స్థానానికి పరిమితం కావడం ఇదే తొలిసారి. 2011లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీఎంసీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోవడం కూడా ఇదే మొదటిసారి. ఏప్రిల్ 29న జరిగిన అసలు పోలింగ్‌లో ఫాల్టా నియోజకవర్గంలో తీవ్ర అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

తమిళనాడులో కోటి కుటుంబాలకు ఉచిత విద్యుత్ అమలు!

చెన్నై, మే 24: రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పథకాన్ని విస్తరిస్తూ తీసుకున్న నిర్ణయం వచ్చే బిల్లింగ్ సైకిల్ నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానంతో రాష్ట్రంలోని కోటికి పైగా కుటుంబాలకు విద్యుత్ బిల్లు సున్నాకు చేరనుంది. ముఖ్యమంత్రిగా సి.జోసెఫ్ విజయ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తీసుకున్న ఈ తొలి కీలక నిర్ణయం లక్షలాది కుటుంబాలకు ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఈ పథకం అమలు కోసం తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ తమ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది. ప్రభుత్వ నూతన విధానానికి అనుగుణంగా అర్హుల గుర్తింపు, సబ్సిడీ లెక్కింపు, బిల్లుల జారీ వంటి మార్పులను సాఫ్ట్‌వేర్‌లో పొందుపరిచినట్లు టీఎన్‌పీడీసీఎల్ అకౌంట్స్ విభాగం వెల్లడించింది. క్షేత్రస్థాయి సిబ్బందికి దీనిపై పూర్తి అవగాహన కల్పించి, అర్హులైన వినియోగదారులకు ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధి చేకూరేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం రెండు నెలలకు 500 యూనిట్ల లోపు విద్యుత్ వాడే గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా సరఫరా చేస్తారు. రాష్ట్రంలో మొత్తం 2.46 కోట్ల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటివరకు 100 యూనిట్ల లోపు వాడే 67 లక్షల కుటుంబాలు సున్నా బిల్లు పొందుతున్నాయి. తాజా విస్తరణతో ఈ సంఖ్య ఏకంగా 1.2 కోట్లకు పెరగనుంది. మరో 85.83 లక్షల మంది వినియోగదారుల బిల్లులు ప్రతి రెండు నెలలకు సుమారు రూ. 235 వరకు తగ్గే అవకాశం ఉంది. అయితే, 500 యూనిట్లకు మించి వాడే 34.24 లక్షల మందికి మాత్రం పాత పద్ధతిలోనే 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రయోజనం కొనసాగుతుంది. ఈ పథకం ద్వారా అయ్యే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అధికారులు స్పష్టం చేశారు.

మే 10న ప్రభుత్వం ఈ ప్రకటన చేసిన వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ ప్రక్రియను ప్రారంభించారు.

డిఎంకె దయాదాక్షిణ్యాలపైనే విజయ్ ప్రభుత్వం:స్టాలిన్

చెన్నై, మే 24: తమిళనాడు రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సరికొత్త యుద్ధం మొదలైంది. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పూర్తి కాలం కొనసాగలేదని, అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక "సినిమా సునామీ మాత్రమేనని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసం లేదా సిద్ధాంతాలను చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిక్ ఫిగర్ అంశాన్ని స్టాలిన్ ప్రధానంగా ప్రస్తావించారు.

సంక్షిప్తంగా..

బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీకి టివికె సై!

చెన్నై, మే 24: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి అధికార పగ్గాలు చేపట్టిన నటుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలపై దృష్టి సారించారు. టీవీకే పార్టీ విస్తరణలో భాగంగా ఆయన కర్ణాటక రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ఆరాష్ట్రంలోని బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కర్ణాటకలో పార్టీ జెండా పాతాలని విజయ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ హబ్ బెంగళూరు నగరంలో స్థానిక కన్నడిగులతో పాటు లక్షలాది మంది తమిళ ప్రజలు దశాబ్దాలుగా నివసిస్తున్నారు. నటుడిగా విజయ్‌కు కర్ణాటక వ్యాప్తంగా, ముఖ్యంగా బెంగళూరులో భారీ సంఖ్యలో అభిమాన సంఘాలు, బలమైన ఫాలోయింగ్ ఉంది.

వైట్‌హౌస్ వద్ద కాల్పులు-ఎన్‌కౌంటర్‌లో ఒకరు మృతి

వాషింగ్టన్, మే 24: అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ దగ్గర కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. యూఎస్ సీక్రెట్ సర్వీస్ చెక్‌పాయింట్‌పై ఓ ఆగంతకుడు కాల్పులకు తెగబడ్డాడు. భద్రతాసిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో అతను మరణించాడు. ఈ ఘటనలో ఒక పౌరుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం 17వ వీధి, పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద ఉన్న భద్రతా చెక్‌పాయింట్ వద్దకు వచ్చిన ఓ వ్యక్తి తన బ్యాగ్‌లోంచి తుపాకీ తీసి అక్కడున్న సీక్రెట్ సర్వీస్ అధికారులపై కాల్పులు ప్రారంభించాడు. తక్షణమే అప్రమత్తమైన అధికారులు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులు జరిపి నిందితుడిని నిలువరించారు. ఈ ఘటన జరిగిన సమయంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోనే ఉన్నారని, ఆయన సురక్షితంగా ఉన్నారని అధికారులు స్పష్టంచేశారు.

కాంగ్రెస్‌ను ఎన్నటికీ నమ్మలేం: ఉదయనిధి

చెన్నై, మే 24: డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. రాజకీయ లబ్ధి కోసం ఆ పార్టీ తమను వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. గత 20 ఏళ్లుగా ఆ పార్టీ తమపై ఆధారపడి ఉందని, ఈ రోజు అధికారం కోసం టివికెతో చేతులు కలిపిందని విమర్శించారు. ఈ విషయాన్ని ఎవరూ ఎప్పటికీ మరిచిపోవద్దని, ఆ పార్టీ నేతలను భవిష్యత్తులో తమ దరిదాపుల్లోకి కూడా రానివ్వకూడదని సూచించారు. రాజకీయంగా తన ఉనికిని నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికి అయినా ఒడిగడుతుందని మరోసారి రుజువయ్యిందన్నారు. దేశంలో బిజెపి వరుస విజయాలకు ప్రధాని మోడీ, అమిత్ షాలే ప్రధాన కారణమని తాను ఇన్నాళ్లు భావించానని, కానీ అది నిజం కాదని ఉదయనిధి అన్నారు.

డిఎంకె కష్టకాలంలో ఎప్పుడూ అండగా నిలిచాం : కాంగ్రెస్

చెన్నై, మే 24: తమిళనాడులో డీఎంకే వల్లే కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు గెలిచారని, విజయ్ సారథ్యంలోని టీవీకేతో చేతులు కలిపి తమకు వెన్నుపోటు పొడిచిందని ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ తిప్పికొట్టింది.

డీఎంకే కష్టకాలంలో ఉన్నప్పుడల్లా తమ పార్టీ వెన్నంటే ఉందని కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ ఆదివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. డీఎంకే కష్టకాలంలో ఉన్నప్పుడల్లా కాంగ్రెస్ అండగా నిలిచింది. వాళ్లు మైనారిటీలో ఉన్నప్పుడు మేము బయటే వేచిచూసాం. ఉదయనిధి వ్యాఖ్యలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మాణిక్యం ఠాగూర్ అన్నారు.

ముత్యపుచిప్పల కోసం వెళ్లి నదిలో ఎనిమిది మంది మృతి

భట్కాల్(కర్ణాటక),మే 24: నదిలో ముత్యపు చిప్పల కోసం వెళ్లిన ఒకే కుటుంబానికి చెందినఎనిమిది మంది మరణించారు. ఇంకో ఇద్దరు గల్లంతైనట్లు తెలుస్తోంది. మృతుల్లో ఏడుగురు మహిళలు ఉన్నారు. కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా, భట్కాల్ తాలూకా, షిరాలి గ్రామ సమీపంలోని తట్టే హక్కాలు నదిలో ఆదివారం ఈ విషాదం చోటుచేసుకుంది. తట్టే హక్కాలు అనే మంచినీటి నదిలోకి 14 మంది సభ్యుల బృందం ఆదివారం ముత్యాల చిప్పల కోసం వెళ్లింది. ఈ సీజన్‌లో ఇక్కడ ముత్యపు చిప్పలు ఎక్కువగా దొరుకుతాయి. వీటిని సేకరించేందుకు స్థానికులు చాలా మంది నదిలోకి వెళ్తుంటారు. బాధితులు నదిలోకి వెళ్లి ముత్యాల కోసం వెతికే సమయానికి నీటి ప్రవాహం తక్కువగా ఉంది.

అయితే, ఉన్నట్లుండి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. వేగంగా అలలు వీచాయి. పెరిగిన నీటి ప్రవాహం, అలల ధాటికి ఒక్కొక్కరు కొట్టుకుపోయారు.

25-5Pg6exHMNWJQE.qxd:25-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:41 AM Page 1

నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో

కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనం పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో ఈనెల 28 నుండి జూన్ 5వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

తిరుమలలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు

భక్తుల రద్దీ మధ్య చెత్త తొలగింపు

తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: వేసవి సెలవులు, వారాంతాలు, ప్రత్యేక దర్శనాల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. తిరుమలలో ప్రస్తుతం సుమారు 210 మరుగుదొడ్లు భక్తులకు అందుబాటులో ఉండటంతో పాటు మరో 130 సంస్థాగత మరుగుదొడ్లను టిటిడి నిర్వహిస్తోంది. ప్రతి మరుగుదొడ్ల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించి, గంట గంటకూ శుభ్రపరిచే విధంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అమలు చేస్తోంది. రసాయనాలు, డిసిన్ఫెక్టల వినియోగం, పరిశుభ్రత ప్రమాణాలపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా అందించడం జరిగింది. భక్తుల వినియోగం అధికంగా ఉన్న ప్రాంతాల్లోని మరుగుదొడ్లను రోజుకు 1,500 నుంచి 2,000 మందికి పైగా భక్తులు వినియోగిస్తున్నారు. ఇక రోడ్ల పరిశుభ్రత విషయంలో కూడా టిటిడి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. రియల్ టైమ్ రోడ్ స్వీపింగ్, చెత్త సేకరణ, నీటి స్ప్రే వంటి పనులు నిరంతరం కొనసాగుతున్నాయి. ఇటీవల ఆకులు రాలే కాలంలోనూ పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం శ్రమించి తిరుమల పరిశుభ్రతకు విశేష కృషి చేశారు. ఇటీవల భక్తుల రద్దీ భారీగా పెరగడంతో బయట క్యూ లైన్లలో భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ నిరంతరం కొనసాగుతున్న నేపథ్యంలో కొంతమంది భక్తులు ఆహార పదార్థాలను పూర్తిగా వినియోగించకుండా పారవేయడం వల్ల ఆహార వ్యర్థాలు అధికంగా పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో క్యూ లైన్ల వెనుక భాగాల్లో ఆహార వ్యర్థాలు ఎక్కువగా చేరుతున్నాయి. సేకరించిన వ్యర్థాలను తొలగించడంతో పాటు బ్లీచింగ్ చల్లడం వంటి చర్యలు కూడా చేపడుతున్నారు. సాధారణ రోజుల్లో 50 టన్నుల వరకు ఉండే తడి వ్యర్థాలు ప్రస్తుతం భక్తుల రద్దీ పెరగడంతో 60 నుంచి 75 టన్నుల వరకు పోగవుతోంది. అదనంగా డ్రై వేస్ట్ కూడా గణనీయంగా పెరిగింది. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడు పరిసరాల పరిశుభ్రతలో భాగస్వామి కావాలని, పారిశుద్ధ్య నిర్వహణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సిబ్బంది కృషిని దృష్టిలో ఉంచుకుని ఆహార పదార్థాలను వృథా చేయకుండా సహకరించాలని భక్తులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

పండగలు సంప్రదాయాలకు మార్గదర్శకాలు

శ్రీకాళహస్తి, మే 24 ప్రభాతవార్త: ఎవరైతే భగవంతుని (అల్లాహ్) ఆదేశాలను తు.చ. తప్పక నిష్కల్మషంగా ఆచరిస్తారో వారు స్వర్గస్తులని, పండగలు సంప్రదాయాలకు దిక్సూచిలు అని, ఆచరించాల్సిన విధానాలతో ఆచరించాలని హాఫీజే ఖుర్ ఆన్ మహమ్మద్ ఆలీ అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన బక్రీద్ పండగ ప్రాధాన్యతను వివరిస్తూ పండగ రోజు ఆచరించాల్సిన విధి విధానాలను వివరించారు. పండగలంటే ఆనందాన్ని మన కుటుంబానికి, బంధులకు మాత్రమే పరిమితం కాదని ప్రతి ఒక్కరికి అవసరాలను గుర్తించాలని సూచిస్తుందన్నారు. సేవాభావంతో ప్రతి ముస్లిం దైవ ఆజ్ఞలను నేరవేర్చటానికి ముందుకు రావాలని, ప్రతి ఒక్కరి హృదయం ఆత్మదైవ గొప్పతనంతో నిండిపోవాలని వివరించారు. ఈద్ అనే పదం ఔద్ నుంచి వచ్చింది. దీని అర్థం తిరిగి రావటం అని వివరించారు.

పాస్టర్ ఆనంద్ ఎస్సీ హోదా రద్దు

- బాపట్ల కలెక్టర్ డా.వినోద్‌కుమార్ కీలక నిర్ణయం
- అధికారిక వెబ్‌సైట్‌లో గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జిల్లా యంత్రాంగం చర్యలు

బాపట్ల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్న వారికి ఎస్సీ హోదా వర్తించదన్న సుప్రీంకోర్టు తీర్పుల నేపథ్యంలో బాపట్ల జిల్లాలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. కొన్నేళ్లుగా న్యాయస్థానాల్లో నడుస్తున్న వివాదానికి తెరదించుతూ పాస్టర్ చింతాడ ఆనంద్ ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో క్రైస్తవ మతంలోకి మారిన వారికి ఎస్సీ హోదా కొనసాగదనే అంశంపై స్పష్టత వచ్చినట్లయింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లా స్థాయిలో పలు విడతలుగా సమగ్ర విచారణ జరిపిన అధికారులు చివరకు ఆనంద్ సామాజిక హోదాను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన అధికారిక గెజిట్‌ను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌తో పాటు మాన్యువల్ రికార్డుల్లోనూ మార్పులు చేశారు. ఈ ప్రొసీడింగ్స్ ప్రతిని సామాజిక సంక్షేమ శాఖతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు పంపినట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి.

వివాదం నేపథ్యం ఇదీ: గత ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెంలో 2021 జనవరి 24న ప్రార్థనలు ముగించుకుని వెళ్తున్న తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించారంటూ పాస్టర్ చింతాడ ఆనంద్ చందోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా పోలీసులు అక్కల రామిరెడ్డి సహా మరో ఐదుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అయితే, ఆనంద్ తన ఫిర్యాదులోనే తాను క్రైస్తవుడినని పేర్కొన్నారని.. అలాంటప్పుడు అట్రాసిటీ చట్టం ఎలా వర్తిస్తుందని ప్రశ్నిస్తూ రామిరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తప్పుడు కేసుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ జరిపిన హైకోర్టు.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఎస్సీ హోదా కోల్పోతారని స్పష్టం చేస్తూ, ఆనంద్ ఫిర్యాదుతో నమోదైన అట్రాసిటీ కేసును కొట్టివేసింది.

కమిటీ నివేదిక ఆధారంగానే..: హైకోర్టు తీర్పు అనంతరం ఆనంద్ ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేయాలంటూ రామిరెడ్డి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు తిరిగి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై స్పందించిన బాపట్ల కలెక్టర్.. జేసీ భావన నేతృత్వంలో జిల్లా స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నెల 1న ఇరుపక్షాల వాదనలు విన్న కమిటీ.. ఆనంద్ ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌కు సిఫార్సు చేసింది. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్ ఈ నెల 3న ఆనంద్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ.. 18వ తేదీలోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు. దీనికి స్పందనగా ఆనంద్ తపాలా ద్వారా సమాధానం పంపడమే కాకుండా, ఈ నెల 19న వ్యక్తిగతంగా తుది విచారణకు హాజరయ్యారు. తాను పుట్టుకతోనే ఎస్సీనని పేర్కొంటూ అందుకు మద్దతుగా 70 పేజీల పత్రాలను సమర్పించారు. అయితే ఆ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా యంత్రాంగం.. న్యాయ నిపుణుల సలహా మేరకు పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికేట్‌ను రద్దు చేస్తూ తుది నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ వివాదానికి తాత్కాలికంగా ముగింపు పడింది.

న్యాయపోరాటంలో గెలిచా: అక్కల రామిరెడ్డి: గత ప్రభుత్వ హయాంలో నాపై పాస్టర్ ఆనంద్ అన్యాయంగా అట్రాసిటీ కేసు పెట్టి వేధించారు. నాటి అధికార పార్టీ నేతల బెదిరింపులను, పోలీసుల ఒత్తిళ్లను తట్టుకుని ఒంటరిగా సుదీర్ఘ న్యాయపోరాటం చేశాను. కలెక్టర్ స్పందించి ఆనంద్ ఎస్సీ హోదాను రద్దు చేయడం సంతోషంగా ఉంది.

సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశా: పాస్టర్ ఆనంద్: నా న్యాయపోరాటం ఇక్కడితో ఆగదు. నా ఎస్సీ హోదాను కాపాడుకునేందుకు ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశాను. దీనిపై చట్టపరంగా మున్ముందుకు వెళ్తాను.

తెనాలిలో మహిళ సెల్ఫీ సూసైడ్

పోలీసుల వేధింపులే కారణమన్న మహిళ ఆరోపణలు

తెనాలి, మే 24 ప్రభాతవార్త: తనకు సంబంధం లేని కేసులో పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారంటూ తిరుపతమ్మ అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. గుంటూరు జిల్లా తెనాలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసు విషయంలో బంగారం రికవరీ కోసం పిలిపించి పోలీసులు వేదించారు అంటూ సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేసింది.

గతంలో కొన్ని సంవత్సరాల క్రితం కొత్తపేటలోని ఓ అపార్ట్మెంట్లో భర్తతో కలిసి వాచ్‌మెన్‌గా పని చేసిన తిరుపతమ్మ అనే మహిళ అపార్ట్మెంట్ ఫ్లాట్‌లోని ఓ మహిళ తనకు బంగారం ఇచ్చానంటూ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసిందని ఆరోపిస్తూ, చేయని నేరానికి వేధింపులకు గురి చేస్తున్నారంటూ తిరుపతమ్మ శనివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది.

గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున 3:00 సమయంలో మృతి చెందింది. దీంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. అనంతరం మృతదేహం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

- అరటి పంట నష్టాలతో తీవ్ర మనస్తాపం
- పొలంలోనే గడ్డి మందు తాగి ఆత్మహత్య
- రూ.18 లక్షల అప్పులు.. కుటుంబంలో విషాదం

పులివెందుల, మే 24 ప్రభాతవార్త: అప్పుల ఊబిలో చిక్కుకుని మరో రైతు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన వైఎస్సార్ కడప జిల్లాలో చోటుచేసుకుంది. పులివెందుల మండలం ఇ.కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణమూర్తి (42) అప్పుల భారాన్ని తట్టుకోలేక పొలంలోనే గడ్డి మందు తాగి మృతి చెందాడు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల వివరాల మేరకు బాలకృష్ణమూర్తికి స్వంతంగా 1.20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగునీటి అవసరాల కోసం మూడు బోర్లు వేయించగా భారీగా అప్పులు అయ్యాయి. అప్పులు తీర్చేందుకు అదనంగా ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని అరటి పంట సాగు చేశారు. అయితే అరటి పంటకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, పెట్టుబడులు పెరగడం వల్ల తీవ్ర నష్టాలు చవిచూశారు.

ఈ క్రమంలో ప్రైవేట్ వ్యక్తుల వద్ద సుమారు రూ.18 లక్షల వరకు అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపానికి గురైన బాలకృష్ణమూర్తి శనివారం సాయంత్రం తన పెద్ద కుమారుడికి ఫోన్ చేసి తాను బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు చెప్పినట్లు తెలిసింది. అనంతరం పొలంలోనే గడ్డిమందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను పులివెందుల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య లక్ష్మీ మదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుటుంబ పెద్ద మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య లక్ష్మీ మదేవి ఫిర్యాదు మేరకు పులివెందుల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యవసాయానికి పెట్టుబడులు పెరగడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం, ప్రైవేట్ అప్పుల ఒత్తిడి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బైండోవర్ ఉల్లంఘించిన

నేరస్తుని అరెస్ట్

విజయవాడ, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: బైండోవర్ ఉల్లంఘించిన స్థానిక వాంబే కాలనీకి చెందిన గొల్లపల్లి పోతురాజును అరెస్ట్ చేసి జైలుకు తరలించామని గుడివాడ పట్టణ డిఎస్పీ పి.శ్రీనివాస్ వెల్లడించారు. ఆదివారం గుడివాడలో డిఎస్పీ శ్రీనివాస్ విలేకర్లతో మాట్లాడుతూ సెక్షన్ 129(ఇ) బిఎన్‌ఎస్‌ఎస్ ప్రకారం ఏడాది పాటు బైండోవర్‌లో ఈ నిందితుడు ఉన్నారన్నారు. మే 15న మళ్లీ నేరానికి పాల్పడటంతో అతడిపై క్రైమ్ నం.132/2025 కింద కేసు నమోదు చేశామన్నారు. ష్యూరిటీ కింద రూ.2 లక్షల నగదు కట్టలేనని పోతురాజు సమాధానం ఇచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ డిటెన్షన్ ఉత్తర్వులతో పోతురాజును వన్ టౌన్ సిఐ కొండపల్లి శ్రీనివాస్ అరెస్ట్ చేశారని వివరించారు. గుడివాడ సబ్ డివిజన్‌లో 444 మందిపై బైండోవర్ కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. బైండోవర్‌లో ఉన్నవారు నేరాలు చేస్తే జరిమానా, డిటెన్షన్, జైలు శిక్ష తప్పదని డిఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. కృష్ణా జిల్లాలో పోతురాజు తొలిసారి బైండోవర్ ఉల్లంఘించిన నిందితుడని డిఎస్పీ పోతురాజు వివరించారు.

మతంలో నియంతృత్వ ధోరణి బాధాకరం

- చాంధస వాదుల నుంచి సమాజాన్ని కాపాడుకోవాలి
- విరసం పూర్వ కార్యదర్శి చెంచయ్య

తిరుపతి, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: మతం అనేది ఒక మత్తు మందు. మతంతో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలు ముడిపడి ఉన్నాయి. ప్రస్తుతం మతం సాహిత్యంలోకీ చొచ్చుకు పోతోంది, ఇది చాలా ప్రమాదకరం. మతం అనే దుర్మార్గం, చాంధసవాదం నుంచి సమాజాన్ని కాపాడుకోవాలి. ఇది కేవలం వామపక్ష భావజాలం ఉన్న వారితోనే సాధ్యమవుతుంది. సమాజ శ్రేయస్సు కోసం కమ్యూనిస్టులందరూ ఆచరణలో ఏకం కావాలి" అని విప్లవ రచయితల సంఘం (విరసం) పూర్వ కార్యదర్శి వి.చెంచయ్య పిలుపునిచ్చారు. తిరుపతి నగరం బైరాగపట్టెడలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో నిర్వహించిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం) 20వ రాష్ట్ర మహాసభల ముగింపు రోజైన ఆదివారం ఆయన హాజరయ్యారు. "మతం వర్తమాన సమాజం" అనే అంశంపై చెంచయ్య ప్రసంగం చేశారు. కాకినాడ జిల్లాకు చెందిన అరసం నేత సి.సబ్బరాజు అధ్యక్షత వహించిన ఈ సభను తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షులు తమటం రామచంద్రారెడ్డి సమన్వయం చేశారు. మతం మీద గట్టి పోరాటం చేయడానికి వామపక్షాలు ఐక్యం కావాలన్నారు. ఇది కేవలం ఒకచోట కూర్చొని మాట్లాడితే కుదిరే పని కాదని, ఆచరణలోనే దీనిని నిరూపించాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. మనం 'జై శ్రీరామ్' నినాదంతో పోరాడాల్సిన క్లిష్ట పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇందుకు ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కారణాలు బలంగా ఉన్నాయని విశ్లేషించారు. మతం, దేవుడు అనేవి పూర్తిగా ఎవరి వ్యక్తిగత ఇష్టాలపై ఆధారపడి ఉంటాయన్నారు. ప్రస్తుత పాలకుల విధానాల వల్ల మన సమాజం చాలా ప్రమాదకరమైన స్థితిలో పడిపోయిందని చెంచయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు భక్తులపై కూడా నియంతృత్వ ధోరణిని అవలంభిస్తున్నారని మండిపడ్డారు. దేశంలో క్రైస్తవులు, ముస్లింలు ఉండాలంటే వారు హిందువుల లాగే ఉండాలంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటి పాలకులు చివరకు 'జనగణమన'ను పక్కన పెట్టి 'వందేమాతరం' మాత్రమే పాడాలంటూ ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. కేవలం మతాన్ని, దేవుని తిట్టడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, సమస్య మూలాలను ఆలోచించి పరిష్కారం కనుగొనాలని సూచించారు. సనాతనం పేరిట మార్పును అడ్డుకుంటున్నారు. ప్రస్తుతం సాహిత్యంలోకి కూడా మతం ప్రవేశిస్తోందని, ఈ నేపథ్యంలో అభ్యుదయ రచయితలందరూ తక్షణమే మేల్కోవాలని వి.చెంచయ్య పిలుపునిచ్చారు.

ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థకు స్వాగతం

- సిపిఐ నేత నారాయణ

తిరుపతి, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: దేశంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ వచ్చి తీరుతుందనే విశ్వాసం తమకు ఉందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ అన్నారు. అది కాక్రోచ్ రూపంలో, మరో రూపంలో వచ్చినా స్వాగతం పలుకుతున్నామన్నారు. తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెట్టుబడిదారులు రెండు వర్గాలుగా విడిపోయి, వారికి వారే పోటీగా మారారని అన్నారు. యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యమే అని శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాలు నిరూపించాయన్నారు. తాజాగా తమిళనాడులో సైతం వ్యవస్థీకృత పార్టీలను కాదని, కొత్తవారిని ఎన్నుకున్నారని గుర్తుచేశారు. యువత ఆవేశపూరిత రాజకీయ, సాంఘిక, ప్రత్యామ్నాయ ఆలోచనలు రాజకీయ స్వరూపం తీసుకుంటుందని పేర్కొన్నారు. అలాంటి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేందుకు వామపక్ష వాదులు ముఖ్యంగా సిపిఐ సిద్ధంగా ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు. మన రాష్ట్రంలో కూడా అవినీతికి, అవినీతికి మధ్యే పోటీ ఉందని, నీతికి, అవినీతికి మధ్య కాదన్నారు. ఈ పరిస్థితుల్లో రాజకీయ పరిణామాలు నివురు కప్పిన నిప్పులా ఉన్నాయన్నారు. ఉద్యమించే వారిని తుదముట్టిస్తే ఉద్యమాలు ఆగవని గుర్తు చేశారు. వ్యవస్థలో లోపాలను సరిదిద్దుకోవాలని అన్నారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్ జనసేన నేతలపై చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక రాజకీయ అంశాలపై మాట్లాడినప్పుడు ఆధారం ఏమిటో నిర్దిష్టంగా చెప్పి ఉండాల్సింది కాదన్నారు. తర్వాత ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నప్పటికీ కేసులు నమోదు చేయడం సరికాదని, ఆయన వ్యాఖ్యలను ఖండించేందుకు వివిధ ప్రత్యామ్నాయాలను ఉపయోగించుకోవచ్చునని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందన్నారు. ఇటీవల గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇతర వర్గాల మాదిరిగా అవినీతిలో కూడా తమకు హక్కు ఉందన్నట్టు కులాన్ని వాడుకోవడం మంచిది కాదని అన్నారు. ఎవరు అవినీతికి పాల్పడినా తప్పేనని పేర్కొన్నారు.

తిరుపతిలో భూమన ఇంటి ముట్టడికి హిందూ సంఘాలు, సాధువుల యత్నం

తిరుమల, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ టిటిడి మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ప్రతినిధులు, సాధువులు ఆదివారం ఉదయం ఆయన ఇంటి ముట్టడికి ప్రయత్నించారు. తిరుమలను భూమన రాజకీయాలకు వాడుకుంటున్నా రన్న ప్రముఖ సాధువు తిరుపతిలోని శిల్పారామం వద్ద నుండి పద్మావతిపురంలోని భూమన ఇంటి వద్దకు ప్రదర్శనగా బయలుదేరారు. ఈ ర్యాలీని తొలుతనే పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెల కొంది. భూమనను అరెస్ట్ చేయాలని, ఆయన ఇంటిని ముట్టడించేందుకు వెళుతున్న సాధువులను అప్రమత్తమైన పోలీసులు నిరసనకారులను మధ్యలోనే అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తమ శాంతియుత నిరసనను అడ్డుకోవడంపై హిందూ ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాధువు మాట్లాడుతూ తిరుమల అనేది రాజకీయాలకు అతీతమైన పరమ పవిత్ర క్షేత్రమని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది హిందువుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉందని గుర్తుచేశారు. అదృష్టం కొద్దీ రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా పనిచేసే అవకాశం వచ్చినప్పటికీ, భూమన శ్రీవారి సేవను విస్మరించి తిరుమలను రాజకీయం కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఆయన చేసిన తప్పులకు గానూ వేంకటేశ్వర స్వామికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, సాధువులు రోడ్డుపైకి వస్తే దాడి చేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్ర పన్నాయని హిందూ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. భూమనను అరెస్ట్ చేయాలని హిందూ సంఘాలు, సాధువుల డిమాండ్ చేశారు. భూమన కరుణాకర్ రెడ్డి తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారు. అదృష్టం కొద్దీ ఆయన రెండు సార్లు టిటిడికి చైర్మన్ అయ్యారు. అలాంటి ఆయన వెంకటేశ్వర స్వామి సేవలో ఉండాలి. కానీ, తిరుమలను రాజకీయాల కోసం వాడుకుంటున్నారు. ఆయన చేసిన పాపాలకు వెంకటేశ్వర స్వామికి బహిరంగ క్షమాపణ చెప్పాలి. సాధు, సంతులను చూసైనా భూమనలో మార్పు వస్తుందని కోరుకుంటున్నాము. కచ్చితంగా క్షమాపణ చెప్పాల్సిందే అని డిమాండ్ చేశారు. కాగా, సాధువులు రోడ్డుపైకి వస్తే దాడి చేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్ర చేసినట్లు తెలుస్తోంది.

దళితుల భూములు ఆక్రమించి అవమానించిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు



తిరుపతి, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: దళితులను కులం పేరుతో దూషించడమేకాకుండా దౌర్జన్యంగా వారి భూములు ఆక్రమించిన వారిని వదిలి పెట్టే ప్రసక్తేలేదని, బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేస్తానని తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వాలముని హెచ్చరించారు. మంగళం, బాలకృష్ణాపురంకు చెందిన సుబ్రమణ్యం భార్య గుర్రమ్మ, మురుగయ్య కుమారుడు మేకల రమేష్ ఆదివారం తిరుపతి జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వాలముని ని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. మంగళం, బాలకృష్ణాపురం గ్రామకంఠానికి చెందిన సర్వే నెంబర్ 15/22లో తమకు చెందిన (గుర్రమ్మ కు చెందిన 3 సెంట్లు భూమి, మేకల రమేష్ కు చెందిన 3 సెంట్లు భూమిని) గిరిధర్ తన అనుచరులతో కలిసి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తెలిపారు. కులం పేరుతో దూషించడమే కాకుండా ముఖంపై ఉమ్మేసి బూతులు తిడుతూ తరిమేశారని వాపోయారు. అంతేకాకుండా తమపైనే అక్రమ కేసులు బనాయించి పోలీసుల చేత బెదిరింపులకు పాల్పడ్డారని చెప్పారు. తమ భూములను సతీష్ చంద్ర అనే వ్యక్తికి అమ్మేశారంటూ చెప్పారు. దీనిపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. కొందరు తిరుపతి అర్బన్ రెవిన్యూ అధికారులు వీరికి అండగా నిలిచి తమకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. తమ స్థలంలో అక్రమంగా ఆరంతస్థుల భవన నిర్మాణం జరుగుతోందని ఆయనకు చెప్పారు. దీంతో తిరుపతి జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వాలముని బాధితులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులకు అన్యాయం జరుగుతున్నా పోలీసులు, రెవిన్యూ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. దళితులకు చెందిన భూమిపై ఎవరికీ హక్కులు ఉండవన్నారు. వారిని కులం పేరుతో దూషించడమే కాకుండా దౌర్జన్యం చేసి, భయపెట్టి, పోలీసుల అండతో వారి స్థలాలను ఆక్రమించుకోవడం చట్టవ్యతిరేకమైన చర్య అన్నారు. అతనిపై ఇప్పటికే అనేక ఫిర్యాదులు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని స్వయంగా స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెడతానని అన్నారు. అవసరమైతే రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ గారి దృష్టికి అలాగే హోమ్ మినిస్టర్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయడానికి తనవంతు ప్రయత్నం చేస్తానని బాధితులకు ధైర్యం చెప్పారు.

నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

తిరుపతి, మే 24 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్‌పిడిసిఎల్ నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమంతో బాటుసర్కిల్ స్థాయిలో కూడా ప్రతి సోమవారం ఉదయం 8:30 గంటల నుండి నుంచి 9:30 గంటల వరకు "డయల్ యువర్ ఎస్ఇ" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది. తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847లకు ఫోన్ చేసి సమస్య చెప్పవచ్చని సిఎండి తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్

విశాఖపట్నం, మే 24,ప్రభాతవార్త

జిల్లాలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష-2026 ప్రశాంతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 17 పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 7,763 మంది అభ్యర్థులకు గాను ఉదయం సెషన్‌లో 4,755 మంది (61.25 శాతం) హాజరుకాగా, 3,008 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 8వ పేజీలో

విశాఖలో ఎండల నుంచి ప్రజలకు ఊరట..

బీచ్ రోడ్డులో మిస్ట్ కానన్ ఏర్పాటు చేసిన విశాఖ పోర్టు అథారిటీ

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో, ప్రజలకు కొంత ఉపశమనం కలిగించే దిశగా విశాఖ పట్నం పోర్టు అథారిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. నగరం లోని ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఆర్కే బీచ్ రోడ్ పరిధి, రైల్వే స్టేషన్ రోడ్డులో వాటర్ ఫాగింగ్/మిస్ట్ కానన్ వాహనాలను ఏర్పాటు చేసి ప్రజలకు తాత్కాలికంగా చల్లదనాన్ని అందిస్తోంది. తీవ్ర వేసవి ఉష్ణోగ్రతల కారణంగా ఉదయం నుంచే నగరంలో వేడి తీవ్రంగా 8వ పేజీలో

'కాక్రోచ్ జనతా పార్టీ' ఆవిర్భావం

యువత ఆకాంక్షలకు అద్దం పడుతోంది

ఏపీటీడీపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

గాజువాక,మే 24,ప్రభాతవార్త

సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్న 'కాక్రోచ్ జనతాపార్టీ' ఆవిర్భావం దేశంలోని యువత ఆకాంక్షలను, వారి ఆందోళనలను ప్రతిబింబిస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్ల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యంగ్యాత్మక ఆన్‌లైన్ ఉద్యమ ప్రజాదరణను గమనించి, విధాన రూపకర్తలు తమ ధోరణిని పునఃసమీక్షించుకోవాల్సిన (రీకాలిబ్రేట్) అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ 8వ పేజీలో

ఓటరు జాబితా సవరణపై

వైఎస్సార్‌సీపీ ఫోకస్..

గాజువాకలో ఎస్ఐఆర్ సమావేశంతో శ్రేణులకు దిశానిర్దేశం

గాజువాక, మే 24, ప్రభాతవార్త:

ఎస్ఐఆర్‌పై వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమావేశం గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై పార్టీ నాయకులు, బీఎల్ఏలతో ఆదివారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం బీసీ రోడ్డులోని అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు తిప్పల నాగిరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె.రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు పసుపులేటి బాలరాజు 8వ పేజీలో

విశాఖలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అలెయ్ బలేయ్

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

నగరంలో ఆదివారం ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో మాజీ కేంద్ర మంత్రి హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ రాజకీయా లకతీతంగా రాష్ట్రం లోని అన్ని పార్టీల నేతలను తెలంగాణలో మాదిరిగా ఒక తాటిమీదకు తెచ్చి ప్రజల సేవలో వారిని మమైకం చెయ్యాలానే సంకల్పంతో నిర్వహించిన అలెయ్ బలెయ్ కార్యక్రమం విజయవంతమయింది. ఈ సందర్భంగా కార్యక్రమంకు హాజరైన వివిధ పార్టీల నేతలు మాజీ గవర్నర్ దత్తాత్రేయకు బ్రహ్మ రథం పట్టారు. వారితో తమకు ఉన్నా అనుభవాలు అనుభూతులను నెమరు వేసుకొని ఘనంగా సత్కరించారు. బీజేపీ నాయకులు చెరువు 8వ పేజీలో

ప్రజల కథే నా ఆత్మ కథ పుస్తకం ఆవిష్కరించిన ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు -అలెయ్ బలెయ్‌కు హాజరైన వైఎస్సార్సీపీ కూటమి పార్టీల నేతలు -కాంగ్రెస్, కమ్యూనిస్టులు దూరం

రూ.40కోట్ల స్థలంపై కబ్జాల 'దండు'..!!

చేతులు కలిపిన అధికార, విపక్ష చోటా నేతలు -చినముషిడివాడలోని నకిలీ పత్రాలతో నాలుగెకరాలకు స్కెచ్ -ఎమ్మెల్యే పంచకర్ల, విశాఖ సీపీకి ఫిర్యాదిచ్చిన హైదరాబాదీ

విశాఖపట్నం-ప్రభాతవార్త

విశాఖలో కబ్జా గ్యాంగ్‌లు ఎలా చెలరేగిపోతున్నాయో పెందుర్తిలో తాజాగా వెలుగు చూసిన కబ్జా భాగోతం తేటతెల్లం చేస్తోంది.నలభై ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థల యజమాని విదేశాల్లో స్థిరపడి అక్కడే మృతి చెందాడని తెలుసుకొన్న కబ్జాల 'దండు' ఆ స్థలంపై కన్నేసింది.అధికార, విపక్ష చోటా నేతలు చేతులు కలిపారు. వీరికి పెందుర్తి ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది సహకారం పుష్కలంగా లభించడంతో నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమణకు దిగారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రభుత్వ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఒక వ్యక్తి వేసిన స్కెచ్ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.స్థల అసలు యజమాని ఐన చనిపోయిన సదరు ఎన్.ఆర్.ఐ.కుమార్తె రంగంలోకి దిగి పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల, విశాఖ సీపీకి ఫిర్యాదివ్వడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా వున్నాయి. హైదరబాద్‌లో ఉంటున్న కె.అనితకు చినముషిడివాడలోని సర్వే నంబర్ 189/2లో 3.40ఎకరాలు, 189/5లో 60సెంట్ల భూమి ఉంది. 1984లో ఆ నాలుగెకరాల భూమిని అనిత కుటుంబీకులు 8వ పేజీలో

సింహాచలం దేవస్థానం ఆక్రమిత భూములు, దుకాణాలు స్వాధీనం

సింహాచలం, మే 24, ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానానికి చెందిన విలువైన భూమిని, ఆక్రమణలను తొలగించి పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకున్నట్లు దేవస్థానం ఈ. ఓజె.వెంకటరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాలు, ఏపీ దేవాదాయ చట్టం 30/87 (సవరించిన చట్టం 36/2023) సెక్షన్ 83(2) నిబంధనల ప్రకారం శనివారం ఈ స్వాధీన ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే. పెందుర్తి మండలం, వేపగుంట గ్రామంలోని సర్వే నెంబర్ 197/ఎ-3లో గల దేవస్థానానికి చెందిన 689.22 చదరపు గజాల స్థలాన్ని, అందులోని ఐదు (05) షాపులను అద్దాల రవీంద్ర వర్మ (తండ్రి: దివం గత రామచంద్ర రాజు) అనే వ్యక్తి అనాధికారికంగా ఆక్రమించుకున్నారు. ఈ విషయమై గతంలో దేవ స్థానం తరపున ఆక్రమణలు ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు జారీ చేసినప్పటికీ, నిర్ణీత గడువు ముగిసినా ఆక్రమణదారుడు సదరు ఆస్తిని దేవ స్థానానికి అప్పగించడంలో విఫలమయ్యారు. ఈ నేపథ్యంలో, దేవస్థానం ఇఓ జె.వెంకటరావు ఆదేశాల మేరకు ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ (భూ సంరక్షణ విభాగం), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సర్వేయర్లతో కూడిన ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. పోలీస్ బందోబస్తుతో, ఆక్రమణలను తక్షణమే తొలగించి, దేవస్థానం భూమిని, దుకాణాలను దేవస్థానం ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇఓ జె.వెంకటరావు మాట్లాడుతూ, స్వామివారి భూములను ఆక్రమిస్తే ఎంతటి వారిపైనైనా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవస్థానం ఆస్తుల రక్షణకు తాము కట్టుబడి ఉన్నామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.

ఆసియా కప్ హాకీ టోర్నమెంట్

నక్కపల్లి విద్యార్థిని నమ్మి గీతశ్రీ

అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన మొదటి హాకీ క్రీడాకారిణి -పలువురు అభినందనలు

నక్కపల్లి, ప్రభాతవార్త

మే 26 నుంచి జూన్ 6 వరకు జపాన్‌లో జరుగుతున్న ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌కు నక్కపల్లి మండలంలోని ఉపమాక శివారు మన బాలవాణిపాలెం గ్రామానికి చెందిన నమ్మి గీత శ్రీ ఎంపికయింది. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులతోపాటు నక్కపల్లి బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ హాకీ క్రీడాకారులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా నమ్మి గీతశ్రీనీ అభినందిస్తూ గ్రామీణ ప్రాంతం నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన హాకీ క్రీడాకారిణి నమ్మి గీతశ్రీ విజయం ఎంతో గర్వకారణమని బియస్ హాకీ క్లబ్ ఫౌండర్ సూరిబాబు, సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గీతశ్రీ సాధించిన ఈ ఘనత భవిష్యత్తులో హాకీ క్రీడకు మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు యువ క్రీడా కారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తల్లి దండ్రులు తాతారావు, ఆదిలక్ష్మిలకు అభినందనలు తెలిపారు. మండలంలోని హాకీ క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొందిన గీతశ్రీ, సుమారు రెండు సంవత్సరాల పాటు శిక్షణ పొంది అనతి కాలంలోనే ప్రతిభ కనబరుస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ఎన్నో విజయాలు సాధించింది తెలిపారు. తన అద్భుత ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందిన విద్యార్థిని, మొట్టమొదటిసారిగా ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌కు ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. గీతశ్రీ మే 29 నుండి జూన్ 6 వరకు జపాన్‌లో జరగనున్న ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనునుందని తెలిపారు. ఆమె అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గీతశ్రీ 2021 సంవత్సరంలో హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు ప్రోత్సాహంతో నక్కపల్లిలో హాకీ శిక్షణ ప్రారంబించి సుమారుగా ప్రతి రోజు 8కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ స్థానిక హాకీ కోచ్ గాజులు రాంబాబు దగ్గర 2022 వరకు సుమారు రెండు సంవత్సరాల పాటు కఠోర మైన తర్ఫీదు పొందుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో హాకీ టోర్నమెంట్‌లలో పాల్గొని ఎన్నో విజయాలు సాధించింది అన్నారు. బలిరెడ్డి సూరిబాబు సూచనలుతో మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్లో ఉన్న ఎంపీ ఉమెన్ హాకీ అకాడమీలో చేరుటకు అర్హత పొంది అకాడమీలో చేరింది అని చెప్పారు. అక్కడినుండి అనేక విజయాలు పొందుతూ వెనుతిరిగి చూడకుండా ఆకాశమే హద్దుగా హాకీలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటూ అంచెలంచెలుగా జాతీయ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి అర్హత సాధించి ఇటు తల్లిదండ్రులకి గ్రామానికి రాష్ట్రానికి అనేక పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి భవిష్యత్తులో భారతదేశానికి విజయాన్ని అందించాలని తపిస్తూ హాకీలో రాణిస్తుంది అన్నారు. ఇప్పటివరకు నమ్మి గీత శ్రీ జాతీయ స్థాయిలో నాలుగు 8వ పేజీలో

జనసేనలోకి 60 కుటుంబాల భారీ చేరిక..

ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో పార్టీ కండువాలు

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి మరో ఊపు వచ్చింది. 37వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీతో పాటు వివిధ పార్టీలకు చెందిన 60 కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీలో చేరాయి. ఈ చేరిక కార్యక్రమం 37వ వార్డు జనసేన అధ్యక్షులు గరికిన రవి ఆధ్వర్యంలో జరిగింది. జబ్బర్ తోట, రెల్లివీధి, పెయిందొరపేట ప్రాంతాలకు చెందిన కుటుంబాలు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తక్కువ కాలంలోనే నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలకు ఆకర్షితులై జనసేనలో చేరుతున్నామని తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, ప్రజా సంక్షేమానికి తీసుకుంటున్న నిర్ణయాల పట్ల విశ్వాసంతో పార్టీ సభ్యత్వం స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సేవా లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పార్టీలో చేరిన ప్రతి కుటుంబానికి తగిన గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. వాసుపల్లి సత్యం, చెన్నా పైడిరాజు, కంబాల కిషోర్ కుమార్, మీసాల మురళి, కాసారపు మధు, ఆర్జీ రాంప్రసాద్, మునగాడ పవన్ కుమార్, బొమ్మలహరి, చిరంజీవి, తులసి తదితరులతో పాటు 60 కుటుంబాలకు చెందిన నాయకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ వుడా చైర్మన్ డా.ఎస్.ఏ.రెహమాన్, దక్షిణ నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు చైతన్య స్రవంతి ఉద్యోగావకాశాలు

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

మహిళలు, యువత సంక్షేమం, సాధికారత., అభివృద్ధి కోసం చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ నిరంతరం పనిచేస్తోందని అల్పాదాయ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పలు కార్యకలాపాలు నిర్వహిస్తోందని మహిళా సంక్షేమ ఉద్యమకారిణి, చైతన్య స్రవంతి అధ్యక్షురాలు డా.పీరీన్ రహ్మాన్ తెలిపారు. చైతన్య స్రవంతి సంస్థ నూతన ఒరవడి వైపు అడుగులు వేస్తూ అర్హత కలిగిన యువత కోసం ఒక ప్రత్యేకమైన ఉద్యోగ,సమీకృత విద్య, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని పేర్కొన్నారు. హాస్పిటాలిటీ మరియు ఫార్మాస్యూటికల్ కోర్సుల్లో శిక్షణ, ఉపాధి కల్పించనుందని ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ రీజియన్లో ట్రైనింగ్‌తో పాటు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇందుకు అర్హులని డిగ్రీ మధ్యలో నిలిపివేసిన విద్యార్థులు కూడా దరఖాస్తులను చేసుకోవచ్చన్నారు. 18 నుండి 20 ఏళ్ల వయస్సు గల వారు ఇందుకు అర్హులని తెలిపారు. మౌఖిక పరీక్ష, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం స్టైపెండ్‌తో కూడిన ఇంటర్న్ షిప్ ఉంటుందన్నారు. సంబంధిత రంగంలో 3 సంవత్సరాల బ్యాచిలర్ డిగ్రీ చదివే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యూషన్, విద్య ఖర్చులు పూర్తిగా భరించబడతాయని ఎంపికైన అభ్యర్థులు నేర్చుకునే విధానంలో ఉచితంగా పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు.ప్రత్యక్ష పరిశ్రమ అనుభవం ఈ కార్యక్రమం ద్వారా ఏర్పడుతుందని చదువుతూ సంపాదించే విధానం ద్వారా యువతను ప్రోత్సాహిస్తామని దరఖాస్తులు చేసేందుకు చివరి తేదీ జూన్ 6 అన్నారు. పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు.అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు పూర్తి వివరాలకు లక్ష్మి, చైతన్య స్రవంతి ఆఫీస్ ఇంచార్జి, సెల్ ఫోన్ నెంబర్ 83417 80712కు సంప్రదించాలని సూచించారు.

జూన్ 9న అడివివరం గ్రామ దేవత పైడితల్లమ్మ పండగ

31న మరిడమ్మ పండుగ

సింహాచలం, మే 24, ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి సోదరి పైడితల్లి అమ్మవారి వార్షిక పండుగ తేదీలు ఖరారు చేశారు. గ్రామ దేవత పూజారుల వంశీయులు గ్రామ పెద్దలతో సింహాచలం దేవస్థానం ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఏకాభిప్రాయంతో తేదీలను ప్రకటించారు. మే 31న తేదీ ఆదివారం పోలిమేర దేవత శ్రీ మరిడమ్మ. జూన్ 9వ తేదీ మంగళవారం సింహాద్రి నాథుని సోదరిగా పూజలందుకుంటున్న శ్రీ పైడితల్లమ్మ వారి పండుగలు జరిపించాలని సభ ఆమోదం తెలిపింది. అలాగే జూన్ 2న ముత్యాలమ్మ వారి పండుగ బడ్జెట్ పత్రాలను పూజారుల వంశీయులు అందజేశారు. బాణా సంచా వెలుగులకు అనుమతి ఇప్పించండి. తొలేళ్ళ పండుగ తెల్లవారుజామున మూడు గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే సంప్రదాయం ఉందని అందుకు పోలీసు అనుమతులు తీసుకురావాలని పెద్దలు దేవస్థానం అధికారులను కోరారు. గ్రామ మంతా విద్యుత్ దీపాలంకరణలు చేయాలన్నారు. సత్తెమ్మ తల్లి పండగ సందర్భంగా స్వచ్ఛంద సంస్థలు సేవలందిస్తున్నాయి. దేవస్థానం కూడా భాగస్వాములు కావాలని కోరారు. గ్రామం తరఫున దేవస్థానానికి సహకారం అందిస్తున్నామని చందనోత్సవం దర్శనం టిక్కెట్లు కేటాయింపుల్లో గ్రామస్థులకు ప్రత్యేక కోటా కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. పైడితల్లమ్మ వారి ఆలయం మరింత విస్తరణ చేయాలని విజ్ఞప్తి చేశారు. అమ్మవారి ఊరేగింపులో దేవస్థానం ఉద్యోగులను భాగస్వాములను కావాలని కోరారు. అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించుకునేందుకు అంతరాలయంలోకి అనుమతించాలని కోరారు. అమ్మవారి జాతర (పరస) తాటాకు మంత్రంగా జరుగుతున్నాయి. ఘనంగా నిర్వహించాలని అధికారులకు విన్నవించుకున్నారు. గ్రామ పెద్దల సూచనలతో ఈఓ వెంకట్రావు మాట్లాడారు. అమ్మవారి పండుగలకు దేవస్థానం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీఇచ్చారు. ప్రస్తుతం దేవాదాయ శాఖ ఆర్థిక పరిస్థితుల పై ఆంక్షలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వీలైనంత తగ్గించుకుని ఉత్సవాన్ని విజయవంతంగా జరిపిద్దామని ఈఓ పిలుపునిచ్చారు. కార్యనిర్వాహక ఇంజనీర్ రాంబాబు అధ్యక్షత జరిగినసభలో పూజార్ల వంశీయులు లండ వెంకటరమణ, కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, మాజీ కార్పొరేటర్ పిసిని వరహా నరసింహం, మాజీ ట్రస్టీ శ్రీనుబాబు, నాయకులు మజ్జి సూరిబాబు, శంకరావు మాట్లాడారు.

మహానాడుకు సర్వం సిద్ధం : మొల్లి పెంటిరాజు

ఈనెల 27, 28 తేదీలలో 75వ వార్డు పరిధిలో వేడుకలు -ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు తీర్మానాల అందజేత

గాజువాక, మే 24ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా సాగే తెలుగుదేశం పార్టీ 'మహానాడు-2026' వేడుకలను ఈనెల 27, 28 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా తెలుగుయువత ప్రధాన కార్యదర్శి మొల్లి పెంటిరాజు తెలిపారు. 75వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్ ఉరుకూటి అప్పలరాజు అధ్యక్షతన ఆదివారం జరిగిన పార్టీ వార్డు కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం నారా చంద్రబాబునాయుడు, లోకేష్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నెల్లిముక్కు జీవీఎంసీ కల్యాణమండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. వార్డు కమిటీ ఆమోదించిన పలు కీలక తీర్మానాలను ఇప్పటికే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అందజేశామని పెంటిరాజు వివరించారు. పెదగంట్యాడలో ఇంటర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు, అన్న క్యాంటీన్ నిర్మాణం, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా విస్తరించడం వంటి డిమాండ్లు ఇందులో ఉన్నాయన్నారు. అలాగే, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపినందుకు ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలుపుతూనే.. 'ఖతీ' నెంబర్ నిర్వాసితులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ ద్వారా తక్షణమే ఉద్యోగాలు ఇవ్వాలని, యారాడలో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని, జీవీఎంసీ వార్డులను 150కి పెంచాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పులి రమణారెడ్డి, నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య, వంగలపూడి అప్పలరాజు, కనితి సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సత్కారం

విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

జనసేన పార్టీ తరపున కేజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యులుగా నియమితులైన డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, యజ్ఞశ్రీ లను దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ సన్మానించారు. సీతమ్మ పేట జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కేజీహెచ్ అభివృద్ధికి తమ సేవలు ఎంతో ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కేజీహెచ్ కీలక పాత్ర పోషిస్తోందని, అభివృద్ధి కమిటీ సభ్యులుగా బాధ్యతలు చేపట్టి ఆసుపత్రి అభివృద్ధికి విశేషంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నియామకానికి ఎంపికైన డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, యజ్ఞశ్రీకి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక అభినందనలు తెలియజేసి శాలువాతో సత్కరించారు.

వార్డు విభజనలపై జనసేన ఆందోళన..

జీవీఎంసీ అధికారులకు మూర్తి యాదవ్ ఫిర్యాదు



విశాఖపట్నం, మే 24, ప్రభాతవార్త

జీవీఎంసీ పరిధిలో చేపట్టిన వార్డుల విభజనపై జనసేన పార్టీ నాయకుడు మూర్తి యాదవ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వార్డుల పునర్విభజన జరిగిందని ఆరోపిస్తూ సంబంధిత అధికారులకు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. విశాఖపట్నం నగరంలో శాస్త్రీయతకు విరుద్ధంగా, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా వార్డు సరిహద్దులను మార్చుతున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ఒక ప్రాంతానికి చెందిన ప్రజలను వేర్వేరు వార్డుల్లో చేర్చడం వల్ల పరిపాలనా పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా సెల్‌ఫోన్, టీచర్స్, హౌసింగ్ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. 2011 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకొని వార్డుల పునర్విభజన చేస్తున్నప్పటికీ, ప్రస్తుత జనాభా పెరుగుదల, ప్రాంతీయ అవసరాలు, ప్రజల రాకపోకలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని వార్డుల్లో అధిక జనాభా ఉండగా, మరికొన్ని వార్డుల్లో తక్కువ జనాభా ఉండే పరిస్థితి నెలకొంటోందన్నారు. అంతేకాకుండా ఒకే కాలనీకి చెందిన వీధులను విడదీసి వేర్వేరు వార్డుల్లో కలపడం వల్ల ప్రజలకు పన్నులు, శానిటేషన్, తాగునీరు, డ్రైనేజీ, రేషన్, సంక్షేమ పథకాల అమలులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వార్డు విభజనలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ అధికారులను కలిసి పునర్విభజన ప్రక్రియను పునఃసమీక్షించాలని కోరుతూ మూర్తి యాదవ్ వినతిపత్రం అందజేశారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం మే 24, ప్రభాతవార్త

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటిఐలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించారు. అభ్యర్థులు https://itiadmissions.ap.gov.in/iti/ వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు 30 జూన్ 2026 రాత్రి 11:59 గంటల వరకు సమయం ఉంది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 19మే 2026 నుంచి 2జులై 2026 సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత ప్రభుత్వ ఐటిఐలు కేంద్రాలలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబును కలిసిన సాలాపు రామారావు

గాజువాక, మే 24,ప్రభాతవార్త

ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గణబాబును శ్రీ కనకమహాలక్ష్మి దేవ స్థానం పాలకమండలి సభ్యులు సాలాపు రామా రావు శనివారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబుకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ సాలాపు రామారావు కనకమహాలక్ష్మి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా నియమితులు కావడం అభినందనీయ మన్నారు. గత 40 ఏళ్లుగా గాజువాక, పశ్చిమ నియోజకవర్గాల్లో రామారావు ఎన్నో ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరో హించాలని ఆకాంక్షించారు. అనంతరం సాలాపు రామారావు మాట్లాడుతూ.. దేవస్థానం పాలక మండలి సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మర్యాదపూర్వకంగానే ఎమ్మెల్యేను కలిసినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 72వ వార్డు మహిళా అధ్యక్షురాలు గంధం యజ్ఞప్రియ, 79వ వార్డు మహిళా అధ్యక్షురాలు గల్లా అనిత, టీడీపీ నాయకులు వెంకట్, ఎస్సీ సెల్ రాజు, సాలాపు నాయుడు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

గాజువాక, మే 24ప్రభాతవార్త

జీవీఎంసీ 68వ వార్డు మిందిలో గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి ప్రతిభావంతులకు ఆదివారం ఘనంగా పురస్కారాలు అందజేశారు. మింది, అప్పన్న కాలనీ ప్రాంతాల స్కూళ్లలో 2025-2026 విద్యా సంవత్సరంలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు ట్రస్ట్ చైర్మన్ గుడివాడ రామమూర్తి చేతుల మీదుగా నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ఈ పరీక్షల్లో మింది ఐడియల్ స్కూల్ విద్యార్థి బి. హరి శేఖర్ 581 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, అదే స్కూల్‌కు చెందిన జి. హారిక, వి. వినయ లిఖిత 577 మార్కులు సాధించారు. మింది జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పైడి జయంతి 578 మార్కులు, గుర్రం లక్ష్మి 568 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. శ్రీ గిరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుంచి సి.హెచ్.ఎస్.వి.సత్య రోజా, దాసరి భరత్ 565 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పెద్దలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఈటి శ్యామలరావు, ఈటి రామచంద్రరావు, పైడా రామారావు, సికటాపు గురునాథరావు, గుడివాడ రామేశ్వరరావు, సీనియర్ సిటిజన్స్ క్లబ్ సభ్యులు ఓ.వెంకట్రావు, ఆనందరావు, పాల్గొన్నారు.

దత్తాత్రేయను మర్యాదపూర్వకంగా కలిసిన కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక,మే 24,ప్రభాతవార్త

హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను గాజువాక నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మద్దెలపాలెంలోని ఒక ఫంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమం లో బండారు దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని ఒరిస్సా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు ఆవిష్కరించారు. నరసింగరావు మాట్లాడుతూ.. సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా ఎదిగిన దత్తాత్రేయ జీవితం ఆదర్శనీయమన్నారు. రాజకీయాల కు అతీతంగా తెలంగాణలో ఆయన నిర్వహిస్తున్న 'అలయ్ బలయ్' కార్యక్రమం గొప్ప సంకల్పమన్నారు. బీజేపీ నాయకుడు చెరువు రామకోటయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, కరణం ధర్మశ్రీ, కొయ్య ప్రసాద్ రెడ్డి, గాజువాక నాయకులు నాగేశ్వరరావు, మనోహర్, కృష్ణారెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.40కోట్ల స్థలంపై కబ్జాల 'దండు'..!

7వ పేజీ తరువాయి ..

కడలి వెంకటనారాయణ కొనుగోలు చేసి, భవన నిర్మాణంతో పాటు ప్రహరీ కట్టించారు. అందుకు సంబంధించి ధృవపత్రాలు కూడా వారి వద్ద ఉన్నాయి. ఈ క్రమంలో గత నెల 10న విశాఖకు చెందిన దండు గోపాలకృష్ణరాజు అనే వ్యక్తి పి.జగన్ మోహన్, అర్జున్, కొల్లి సురేష్, చందు యాదవ్, తైనాల మహేష్, రమేష్ అనే వ్యక్తుల సహకారంతో ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. రాత్రి వేళ వచ్చి హంగామా సృష్టించారు. స్థలం మాదంటూ నకిలీ పత్రాలు చూపించారు. ప్రశ్నించిన వాచ్‌మన్ సత్తిబాబు ఆయన భార్యపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ప్రహరీని కూల్చేశారు. ఆస్తుల్ని ధ్వంసం చేశారు. దీంతో వాచ్‌మన్ ఈ విషయాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న కె.అనిత దృష్టికి తీసుకు వెళ్లారు. ఆమె గత నెల 13న విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రత బగ్చీకి ఫిర్యాదిచ్చారు. దండు గోపాలకృష్ణ ఆయన అనుచరులపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. తమ వద్ద అన్ని ఆధారాలూ ఉన్నాయని, వెంటనే ఎఫఐఆర్ నమోదు చేయాలంటూ పెందుర్తి పోలీసుల్ని ఆదేశించాలని కోరారు. ఆ తర్వాత గత ఏప్రిల్ 24న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును కూడా అనిత ఆశ్రయించారు. కబ్జాదారుల నుంచి తమ స్థలాన్ని కాపాడాలంటూ కోరారు. దీంతో ఈ విషయం స్థానికంగా సంచలనమైంది. ఈ ఉదంతం విశాఖలోని ఆక్రమణల దందాకు నిదర్శనంగా మారింది.

అధికార ...ప్రతిపక్షం జతకలిసి

రూ.40కోట్ల విలువైన నాలుగెకరాల భూమిపై కన్నేసిన వారంతా చరిత్ర కలిగిన వారేనని స్థానికులు చెబుతున్నారు. కూటమి పార్టీతో పాటు ప్రతిపక్ష వైసీపీకి చెందిన కార్యకర్తలూ, నేతలు కూడా ఈ కబ్జాలో భాగస్వాములయ్యారని, గతంలో వీరంతా ఇలాంటివి చాలా చేశారని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగి అయిన కొల్లి సురేష్ (నీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్) ఆస్తుల సంపాదనపై ఇటీవల ఏసీబీకి వరుస ఫిర్యాదులెళ్లాయి. ఆయనకున్న అనుభవంతోనే నకిలీ పత్రాలు సృష్టించారంటున్నారు. అదే విధంగా టీడీపీకి చెందిన అర్జున్, తైనాల మహేష్ భూ వివరాలు సంపాదించారంటున్నారు. జనసేనకు చెందిన పిల్లా జగన్ మోహన్ పాత్రుడు రెవెన్యూను మ్యానేజ్ చేశారంటున్నారు. మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ అనుంగ శిష్యుడిగా ఉన్న రమేష్, వైసీపీకి చెందిన చందు యాదవ్ (సింహాచలం ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు), వీరంతా కలిసి దండు గోపాలకృష్ణరాజుకు సహకరించారని తెలుస్తోంది. మరో విచిత్రం ఏంటంటే ఈ భూ కబ్జాదారుల్లో ఒకరిపై గతంలో రౌడీషీట్ కూడా ఉందని తెలుస్తోంది. ఆక్రమిత స్థలంలో బోర్డులేర్పాటు చేయడంపై పెందుర్తి తహసీల్దార్, స్థానిక పోలీసులకు కూడా ఫిర్యాదులెళ్లాయంటున్నారు. దీంతో బాధితురాలు అనితకు న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే పంచకర్ల అధికారుల్ని ఆదేశించారని సమాచారం.

మధురవాడ 6వ వార్డులో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమం నిర్వహణ

పిఎం పాలెం, మే 24, ప్రభాతవార్త

జీవీఎంసీ 6వ వార్డులో 'ఆపరేషన్ క్లీన్ స్వీప్ - గాయత్రి' కార్యక్రమం ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి 6వ వార్డు తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు గారే గురునాథ్ ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు మాట్లాడుతూ "ఒక రాష్ట్రం - ఒక పరిశుభ్రత లక్ష్యం" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి పరిశుభ్రత కార్యక్రమాలకు సహకరించాలని పిలుపు నిచ్చారు. మన కాలనీని మనమే పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మన ఆరోగ్యాలను మనమే కాపాడు కోవచ్చని పేర్కొన్నారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కార్యదర్శి లోడగల జానకిరామ్, 6వ వార్డు బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు గొల్లంగి ఆనందబాబు, బీజేపీ అధ్యక్షులు రాజు, పొతిన నాయుడు, ముచ్చు రవణ, కొస్టు రఘు తదితరులు పాల్గొన్నారు. అలాగే శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఎన్.సాయి, శానిటేషన్ సెక్రటరీ చక్రవర్తి, సూపర్వైజర్లు ఎం.అప్పలరెడ్డి, పి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొని పరిసర ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు.

మాడుగుల పరిశీలకులుగా దాసరి శ్రీనివాస్ నియామకం

పిఎం పాలెం, మే 24, ప్రభాతవార్త:

తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి శ్రీనివాస్‌ను మాడుగుల నియోజకవర్గ పూర్తి స్థాయి పరిశీలకులుగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాలు జారీ చేసింది. భీమిలి నియోజకవర్గానికి చెందిన దాసరి శ్రీనివాస్‌కు ఈ కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ బలోపేతం, కేడర్ సమన్వయం, నియోజకవర్గ స్థాయి కార్యక్రమాల పర్యవేక్షణలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని నాయకులు అభిప్రాయపడుతున్నారు.

హైబీపీపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం : డా.కుప్పిలి సురేష్ బాబు

పిఎం పాలెం, మే 24, ప్రభాతవార్త

ప్రస్తుత జీవనశైలిలో మార్పుల కారణంగా అధిక రక్తపోటు (హైబీపీ) సమస్య యువతలో కూడా పెరుగుతోందని ప్రజా వైద్యులు డా.కుప్పిలి సురేష్ బాబు తెలిపారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా ఆయన హైబీపీపై ప్రజలకు అవగాహన కల్పించారు. హైబీపీని నిర్లక్ష్యం చేస్తే గుండె, మెదడు, కిడ్నీలు వంటి కీలక అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అధిక బరువు, మధుమేహం, మానసిక ఒత్తిడి, ధూమపానం, మద్యపానం, శారీరక శ్రమ లేకపోవడం వంటి కారణాల వల్ల రక్తపోటు పెరుగుతుందని వివరించారు. తలనొప్పి, ఛాతినొప్పి, ఆయాసం, కళ్ళు తిరగడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవడం, ఉప్పు తగ్గించడం, వ్యాయామం చేయడం, ఒత్తిడి తగ్గించుకోవడం ద్వారా హైబీపీని నియంత్రణలో ఉంచుకోవచ్చని తెలిపారు.

విశాఖలో ఎండల నుంచి ప్రజలకు ఊరట..

7వ పేజీ తరువాయి ..

నమోదవుతుండటంతో బీచ్ రోడ్డుకు వచ్చే సందర్శకులు, పర్యాటకులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పోర్ట్ అథారిటీ ప్రత్యేకంగా మిస్ట్ కానన్ వాహనాన్ని రంగంలోకి దింపింది. ఈ వాహనం ద్వారా సన్నని నీటి జల్లును గాలిలో వెదజల్లడం జరుగుతోంది. దీని వల్ల పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రత కొంత మేర తగ్గి, ప్రజలకు వేడి నుంచి ఉపశమనం లభిస్తోంది. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ఫాగింగ్ కార్యక్రమం కొనసాగుతుంది. ముఖ్యంగా ఆర్కే బీచ్ నుంచి అప్పుఘర్ ప్రాంతం వరకు బీచ్ రోడ్డులో, అలాగే రైల్వే స్టేషన్ రోడ్డులో ఈ మిస్ట్ కానన్ ద్వారా నీటి జల్లును వెదజల్లనున్నారు. ప్రజలు అధికంగా రాకపోకలు చేసే ఇతర ప్రాంతాల్లో కూడా అవసరాన్ని బట్టి ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. బీచ్ రోడ్డుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు, ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే స్థానికులు విశాఖ పోర్ట్ అథారిటీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎండల తీవ్రతలో ఇలాంటి చర్యలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, బీచ్ ప్రాంతంలో వ్యాపారం చేసే చిన్న వ్యాపారులు ఈ ఏర్పాటుతో కొంత ఉపశమనం పొందుతున్నట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా పోర్ట్ అధికార యంత్రాంగం మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునే వరకు ప్రజలు ఇబ్బందులు పడకుండా తాత్కాలిక చర్యగా ఈ మిస్ట్ కానన్ సేవలను అందిస్తున్నామని వెల్లడించింది. భవిష్యత్తులో కూడా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

'కాక్రోచ్ జనతా పార్టీ' ఆవిర్భావం

7వ పేజీ తరువాయి ..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎల్లప్పుడూ ఉద్యోగ కల్పన, ఆర్థికాభివృద్ధి, డిజిటల్ ఇండియా, పెట్టుబడుల ఆకర్షణపైనే ప్రధానంగా దృష్టి పెట్టారని గుర్తుచేశారు. అయితే, నిరుద్యోగం, యువత ఆకాంక్షల చుట్టూ కాక్రోచ్ జంతాపార్టీ లేవనెత్తుతున్న కొన్ని సమస్యలను ఖచ్చితంగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు.

బాహ్య శక్తులపై అప్రమత్తత అవసరం..

ఇదే సమయంలో సోషల్ మీడియా వేదికలపై యువత కొంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సామాజిక మాధ్యమాలు పూర్తిస్థాయిలో నియంత్రణ లేనివి కావడం వల్ల, వీటి ద్వారా దేశ సరిహద్దులు దాటిన బాహ్య శక్తులు లేదా విదేశీ శక్తులు యువతను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యల్లో దొర్లిన కొన్ని పదాలు ప్రజల్లో ఒక రకమైన భావోద్వేగాన్ని రేకెత్తించాయని, అది కూడా ఈ ఉద్యమం ఇంత వేగంగా ప్రాచుర్యం పొందడానికి కారణమై ఉండవచ్చని పల్లా అభిప్రాయపడ్డారు. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలుగా బీజేపీ, టీడీపీల ఉమ్మడి లక్ష్యం యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమేనని ఆయన స్పష్టం చేశారు.

ఓటరు జాబితా సవరణపై ..

7వ పేజీ తరువాయి ..

హాజరయ్యారు. సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమర్థవంతంగా అమలు చేయాలని నాయకులు సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయించాలని కోరారు. బీఎల్ఏలు, పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గొందేసి మహేశ్వర రెడ్డి, మార్టుపూడి పరదేశి, పల్లా చిన్నతల్లి, పాతపాటి ఆర్ఎస్‌వీ ప్రసాద్ రాజు, రాజాన వెంకటరావు, కోమటి శ్రీనివాసరావు, ఎస్ఎండీ గౌస్, నీలి రవి, జీలకర్ర నాగేంద్ర, ధర్మాల శ్రీను, మద్దాల అప్పారావు, పెద్దిరెడ్ల ఈశ్వరరావు, పల్లా సురేష్, సంద్రాన నూకరాజు, బోగాది సన్యాసిరావు, కొణతాల రాము, పొగిరి హరీష్, షౌకత్ అలీ, గొందేసి శ్రీనివాసరెడ్డి, మంత్రి శంకర్ నారాయణ, రావాడ శివ, పూర్ణానంద శర్మ, బొడ్డ గోవింద్ తదితర నాయకులు పాల్గొన్నారు. అలాగే గొందేసి వెంకటరమణారెడ్డి, దామోదర్, మరిస అప్పలరాజు, గొందేసి నాగిరెడ్డి, వాడపల్లి రామచంద్రరాజు, గొడబ మనోజ్ కుమార్, మనపురం శ్రీనివాస్ పట్నాయక్, అండిబోయిన అప్పారావు, కటికల కల్పన, ఎన్నేటి రమణ, మజిరెడ్డి చిన్నరాజు నాయుడు, చేకూరి హరీష్ వర్మ, తాటికొండ జగదీష్, సంపంగి ఈశ్వరరావు, ఎల్లిపోగుల వరలక్ష్మి, ఎన్నేటి సూర్యకుమారి, గొందేసి పెంటారెడ్డి, ప్రగడ జాన్ ప్రసాద్, గుండాసు రాజు, గొందేసి రామిరెడ్డి తదితరులు పాల్గొని పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, బీఎల్ఏలు, అనుబంధ విభాగాల నాయకులు పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

7వ పేజీ తరువాయి ..

4,696 మంది (60.49 శాతం) హాజరుకాగా, 3,067 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన పకడ్బందీ ఏర్పాట్లు, కేంద్రాల వద్ద భద్రతా చర్యలు, అభ్యర్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పరీక్షలు సజావుగా జరిగాయి. అన్ని కేంద్రాల్లో అధికారులు నిరంతర పర్యవేక్షణ నిర్వహించారు. ఇదిలా ఉండగా, పరీక్షల నిర్వహణ తీరును జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పరిశీలించారు. ఆదివారం ఉదయం మద్దిలపాలెంలోని వి.ఎస్. కళాశాల, ఎం.వి.పి. పరిధిలోని గాయత్రి విద్యా కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు. అధికారులతో మాట్లాడి అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఆసియా కప్ హాకీ టోర్నమెంట్..

7వ పేజీ తరువాయి ..

పర్యాయాలు, ఆడుతూ పథకాలు సాధించింది.16వ జాతీయస్థాయి సబ్ జూనియర్స్ నేషనల్ ఛాంపియన్షిప్ 2026 గాను మధ్యప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ టోర్నమెంట్ ఏప్రిల్ 1 నుండి 12 వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగిందని చెప్పారు. ఈ టోర్నమెంట్లో గీత శ్రీ అద్భుతమైన ప్రతిభ కనబరిచి తన జట్టును ఫైనల్స్ తీసుకొని వెళ్లడమే కాకుండా ప్రతి ఆటలోను తనదైన ప్రత్యేకమైన శైలి చూపిస్తూ సుమారుగా ఐదు గోల్స్ చేసి బలమైన క్రీడాకారిణిగా నిలిచిందని చెప్పారు. గీత శ్రీ ప్రతిభతో హాకీ ఇండియా 42 మందిని ఎంపిక చేయగా నమ్మి గీతశ్రీ అతి పిన్న వయసు (12 సంవత్సరాలుగా) ఎంపికైందని అన్నారు. ఈ తొలి ఎంపికల్లో 42 నుండి 24 మందిని మలి ఎంపిక చేయగా ఆ జట్టులో కూడా గీత శ్రీ ఎంపిక అవడం విశేషం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ 24 మంది జట్టుతో మే 15 నుండి 20 వరకు బోపాల్‌లో జరిగిన ఇండియా, ఆస్ట్రేలియా సిరీస్‌లో పాల్గొన్నారు. ఈ సిరీస్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన వారిలో 18 మంది జట్టును ఎంపిక చేయడం జరిగింది ఈ జట్టు మే 29 నుండి జూన్ 6 వరకు జపాన్‌లో జరగబోయే అండర్ 18 మహిళల హాకీ ఆసియా కప్‌లో పాల్గొంటుందని తెలిపారు. భారతదేశం తరపున తలపడే మహిళల హాకీ జట్టు మొదటి రౌండ్లో మలేషియా, కొరియా సింగపూర్ తదితర దేశాలతో ఆడిందని చెప్పారు. ఇంతటి అద్భుతమైన విజయం సొంతం చేసుకున్న నమ్మి గీత శ్రీని ఆంధ్రప్రదేశ్ ప్రాధికార సంస్థ,బిఎస్ హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి తాతాజీ, నానాజీ, రామచంద్ర రావు, ఇతర క్లబ్ సభ్యులు, స్థానిక హాకీ కోచ్ గాజుల రాంబాబు, రంజిత్, గ్రామ పెద్దలు, నాయకులు, పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నమ్మి గీత శ్రీ ఎంపిక పట్ల హాకీ మధ్యప్రదేశ్ వారికి, గ్వాలియర్ హాకీ అకాడమీ వారికి బిఎస్ హాకీ క్లబ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్

7వ పేజీ తరువాయి ..

రామకోటయ్య అధ్యక్షతన నగరంలో తొలిసారిగా జరిగిన అలయ్ బలయ్ సదస్సుకు వైస్సార్సీపీ నుంచి మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీలు హాజరు కాగా తెలుగుదేశం నుంచి మాజీ మంత్రి భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు అలాగే జనసేన నుంచి మాజీ మంత్రి అనకాపల్లి శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ బీజేపీ పార్టీ నుంచి ఎమ్మెల్సీ సోము వీర్రాజు రాజ్యసభ మాజీ సభ్యులు జీవీఎల్ నరసింహ రావుఉమ్మడి విశాఖపట్నం జిల్లాలు అధ్యక్షులు పరుశురాం రాజు ద్వారపు రెడ్డి పరమేశ్వర రావులు పాల్గొన్నారు. ఆహ్వానించిన కాంగ్రెస్ తోపాటు ఉభయ కమ్యూనిస్ట్ పార్టీల నుండి నేతలు హాజరు కాక పోవడం విశేషం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఒరిస్సా రాష్ట్ర గవర్నర్ డా.కంభపాటి హరిబాబు సందర్భంగా మాట్లాడుతూ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, తన ప్రస్థానం ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తగా ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులుగా, కేంద్ర కార్మికశాఖ మంత్రిగా, హర్యానా రాష్ట్ర గవర్నర్‌గా ఎదిగారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు నాయకులు అందరూ కలిసి ఒక తాటిపైకి వచ్చి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో తెలంగాణలో అలయ్ బలయ్ అనే కార్యక్రమాన్ని దత్తాత్రేయ విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. అటువంటి గొప్ప నాయకుడు ప్రజల కథే నా ఆత్మకథ అనే పుస్తకాన్ని రచించారని తెలిపారు. ఆ పుస్తకాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించడం తనవ అదృష్టంగా భావిస్తున్నానన్నారు అంతకు ముందు దత్తాత్రేయ స్వీయచరిత్ర పుస్తకాన్ని డా.హరిబాబు ఆవిష్కరించారు. కేంద్ర కార్మిక మంత్రిగా ఉన్నా సమయంలో విశాఖపట్నంకు ఇఎస్ఐ ఆసుపత్రి మంజూరుకు కృషి చేసిన దత్తాత్రేయను నగరంలోని నేవల్ డాక్‌యార్డ్ హిందూస్తాన్ షిప్ యార్డ్ పోర్ట్ ట్రస్ట్ స్టీల్‌ప్లాంట్ పరిశ్రమలకు చెందిన పలు కార్మిక సంఘాల చెందిన కార్మిక నేతలు ఘనంగా సన్మానించారు.

శిల్పారామంలో చిన్నారుల నృత్య విభావరి

పిఎం పాలెం, మే 24, ప్రభాతవార్త:

మధురవాడ పరిధి శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం సందడిగా సాగాయి. ఇందులో భాగంగా జోష్ డాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో చిన్నారుల ప్రతిభ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిందని శిల్పారామం పరిపాలన అధికారి రమేష్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక కళలను ప్రోత్సహించడంతో పాటు చిన్నారుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా ప్రకటన

M/S SATSYIL IT SOLUTIONS INDIA PRIVATE LIMITED (CIN NUMBER:U72200AP2015FTC096904) సంస్థ తన కార్యాలయాన్ని 54-13-11, Second Floor, Topaz Square, Near Infant Jesus Church, Seethammadhara, Visakhapatnam, Andhra Pradesh – 530013 నుండి 3rd Floor, Flat #1, CBCID Colony, NRSA Colony, Bhagath Singh Nagar Phase 2, Kukatpally, Hyderabad, Telangana – 500085 కు మార్చుటకు కంపెనీస్ చట్టం, 2013 సెక్షన్ 13 ప్రకారం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం తేదీ:20.05.2026న జరిగిన EGMలో ఆమోదించబడింది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, ప్రచురణ తేదీ నుండి 14 రోజులలోపు అఫిడవిట్ రీజనల్ డైరెక్టర్, న్యూఢిల్లీ వారికి పంపవచ్చు మరియు ఒక కాపీ కంపెనీకి పంపాలి.
దరఖాస్తుదారుని తరఫున-అంకినపల్లి రవీంద్ర, డైరెక్టర్ (DIN: 07664440)

పలువురును పరామర్శించిన "వీసం"

(నక్కపల్లి రూరల్ /అడ్డురోడ్డు ,ప్రభాతవార్త) : మండలంలోని ముకుందరాజుపేట గ్రామానికి చెందిన దార్ల నాగరాజు, వియ్యపు గోవిందు ఆరోగ్యం బాగా లేని విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆదివారం పరామర్శించారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, మాజీ సర్పంచ్ వియ్యపు శ్రీను, గొడిచర్ల పిఎసిఎస్ అధ్యక్షులు దార్ల కృష్ణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఈదురు గాలులకు పాడైన పంటలను పరిశీలించిన వైకాపా రాష్ట్ర నేత" వీసం"

(అడ్డురోడ్డు, ప్రభాతవార్త) : నక్కపల్లి మండలంలోని శనివారం ఈ వీచిన ఈదురు గాలులకు నష్టపోయిన పంటలను రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా రేబాక, రమణయ్యపేట, ముకుంద రాజుపేట, చీడిక, చీడిక కోత్తురు, జి. జగన్నాధపురం, దొంకాడ ,గుల్లిపాడు, చిన దొడ్డి గల్లు తోపాటు అన్ని గ్రామాలలో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు వర్షం వలన రైతులు పూర్తిగా నష్టపోయారని ఇది చాలా బాధాకరమని ప్రభుత్వం ఆదుకునేందుకు తక్షణమే కృషి చేయాలని పరిశీలించిన అనంతరం డిమాండ్ చేశారు. అరటి, మామిడి, కొబ్బరి, జీడీ మామిడి, బొప్పాయి, కూరగాయలు తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఈ గాలులకు అరట్లకోట, చిన రామభద్రపురం గ్రాములలో చెట్లు కూలి మగ్గురు రైతులు మృతి చెందడం బాధాకరమని తక్షణమే ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయనతోపాటు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు ఉన్నారు.

ఈదురు గాలులకు దెబ్బతిన్న ప్రాంతాల్లో మండల స్థాయి అధికారుల బృందం

(నక్కపల్లి, ప్రభాతవార్త): మండలంలోని శనివారం సాయంత్రం ఎన్నడూ ఊహించని విధంగా హఠాత్తుగా వీచిన ఈదురు గాలులకు దెబ్బతిన్న పంటలను నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను అంధకారంలో ఉన్న మెరక ప్రాంతపు గ్రామాలను ఇన్చార్జి ఎంపీడీవో దెందుకూరు సీతారామరాజు ,తాసిల్దార్ చిన్ని కృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో జ్యోతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ, పలువురు గ్రామ కార్యదర్శులు మండల స్థాయి అధికారులతో కలసి పర్యటించారు. మంచినీటి సమస్య రాకుండా గ్రామాల్లో జనరేటర్ సహాయంతో మంచినీటిని ట్యాంకులకు పంపించే ఏర్పాట్లు చేయడంతో పాటు పలు సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అక్కడున్న గ్రామస్తులతో మాట్లాడడంతో పాటు దెబ్బతిన్న పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న పంట పరిస్థితులను నివేదికల రూపంలో ప్రభుత్వానికి తెలియజేస్తామని, ఈ సందర్భంగా గ్రామస్తులకు రైతులకు ఇంచార్జ్ ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ముందుగా మండల స్థాయి అధికారుల బృందం గోడిచర్ల, జి.జగన్నాధపురం,, ముకుందరాజుపేట, దోసలపాడు, రమణయ్యపేట, రేబాక, తిరుపతి పాలెం, గుల్లిపాడు గ్రామాల నందు తీవ్రమైన ఈదురు గాలుల వలన నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. పరిశీలించిన అనంతరం ఎలక్ట్రికల్ స్తంబాలు, చెట్లు విరిగి పోవుటవలన త్రాగు నీరుకు ఇబ్బందులు లేకుండా ప్రతీ గ్రామం నందు అవసరం అయిన జెనెరేటర్స్, వాటర్ ట్యాంకర్స్ ఏర్పాటు చేయుటకు గాను తగు చర్యలు తీసుకొనుటకు గాను సంబందించిన అన్ని అన్ని గ్రామాల్లో చర్యలు చేపట్టారు.

పశువుల అక్రమ రవాణాపై పాడేరు పోలీసులు నిఘా

పాడేరు సిఐ దీనబంధు

పాడేరు,మే24, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు జంతు సంరక్షణ చట్టాల ప్రకారం ఎవరైనా అక్రమంగా పశువులు రవాణా చేసిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నామని పాడేరు పోలీస్ ఇన్ స్పెక్టర్ డి.దీనబంధు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ,సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బక్రీద్ పండగ సందర్భంగా ఎవరు అయిన అక్రమంగా పశువుల రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామనీ అయన హెచ్చరించారు. అదేవిధంగా వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామనీ ఎవరైనా పశువుల రవాణాలో తప్పనిసరిగా చట్టనిబందులను పాటించాలని యూనా స్పష్టం చేసారు. అట్లకాని నిబంధనలు పాటించని యెడల కఠినమైన చర్యలు తీసుకోనున్నామని సి ఐ దీనబంధు హెచ్చరించారు.

అరకులోయలో రోడ్డు ప్రమాదాలపై పోలీసులు అవగాహన

హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులతో భారీ బైక్ ర్యాలీ

అరకలోయ, మే 24, ప్రభాతవార్త : అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది.ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ను ధరించాలని అవగాహన పరుస్తూ ఒకవైపు జిల్లా కలెక్టర్, ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలు నిర్వహిస్తుండగా, మరో వైపు పర్యాటకులకు, స్థానికులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని చెబుతూ బైక్ ర్యాలీ కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అరకులోయలో పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి నేతృత్వంలో అరకులోయ సబ్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పర్యాటకులు స్థానిక ద్విచక్ర వాహనదారులతో కలిసి హెల్మెట్ ధరించి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ హిమగిరి, ఎస్ఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం. కుటుంబాన్ని వీధిపాలు చేస్తుందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని సూచించారు.

ఎల్ సి సి చైర్మన్ కృష్ణకుమారికి సేవా రత్నా అవార్డు

అరకులోయ, మే 24, ప్రభాతవార్త : అల్లూరి సీతారామరాజు జిల్లాలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ , గిరిజనుల హృదయాల్లో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న అరకులోయకు చెందిన స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కమిడి కృష్ణ కుమారికి మదర్ తెరిసా సేవా సంస్థ సేవా రత్నా రాష్ట్రస్థాయి అవార్డును ప్రధానం చేసింది. దీనిలో భాగంగా ఆదివారం విశాఖపట్నం లో వి జె ఎఫ్ అధ్యక్షుల సమక్షంలో కృష్ణ కుమార్ కి అవార్డును అందించారు . సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ మెమెంటో ప్రశంస పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న కృష్ణకుమారి మాట్లాడుతూ తనకు మదర్ తెరిసా సేవా సంస్థ తన సేవలను గుర్తించి సేవా రత్న రాష్ట్ర స్థాయి అవార్డు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని , ప్రజలకు భవిష్యత్తులో మరిన్ని సేవలను అందిస్తానని తెలియజేశారు.

కనకదుర్గమ్మ అమ్మవారికి వెండి కిరీటం అలంకరణ

అరకలోయ, మే 24, ప్రభాతవార్త : అరకులోయ పట్టణం లో వెలసిన శ్రీశ్రీశ్రీ కనక దుర్గ అంబికా అమ్మవారికి ఆదివారం ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ లిడా. సియ్యారి దొన్ను దొర వెండి కిరీటం ను అలంకరించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా వెండి కిరాటాన్ని అలంకరింపజేశారు. కాగా స్థానిక గురుభవాని పాడి చందు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతూ ఉంటాయి. ఈ కార్యక్రమంలో అరకులోయ మండలం అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, ఏఎంసి చైర్మన్ బొరి బొరి లక్ష్మీ, టిడిపి నాయకులు కొర్ర జ్యోతి, అరకు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు సియ్యారి అజయ్ దొర, క్లస్టర్ ఇంచార్జి కొర్ర శేఖర్, డంబ్రిగుడ క్లస్టర్ ఇంచార్జి కొర్ర నాగరాజు, నిర్మల, మాజీ ఎంపిటిసి వంతల వెంకటరావు, నాగరాజు, టిడిపి సీనియర్ నాయకుడు సత్యనారాయణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వంటలమామిడిలో 'జన్ భాగీదారీ అభియాన్' ముగింపు వేడుకలు

-ఐటీడీఏ పీఓ ఆదిత్య వర్మ

పాడేరు,మే24, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 'జన్ భాగీదారీ అభియాన్' కార్యక్రమ ముగింపు వేడుకలు సోమవారం మే 25న పాడేరు మండలం వంటలమామిడి గ్రామ పంచాయతీ పరిధిలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి వంటలమామిడిలో ప్రారంభం కానున్న ఈ మెగా క్యాంప్‌లో జిల్లా కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్ నిషాంతి. టి , జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ , ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ లతో పాటు జిల్లా స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.ప్రధాన కార్యక్రమాలు జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖలు ప్రత్యేక స్టాళ్లుఈ ముగింపు వేడుకల్లో భాగంగా ఏర్పాట్లు,అలాగే ప్రజల సౌకర్యార్థం గ్రామంలో పలు ప్రభుత్వ సేవల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.అధికారులచే గ్రామంలో పర్యటన (ట్రాన్సిట్ వాక్),ఉచిత మెగా వైద్య శిబిరం (మెగా మెడికల్ క్యాంప్),ఆధార్ నమోదు మరియు సవరణ స్టాల్,విడివికె స్టాల్,ఐసీడీఎస్ స్టాల్,గృహ నిర్మాణ లబ్ధిదారుల నమోదు (హౌసింగ్ స్టాల్),పీఎం ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల నమోదు స్టాల్, కేంద్ర బృందం పర్యటనఈ 'జన్ భాగీదారీ అభియాన్' క్షేత్రస్థాయి పరిశీలన మరియు డాక్యుమెంటేషన్ కొరకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు చిరాగ్ ఖురానా (టీమ్ లీడర్), శ్రీ వరుణ్ జునేజా (కో-టీమ్ లీడర్) లతో కూడిన బృందం మే 24 నుండి 26 వరకు పాడేరు ఏజెన్సీ పరిధిలో పర్యటించనున్నారు ఐ టి డి ఏ పీఓ ఆదిత్య వర్మతెలిపారు.ఈ కార్యక్రమానికి పాడేరు ఎంపీడీఓ నోడల్ అధికారిగా, వంటలమామిడి పంచాయతీ కార్యదర్శి గ్రామ స్థాయి అధికారిగా వ్యవహరిస్తూ, అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అధికారులకు ఆదేశాలు

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వంటాలమామిడిలో జరిగే ఈ ముగింపు క్యాంప్‌నకు తప్పనిసరిగా హాజరుకావాలని, అలాగే సంబంధిత శాఖల అధికారులు తమ స్టాళ్లను, వైద్య శిబిరాలను విజయవంతం చేయడానికి అవసరమైన సిబ్బందిని, ముందస్తు ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని ఈ ప్రకటన ద్వారా తెలియజేసారు.

పెద్దిపాలెం జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదం

ఆనందపురం, మే 24, ప్రభాతవార్త: ఆనందపురం మండలం పెద్దిపాలెం బ్రిడ్జ్ కు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆనందపురం నుంచి తగరపువలస వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం లారీ ముందుగా వెళ్తుండగా, అదే దారిలో వెనుక నుంచి వస్తున్న స్కూటీ లారీ కుడి వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఉప్పాడ లోకేష్ మణికంఠ (18) తీవ్రంగా గాయపడ్డాడు. ముఖం, ఎడమ కన్ను, నోరు, దవడ భాగాల్లో తీవ్ర రక్తగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు.ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారు కాగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

గాజువాకలో 'రోడ్డు' షోలు...నిబంధనలు కాగితాలకే పరిమితం!

-ఏసీపీ ఆదేశాలు బేఖాతరు - అమ్మవారి పండుగ పేరుతో రోడ్లపైనే డాన్స్ ప్రోగ్రామ్‌లు

-రాకపోకలకు ఇబ్బందిపడిన ప్రయాణికులు -

ట్రాఫిక్ పోలీసులుపై స్థానికుల తీవ్ర ఆగ్రహం

గాజువాక, మే 24,ప్రభాతవార్త : గాజువాకలో ట్రాఫిక్ నిబంధనలు తుంగలో తొక్కారు. నిత్యం వేలాది వాహనాలతో బిజీగా ఉండే గాజువాక నుంచి సిందియా ప్రధాన రహదారిని పండుగ సంబరాల పేరుతో దిగ్బంధించారు. ఉన్నతాధికారులు హెచ్చరించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడం, పైగా ఆదేశాలు జారీ చేసిన 24 గంటలు గడవక ముందే మళ్లీ అదే తంతు పునరావృతం కావడం స్థానికంగా కలకలం రేపుతోంది. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ డిపో, కొత్త నక్కవానిపాలెం సమీపంలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క రోజు కూడా గడవక ముందే..!

వారం రోజుల క్రితం జింక్ ప్రధాన ద్వారం సమీపంలో అమ్మవారి పండుగ వేడుకల పేరుతో రోడ్డును క్లోజ్ చేయడంతో గాజువాక నుంచి సిందియా మీదుగా నగరానికి రాకపోకలు చేసే వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీనిపై ప్రయాణికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ వై. శ్రీనివాసరావు తీవ్రంగా స్పందించారు. ఇకపై రోడ్లపై ఇలాంటి కార్యక్రమాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతులు ఉండబోవని హెచ్చరిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే.. ఈ ప్రకటన వెలువడి ఒక్క రోజు కూడా గడవక ముందే స్థానిక పోలీసులు ఏసీపీ ఆదేశాలను గాలికి వదిలేశారు. కొత్త నక్కవానిపాలెంలో రోడ్డుపైనే 'డాన్స్ బేబీ డాన్స్' ప్రోగ్రామ్‌లు, ఆర్కెస్ట్రాలు నేల వేషాలు, సాము గరిడీలు యథేచ్ఛగా నిర్వహించారు. దీంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కల్గింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అంబులెన్స్‌కూ దిక్కులేదు!..

ట్రాఫిక్ పోలీసుల తీరుపై స్థానికులు బహిరంగంగానే ఆరోపణలు గుప్పిస్తున్నారు. కేవలం మామూళ్ళ కోసమే పోలీసులు ట్రాఫిక్ నిర్వహణను గాలికి వదిలేశారని మండిపడుతున్నారు. పోలీసుల కళ్లముందే ఇంత పెద్ద ఎత్తున రోడ్డును ఆక్రమించి ప్రోగ్రామ్స్ పెడుతుంటే కనీసం పట్టించుకోకపోవడం వెనుక పెద్ద కథే ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితి వస్తే కనీసం ఒక అంబులెన్స్ కూడా వెళ్లే దారి లేకపోవడం ఇక్కడి దుస్థితికి అద్దం పడుతోంది. "ఉదయం ఇళ్ల నుంచి వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన మేము.. రాత్రికి క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలా వద్దా?" అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

నగర కమిషనర్ స్పందించాలి....

ఉన్నతాధికారుల హెచ్చరికలు కేవలం కాగితాలకే పరిమితం కావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా నగర పోలీస్ కమిషనర్ (సీపీ) ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన స్థానిక సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గాజువాక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిరుపేదలకు అన్నప్రసాద వితరణ

విశాఖపట్నం మే 24 ప్రభాత వార్త : అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల ప్రాంగణం వద్ద ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా గత 14 సంవత్సరాలుగా నిరుపేదలకు అన్నార్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ఈరోజు ఈ కార్యక్రమాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వి రాజశేఖర్ ప్రారంభించి పేదలకు, అన్నార్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ చక్కని కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యంవివి సత్యనారాయణ జి బి కుమార్లను ప్రశంసించారు . కార్యక్రమంలో ద్వారకా నగర్ లైన్స్ క్లబ్ ప్రతినిధులు కే స్వతంత్ర కుమార్ , ఏ వెంకటరావు , జి బ్రహ్మానంద కుమార్ పాల్గొన్నారు .

ఘనంగా అబిడ్ నగర్‌లో హ్యాపీ సండే సందడి

ఆరిలోవ, మే 24, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హ్యాపీ సండే కార్యక్రమం విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్, స్థానిక శాసనసభ్యులు విష్ణు కుమార్ రాజు ఆదేశాలు మేరకు ఆదివారం జీవీఎంసీ 44,45 వార్డుల కూటమి నాయకుల ఆధ్వర్యంలో అబిడ్ నగర్ పార్క్ వద్ద "హ్యాపీ సండే" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, 44వ వార్డు అధ్యక్షులు గారపాటి సత్యనారాయణ (సతీష్), 45వ వార్డు అధ్యక్షులు బర్నికాన రాజు, జనసేన అధ్యక్షులు పరమేష్ , బీజేపీ అధ్యక్షులు రఘునాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గారపాటి సతీష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆటలు, నృత్యాలు అందరిని అలరించాయని, వారం రోజుల నుండి పని ఒత్తిడితో జీవిస్తూ ఆదివారం నాడు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం పట్ల మనసు ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటుందని ఆయన తెలిపారు. యోగా, కరాటే, నృత్య ప్రదర్శనలుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మల్ల లక్ష్మి, మల్ల నిర్మల, పి. చక్రవర్తి, ఏ. అన్నపూర్ణ, పి. శ్రీను, ఎస్. నరసింహమూర్తి, కల్లా శ్రీను, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, అబిడ్ నగర్ వాకర్స్ క్లబ్, శుభోదయం వాకర్స్ క్లబ్ సభ్యులు, కూటమి పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చెరువుల బలోపేతంతో రైతాంగం అభివృద్ధి : గంటా

ఆనందపురం, మే 24: మండలంలోని రెండు చెరువుల పునరుజ్జీవానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఆనందపురం పంచాయతీ పుర్లివాని చెరువు, గండిగుండం పంచాయతీ గౌరివాని చెరువు లను ఒక్కొక్కటి సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. చెరువుల బలోపేతం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని గంటా ఈ సందర్భంగా పేర్కొన్నారు. చెరువుల పటిష్టంతో పాటు సోలార్ దీపాలు, ఆర్.సి.సి. బెంచీలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్ పార్కులతో ఆహ్లాదకరమైన వాతావరణం అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు నిర్మలాదేవి, కె. ఆంజనేయులు, సత్యనారాయణ, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, బి.ఆర్.బి. నాయుడు, లొడగల వెంకట్రావు, గండ్రెడ్డి సోమినాయుడు, శ్రీకాంత్ రాజు, ఎర్ర రాజు, చిన్న, మదపాటి శ్రీను, బలిరెడ్డి మల్లికార్జునరావు, గండ్రెడ్డి రమేష్, అంగటి రాము, కాళ్ల నగేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ నేషన్స్ ప్రతినిధులను ఆకట్టుకున్న తర్లువాడ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు

ఆనందపురం, మే 24, ప్రభాత వార్త: యునైటెడ్ నేషన్స్ ఎన్విరా న్మెంట్ ప్రోగ్రామ్ (యూనిప్) ప్రతినిధులు విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ అమలు చేస్తున్న సుస్థిర వ్యవసాయ విధానాలను పరిశీలించారు. ఈ బృందంలో శ్రీ సత్య ఎస్ త్రిపాఠి, మిస్టర్ ఫిలిప్పే, మిస్టర్ హెన్నింగ్స్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు ఆర్‌టిఎల్ ప్రకాష్, అల్లంసెట్టి మోహన్ రావు, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించారు. జేడీ ఫిషరీస్ పి. లక్ష్మణరావు, ఎఫ్‌డీవో మురళి అతిథులుగా హాజరయ్యారు. రైతు సాధికార సంస్థ హెచ్ఆర్ అండ్ జెండర్ థీమాటిక్ బి. శ్రీనివాస్ చక్రవర్తి వ్యవసాయ క్షేత్రంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతినిధులకు వివరించారు. ముఖ్యంగా వర్షాకాలానికి ముందే పొడి నేలలో విత్తనాలు విత్తే విధానం,విత్తనాలకు రక్షణ పూత పెట్టే ప్రక్రియ / విత్తన గుళికల తయారీ విధానం, ఎప్పుడైనా ఆదాయం అందించే విధానాల ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో స్థిరమైన ఆదాయం పొందుతున్న విధానాన్ని తెలియజేశారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల్లో వర్షాభావాన్ని ఎదుర్కోవడంలో విత్తనాలకు రక్షణ పూత పెట్టే ప్రక్రియ ఎంతో ఉపయోగకరమని వివరించారు.అలాగే మామిడి తోటల్లో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, జీవ వైవిధ్య పరిరక్షణ, బహుళ పంటల సాగు విధానాలను యునైటెడ్ నేషన్స్ ప్రతినిధులు ఆసక్తిగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ప్రతినిధులు బయో రీసెర్చ్ సెంటర్‌ను కూడా సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ పరిశోధనలు, రైతులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, స్థానిక విత్తనాల పరిరక్షణ చర్యలను తెలుసుకొని అభినందించారు. మహిళా సంఘ సభ్యులతో సమావేశమై ప్రకృతి వ్యవసాయం వల్ల గ్రామీణ మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం పర్యావరణ పరిరక్షణకు, నేల ఆరోగ్య సంరక్షణకు రైతుల ఆర్థిక స్థిరత్వానికి ఎంతో దోహదపడుతుందని యునైటెడ్ నేషన్స్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్శనతో విశాఖపట్నం జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు.

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఫలితాల్లో ఎస్‌జీఎస్ సైనిక్ అకాడమీ విద్యార్థుల ఘన విజయం

మాధవధార, మే 24: సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ -2026 పరీక్షల ఫలితాల్లో మురళి నగర్ ఎస్‌జీఎస్ సైనిక్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని నమోదు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న 33 ప్రభుత్వ సైనిక్ పాఠశాలల్లో ఈ అకాడమీకి చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో ఎంపికై సంస్థకు గర్వకారణంగా నిలిచారు.మురళి నగర్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ రామ్ మాట్లాడుతూ సైనిక్ స్కూల్స్ ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ విద్య, క్రమశిక్షణతో కూడిన శిక్షణ లభిస్తుందని తెలిపారు. దీంతో పిల్లల్లో లాజికల్ థింకింగ్, నాయకత్వ లక్షణాలు, క్రీడా నైపుణ్యాలు, గన్ షూటింగ్ వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.2012 నుంచి ఇప్పటివరకు 600 మందికి పైగా విద్యార్థులను తమ అకాడమీ ద్వారా సీట్లు సాధించినట్లు తెలిపారు.

గ్రంథాలయ వేసవి శిబిరంలో అలరించిన 'సోమరిపోతు సోము' కథ

గాజువాక, మే 24ప్రభాతవార్త: స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ఉత్సాహభరితంగా సాగింది. శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు చదవడం, రాయడం, చెప్పడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి బి. సూర్యకళ విద్యార్థులకు 'సోమరిపోతు సోము' అనే నీతి కథను చక్కగా వివరించి చెప్పారు. నిత్య జీవితంలో సోమరితనాన్ని వీడి, కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని కథ ద్వారా పిల్లలకు బోధించారు.అనంతరం విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందుకు సన్‌ఫ్లవర్ (పొద్దుతిరుగుడు) గింజలతో వివిధ రకాల ఆకర్షణీయమైన డిజైన్లను చేయించారు. పిల్లలు ఎంతో ఆసక్తిగా ఈ క్రాఫ్ట్ వర్క్‌లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. గ్రంథాలయ అధికారిణి బి. సూర్యకళ పర్యవేక్షణలో జరిగిన ఈ విజ్ఞాన భరిత కార్యక్రమం చివరగా విద్యార్థులు ఆలపించిన జాతీయ గీతంతో ముగిసింది.

ప్రజల అభిప్రాయాన్ని సేకరించి వార్డుల విభజన చేయాలి

వైసిపి నేతలు జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

అనకాపల్లి, 24, (ప్రభాత వార్త) పట్టణంలో వార్డుల విభజనలో ఉన్న గందరగోళ పరిస్థితిని తొలగించే చర్యలు చేపట్టాలని వైసిపి డిమాండ్ చేసింది. ఈ మేరకు అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కమిషనర్ లక్ష్మీ తులసికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ముందుగా రింగ్ రోడ్ లోని పార్టీ కార్యాలయం నుండి కార్యకర్తలతో జీవీఎంసీ కార్యాలయానికి తరలివెళ్లి జోనల్ కమిషనర్ లక్ష్మీ తులసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు పార్టీ నాయకులు కేవిఎం నేత జాజుల రమేష్, బొడ్డెడ శివ కోరుకొండ రాఘవ కొణతాల మురళీకృష్ణ అల్లు త్రినాథ్ బుద్ధ భాస్కరరావు తదితరులు మాట్లాడుతూ పట్టణంలో పారదర్శకత లేకుండా ఐదు వార్డులను ఆరు వార్డులకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదన్నారు. ఏ ప్రాతిపదికన ఎటువంటి ప్రజాభిప్రాయం లేకుండా వార్డుల సంఖ్యను పెంచడం జరిగిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా విమర్శలు లేకుండా వార్డులను రౌండ్ ద క్లాక్ సిస్టం లో ఐదు వార్డులుగా విభజించడం జరిగిందన్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చి వారం రోజుల్లో వార్డుల విభజన ప్రక్రియ పూర్తి అయినట్లు ప్రకటించడం సమంజసం కాదన్నారు. అలాగే ఈ ఎమ్మెల్యేలు 120 సంఖ్యను నూట యాభై కి పెంచాలని డిమాండ్ చేయడం మరింత గందరగోళానికి దారి తీసింది అని అన్నారు. ప్రజల అభిప్రాయాన్ని సేకరించి ఈ పునఃకైనా వార్డుల విభజనను పారదర్శకంగా నిర్వహించాలని వారు కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మిత్రమా ... కుశలమా ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం

అనకాపల్లి, మే 24, (ప్రభాతవార్త) ప్రస్తుత పరిస్థితుల్లో సూర్య భగవానుడు తన ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్న తరుణంలో అధిక ఉష్ణోగ్రతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు దాహార్తిని తీర్చేందుకు స్థానిక జీవీఎంసీ పెద్ద హై స్కూల్ 1985 - 86 ఏడాదిలో చదువుకున్న పదవ తరగతి పూర్వ విద్యార్థులు మిత్రమా ... కుశలమా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తాము చదువుకున్న స్కూల్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సంఘం అధ్యక్షులు డొంక సాయినాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అటుగా ప్రయాణించే ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. మండుతున్న ఎండల నుండి ఉపశమనం పొందేందుకు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం నిర్వాహకులను ప్రజలు అభినందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు సాయినాథ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అధిక ఉష్ణోగ్రత నుండి ప్రజలు దాహార్తిని తీర్చుకునేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సుమారుగా 2 వేల మందికి చల్లని మజ్జిగ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంట్రా శ్రీనివాసరావు, సీతారాం మెడికల్ అధినేత వంకాయల కామరాజు, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు గణేష్, గున్నాల్, మహేదేవ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

అనకాపల్లి, మే 24, (ప్రభాత వార్త) : ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెంలో కొలువై ఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతర ముగినిప్పటికీ భక్తుల రద్దీ మాత్రం వారం వారం పెరుగుతూ వస్తుంది. వేసవి సెలవులు కావడంతో ఆదివారం సుదూర ప్రాంతాల నుండి భక్తులు తమ కుటుంబ సభ్యులతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు అన్నీ భక్తులతో రద్దీగా మారాయి. అనకాపల్లి పరిసర ప్రాంతాల నుండి భక్తులు అమ్మవారి ఘటాలతో కాలినడకన ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాల్లో వంటలు వండుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గంటల తరబడి క్యూ లైన్ లో ఉన్న భక్తులకు దేవస్థానం అధికారులు, పాలక మండలి సభ్యులు మజ్జిగ, తాగునీరు, ప్రసాదం , చిన్న పిల్లలకు పాలు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి ఆలయానికి వచ్చిన భక్తులకు అందజేశారు.

తాగు నీరు సమస్య పరిష్కరించండి

(ఎస్ రాయవరం, మే 24, ప్రభాతవార్త): మండలంలో ధర్మవరం అగ్రహారం వివేకానంద కాలనీ, కొత్తూరులో తాగు నీరు సరిపడక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నేత అప్పల రాజు అన్నారు. వెంటనే పంచాయతీ అధికారులు స్పందించి తాగునీరు అందించే విధంగా రక్షిత మంచినీరు ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించి శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. ధర్మవరం అగ్రహారం గ్రామ ప్రజలు అందరు తరుపున కోరుతున్నామని, ధర్మవరం అగ్రహారం గ్రామంలో ప్రస్తుతం రక్షిత మంచినీరు, సరఫరా చేస్తున్న ఓవర్ హెడ్ 2000 సంవత్సరం లో ప్రారంభించారని ,ఆ ట్యాంకు అప్పటి జనాభా కు తగ్గట్టుగా రోజు కు 90 వేల లీటర్లు నీరు సరఫరా చేసే అంచనా తో నిర్మించారు,అట్యాంకు నిర్మించి 26 సంవత్సరాలు అవుతుందని,అప్పటికి ఇప్పటికీ జనాభా పెరిగారు,గ్రామం విస్తరించింది, అదేవిధంగా ఇప్పుడు నీరు అవసరాలు ఎక్కువైన్నాయి హెండిల్ బోర్లు కూడా ఉండేవి, ఇప్పుడు అవి కూడా లేక త్రాగు నీటికి,ఇతర అవసరాలకు కూడా ఇంటింటి కుళాయి నీరుపై, ఆధారపడాల్సిన పరిస్థితి కూడా ఏర్పడిందన్నారు. అధికారులు వెంటనే స్పందించి, శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో జి.అప్పలరాజు, బి.విష్ణుమూర్తి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధన

అనకాపల్లి, మే 24 (ప్రభాత వార్త): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యా బోధనతో మీ పిల్లల బంగారు భవిష్యత్ ఆధారపడి ఉందని రాముపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాస్త్రి అన్నారు. మేజర్ పంచాయతీ కొత్తూరు, సత్యనారాయణపురం, పినినికాడల పరిధిలోని రాముపురం, కృష్ణాపురం, రామభద్రపురం, పుడా కాలనీ, సుబ్రహ్మణ్యం కాలనీ, టిడ్కో కాలనీలో ఆదివారం ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో నిపుణులైన ఉపాధ్యాయులతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. విద్యార్థులందరికీ ఆరోగ్యకరమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మీ పిల్లల భవిష్యత్తు కి మేము హామీ ఇచ్చే విధంగా విద్యాబోధన చేస్తున్నామన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెనుమత్స కృష్ణశేఖరాజు, ఉపాధ్యాయులు అలి, శారద, అన సూర్యా, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఎంవిఆర్ ఆర్థిక సాయంతో బాక్సింగ్‌లో చిన్నారుల సంచలనం

అనకాపల్లి , మే 24 (ప్రభాత వార్త) : పట్టణంలోని డాక్టర్ బి ఆర్. అంబేద్కర్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో మెడల్స్ పంట పండించారు. ఈ నెల 16న ఈ పోటీలకు వెళ్లేందుకు ముత్యాల వెంకటేశ్వర రావు (ఎం వి ఆర్) తమ కార్యాలయంలో 8 మంది విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించారు.ఆయన నమ్మకాన్ని నిలబెడుతూ ఆ చిన్నారులు స్టేట్ లెవెల్ పోటీల్లో 2 గోల్డ్, 5 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించి ఘన విజయం సాధించారు. ఆదివారం విజేతలు ఎం వి ఆర్ ని మర్యాదపూర్వకంగా కలిసి తాము సాధించిన బహుమతులను చూపించారు.ఈ సందర్భంగా చిన్నారులను అభినందించిన ముత్యాల వెంకటేశ్వర రావు (ఎంవిఆర్) నేటి బాలలే రేపటి పౌరులుగా సమాజంలో గొప్ప స్థాయిలో ఉండాలని, మన రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది తోపాటు ఎం వి ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు విద్యాయజ్ఞం..!

- గ్రామాల్లో డోర్ టు డోర్ ప్రచారం - ప్రభుత్వ బడులకు10 మంది కొత్త అడ్మిషన్లు

(అచ్చుతాపురం, మే 24, ప్రభాతవార్త): ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచేందుకు అధికారులు, ఉపాధ్యాయులు అర్ధరాత్రి వరకు శ్రమించిన ఘటన అచ్చుతాపురం మండలంలో చోటుచేసుకుంది. 5o చిల్డ్రన్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఓ), మండల విద్యాశాఖ అధికారులు (యం ఇ ఓ -1,యం ఇ ఓ -2), అచ్చుతాపురం హైస్కూల్ హెచ్ఎం, యం పి పి యస్ పెదపాడు, జగ్గన్నపేట ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు కలిసి శుక్రవారం రాత్రి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు.రాత్రి 10 గంటల వరకు కొనసాగిన ఈ ప్రత్యేక ప్రచారంలో తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ బోధన వంటి అంశాలను వివరించారు. అధికారుల బృందం పట్టుదల ఫలితంగా 10 మంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ముందుకొచ్చారు.గ్రామాల్లో విద్యార్థుల కోసం అధికారులు అర్ధరాత్రి వరకు తిరగడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. విధి నిర్వహణ పూర్తయ్యేసరికి రాత్రి 12 గంటలు దాటిందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యాశాఖ తీసుకుంటున్న చర్యలను గ్రామస్తులు అభినందించారు.

మహానాడును విజయవంతం చేయండి .. ధూళి రంగనాయకులు

ఎలమంచిలి, మే 24, ప్రభాతవార్త: రాంబిల్లి మండలం హరిపురంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు ముఖ్య సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే 'మహానాడు' కార్యక్రమాన్ని ఈ నెల 27, 28 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు నాయకులు ప్రకటించారు. రాంబిల్లి క్లస్టర్-4 పరిధిలోని గ్రామాలకు సంబంధించి నారాయణపురం గ్రామంలో గల కళ్యాణ మండపంలో ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, మండల ప్రధాన కార్యదర్శి కరెడ్ల ఈశ్వరరావు, కో-క్లస్టర్ ఇన్‌ఛార్జ్ చిన్న తెలిపారు. క్లస్టర్-4 గ్రూపులో ఉన్న 14 గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ఈ నెల 27, 28 తేదీల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చి, మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ?ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తోట మోహన్రావు, మణికంత, నర్సింగరావు, మంచాల అచ్చిబాబు, వేగిరాముతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముసిలితల్లి అమ్మవారిని దర్శించిన బొడ్డేడ ప్రసాద్

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైసీపీ నేతలు

(అచ్చుతాపురం, మే 24, ప్రభాతవార్త): మునగపాక మండలంలోని మునగపాక గ్రామంలో ఆదివారం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. గ్రామ దేవత ముసిలితల్లి అమ్మవారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించగా, బొడ్డేడ ప్రసాద్ అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ముసిలితల్లి మూల సంఘం సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు అమ్మవారి ఆశీస్సులతో ప్రాంతం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక హారతులు సమర్పించారు. కార్యక్రమం భక్తి వాతావరణంలో ఘనంగా ముగిసింది.

అమ్మవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు

నక్కపల్లి, మే 24: మండలంలోని రేబాక గూడుపమ్మతల్లి ఆలయాన్ని అనేక ఉపాలయాలతో పునర్ని ర్మించిన తరువాత ఆలయానికి భక్తుల తాకిడి గణనీయంగా పెరుగుతోంది. మండు టెండల్లో సైతం పచ్చని వనాల మధ్యవున్న ఈ ఆలయానికి వెళితే ఎంతో చల్లదనంగా వుంటుందని భక్తులు భావిస్తున్నారు.అందుకే వేసవిలో కూడా భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడుతోంది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రికార్డు స్థాయిలో భక్తులు ఆలయానికి వచ్చారు. కోటనందూరు, తుని, పిఠాపురం, పాయకరావుపేట, నక్కపల్లి, ఎలమంచిలి, ఎస్.రాయవరం మండలాల నుంచి భక్తులు వచ్చారు. అమ్మవారిని, ఆలయంలోపల వున్న అష్టాదశ పీఠాల దేవతామూర్తులను దర్శించుకున్న అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలోనే వంటలు చేసుకుని, భోజనాలు చేశారు. ఎంతో సందడిగా గడిపారు. పాయకరావుపేట బృందావనం కాలనీకి చెందిన కంగెం శ్రీను-సత్యవతి దంపతులు అమ్మవారికి రూ. 20వేలు విలువైన వెండి త్రిశూలాన్ని బహూకరించారు. భకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆర్.భీమవరంలో ఎంఎస్ఎంఈ పార్క్‌కు సోమవారం శంకుస్థాపన

సీఎం చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభం

బుచ్చయ్య పేట మే 24 ప్రభాత వార్త : మండలంలోని ఆర్.భీమవరంలో ఏర్పాటు కానున్న ఎంఎస్ఎంఈ పార్క్‌కు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంఖుస్థాపన చేయనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ఆర్.భీమవరంలో 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. సంబంధిత స్థలంలో ఇప్పటికే ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని, కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే రాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొననున్నారని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటును వేగవంతం చేస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా చోడవరం నియోజకవర్గానికి సంబంధించి ఆర్.భీమవరంలో ఈ పార్క్ అభివృద్ధి చేయడం ప్రాంతీయ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడనుందని అధికారులు పేర్కొన్నారు.

నేడు వడ్డాది సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

రైతులకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరా వేళల్లో మార్పు

బుచ్చయ్య పేట మే 24 ప్రభాత వార్త : బుచ్చయ్యపేట మండలంలోని వడ్డాది సబ్‌స్టేషన్‌లో పీటీఆర్-2 మరమ్మత్తు పనులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా సమయాల్లో తాత్కాలిక మార్పులు చేస్తున్నట్లు నర్సీపట్నం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్,రామకృష్ణ తెలిపారు.వడ్డాది సబ్‌స్టేషన్ పరిధిలోని బంగారుమెట్ట ఫీడర్ ప్రాంతాలకు నేటి నుంచి వారం రోజుల పాటు ఉదయం 2 గంటల నుంచి 11 గంటల వరకు మూడు ఫేజ్‌ల విద్యుత్ సరఫరా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విజయరామరాజుపేట, మంగళాపురం ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, తిరిగి రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు రైతులకు మూడు ఫేజ్‌ల కరెంట్ అందించనున్నట్లు వెల్లడించారు.మరమ్మత్తు పనులు పూర్తయ్యే వరకు రైతులు విద్యుత్ సరఫరా సమయాలను గమనించి శాఖ అధికారులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ షెడ్యూల్ అమలు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక

(ఎస్. రాయవరం,మే 24, ప్రభాతవార్త): ధర్మవరం అగ్రహారం గ్రామంలో ఆదివారం 2004 - 2005 సంవత్సరం, పదవ తరగతి విద్యార్థులు,21 సంవత్సరం తర్వాత అపూర్వ కలయిక జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, పాత జ్ఞాపకాలు నెమర వేసుకున్నారు, అందరూ సంతోషాన్ని పంచుకున్నారు. విద్యతో పాటు సంస్కారాన్ని జ్ఞానాన్ని పెంపొందించిన గురువర్యులను ఎంఈఓ మోతి, ఉపాధ్యాయులు శర్మ, ఆయిల్,రాధా,నారాయణ, రాణి,గౌరీ తదితర గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన దాసపాత్రుని శివ, ఒరిగంటి కృష్ణ, స్వరూప కన్నయ్య దొర,ధనలక్ష్మి, శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు.

అరటి, బొప్పాయి తోటలకు అపార నష్టం

పలు గ్రామాల్లో అంధకారం.. 24 గంటలుగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరా.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)మే 24 : నక్కపల్లి మండలంలో శనివారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులు పెనుబీభత్సాన్ని సృష్టించాయి. కేవలం గంటసేపు ఈదురుగా లులకు మండలంలోని అనేక గ్రామాలు వణికాయి.ఈమండలంలోని రేబాక, రమణయ్యపేట, ముకుందరాజుపేట, చీడిక, చీడిక కొత్తూరు, జీ జగన్నాథపురం, డొంకాడ, గుల్లిపాడు, చినదొడ్డిగల్లు తదితర గ్రామాల్లో జీడి, మామిడి తోటలతో పాటు అరటి, బొప్పాయి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చీడిక కొత్తూరు, రమణయ్యపేట, రేబాక, జీ జగన్నాథపురం తదితర గ్రామాల్లో అరటి, బొప్పాయి చెట్లు నేలకొరిగాయి. సుమారు 80ఎకరాల్లో ఈ తోటలకు అపార నష్టం జరిగినట్టు తెలిసింది. దెబ్బతిన్న తోటలను ఆదివారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ పరిశీలించారు. ఈదురుగాలుల బీభత్సానికి అనేక గ్రామాల్లో వృక్షాలు నేలమట్టమయ్యాయి. విద్యుత్ వైర్లు తెగిపడ్డంతో మెరక గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి అంధకారం అలముకుంది. రేబాక, రమణయ్యపేట, తిరుపతిపాలెం, ముకుందరాజుపేట, దోసలపాడు సహా వెదుళ్లపాలెం, సీ హెచ్చీ అగ్రహారం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పునరుద్ధరించడానికి ట్రాన్స్కో సిబ్బంది అవస్థలు పడుతున్నారు ఏ విధంగా అయినా పునరుద్ధరిస్తామని తెలిపారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సెల్ఫోన్ ఛార్జింగ్ లేకపోవడం, కొన్ని నెట్వర్క్ కు సంబంధించి సిగ్నలింగ్ వ్యవస్థ కూడా దెబ్బతింది. ఆయనతోపాటు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, మాజీ సర్పంచ్ లు వియ్యపు శ్రీను, గండేపల్లి ప్రకాష్, తదితరులు ఉన్నారు.

హాకీ వేసవి హాకీ క్రీడాకారుల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన వైకాపా నేత వీసం

(నక్కపల్లి ,ప్రభాతవార్త)వేసవి హాకీ ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ,విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గ పరిశీలకులు వీసం రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా బిఎస్ హాకీ క్లబ్ ఫౌండర్ సూరిబాబు ఆధ్వర్యంలో కేశవ్ రామకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముందుగా ఇతర రాష్ట్ర దూర ప్రాంతాల నుంచి నక్కపల్లిలో సుమారుగా నెలరోజుల పాటు శిక్షణ పొందడానికి వచ్చిన క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందిస్తూ క్రీడాకారులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో రాణించాలని కోరారు. బలిరెడ్డి సూరిబాబు, రామచంద్రరావు, తాతాజీ, కొల్లాటి నానాజీ, తదితరులు ఉన్నారు.

యువతకి వాలీబాల్ కిట్లు అందించిన లక్ష్మీ జయరావు

(ఎస్ రాయవరం,మే 24, ప్రభాతవార్త): మండలంలో పెద్ద ఉప్పలం గ్రామంలోయువతకి చెందిన చెల్లూరు లక్ష్మి జయరావు వాలీబాల్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు రావాలని,ఈ క్రీడల వల్ల మంచి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.అదే గ్రామానికి 85,000/-రూపాయలతో వేచించి గ్రామ రోడ్డును గుంతలు కూడా పూడ్చమని ఆయన తెలిపారు. గ్రామానికి ఏ సేవ చెయ్యడానికి అయిన ముందు ఉంటాను అని తెలిపారు. ఆయనకు యువకులు,గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

మహానాడు ఏర్పాట్లను పరిశీలించిన హోంమంత్రి

(నక్కపల్లి, ప్రభాతవార్త): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. మే 27, 28 తేదీల్లో హైబ్రిడ్ విధానంలో జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమానికి సంబంధించి కళ్యాణ మండపాలు, సభా ప్రాంగణాలు, ఏర్పాట్లను ఆమె ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ మేరకు హోం మంత్రి అనిత పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో మహానాడు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించిన మంత్రి అనిత, క్లస్టర్ స్థాయిలో జరగనున్న మహానాడును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇదే సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎస్.రాయవరం మండలం పెదగుమ్ములూరులో రుద్ర లక్ష్మి, సాయి శంకర్ కుటుంబాలను స్వయంగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించి చెక్కులను అందజేశారు.

నక్కపల్లిలో మహానాడు పోస్టర్ ఆవిష్కరణ.!

నక్కపల్లిలోని మంత్రి నివాసం వద్ద మహానాడు పోస్టర్‌ను హోం మంత్రి అనిత ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, "టీడీపీ కుటుంబ సభ్యులు జరుపుకునే అతిపెద్ద పండుగ మహానాడు" అని పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా పార్టీ ఆన్‌లైన్‌లో మహానాడు నిర్వహించిందని గుర్తుచేసిన ఆమె, ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు పొదుపు చర్యల్లో భాగంగా ఈసారి కూడా హైబ్రిడ్ విధానాన్ని అవలంబిస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 1,840 క్లస్టర్లలో మహానాడు...

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తమ కాన్వాయ్‌లలో 50 శాతం వాహనాలను తగ్గించారని, అదే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఖర్చు తగ్గింపునకు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి అనిత వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,840 క్లస్టర్లలో మహానాడు నిర్వహిస్తున్నామని, పాయకరావుపేట నియోజకవర్గంలో 10 ప్రాంతాల్లో మహానాడు జరగనుందని తెలిపారు. మే 27, 28 తేదీల్లో రోజుకు ఆరు గంటల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ కోసం పనిచేయడం పూర్వజన్మ సుకృతం.!

నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీలో పనిచేయడం తన పూర్వజన్మ సుకృతమని మంత్రి అనిత పేర్కొన్నారు. రెండోసారి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా ఎంపిక కావడం తన అదృష్టమని చెప్పారు.పాయకరావుపేట నియోజకవర్గానికి స్టీల్ ప్లాంట్ రాక గర్వకారణమని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేస్తున్నామని తెలిపారు.

వైసీపీ నాయకులు రాజకీయాలు చేస్తున్నారు హోం మంత్రి "అనిత"

పాయకరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి అనిత పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్, కోర్టు మంజూరు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇటీవల జరిగిన ఘటనలపై స్పందిస్తూ, "రెండు రోజులుగా వైసీపీ నాయకులు నన్ను బద్నాం చేయాలని ప్రయత్నిస్తున్నారు. 11 ఏళ్ల దళిత బాలిక ఘటనపై రాజకీయాలు చేస్తున్నారన్నారు. పాయకరావుపేట సీఐ నుంచి సమాచారం అందిన వెంటనే విచారణకు ఆదేశించామని, ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. "అత్యాచారం జరిగిందని పోలీసులు నిర్ధారించారా? వైద్యులు నిర్ధారించారా?" అంటూ ప్రశ్నించిన మంత్రి, "మీ ఇళ్లల్లో కూడా ఆడపిల్లలు ఉన్నారు... ఆలోచనలు మారాలి" అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు అమలుకంటి అబద్ధం, గింజల లక్ష్మణరావు, చించెలుపు పద్దు ,పార్టీ నాయకులు కురందాసు నూకరాజు, వినోద్ రాజు, వెంకటరాజు, శ్రీకాంత్, గుర్రం రామకృష్ణ, పెద్దిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ దేవర సత్యనారాయణ, అయినంపూడి అప్పలరాజు, వైబోయిన వెంకటరమణ, పొడగట్ల వెంకటరమణ, గింజల శ్రీనివాసరావు ,తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఘాతానికి గురై రైతు మృతి

కసింకోట, మే 24, ప్రభాతవార్త; మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సుంకర నూకరాజు (47) విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందినట్లు కసంకోట ఎస్సై కే. లక్ష్మణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం సుంకర నూకరాజు ఆదివారం ఉదయం కొత్తపల్లిలో పొలం పనుల నిమిత్తం వెళ్లి పంట కాలువ గట్టుపై గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ సంఘటన స్థలంలోనే పడిపోయినట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు నూకరాజు భార్య తన భర్త కనిపించలేదంటూ చుట్టుపక్కల వెతకగా పంట పొలాల గట్టుపై ఉండడాన్ని గమనించి గ్రామస్థులకు, స్థానిక లైన్ మేలుకు సమాచారం అందించింది అని తెలిపారు. సమాచారం అందుకున్న లైన్మెన్ విద్యుత్తు సరఫరాను నిలిపి వేసి పరిశీలించగా అప్పటికే నూకరాజు మృతి చెందినట్లు నిర్ధరించారన్నారు. ఈ ఘటనపై మృతులు భార్య సుంకర లక్ష్మి కసింకోట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కసింకోట ఎస్సై కే లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో కొనసాగుతున్న డ్రంకన్ డ్రైవ్ దాడులు.. 438 మంది మందు బాబుల పట్టివేత

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త: జంట నగరాలలో మందు బాబుల భరతం పట్టేందుకు డ్రంకన్ డ్రైవ్ దాడులు కొనసాగుతూనే వున్నాయి. శుక్రవారం, శనివారం రాత్రుల్లో ట్రాఫిక్ పోలీసులు పలు చోట్ల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ దాడుల్లో మొత్తం 438 మంది మందు బాబులు ప ట్టుబడ్డారు. వీరిలో 365 మంది ద్విచక్ర వాహనదారులు, 25 మంది ఆటో డ్రైవర్లు, 47 మంది కార్లతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు వున్నా రు. పట్టుబడ్డ వారిలో 98 మంది 30 నుంచి 50 పాయింట్ల వరకు వుండగా 191 మంది 51 నుంచి 100 పాయింట్ల వరకు, 83 మంది 101 నుంచి 150 పాయింట్ల వరకు, 42 మంది 151 నుంచి 200 పాయింట్ల వరకు, 13 మంది 201 నుంచి 250 పాయింట్ల వరకు, ఆరుగు రు 251 నుంచి 300 పాయింట్ల వరకు, ఐదుగురు 300 పాయింట్లకు మించి విపరీతంగా మద్యం సేవించినట్లు తేలింది. వీరిని అరెస్టు చేసిన తరువాత వారి వా హనాలు జప్తు చేసి, కేసులు నమోదు చేశాక సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించిన తరువా త కోర్టుల్లో హాజరు పరుస్తారు. కోర్టులు వీరికి శిక్షలు విధిస్తాయని నగర జాయింట్ ట్రాఫిక్ పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్ మీడియాకు తెలి పారు. జంట నగరాలలో డ్రంకన్ డ్రైవ్ దాడులు నిరంతరం కొనసాగుతాయని, వీటిని పూర్తిస్థాయిలో అరికడతామని ఆయన వెల్లడించారు. మల్కాజిగిరి పరిధిలో 227 మంది, సైబరాబాద్‌లో 294 మంది మందు బాబుల పట్టివేత ఇదిలావుండగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో 227 మంది మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 185 మంది ద్విచక్ర వాహనదారులు, 12 మంది ఆటో డ్రైవర్లు, 29 మంది కార్ల డ్రైవర్లు, ఒకరు హెవీ వాహన డ్రైవర్ వున్నారు. కాగా సైబరాబాద్ పరిధిలో 294 మందు బాబులు పట్టుబడ్డారు. వీరిలో 255 మంది ద్విచక్ర వాహనదారులు. ఐదుగురు ఆటో డ్రైవర్లు, 34 మంది కార్ల డ్రైవర్లు వున్నారు.

ముఠా కార్మికుని మృతికి సిపిఎం బాబు రావు సంతాపం

విజయవాడ మే24 ప్రభాతవార్త ప్రతినిధి: భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు డిమాండ్ చేశారు. నిర్మాణరంగంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తూ చనిపోయిన కార్మికులు కుటుంబాలకు తక్షణమే 10 లక్షల నష్టపరిహారం రాష్ట్ర ప్రభుత్వం అందించాలన్నరు. లిఫ్ట్ ముఠా పని చేస్తూ ప్రమాదవశాత్తూ మృతిచెందిన బాను నగర్‌కు చెందిన పంచాడ కన్నయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిపించేందుకు ఆందోళన చేపట్టారు. భవన యజమాని 7 లక్షల ఆర్థిక సహాయం, మట్టి ఖర్చులు ఇచ్చేలా అంగీకారం కుదిర్చిన మేరకు చెక్‌ను అందజేస్తారు. ఈ మేరకు చెక్‌ను బాధిత కుటుంబ సభ్యులకు బాబూరావు అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని కాలరాస్తుందని విమర్శించారు. కార్మిక సంక్షేమ నిధిను దారిమళ్లించారని ధ్వజమెత్తారు.

ప్రస్థాన సాధనలతో సంపూర్ణ ఆరోగ్యం

విజయవాడ 24 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రస్థాన సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్ఫూర్తి కుటుంబం యోగ ఇన్‌స్ట్రక్టర్ ప్రభాకర్ తెలిపారు. స్ఫూర్తి కుటుంబం ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మి విశ్వగురువు, సైంటిఫిక్ సెయింట్, పూర్ణ గురువులు గురు విశ్వస్ఫూర్తి గురుదేవులు అనుగ్రహించిన ఆసన ప్రాణామాయ యోగ ప్రక్రియ లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. నిరంతరం యోగ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంత లభిస్తుందని గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి తెలిపారు. స్ఫూర్తి కోటుంబ జోనల్ ఇన్‌చార్జ్ కె. మాధవ్ ధ్యాన మనో ప్రస్థానం గురించి వివరంగా తెలియజేశారు. ధ్యాన మనో ప్రస్థానం ద్వారా మనస్సులో మంచి మారుపలు తెచ్చుకొని, దానిని మన ఆధీనంలో ఉంచుకోవచ్చని చెప్పారు. ఈ శిక్షన కార్యక్రమంలో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మల్లెల వరలక్ష్మి, వి.దుర్గా భవాని, స్ఫూర్తి కుటుంబ వాలంటీర్లు చొప్పరపు బాల వెంకట పవన్ సాయిందాం, ఆదిత్య స్ఫూర్తి పాల్గొన్నారు.

ఏ సినిమాకైనా పర్సంటేజ్ ఇవ్వాల్సిందే

తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త రాష్ట్రంలో ఏ సినిమా విడుదల చేయాలన్నా పర్సంటేజ్ ఇవ్వాల్సిందేనని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ది సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో ఈ మూవీని థియేటర్లలో రిలీజ్ చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తుది నిర్ణయాన్ని ప్రకటించింది. తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు, ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. రాష్ట్రంలోని 120 మంది థియేటర్స్ ఓనర్లు దీన స్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది. పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటాం అని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం.

బంకీపూర్‌నుంచే ప్రశాంత్‌కిశోర్ పోటీ

పాట్నా, మే 24: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఖాళీ చేసిన బంకీపూర్ నియోజకవర్గం ఉప ఎన్నికలో జన్ సురాజ్ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. బంకీపూర్‌లో బీజేపీని ఓడిచే సామర్థం జన్‌సురాజ్‌కే ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జన్ సురాజ్ పార్టీ 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి 238 సీట్లలో పోటీ చేసి ఒక్క సీటు కూడా సాధించలేకపోయింది. అధికార ఎన్డీయే ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ఎన్నికలకు ముందు పథకాల పేరుతో ఒక్కో మహిళకు రూ.10 వేలు చొప్పున ఇవ్వడం ఎన్నికల ఫలితాలను దెబ్బతీసిందని ఎన్నికల ఫలితాల అనంతరం ప్రశాంత్ కిషోర్ విశ్లేషించారు. బీజేపీకి దశాబ్దాలుగా కంచుకోటగా ఉన్న బంకీపూర్ నియోజకర్గం నుంచి గతం అసెంబ్లీ ఎన్నికల్లో నితిన్ నబిన్ పోటీ చేసి వరుసగా ఐదోసారి విజయం సాధించారు. ఆర్జేడీపై 50వేల ఓట్ల ఆధిక్యంలో ఆయన గెలుపొందగా, జన్ సురాజ్ పార్టీ మూడో స్థానంలో నిలించింది. గత జనవరిలో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబిన్ ఎన్నికయ్యారు. అనంతరం రాజ్యసభకు ఎన్నిక కావడంతో గత నెలలో బంకీపూర్ నియోజకవర్గానికి ఆయన రాజీనామా చేశారు. బంకీపూర్‌లో ఆరు నెలల్లోపు ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. బంకీపూర్ నియోజకవర్గం నుంచి జన్ సురాజ్ పోటీ చేస్తుందని ప్రకటించిన ప్రశాంత్ కిషోర్ ఆ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాలపై నేరుగా సమాధానం ఇవ్వలేదు. దీనిపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పార్టీ సంస్థాగత పనులపై దృష్టి సారించేందుకే తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదని, పార్టీ సమష్టి నిర్ణయానికే తాను కట్టుబడి ఉంటానని చెప్పారు. కాగా, జన్ సురాజ్ బిహార్ అధ్యక్షుడు మనోజ్ భారతి మాట్లాడుతూ, నితిన్ నబిన్ జాతీయ అధ్యక్షుడు కావడంతో బంకీపూర్ నియోజకవర్గం ఇప్పుడు వీవీఐపీ సీటుగా మారిందన్నారు. దీంతో బీజేపీ కూడా శక్తివంచన లేకుండా గెలిచేందుకు ప్రయత్నిస్తుందని, జన్ సురాజ్ నుంచి గట్టి నేతను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గత 20 రోజులుగా నియోజకవర్గం ప్రజలతో మాట్లాడుతున్నామని, ప్రశాంత్ కిషోర్‌ను తమ అభ్యర్థిగా చూడాలని బంకీపూర్ కోరుకుంటున్నట్టు తమ పరిశీలనలో తేలిందని అన్నారు. పార్టీ కార్యనిర్వాహకవర్గం, ప్రశాంత్ కిషోర్ అంగీకరిస్తే ఈసారి పోటీ రసవత్తరంగా ఉంటుందని చెప్పారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగింది: వైసిపి నేత అంబటి రాంబాబు

విజయవాడ,మే 24,ప్రభాతవార్తప్రతినిధి: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగిందని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారుచంద్రబాబు వచ్చే ఎన్నికల్లో గెలవడన్నారు.ప్రజల్లో అశాంతి దాని నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారనిమండిపడ్డారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, అందుకే నిరంతరం వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజ మెత్తారు. వైఎస్ కుటుంబానికి పులివెందులలో ఎన్నడూ ఓడిపోయిన చరిత్ర లేదని ఆయన గుర్తుచేశారు.చంద్రబాబు నియంతలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, అధికారంలోకి వచ్చాక రూ.3.5 లక్షల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులతో రాష్ట్రానికి ఏం చేసిందని అంబటి ప్రశ్నించారు. వైసీపీని తిట్టడం తప్ప వీరికి పాలన చేతకావడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధర లేదని... మొక్కజొన్న ధరలపై ప్రశ్నిస్తే గోడౌన్లపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ యుద్ధాల నెపంతో పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూసే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయడం లేదని, చంద్రబాబు, లోకేష్ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు.

విదేశాల్లో ఉద్యోగం పేరుతో మోసం

జూబ్లీహిల్స్, మే 24, ప్రభాతవార్త: విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఘటనపై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. మలేషియాలో ఉద్యోగం పేరుతో రూ.2.50 లక్షలు వసూలు చేసి, చివరకు టూరిస్ట్ వీసాపై పంపి మోసం చేసినట్లు బాధితుడు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.పంజాగుట్ట తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూలు జిల్లా వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన గొల్ల సాయి రాహుల్(24) సోమాజిగూడలోని ఏఈ స్క్వేర్ ఐఎం మైగ్రేషన్ ఓపీసీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఆశ్రయించాడు. మలేషియాలో ఉద్యోగం కల్పిస్తామని, వర్క్ వీసా ఏర్పాటు చేస్తామని కన్సల్టెన్సీ ప్రతినిధులు హామీ ఇచ్చారు. మొత్తం రూ.3.50 లక్షలు అవుతందని, ముందుగా రూ.35 వేలును చెల్లించాలని కోరడంతో ఆన్‌లైన్ ద్వారా ఆ మొత్తాన్ని చెల్లించాడు. తరువాత లోన్ వెంటనే రాదని, ముందుగా డబ్బులు చెల్లిస్తే మలేషియాకు వెళ్లిన 10 రోజుల్లో ఉద్యోగం వస్తుందని సేల్స్ మేనేజర్ శ్యామ్‌బాబు నమ్మించాడు. దీంతో మరో రూ.95 వేలును చెల్లించాడు. అనంతరం ప్రయాణ ఏర్పాట్ల కోసం మరో రూ.1.20 లక్షలు. ఏప్రిల్ 22న మలేషియాకు బయలుదేరే సమయంలో రూ.50 వేలు, మరోసారి రూ.70 వేలు చెల్లించాడు. మలేషియాలోని కౌలాలంపూర్ ఎయిర్ పోర్ట్‌కు వెళ్లాడు. అక్కడ నాలుగు గంటల పాటు వేచి ఉన్న తరువాత ఒక వ్యక్తి వచ్చి పాస్‌పోర్ట్ ఇవ్వాలని కోరడంతో అనుమానం వచ్చి రాహుల్ అతనికి పాస్‌పోర్ట్ ఇవ్వలేదు. అప్పటికే మోస పోయినట్లు గ్రహించిన రాహుల్ హైదరాబాద్‌కు తిరిగి టికెట్ బుక్ చేసుకుని ఏప్రిల్ 24న తిరిగి వచ్చాడు. కన్సల్టెన్సీ ప్రతినిధులను తన డబ్బులు తనకు చెల్లించాలని కోరగా 45 రోజులు అక్కడ ఉండకపోవడంతో ప్రాసెస్ ఫెయిల్ అయ్యిందంటూ మరో రూ. లక్ష డిమాండ్ చేశారు. సేల్స్ మేనేజర్ శ్యామ్‌బాబు, ప్రాసెసింగ్ మేనేజర్ అష్వాక్, యజమాని అంకిత అతన్ని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మలేషియాలో ఉద్యోగం, వర్క్ వీసా పేరుతో టూరిస్ట్ వీసాపై పంపించి రూ.2.50 లక్షలు మోసం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరి జలాల వినియోగంలో నిర్లక్ష్యం వీడండి

న- 968 టిఎంసిలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోండి

- కాళేశ్వరం మరమ్మతులపై నిర్లక్ష్యం తగదు

సిఎం రేవంత్ రెడ్డికి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఘాటు లేఖ

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:తెలంగాణకు కేటాయించిన గోదావరి జలాల వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరిస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై సిఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆయన ఘాటుగా లేఖ రాశారు. తెలంగాణకు ట్రిబ్యునల్ కేటాయించిన సుమారు 968 టిఎంసిల గోదావరి జలాల వినియోగం ఇప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువ కాలం కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రాంతంలో గోదావరి జలాల వినియోగం కేవలం 400 టిఎంసిలకే పరిమితమైందని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత కేంద్రంలోని మోది ప్రభుత్వం తెలంగాణకు గోదావరి నదిపై 360 టీఎంసీల వినియోగానికి సంబంధించిన పలు ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇందులో కాళేశ్వరం - 237 టీఎంసీలు, సీతారామసాగర్ - 67 టీఎంసీలు, సమ్మక్కసాగర్ - 47 టిఎంసిలు సహా పలు ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల రూపకల్పన, నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిరక్ష ్యం ప్రదర్శించడంతో బ్యారేజీలు దెబ్బతిన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెండున్నరేళ్లలో జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డిఎస్ఎ) కాళేశ్వరం బ్యారేజిల పునరుద్ధరణపై పలుమార్లు నివేదికలు ఇచ్చినా అమలు చేయడంలో చొరవ తీసుకోలేదని విమర్శించారు. దీంతో రాష్ట్ర ప్రజలు సుమారు 200 టిఎంసిల గోదావరి జలాలను వినియోగించుకోలేకపోతున్నారని ఆరోపించారు. ఇక సీతారామ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం హైడ్రాలజీ సహా అన్ని అనుమతులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయలేదని సిఎంకు రాసిన లేఖలో రాంచందర్‌రావు విమర్శించారు. దీంతో 67 టిఎంసిల గోదావరి జలాల వినియోగం ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. అలాగే సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు 47 టీఎంసీల హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చినప్పటికీ, కమాండ్ ఏరియా గుర్తింపులో ప్రభుత్వం నిరక్ష ్యం చూపుతోందని ఆరోపించారు. అదేవిధంగా.. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-కావేరి నదుల అనుసంధానం.

ఉచిత డిస్కమ్‌కు అనుమతి వద్దు!

కొత్త పంపిణీ సంస్థ ఏర్పాటు వెనుక కుట్ర

అన్నదాతల పేరిట మరణ శాసనం

అప్పులు పెంచడమే తప్ప ప్రయోజనం లేదు

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త కొత్తగా ఏర్పాటు చేస్తున్న మూడో ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు అనుమతి ఇవ్వ వద్దని తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్సీ)కి పలువురు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో "మూడో ఉచిత డిస్కమ్, ప్రకటిత లక్ష్యాలు, ఆచరణ సవాళ్లు" అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు.. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని దుస్సాహసాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేస్తూ మూడో ఉచిత డిస్కమ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి రైతులను కష్టాల్లోకి నెట్టుతుందని, థర్డ్ డిస్కమ్ రైతుల పాలిట మరణశాసనం అని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తంచేశారు. అప్పులతో పుట్టిన డిస్కమ్ సేవలు ఏలా సాధ్యం అని వారు ప్రశ్నించారు. ఇందులో పాల్గొన్న మాజీ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతు కొత్తగా ఏర్పాటు చేస్తున్న రైతు డిస్కమ్ భవిష్యత్‌లో రైతుల పాలిట మరణశాసనంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త డిస్కమ్ ఏర్పాటుకు ఈఆర్సీ నుంచి అనుమతులు లేక ముందే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడం శోచనీయమన్నారు. ఎవరి అభిప్రాయం లేకుండానే ఏక పక్షంగా మూడవ డిస్కమ్ ఏర్పాటు చేసి రైతులను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం ఉద్యోగుల విభజన తీరు గమనిస్తే సుమారుగా 600 డీటీఆర్‌లను ఒకరు చూడాలంటే సాధ్యమా అని ప్రశ్నించారు. అప్పుల డిస్కమ్ ఏలా నిర్వహిస్తారని ఇంజనీర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. మూడవ డిస్కమ్ ఏర్పాటు అవసరం లేదని, రెండు డిస్కమ్‌లతో గత పన్నెండు సంవత్సరాలుగా వినియోగదారులకు మంచి సేవలు అందుతున్నాయని అన్నారు. 3వ డిస్కమ్‌తో అప్పులు పెంచడమే తప్ప ఏలాంటి ప్రయోజనం లేదన్నారు. టీఈఈఏ మాజీ ప్రధాన కార్యదర్శి రామేశ్వరయ్య శెట్టి మాట్లాడుతు మూడవ డిస్కమ్‌తో ప్రభుత్వంతో పాటు ఏ వర్గానికి ఉపయోగం లేదన్నారు. రైతుసంఘం నాయకుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతు రైతు డిస్కమ్ అంటే వ్యాపారమన్నారు. ఈ డిస్కమ్‌తో రైతులకు సేవలు అందుతాయనేది భ్రమ అన్నారు. సీపీఐ(ఎం) సహకార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతు కొత్త డిస్కమ్ ఏర్పాటు వెనుక కుట్ర దాగి ఉందన్నారు. ప్రభుత్వానికి రైతులపై నిజమైన ప్రేమ ఉంటే తక్కువ ఖర్చుతో వచ్చే విద్యుత్ కేటాయించేదన్నారు. కానీ అధిక ధరతో వచ్చే థర్మల్ విద్యుత్‌ను కేటాయించడం వెనుక సంస్థను నిర్వీర్యం చేసే కుట్ర దాగి ఉందన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు కోటేశ్వర్‌రావు మాట్లాడుతు ఇది రైతు డిస్కమ్ కాదని, డబ్బులు లేని డిస్కమన్నారు. ఇది రూ. 35 వేల కోట్ల అప్పుతో పుడుతుందన్నారు. ఆదాయం లేని డిస్కమ్‌కు స్మార్ట్ మీటర్లు ఎందుకన్నారు. ప్రభుత్వం రైతు డిస్కమ్ ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 1104 ట్రేడ్ యూనియన్ మాజీ కార్యదర్శి జనార్థన్‌రెడ్డి మాట్లాడుతు రైతు డిస్కమ్ ఏర్పాటు ఏక పక్ష నిర్ణయమని, 30 శాతం స్టేక్ హోల్డర్స్ అయిన ఉద్యోగులతో కూడా చర్చించకుండానే డిస్కమ్ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. ఒక కొత్త డిస్కమ్ ఏర్పాటు చేయాలంటే ప్రజలతో పాటు ఉద్యోగులు, విద్యుత్ నిపుణులు, రైతు సంఘ నాయకులతో చర్చించాల్సిన అవసరం ఉందని టీఈఈఏ అధ్యక్షులు శివాజీ అన్నారు. కానీ ఇక్కడ ఎవరితో చర్చించకుండానే తాము చేయదలుచుకుంది చేసుకుంటున్నామనే దోరణితో వెళ్లడం బాధకరమన్నారు. రైతు డిస్కమ్ వాటా 42 శాతం ప్రకారం ప్రతి ఏటా రూ. 32 వేల కోట్ల విద్యుత్ కావాలని, ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న క్రాస్ సబ్సిడి కేవలం రూ. 16 వేల కోట్లు అన్నారు. మరి ఇంకా 16 వేల కోట్లు ఏలా సర్దుబాటు చేస్తారని ప్రశ్నించారు. రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తుల్జారాంసింగ్ మాట్లాడుతు కొత్త డిస్కమ్ ఏర్పాటుతో మళ్లి తెలంగాణ లో పాత రోజులు రాబోతున్నాయన్నారు. ప్రభుత్వం ప్రజల, వినియోగదారుల శ్రేయస్సు కోరి థర్డ్ డిస్కమ్ ప్రతిపాదన వి రమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు డిస్కమ్‌కు లైసెన్స్ ఇవ్వకూడదంటూ నాలుగు తీర్మానాలు సమావేశం ఏకగ్రీవంగా చేసింది.

తెలంగాణ థర్మల్ యూనిట్లలో స్థిరంగా బొగ్గు నిల్వలు అధిక లోడ్‌తో విద్యుత్ ఉత్పత్తి

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవు తుండటంతో గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయి. ఇందుకు గాను భారీగా బొగ్గును వినియోగి స్తున్నప్పటికీ, రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలు సంతృప్తికరమైన బొగ్గు నిల్వలను నిర్వహిస్తున్నాయని బొగ్గు మంత్రిత్వ శాఖ డేటా వెల్లడించింది. రాష్ట్రంలో విద్యుత్‌కు రికార్డు స్థాయిలో డిమాండ్ చోటు చేసుకోవడంతో విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు అధిక లోడ్ స్థాయిలలో పనిచేస్తున్నాయి. సింగరేణి 77, భద్రాద్రి 83, కాకతీయ 71, కొత్తగూడెం (కొత్త) 62, కొత్తగూడెం స్టేజ్7 థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) 80 శాతంగా ఉండగా, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఇది 21 శాతంగా ఉంది. మొత్తం మీద చూస్తే, అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం సింగరేణి కాలరీస్ థర్మల్ ప్లాంట్లు ప్రామాణిక స్థాయిలలో 19 శాతం బొగ్గు నిల్వలను కలిగి ఉండగా, తెలంగాణ విద్యుత్ 26 శాతం నిల్వలను కొనసాగిస్తోంది, ఈ రెండూ 621.7 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో, అధిక వేడి కారణంగా విద్యుత్ వినియోగం పెరగడంతో, విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో 4,766 మెగావాట్లకు చేరగా, వినియోగం 100.83 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. బొగ్గు నిల్వలు, సరఫరా ప్రణాళికల ద్వారా వ్యవస్థకు తగినంత మద్దతు ఉందని విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు తెలిపారు.

జాతీయంగా, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నివేదికల ప్రకారం, గరిష్ట డిమాండ్ ఉన్నప్పటికీ, భారతదేశంలోని థర్మల్ ప్లాంట్లు ఈ నెల ప్రారంభంలో 53.702 మిలియన్ టన్నుల బొగ్గును నిల్వ ఉంచుకున్నాయి. మార్చి 22 నాటి ఈ నిల్వలు 58.2 మిలియన్ టన్నులుగా ఉన్నాయి, ఇది గణనీయమైన నిల్వలను సూచిస్తోంది. సుమారు మూడు వారాల విద్యుత్ ఉత్పత్తికి మద్దతు ఇవ్వడానికి నిల్వలు సరిపోయాయి,

ఈ ధోరణిలో తెలంగాణలోని థర్మల్ కేంద్రాలు కూడా బొగ్గు నిల్వల పట్ల అప్రమత్తంగా ఉన్నాయి.

నేటి నుండి రోహిణి కార్తె

వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతులు

వేసవి దుక్కులు, పచ్చిరొట్ట సాగు పనులు ముమ్మరం

హైదరాబాద్, మే 24, ప్రభాతవార్త:ఈ ఏడాది వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. రోహిణి కార్తె సోమవారం నుండి మొదలుకానుండడంతో వ్యవసాయ పనులు జోరందుకోనున్నాయి. ఈ సారి రుతుపవన వర్షాలు సకాలంలో కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది. మరోవైపు ఎత్తిపోతల పథకాల జలాలతో చెరువుల్లో నీళ్లు ఉండడం, భూగర్భజలాలు పెరగడంతో ఇబ్బందులు ఉండవని రైతులు భావిస్తున్నారు. రోహిణి కార్తె ప్రవేశించడంతో ఓ పక్కన యాసంగి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుంటూనే వానాకాలం వ్యవసాయానికి కావాల్సిన విత్తనాలు, ఎరువులను రైతులు సిద్ధం చేసుకుంటున్నారు. అదే సమయంలో రోహిణికార్తెలో కురిసే వర్షాలకు వేసవి దుక్కులు దున్నుకునేందుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. రోహిణికార్తెలో (సోమవారం నుండి) వానాకాలం వరి నారు పోసేందుకు పెద్ద సంఖ్యలో అన్నదాతలు సిద్ధమయ్యారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వరి నారు మడులను సిద్ధం చేశారు. అయితే వానాకాలం సాగు ఊపందుకోనున్న రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టడానికి పల్లెల్లో దళారులు ప్రయత్నాలు మొదలుపెట్టడంతో విత్తనాల కొనుగోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నకిలీ గుర్తింపు తదితర అంశాలపై టాస్క్‌ఫోర్స్, పోలీసు బృందాలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. రోహిణిలో కురిసే వర్షాలకు అన్నదాతలు ప్రధానంగా జీలుగ, పెసర, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట పంటలను సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు.. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. ప్రస్తుతం అకాల వర్షాలతో వాతావరణం చల్లబడినట్లు కనిపించినా వేడి, ఉక్కపోతతో ప్రజలుసతమతమవుతున్నారు. వాస్తవానికి రోహిణి కార్తెతో వేసవి కాలం పూర్తయిపోతుంది. ఆ తర్వాత వర్షాకాలం ప్రారంభమవుతుంది. ఈ సమయంలో వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులు ఏరువాకను ప్రారంభిస్తారు. తమ పంట పొలాల్లో పనులను ముమ్మరం చేస్తారు. అయితే రోహిణీ కార్తె వచ్చిందంటే సంప్రదాయ బద్ధంగా రైతులు చేసే సంబరాలు కనుమరుగవుతున్నాయి. ఒకప్పుడు రోహిణీ కార్తెకు వాతావరణమంతా చల్లబడి మబ్బులు కమ్ముకునేవని, రోహిణీకార్తె ప్రవేశాన్ని పెద్ద పండుగలా రైతులు జరుపుకునేవారు. కాగా.. ఈ ఏడాది మే 25వ తేదీన సోమవారం రోజున రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. ఇదే నక్షత్రంలో జూన్ 8వ తేదీ వరకు ఉంటాడు. ఈ పక్షం రోజుల పాట ఎండలు విపరీతంగా మండిపోతాయి. వేసవి కాలంలో నాలుగు నెలలుగా వచ్చే వేడి గాలులు ఒక ఎత్తు అయితే కేవలం రోహిణి కార్తె సమయంలో మాత్రం నేరుగా రోళ్లు పగిలేంత ఎండలు పెరిగిపోతాయి. జూన్ 8న రోహిణె కార్తె ముగిసి మృగశిర కార్తె ప్రవేశించనుంది. మృగశిరకార్తెలో తొలకరి వర్షాలు రైతులను పలకరించనున్నాయి.

బడిబాటతో ప్రభుత్వ బడుల్లో పెరగని విద్యార్థుల సంఖ్య!

ప్రైవేటులో చేర్పించడానికే మొగ్గు చూపిస్తున్న తల్లిదండ్రులు

హైదరాబాద్, ప్రభాతవార్త, మే 24: రాష్ట్రంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రతి ఏడాది నిర్వహిస్తారు. బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థులను చేరమని ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ కోరుతారు. 5 సంవత్సరాలు నిండిన ప్రతి పిల్లవాన్ని ప్రభుత్వ స్కూల్‌లో చేరేలా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. దాంతోపాటు బడిఈడు పిల్లలు బడిబయట ఉంటే వారిని ప్రభుత్వ స్కూల్స్‌లో చేర్పించడం బడిబాట కార్యక్రమం నిర్వహిస్తారు. చాలా కాలం నుంచి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వం అనుకున్నంత ప్రయోజనం జరగడం లేదని ప్రభుత్వ పెద్దలతోపాటు విద్యార్థి సంఘాలు విమర్శిస్తున్నాయి. ప్రతి ఏడాది బడిబాటను జూన్ 1 నుంచి నిర్వహించే వారు. కానీ ఈ ఏడాది ఇప్పటికే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నారు. 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా బడిబాట కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఈ ఏడాది బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొనడం లేదు. సగానికిపైగా ఉపాధ్యాయులు సెన్సస్ పనుల్లో ఉండగా.. మిగిలిన వారు మాత్రమే బడిబాట కార్యక్రమంలో పాల్గొంటున్నారు. బడిబాటలో ఉపాధ్యాయులు గ్రామాల్లోని 5 సంవత్సరాల పిల్లలున్న ఇళ్లకు వెళ్లి వారి పిల్లలను ప్రభుత్వ స్కూల్‌కి పంపించమని కోరుతున్నారు. ఈ సమయంలో తల్లిదండ్రులు అడిగే ప్రశ్నలకు చాలా వాటికి ఉపాధ్యాయుల దగ్గర సమాధానం ఉండటం లేదు. స్కూల్స్‌లో కనీస సౌకర్యాలు ఉన్నాయా, పంతులు రెగ్యులర్‌గా బడికి వస్తారా? పిల్లలపై శ్రద్ధ పెడతారా? వంటి ప్రశ్నలకు ఉపాధ్యాయుల దగ్గర సమాధానాలు లేని పరిస్థితి. అయినప్పటికీ ఉపాధ్యాయులు వారిని ఒప్పించి వారి పిల్లలను ప్రభుత్వ బడికి రప్పించేలా ప్రయత్నం చేసినప్పటికీ కొద్ది రోజుల తరువాత వారు ప్రైవేటు బడికి వెళుతున్న సందర్భాలే ఉంటున్నాయి. బడిబాటలో బడిబయట ఉన్న పిల్లల తల్లితండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడతారు వారి పిల్లలను గవర్నమెంట్ స్కూల్‌కి పంపించమని కోరుతారు. ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని చెబుతారు. బడిబాటలో బడిబయట ఉన్న పిల్లలే ఎక్కువగా ప్రభుత్వ బడులకు వస్తున్నట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుతనతవ పాఠశాలల్లో 1740 స్కూల్స్‌లో ప్రీప్రైమరీ తరగతులు కొనసాగుతున్నాయి. వాటిల్లో గత ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో 6431 మంది చేరగా.. 2025-26 విద్యా సంవత్సరంలో అదికాస్త

vsp12:vsp12.qxd 24-05-2026 22:36 Page 1

పలువురును పరామర్శించిన "వీసం"

(నక్కపల్లి రూరల్ /అడ్డురోడ్డు ,ప్రభాతవార్త) : మండలంలోని ముకుందరాజుపేట గ్రామానికి చెందిన దార్ల నాగరాజు, వియ్యపు గోవిందు ఆరోగ్యం బాగా లేని విషయం తెలుసుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆదివారం పరామర్శించారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, మాజీ సర్పంచ్ వియ్యపు శ్రీను, గొడిచర్ల పిఏసిఎస్ అధ్యక్షులు దార్ల కృష్ణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఈదురు గాలులకు పాడైన పంటలను పరిశీలించిన వైకాపా రాష్ట్ర నేత" వీసం"

(అడ్డురోడ్డు, ప్రభాతవార్త) : నక్కపల్లి మండలంలోని శనివారం ఈ వీచిన ఈదురు గాలులకు నష్టపోయిన పంటలను రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా రేబాక, రమణయ్యపేట, ముకుంద రాజుపేట, చీడిక, చీడిక కోత్తురు, జి. జగన్నాధపురం, దొంకాడ ,గుల్లిపాడు, చిన దొడ్డి గల్లు తోపాటు అన్ని గ్రామాలలో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు వర్షం వలన రైతులు పూర్తిగా నష్టపోయారని ఇది చాలా బాధాకరమని ప్రభుత్వం ఆదుకునేందుకు తక్షణమే కృషి చేయాలని పరిశీలించిన అనంతరం డిమాండ్ చేశారు. అరటి, మామిడి, కొబ్బరి, జీడీ మామిడి, బొప్పాయి, కూరగాయలు తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఈ గాలులకు అరట్లకోట, చిన రామభద్రపురం గ్రాములలో చెట్లు కూలి మగ్గురు రైతులు మృతి చెందడం బాధాకరమని తక్షణమే ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయనతోపాటు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు ఉన్నారు.

ఈదురు గాలులకు దెబ్బతిన్న ప్రాంతాల్లో మండల స్థాయి అధికారుల బృందం

(నక్కపల్లి, ప్రభాతవార్త): మండలంలోని శనివారం సాయంత్రం ఎన్నడూ ఊహించని విధంగా హఠాత్తుగా వీచిన ఈదురు గాలులకు దెబ్బతిన్న పంట లను నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను అంధకారంలో ఉన్న మెరక ప్రాంతపు గ్రామాలను ఇన్చార్జి ఎంపీడీవో దెందుకూరు సీతారామరాజు ,తాసిల్దార్ చిన్ని కృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో జ్యోతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణ, పలువురు గ్రామ కార్యదర్శులు మండల స్థాయి అధికారులతో కలసి పర్యటించారు. మంచినీటి సమస్య రాకుండా గ్రామాల్లో జనరేటర్ సహాయంతో మంచినీటిని ట్యాంకులకు పంపించే ఏర్పాట్లు చేయడంతో పాటు పలు సహాయక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. అక్కడున్న గ్రామస్తులతో మాట్లాడడంతో పాటు దెబ్బతిన్న పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న పంట పరిస్థితులను నివేదికల రూపంలో ప్రభుత్వానికి తెలియజేస్తామని, ఈ సందర్భంగా గ్రామస్తులకు రైతులకు ఇంచార్జ్ ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ముందుగా మండల స్థాయి అధికారుల బృందం గోడిచర్ల, జి.జగన్నాధపురం,, ముకుందరాజుపేట, దోసలపాడు, రమణయ్యపేట, రేబాక, తిరుపతి పాలెం, గుల్లిపాడు గ్రామాల నందు తీవ్రమైన ఈదురు గాలుల వలన నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. పరిశీలించిన అనంతరం ఎలక్ట్రికల్ స్తంబాలు, చెట్లు విరిగి పోవుటవలన త్రాగు నీరుకు ఇబ్బందులు లేకుండా ప్రతీ గ్రామం నందు అవసరం అయిన జెనెరేటర్స్, వాటర్ ట్యాంకర్స్ ఏర్పాటు చేయుటకు గాను తగు చర్యలు తీసుకొనుటకు గాను సంబందించిన అన్ని అన్ని గ్రామాల్లో చర్యలు చేపట్టారు.

పశువుల అక్రమ రవాణాపై పాడేరు పోలీసులు నిఘా

పాడేరు సిఐ దీనబంధు

పాడేరు,మే24, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు జంతు సంరక్షణ చట్టాల ప్రకారం ఎవరైనా అక్రమంగా పశువులు రవాణా చేసిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోనున్నామని పాడేరు పోలీస్ ఇన్ స్పెక్టర్ డి.దీనబంధు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైకోర్టు ,సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం బక్రీద్ పండగ సందర్భంగా ఎవరు అయిన అక్రమంగా పశువుల రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామనీ అయన హెచ్చరించారు. అదేవిధంగా వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామనీ ఎవరైనా పశువుల రవాణాలో తప్పనిసరిగా చట్టనిబందులను పాటించాలని యానా స్పష్టం చేసారు. అట్లకాని నిబంధనలు పాటించని యెడల కఠినమైన చర్యలు తీసుకోనున్నామని సి ఐ దీనబంధు హెచ్చరించారు.

అరకులోయలో రోడ్డు ప్రమాదాలపై పోలీసులు అవగాహన

హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులతో భారీ బైక్ ర్యాలీ

అరకలోయ, మే 24, ప్రభాతవార్త : అల్లూరి సీతారామరాజు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీస్ శాఖ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ను ధరించాలని అవగాహన పరుస్తూ ఒకవైపు జిల్లా కలెక్టర్, ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీలు నిర్వహిస్తుండగా, మరో వైపు పర్యాటకులకు, స్థానికులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని చెబుతూ బైక్ ర్యాలీ కార్యక్రమాలు చేపడు తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం అరకులోయలో పోలీస్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి నేతృత్వంలో అరకులోయ సబ్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పర్యాటకులు స్థానిక ద్విచక్ర వాహనదారులతో కలిసి హెల్మెట్ ధరించి భారీ బైక్ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిఐ హిమగిరి, ఎస్ఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం. కుటుంబా న్ని వీధిపాలు చేస్తుందని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ను ధరించాలని సూచించారు.

ఎల్ సి సి చైర్మన్ కృష్ణకుమారికి సేవా రత్నా అవార్డు

అరకులోయ, మే 24, ప్రభాతవార్త : అల్లూరి సీతారామరాజు జిల్లాలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ , గిరిజనుల హృదయాల్లో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్న అరకులోయకు చెందిన స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కమిడి కృష్ణ కుమారికి మదర్ తెరిసా సేవా సంస్థ సేవా రత్నా రాష్ట్రస్థాయి అవార్డును ప్రధానం చేసింది. దీనిలో భాగంగా ఆదివారం విశాఖపట్నం లో వి జె ఎఫ్ అధ్యక్షుల సమక్షంలో కృష్ణ కుమార్ కి అవార్డును అందించారు . సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ మెమొంటో ప్రశంస పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న కృష్ణకుమారి మాట్లాడుతూ తనకు మదర్ తెరిసా సేవా సంస్థ తన సేవలను గుర్తించి సేవా రత్న రాష్ట్ర స్థాయి అవార్డు అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందని , ప్రజలకు భవిష్యత్తులో మరిన్ని సేవలను అందిస్తానని తెలియజేశారు.

కనకదుర్గమ్మ అమ్మవారికి వెండి కిరీటం అలంకరణ

అరకలోయ, మే 24, ప్రభాతవార్త : అరకులోయ పట్టణం లో వెలసిన శ్రీశ్రీశ్రీ కనక దుర్గ అంబికా అమ్మవారికి ఆదివారం ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ డా. సియ్యారి దొన్ను దొర వెండి కిరీటం ను అలంకరించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా వెండి కిరాటాన్ని అలంకరింపజేశారు. కాగా స్థానిక గురుభవాని పాడి చందు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతూ ఉంటాయి. ఈ కార్యక్రమంలో అరకులోయ మండలం అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, డుంబ్రిగుడ మండల అధ్యక్షుడు కిల్లో ఆనందరావు, ఏఎంసి చైర్మన్ బొరి బొరి లక్ష్మీ, టిడిపి నాయకులు కొర్ర జ్యోతి, అరకు నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు సియ్యారి అజయ్ దొర, క్లస్టర్ ఇంచార్జి కొర్ర శేఖర్, డంబ్రిగుడ క్లస్టర్ ఇంచార్జి కొర్ర నాగరాజు, నిర్మల, మాజీ ఎంపిటిసి వంతల వెంకటరావు, నాగరాజు, టిడిపి సీనియర్ నాయకుడు సత్యనారాయణ, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వంటలమామిడిలో 'జన్ భాగీదారీ అభియాన్' ముగింపు వేడుకలు

-ఐటీడీఏ పీఓ ఆదిత్య వర్మ

పాడేరు,మే24, ప్రభాతవార్త: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 'జన్ భాగీదారీ అభియాన్' కార్యక్రమ ముగింపు వేడుకలు సోమవారం మే 25న పాడేరు మండలం వంటలమామిడి గ్రామ పంచాయతీ పరిధిలో ఘనంగా నిర్వహించను న్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి వంటలమామిడిలో ప్రారంభం కానున్న ఈ మెగా క్యాంప్లో జిల్లా కలెక్టర్ ఒ జిల్లా మేజిస్ట్రేట్ నిషాంతి. టి , జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ , ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ లతో పాటు జిల్లా స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ప్రధాన కార్యక్రమాలు జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ శాఖలు ప్రత్యేక స్టాళ్లుఈ ముగింపు వేడుకల్లో భాగంగా ఏర్పాట్లు,అలాగే ప్రజల సౌకర్యార్థం గ్రామంలో పలు ప్రభుత్వ సేవల స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అధికారులచే గ్రామంలో పర్యటన (ట్రాన్సిట్ వాక్),ఉచిత మెగా వైద్య శిబిరం (మెగా మెడికల్ క్యాంప్),ఆధార్ నమోదు మరియు సవరణ స్టాల్,విడివికె స్టాల్,ఐసీడీఎస్ స్టాల్,గృహ నిర్మాణ లబ్ధిదారుల నమోదు (హౌసింగ్ స్టాల్),పీఎం ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల నమోదు స్టాల్, కేంద్ర బృందం పర్యటనఈ 'జన్ భాగీదారీ అభియాన్' క్షేత్రస్థాయి పరిశీలన మరియు డాక్యుమెంటేషన్ కొరకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు చిరాగ్ ఖురానా (టీమ్ లీడర్), శ్రీ వరుణ్ జునేజా (కో-టీమ్ లీడర్) లతో కూడిన బృందం మే 24 నుండి 26 వరకు పాడేరు ఏజెన్సీ పరిధిలో పర్యటిచించానున్నారు ఐ టి డి ఏ పీఓ ఆదిత్య వర్మతెలిపారు. ఈ కార్యక్రమానికి పాడేరు ఎంపీడీఓ నోడల్ అధికారిగా, వంటలమామిడి పంచాయతీ కార్యదర్శి గ్రామ స్థాయి అధికారిగా వ్యవహరిస్తూ, అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అధికారులకు ఆదేశాలు

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు వంటాలమామిడిలో జరిగే ఈ ముగింపు క్యాంప్నకు తప్పనిసరిగా హాజరుకావాలని, అలాగే సంబంధిత శాఖల అధికారులు తమ స్టాళ్లను, వైద్య శిబిరాలను విజయవంతం చేయడానికి అవసరమైన సిబ్బందిని, ముందస్తు ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని ఈ ప్రకటన ద్వారా తెలియజేసారు.

పెద్దిపాలెం జాతీయ రహదారి పై రోడ్డు ప్రమాదం

ఆనందపురం, మే 24, ప్రభాతవార్త: ఆనందపురం మండలం పెద్దిపాలెం బ్రిడ్జ్ కు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆనందపురం నుంచి తగరపువలస వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం లారీ ముందుగా వెళ్తుండగా, అదే దారిలో వెనుక నుంచి వస్తున్న స్కూటీ లారీ కుడి వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఉప్పాడ లోకేష్ మణికంఠ (18) తీవ్రంగా గాయపడ్డాడు. ముఖం, ఎడమ కన్ను, నోరు, దవడ భాగాల్లో తీవ్ర రక్తగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారు కాగా పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘటనపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

గాజువాకలో 'రోడ్డు' షోలు...నిబంధనలు కాగితాలకే పరిమితం!

-ఏసీపీ ఆదేశాలు బేఖాతరు - అమ్మవారి పండుగ పేరుతో రోడ్లపైనే డాన్స్ ప్రోగ్రామ్‌లు

-రాకపోకలకు ఇబ్బందిపడిన ప్రయాణికులు -

ట్రాఫిక్ పోలీసులుపై స్థానికుల తీవ్ర ఆగ్రహం

గాజువాక, మే 24,ప్రభాతవార్త : గాజువాకలో ట్రాఫిక్ నిబంధనలు తుంగలో తొక్కారు. నిత్యం వేలాది వాహనాలతో బిజీగా ఉండే గాజువాక నుంచి సిందియా ప్రధాన రహదారిని పండుగ సంబరాల పేరుతో దిగ్బంధించారు. ఉన్నతాధికారులు హెచ్చరించినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడం, పైగా ఆదేశాలు జారీ చేసిన 24 గంటలు గడవక ముందే మళ్లీ అదే తంతు పునరావృతం కావడం స్థానికంగా కలకలం రేపుతోంది. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ డిపో, కొత్త నక్కవానిపాలెం సమీపంలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క రోజు కూడా గడవక ముందే..!

వారం రోజుల క్రితం జింక్ ప్రధాన ద్వారం సమీపంలో అమ్మవారి పండుగ వేడుకల పేరుతో రోడ్డును క్లోజ్ చేయడంతో గాజువాక నుంచి సిందియా మీదుగా నగరానికి రాకపోకలు చేసే వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. దీనిపై ప్రయాణికులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయడంతో సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ వై. శ్రీనివాసరావు తీవ్రంగా స్పందించారు. ఇకపై రోడ్లపై ఇలాంటి కార్యక్రమాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతులు ఉండబోవని హెచ్చరిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే.. ఈ ప్రకటన వెలువడి ఒక్క రోజు కూడా గడవక ముందే స్థానిక పోలీసులు ఏసీపీ ఆదేశాలను గాలికి వదిలేశారు. కొత్త నక్కవానిపాలెంలో రోడ్డుపైనే 'డాన్స్ బేబీ డాన్స్' ప్రోగ్రామ్‌లు, ఆర్కెస్ట్రాలు నేల వేషాలు, సాము గరిడీలు యథేచ్ఛగా నిర్వహిం చారు. దీంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం కల్గింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అంబులెన్స్‌కూ దిక్కులేదు!..

ట్రాఫిక్ పోలీసుల తీరుపై స్థానికులు బహిరంగంగానే ఆరోపణలు గుప్పిస్తున్నారు. కేవలం మామూళ్ళ కోసమే పోలీసులు ట్రాఫిక్ నిర్వహణను గాలికి వదిలేశారని మండిపడుతున్నారు. పోలీసుల కళ్లముందే ఇంత పెద్ద ఎత్తున రోడ్డును ఆక్రమించి ప్రోగ్రామ్స్ పెడుతుంటే కనీసం పట్టించుకోకపోవడం వెనుక పెద్ద కథే ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితి వస్తే కనీసం ఒక అంబులెన్స్ కూడా వెళ్లే దారి లేకపోవడం ఇక్కడి దుస్థితికి అద్దం పడుతోంది. "ఉదయం ఇళ్ల నుంచి వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన మేము.. రాత్రికి క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలా వద్దా?" అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

నగర కమిషనర్ స్పందించాలి....

ఉన్నతాధికారుల హెచ్చరికలు కేవలం కాగితాలకే పరిమితం కావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా నగర పోలీస్ కమిషనర్ (సీపీ) ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన స్థానిక సిబ్బందిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని గాజువాక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నిరుపేదలకు అన్నప్రసాద వితరణ

విశాఖపట్నం మే 24 ప్రభాత వార్త : అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాల ప్రాంగణం వద్ద ప్రతి ఆదివారం క్రమం తప్పకుండా గత 14 సంవత్సరాలుగా నిరుపేదలకు అన్నార్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ఈరోజు ఈ కార్యక్రమాన్ని ప్రముఖ ఆధ్యా త్మికవేత్త ఎం వి రాజశేఖర్ ప్రారంభించి పేదలకు, అన్నార్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ చక్కని కార్యక్రమా న్ని నిర్వహిస్తున్న యంవివి సత్యనారాయణ జి బి కుమార్లను ప్రశంసించారు . కార్యక్రమంలో ద్వారకా నగర్ లైన్స్ క్లబ్ ప్రతినిధులు కే స్వతంత్ర కుమార్ , ఏ వెంకటరావు , జి బ్రహ్మానంద కుమార్ పాల్గొన్నారు .

ఘనంగా అబిద్ నగర్‌లో హ్యాపీ సండే సందడి

ఆరిలోవ, మే 24, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హ్యాపీ సండే కార్యక్రమం విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్, స్థానిక శాసనసభ్యులు విష్ణు కుమార్ రాజు ఆదేశాలు మేరకు ఆదివారం జీవీఎంసీ 44,45 వార్డుల కూటమి నాయకుల ఆధ్వర్యంలో అబిద్ నగర్ పార్క్ వద్ద "హ్యాపీ సండే" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, 44వ వార్డు అధ్యక్షులు గారపాటి సత్యనారాయణ (సతీష్), 45వ వార్డు అధ్యక్షులు బర్నికాన రాజు, జనసేన అధ్యక్షులు పరమేష్ , బీజేపీ అధ్యక్షులు రఘునాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గారపాటి సతీష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆటలు, నృత్యాలు అందరిని అలరించాయని, వారం రోజుల నుండి పని ఒత్తిడితో జీవిస్తూ ఆదివారం నాడు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం పట్ల మనసు ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటుందని ఆయన తెలిపారు. యోగా, కరాటే, నృత్య ప్రదర్శనలుతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మల్ల లక్ష్మి, మల్ల నిర్మల, పి. చక్రవర్తి, ఏ. అన్నపూర్ణ, పి. శ్రీను, ఎస్. నరసింహమూర్తి, కల్లా శ్రీను, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, అబిద్ నగర్ వాకర్స్ క్లబ్, శుభోదయం వాకర్స్ క్లబ్ సభ్యులు, కూటమి పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చెరువుల బలోపేతంతో రైతాంగం అభివృద్ధి : గంటా

ఆనందపురం, మే 24: మండలంలోని రెండు చెరువుల పునరుజ్జీవానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఆనందపురం పంచాయతీ పుర్లివాని చెరువు, గండిగుండం పంచాయతీ గౌరివాని చెరువు లను ఒక్కొక్కటి సుమారు రూ.50 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. చెరువుల బలోపేతం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని గంటా ఈ సందర్భంగా పేర్కొన్నారు. చెరువుల పటిష్టంతో పాటు సోలార్ దీపాలు, ఆర్.సి.సి. బెంచీలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, చిల్డ్రన్ పార్కులతో ఆహ్లాదకరమైన వాతావరణం అభివృద్ధి చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు నిర్మలాదేవి, కె. ఆంజనేయులు, సత్యనారాయణ, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, బి.ఆర్.బి. నాయుడు, లొడగల వెంకట్రావు, గంట్రెడ్డి సోమినాయుడు, శ్రీకాంత్ రాజు, ఎర్ర రాజు, చిన్న, మదపాటి శ్రీను, బలిరెడ్డి మల్లికార్జునరావు, గంట్రెడ్డి రమేష్, అంగటి రాము, కాళ్ల నగేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ నేషన్స్ ప్రతినిధులను ఆకట్టుకున్న తర్లువాడ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు

ఆనందపురం, మే 24, ప్రభాత వార్త: యునైటెడ్ నేషన్స్ ఎన్విరా న్మెంట్ ప్రోగ్రామ్ (యూనిప్) ప్రతినిధులు విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ అమలు చేస్తున్న సుస్థిర వ్యవసాయ విధానాలను పరిశీలించారు. ఈ బృందంలో శ్రీ సత్య ఎస్ త్రిపాఠి, మిస్టర్ ఫిలిప్పే, మిస్టర్ హెన్నింగ్స్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు ఆర్‌టిఎల్ ప్రకాష్, అల్లంసెట్టి మోహన్ రావు, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించారు. జేడీ ఫిషరీస్ పి. లక్ష్మణరావు, ఎఫ్‌డీవో మురళి అతిథులుగా హాజరయ్యారు. రైతు సాధికార సంస్థ హెచ్ఆర్ అండ్ జెండర్ థీమాటిక్ బి. శ్రీనివాస్ చక్రవర్తి వ్యవసాయ క్షేత్రంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతినిధులకు వివరించారు. ముఖ్యంగా వర్షాకాలానికి ముందే పొడి నేలలో విత్తనాలు విత్తే విధానం,విత్తనాలకు రక్షణ పూత పెట్టే ప్రక్రియ / విత్తన గుళికల తయారీ విధానం, ఎప్పుడైనా ఆదాయం అందించే విధానాల ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో స్థిరమైన ఆదాయం పొందుతున్న విధానాన్ని తెలియజేశారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల్లో వర్షాభావాన్ని ఎదుర్కోవడంలో విత్తనాలకు రక్షణ పూత పెట్టే ప్రక్రియ ఎంతో ఉపయోగకరమని వివరించారు. అలాగే మామిడి తోటల్లో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, జీవ వైవిధ్య పరిరక్షణ, బహుళ పంటల సాగు విధానాలను యునైటెడ్ నేషన్స్ ప్రతినిధులు ఆసక్తిగా పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు బయో రీసెర్చ్ సెంటర్‌ను కూడా సందర్శించి అక్కడ జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ పరిశోధనలు, రైతులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలు, స్థానిక విత్తనాల పరిరక్షణ చర్యలను తెలుసుకొని అభినందించారు. మహిళా సంఘ సభ్యులతో సమావేశమై ప్రకృతి వ్యవసాయం వల్ల గ్రామీణ మహిళలకు కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం పర్యావరణ పరిరక్షణకు, నేల ఆరోగ్య సంరక్షణకు రైతుల ఆర్థిక స్థిరత్వానికి ఎంతో దోహదపడుతుందని యునైటెడ్ నేషన్స్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్శనతో విశాఖపట్నం జిల్లాలో ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు తెలిపారు.

సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఫలితాల్లో ఎస్‌జీఎస్ సైనిక్ అకాడమీ విద్యార్థుల ఘన విజయం

మాధవధార, మే 24: సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ -2026 పరీక్షల ఫలితాల్లో మురళి నగర్ ఎస్‌జీఎస్ సైనిక్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని నమోదు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న 33 ప్రభుత్వ సైనిక్ పాఠశాలల్లో ఈ అకాడమీకి చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో ఎంపికై సంస్థకు గర్వకారణంగా నిలిచారు. మురళి నగర్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ రామ్ మాట్లాడుతూ సైనిక్ స్కూల్స్ ద్వారా విద్యార్థులకు అత్యుత్తమ విద్య, క్రమశిక్షణతో కూడిన శిక్షణ లభిస్తుందని తెలిపారు. దీంతో పిల్లల్లో లాజికల్ థింకింగ్, నాయకత్వ లక్షణాలు, క్రీడా నైపుణ్యాలు, గన్ షూటింగ్ వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 2012 నుంచి ఇప్పటివరకు 600 మందికి పైగా విద్యార్థులను తమ అకాడమీ ద్వారా సీట్లు సాధించినట్లు తెలిపారు.

గ్రంథాలయ వేసవి శిబిరంలో అలరించిన 'సోమరిపోతు సోము' కథ



గాజువాక, మే 24ప్రభాతవార్త: స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ఉత్సాహభరితంగా సాగింది. శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు చదవడం, రాయడం, చెప్పడం వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి బి. సూర్యకళ విద్యార్థులకు 'సోమరిపోతు సోము' అనే నీతి కథను చక్కగా వివరించి చెప్పారు. నిత్య జీవితంలో సోమరితనాన్ని వీడి, కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకుంటారని కథ ద్వారా పిల్లలకు బోధించారు. అనంతరం విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందుకు సన్‌ఫ్లవర్ (పొద్దుతిరుగుడు) గింజలతో వివిధ రకాల ఆకర్షణీయమైన డిజైన్లను చేయించారు. పిల్లలు ఎంతో ఆసక్తిగా ఈ క్రాఫ్ట్ వర్క్‌లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. గ్రంథాలయ అధికారిణి బి. సూర్యకళ పర్యవేక్షణలో జరిగిన ఈ విజ్ఞాన భరిత కార్యక్రమం చివరగా విద్యార్థులు ఆలపించిన జాతీయ గీతంతో ముగిసింది.

25skl13:25skl13.qxd 24-05-2026 23:10 Page 1

పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

సంతబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త : సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-96 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 30 ఏళ్ళ క్రితం కలసి చదువుకున్న వీరంతా ఒకరినొకరు పలకరించుకుని అలింగనం చేసుకొని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఆ పాత మధురాలు మర్చిపోలేనివని పేర్కొన్నారు. అలాగే కుటుంబ విషయాలు, వ్యాపార విషయాలు, ఉద్యోగ విషయాలు ఈ సందర్భంగా చర్చించుకున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. అంతకుముందు వీరితో చదువుకొని కీర్తి శేషులైన తోటి విద్యార్థుల మృతికి సంతాపం పాటించారు.

గాయపడిన కళాకారునికి చేయూత

ఇచ్ఛాపురం, మే 24 ప్రభాతవార్త : ఇచ్ఛాపురం మండలం కేశుపురం గ్రామానికి చెందిన ప్రముఖ సంగీత హార్మోనియం కళాకారులు లక్కోజి గణపతి ఆచారి గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు ఎడమ కాళ్ళ తుంటి ఎముక విరిగి నడవలేని స్థితిలో ఉండటంతో సోమవారం మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉండగా విషయం తెలుసుకొని అత్యవసరంగా భావించి మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ అధ్యక్షులు రంగాల జానకిరామ్ రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి, ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్ కుమార్, కోశాధికారి కొప్పల హేమంత్, సలహాదారులు బోర రామారావు, దూట్ల వెంకటేశం, పిట్ట కేశవరావు, ఉమా మహేష్ ఆచారి, కారింగి తులసయ్య, సాడి హేమసుందర్, గుప్పి కుమార స్వామి, మార్పు నారాయణరావు తదితరులు 6000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి గణపతి ఆచారికి ధైర్యం చెప్పారు. శ్రీ మహతి సాంస్కృతిక కళా సేవా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి గ్రంథాలయంలో క్విజ్ పోటీలు

సంతబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త: మండల కేంద్రం సంతబొమ్మాళి శాఖ గ్రంథాలయం సమ్మర్ క్యాంపులో భాగంగా హైస్కూల్ స్థాయి విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. అలాగే ఈ గ్రంథాలయంలో చదువుకుని ఎస్జిటి ఉపాధ్యాయులుగా సెలెక్ట్ అయిన పందిరి నారాయణను గ్రంథాలయం అధికారితో పాటు రీడర్స్ సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రామకృష్ణ, హైస్కూల్ మ్యాథ్స్ ఉపాధ్యాయులు హేమసుందర్ రావు, రీడర్స్ ఉమామహేశ్వరరావు, తిరుపతిరావు, సాత్విక్, చైతన్య, ధనుంజయ్, పవన్ కుమార్, సహాయకులు బాబురావు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో పడి చిత్తు కావొద్దు

ఇచ్ఛాపురం, మే 24 ప్రభాతవార్త : గంజాయి మత్తుకి అలవాటు పడి యువత చిత్తు కావొద్దని రూరల్ ఎస్ఐ అర్.జనార్దనరావు అన్నారు. లొద్దపుట్టి జంక్షన్‌లో గంజాయి వినియోగించారా లేదా అనే విషయం పై రాపిడ్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ రాపిడ్ టెస్ట్‌ల్లో ఎవరు కూడా గంజాయి వినియోగించేవారు దొరకలేదని తెలిపారు. మాదక ద్రవ్యాలకి దూరంగా ఉండాలని యువతకి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అవధానుల చెరువు నుంచి మట్టి తరలింపు

- చోద్యం చూస్తున్న అధికారులు...? - జిల్లా కలెక్టర్ స్పందించాలి

ఆమదాలవలస, మే 24 ప్రభాతవార్త : సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామం ఆనుకొని ఉన్న అవధానుల చెరువు నుంచి అక్రమంగా మట్టి రవాణా జరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం పగలనకా రాత్రనక జెసిబిలతో తవ్వి, లారీల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న అధికారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదని పరిసర ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. ఆ చెరువుకు ఆనుకునే ఉన్న పిల్ల కాలువను తవ్వి మట్టిని తరలిస్తున్న అధికారులకు నిమ్మకు నీరెత్తినట్లు లేదని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత మూడు నెలలు నుండి చెరువులను తవ్వి టిప్పర్లతో మట్టి, గ్రావెల్ తరలిస్తూ భారీ స్థాయిలో అక్రమ దందా సాగుతుందని స్థానికుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ మట్టి రవాణా జరుగుతున్న సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ చూసి చూడనట్లు మౌనం దాల్చడంపై రైతులు మండిపడుతున్నారు. రాత్రి వేళల్లో జెసిబిలతో చెరువులను తవ్వించి పదులు సంఖ్యలో శ్రీకాకుళం మండలం పల్లివలస గ్రామానికి చెందిన వ్యక్తి ఈ అక్రమ మట్టి దందాను కొనసాగిస్తున్నాడు. ఈ ప్రాంతానికి చెందిన మట్టిని శ్రీకాకుళం రూరల్ మండలాల్లో ఉన్న ఇటుక బట్టి యాజమానులకు అధిక లాభాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఒక టిప్పర్ మట్టిని సుమారు రూ.13 వేల వరకు విక్రయిస్తూ భారీ స్థాయిలో అక్రమ వ్యాపారం జరుగుతుందని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు రాత్రి పెద్ద ఎత్తున మట్టి తరలింపుతో నెలకు కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి రావలసిన ప్రజాధనాన్ని ఈ అక్రమ మట్టి రవాణా దారులు కొల్లగొడుతున్నారు. గత కొంతకాలంగా ఈ అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నడంతో మట్టి, కంకర మాఫియా మరింత రెచ్చిపోయి తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విధముగా మట్టి తరలించడంతో చెరువుల, కొండల జాగ్రుతి మారిపోతోండడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి, కంకర అక్రమ తవ్వకాలను అరికట్టవలసిన సచివాలయ సిబ్బంది, రెవిన్యూ, మైన్స్, తదితర శాఖల అధికారులు మాత్రం మౌనం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఈ అక్రమ మట్టి రవాణాను అరికట్టాలని ఇటీవల ఎమ్మెల్యే రవికుమార్ అధికారులకు సూచించినప్పటికీ అధికారులు మాత్రం మౌనం దాల్చడంపై పలు విమర్శలకు తావిస్తోంది. మట్టిని నిరంతరం తరలించడం ద్వారా పురుషోత్తపురం రోడ్డు మొత్తం గతుకులమై అయ్యింది. ఈ రోడ్డుమీద ప్రయాణించే వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు జీవీవ లక్షలది రూపాయల వ్యయంతో పనులు చేసి నప్పటికీ ఈ మట్టి లారీలు అధిక లోడుతో వెళ్లడం ద్వారా ఆ రోడ్డన్నీ గతుకులమై పోయావని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డన్నీ ఆ మట్టి లారీల ప్రయాణంతో పాడైపోయి సొమ్ము వసూలు చేసి ఆ రోడ్డన్నీ బాగు చేయించాలని అధికారులను పరిసర ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు. అంతేకాకుండా మట్టి లారీల్లో అధిక మొత్తంలో నింపడం వల్ల మట్టి లారీ మీద ఎటువంటి పరదాలు వేయకపోవడం వల్ల ఆ మట్టి రోడ్డు మీద వెళుతున్న ప్రయాణికుల కళ్లల్లో పడుతున్నాయని, మట్టి లారీలు స్పీడ్ గా వెళ్లడం వల్ల పలు ప్రమాదాల బారిన ప్రయాణికులు పడుతున్నారని అలికాం బత్తిలి రోడ్డు ప్రయాణం చేస్తున్న ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ మట్టిని తరలించడానికి ఎటువంటి అనుమతులు లేనప్పటికీ అధికారులను లోబరుచుకుని ఈ మట్టి రవాణా గుత్తేదారులు సిండికేట్ గా ఏర్పడి ఈ దందాను కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారం అంతా అధికారులకు తెలిసినప్పటికీ చూసి చూడనట్లు వ్యవహారం చేయడం పై పలు విమర్శలకు తావిస్తుంది. ఈ మట్టి రవాణాను జిల్లాలో పలు మండలాల్లో అధికారులు అరికడుతు న్నప్పటికి సరుబుజ్జిలి, ఆముదాలవలస మండలాల్లో మాత్రం అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ జరుగుతున్న అక్రమ మట్టి దందా నా జిల్లా కలెక్టర్ అరికట్టాలని పరిసర ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

-చిన్ననాటి మధుర స్మృతుల్లో తేలియాడిన మిత్రులు

రణస్థలం, మే 24 ప్రభాతవార్త : కాలాంతరంలో ఎవరి బాటలో వారు సాగిపోయి, వివిధ రంగాల్లో స్థిరపడిన మండల కేంద్రం రణస్థలం ప్రభుత్వ హైస్కూల్ 2002-05 బ్యాచ్ మిత్రులంతా ఒక్కచోట చేరితే ఆ ఆనందానికి హద్దుల్లేవు. సుమారు 24 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన 'పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం' ఎంతో భావోద్వేగాల మధ్య, ముచ్చటగా పండగలా సాగింది. చిన్ననాటి స్నేహితులను చూసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ, నాటి తరగతి గదుల చిలిపి చేష్టలను, ఆటపాటలను గుర్తు చేసుకుంటూ జ్ఞాపకాల పల్లకిలో విహరించారు. తమ జీవితాల్లో ఎవరు ఏ స్థాయిలో ఉన్నా, సమయం మారినా బాధ్యతలు పెరిగినా నాటి బాల్య స్నేహం ముందు అందరూ మళ్లీ పాఠశాల విద్యార్థులుగా మారిపోయి సందడి చేశారు. ఎన్ని విజయాలు సాధించినా చిన్ననాటి స్నేహితుల మధ్య దొరికే ఆ ఆనందం, ఆత్మీయత మరెక్కడా దొరకదు. ఈ రోజు మా జీవితంలో ఎప్పటికీ మరువలేని ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుందంటూ ఆనందం వ్యక్తం చేశారు.

గురువందనం.. ఉపాధ్యాయులకు ఘన సత్కారం:

తమను క్రమశిక్షణతో పెంచి, సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన నాటి గురువులను ఈ సందర్భంగా విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను బహూకరించి తమ కృతజ్ఞతలు చాటుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము చదువు చెప్పిన పిల్లలు నేడు ప్రయోజకులై, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండటం, తమను గుర్తుపెట్టుకుని ఇలా సన్మానించడం ఒక గురువుగా తమకు దక్కిన అతిపెద్ద బహుమతి అని ఆనందం వ్యక్తం చేశారు. స్నేహితుల కుటుంబ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విందు భోజనాలు, సెల్ఫీలు, గ్రూప్ ఫోటోలతో రోజంతా కోలాహలంగా గడిచింది. ఆత్మీయంగా సాగిన ఈ రోజంతా మధుర స్మృతులు మిగులుతూ, "మళ్లీ కలుద్దాం" అంటూ ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

రణస్థలం, మే 24 ప్రభాతవార్త : మండలంలో నారువ గ్రామ పంచాయతీలో బీజేపీ శక్తి కేంద్రం ప్రతినిధుల సమావేశం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. శక్తి కేంద్రం అధ్యక్షులు, బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు జీరు గురునాథ్ రెడ్డి అద్భుతమైన ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నారువ పంచాయతీ పరిధిలోని బూత్ కమిటీ అధ్యక్షులు, సెక్రటరీలు, కార్యదర్శులు మరియు శక్తి కేంద్ర సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యకర్తల్లో సరికొత్త ఉత్సాహం సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు జీరు గురునాథ్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో శక్తి కేంద్రాలు, బూత్ కమిటీల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బూత్ కమిటీల బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సభ్యులతో విస్తృతంగా చర్చించారు. నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపైకి వచ్చి పార్టీ విజయానికి కృషి చేయాలని తీర్మానించారు. సమావేశం విజయవంతం కావడంతో స్థానిక బీజేపీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సత్కారం

శ్రీకాకుళం, మే 24 ప్రభాతవార్త : ఎచెర్ల మండలం బొంతలకోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. మొదటిగా గురువులైన పంచాది జగన్నాథం, విశ్రాంతి మండల విద్యాశాఖధికారి, మొయ్యిల సింహాచలం, విశ్రాంతి గ్రేడ్ 2 ఫీజికల్ డైరెక్టర్, మరియు పైడిశెట్టి జగన్నాధం విశ్రాంతి ప్రధానోపాధ్యాయులు, మాస్టర్లను శాలువా మరియు జ్ఞాపికలతో సత్కారించడం జరిగింది, అనంతరం 36ఏళ్ళ క్రితం కలసి చదువుకున్న వీరంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఆ పాత మధురాలు మర్చిపోలేనివని పేర్కొన్నారు. అలాగే కుటుంబ విషయాలు, వ్యాపార విషయాలు, ఉద్యోగ విషయాలు ఈ సందర్భంగా చర్చించుకున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. అంతకుముందు, వీరికి పాఠాలు చెప్పి కీర్తి శేషులైన గురువులకు, వీరితో చదువుకొని కీర్తి శేషులైన తోటి విద్యార్థులకు సంతాపం పాటించారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

మండల పార్టీ అధ్యక్షులు సుగ్గు స్వరూప్ రెడ్డి

సంతబొమ్మాళి, మే 24 ప్రభాత వార్త: నౌపడలో ఈ నెల 27, 28 తేదీలలో జరగనున్న మినీ మహానాడును తెలుగు తమ్ముళ్లు హాజరై విజయవంతం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి పిలుపు నిచ్చారు. నౌపడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలుగు దేశం పార్టీ నాయకులతో స్వరూప్ రెడ్డి సమావేశం నిర్వహించారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాలు మేరకు నౌపడలో రెండు రోజులు పాటు మిని మహానాడు నిర్వహిస్తునట్లు ఆయన చెప్పారు. ఈ మహానాడులో మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు. భావనపాడు నుంచి ఉమిలాడ వరకు మండలం నలుమూలల నుంచి తెలుగు దేశం పార్టీ తమ్ముళ్లు తప్పకుండా హాజరై జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు కోరారు. అనంతరం మహానాడు నిర్వహించనున్న ప్రదేశాన్ని పార్టీ కేడర్‌తో కలసి వెళ్లి పరిశీలించారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలుపు మందు అమ్మకాలపై తాత్కాలిక నిషేధం

మండల వ్యవసాయాధికారి ఎస్.దానకర్ణుడు

మెళియాపుట్టి, మే 24 ప్రభాతవార్త : ప్రభుత్వం వ్యవసాయ శాఖ ప్రజల ఆరోగ్య దృష్ట్యా ఇచ్చిన ఉత్తర్వులు ప్రకారం పెరాక్వాటు డైక్లోరైడ్ 24 ఎస్ఎల్ అనే కలుపు మందుపైన మెళియాపుట్టి మండలంలో అమ్మకాలపై తాత్కాలిక నిషేధం ఇవ్వడం జరిగినది. మెళియాపుట్టి మండలంలో ఉన్న పురుగు మందుల డీలర్లు దుకాణాలను మండల వ్యవసాయాధికారి తనిఖీ చేయడం జరిగింది. పురుగుమందుల డీలర్ల వద్ద ఉన్న 37.25 లీటర్ల ప్యారాకోట్ డైక్లోరైడ్ కలుపు మందు అమ్మకాలపై తాత్కాలిక నిషేధం ఇవ్వడం జరిగినది. మండలంలో ఉన్న డీలర్లు అందరూ కూడా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు పాటించవలసిందిగా తెలియజేయడమైనది. అలాగే ప్రజల ఆరోగ్యం దృష్ట్యా రైతు సోదరులందరూ కూడా సహకరించాలని తెలిపారు. ఎవరైనా డీలర్లు విషయాన్ని అతిక్రమించినచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

బక్రీద్ సెలవుతో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష వాయిదా

వీరఘట్టం, మే 24 ప్రభాతవార్త: బక్రీద్ (ఈద్అల్అదా) పండుగ సందర్భంగా ఈ నెల 28వ తేదీన నిర్వహించాల్సిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను వాయిదా వేసినట్లు సవరించిన తేదీల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఇంటర్ విద్యాధికారి వై.నాగేశ్వరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి పి.రంజిత్ బాషా ఆదేశాల మేరకు పరీక్షల తేదీలలో మార్పులు చేసినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం మే 28వ తేదీని బక్రీద్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మే 28న జరగాల్సిన ఫస్ట్ ఇయర్ జనరల్ ఎకనామిక్స్ పేపర్1, సెకండ్ ఇయర్ జనరల్ మ్యాథమెటిక్స్ పేపర్ 2బి పరీక్షలను జూన్ 5వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే వొకేషనల్ బ్రిడ్జ్ కోర్సులకు సంబంధించిన మ్యాథమెటిక్స్,బయోలాజికల్ సైన్సెస్ పరీక్షలు కూడా అదే రోజున నిర్వహించబడతాయని చెప్పారు. ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని వివరించారు. అదే విధంగా జూన్ 5న నిర్వహించాల్సిన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వేల్యూస్ పరీక్షను జూన్ 12వ తేదీకి మార్చినట్లు తెలిపారు. విద్యార్థులు ఇప్పటికే జారీ చేసిన హాల్ టికెట్లతోనే పరీక్షలకు హాజరుకావాలని, పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మార్పులు లేవని జిల్లా ఇంటర్ విద్యాధికారి వై.నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

ఎండల తీవ్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోండి

వీరఘట్టం, మే 24 ప్రభాతవార్త : జిల్లాలో తీవ్ర ఎండల పరిస్థితులపై జిల్లా కలెక్టర్ డా ఎన్.ప్రభాకర్ రెడ్డి ప్రజలకు అప్రమత్తత సూచనలు జారీ చేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్ విడుదల చేసిన హీట్ ఇండెక్స్ ఫోర్‌కాస్ట్ అడ్వైజరీ ప్రకారం జిల్లాలోని 15 మండలాలు డేంజర్ కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. ఈ మండలాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 54 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం, సాలూరు, పాచి పెంట, మక్కువ, సీతంపేట, భామిని, కొమరాడ, వీరఘట్టం, బలిజిపేట, జియ్యమ్మవలస, పార్వతీపు రం, గరుగుబిల్లి, పాలకొండ మండలాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు మరియు అనారోగ్య సమస్యలు ఉన్నవారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని తెలిపారు. రైతులు, కూలీలు మరియు బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని, తరచూ నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవాలు తీసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితులలో తప్ప ప్రజలు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కొండపేటలో లోవోల్టేజీ ఇబ్బందులు

రాజాం, మే 24 ప్రభాతవార్త: రాజాం మున్సిపాలిటీ పరిధిలోని కొండంపేట గ్రామంలో లంక సిరి తల్లి కాలనీలో లోవోల్టేజ్ వలన 15 నెలల నుంచి చాలా ఇబ్బందులు పడవలసి వస్తుందని వాపోతున్నారు. ఈ విషయంపై గతంలో విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన ఎటువంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీకాకుళం వార్త

జిల్లా క్రికెట్ అభివృద్ధికి కొత్త ఊపు : కూన

ఆముదాలవలస, మే 24 ప్రభాతవార్త : ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ జిల్లా క్రికెట్ అధ్యక్షుడు హోదాలో శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో క్రికెట్ అసోసియేషన్ బిల్డింగ్ నందు జిల్లా క్రికెట్ అభివృద్ధికి సంబంధించి నిర్వహించిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా స్థాయి పురుషుల మహిళలు క్రికెట్ శిక్షణ కేంద్రానికి సంబంధించిన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించగా, ఇందులో ఎస్పీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిలుగా హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడా రంగం అభివృద్ధి చెందితే యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల యువతలో ఎంతో ప్రతిభ దాగి ఉందని, సరైన అవకాశాలు మరియు శిక్షణ లభిస్తే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. జిల్లాలో క్రికెట్‌కు మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామని, యువ క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు, శిక్షణా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తామని తెలిపారు. క్రీడాకారులకు నాణ్యమైన కోచింగ్, మెరుగైన ప్రాక్టీస్ సదుపాయాలు అందించడం ద్వారా జిల్లా నుంచి భవిష్యత్తులో మంచి క్రికెటర్లు తయారవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన క్రికెట్ శిక్షణా సదుపాయాలను పరిశీలించిన ఎమ్మెల్యే రవికుమార్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల వైపు మరింత ఆసక్తి చూపాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం ప్రతినిధులు ఇలియాస్ మరియు సెక్రటరీ వైస్ ప్రెసిడెంట్సు సంఘం సభ్యులు క్రీడా నిర్వాహకులు, కోచ్‌లు, యువ క్రికెటర్లు, అభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : మంత్రి

కోటబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త : వేసవి నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెక్కలి తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా వినతులు స్వీకరించారు. కొందరు ప్రజలు తాగునీటి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ, తదితర శాఖల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. దర్బార్‌కు వచ్చిన వినతుల్లో అత్యధికంగా భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులే ఉన్నాయని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో జరిగిన తప్పిదాలు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అనేకమంది పేదల భూములు ఇతరుల పేర్లకు మార్పిడి అయ్యాయని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, రెవెన్యూ అధికారులతో మాట్లాడి బాధితులకు తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి సూచించారు. విద్య, వైద్యం మరియు ఆరోగ్య రంగాలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శక పాలన అందిస్తామని పునరుద్ఘాటించారు. "సమస్య ఏదైనా సరే, నేరుగా నా దృష్టికి తీసుకురండి" అని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి అచ్చెన్నాయుడు భరోసా కల్పించారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నలుగురికి రూ.2.42 లక్షల ఆర్థిక సాయం

కోటబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త : అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి వైద్యం చేయించుకుని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మాకు మంత్రి దేవుడిలా అండగా నిలిచారంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న టెక్కలి మండలానికి చెందిన నలుగురు బాధితులకు మొత్తం రూ.2,42,587ల ఆర్థిక సాయాన్ని ఆయన అందజేశారు. పి.తులసి లక్ష్మి రూ.64,579, ఎం.మహాలక్ష్మి రూ.61,529, ఎస్.విమలకుమారి రూ.66,280, పి.శివసాయి రూ.50,019 చెక్కులు అందుకున్న అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మాకు ఇంత త్వరగా సాయం అందేలా చేసి మా ఇళ్లలో వెలుగులు నింపారు. కష్టాలలో ఉన్నప్పుడు ఆదుకున్న మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని సంతోషాన్ని వ్యక్తపరిచారు.కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి రుణం తీర్చుకోలేనిది

కోటబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త : బడుగు, బలహీన వర్గాలకు వెన్నుదన్నుగా ఉన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రుణం తీర్చుకోలేనిది మండలంలోని దంత గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్తలు చల్ల సింహాచలం, శిమ్మ వెంకటరావులు అన్నారు. ఆదివారం వారు కలిసిన విలేకరులతో మాట్లాడుతూ దంత గ్రామానికి చెందిన సుమారు 39 మంది బలహీన వర్గాల ప్రజలకు ఇళ్ల పట్టాలు అందజేయడం సంతోషకరమని అన్నారు. ఇంకా అర్హత కల్గిన వారు ఉంటే వారిని గుర్తించాలని రెవెన్యూ సిబ్బందికి మంత్రి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. రహదారులు అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా గరీబుల గెడ్డ నుండి ప్రారంభించిన రహదారి శరవేగంగా నిర్మాణం జరుగుతుందని అన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందివ్వడం జరుగుతుందని అన్నారు.దీని పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం జేస్తున్నారని అన్నారు. జూన్ నెలలో వితంతువులకు పింఛను అందజేయడం జరుగుతుందని ప్రభుత్వమే ప్రకటించడం ఆనందదాయకమని అన్నారు. గ్రామానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు మంత్రి సిద్ధంగా ఉన్నారనిప్రజలు ఇదంతా గమనించి తెలుగుదేశం పార్టీకి మంత్రి అచ్చెన్నాయుడుకు ఆదరించాలని వారు కోరారు.

ఆపరేషన్ క్లీన్‌స్వీప్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, మే 24 ప్రభాతవార్త : ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచుతున్నామని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజాం మొగిలివలస బ్రిడ్జి సమీపంలో, రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను, ప్రోక్లైనర్ ద్వారా తీయించారు. మున్సిపల్ కార్మికులతో కలిసి ఎమ్మెల్యే చెత్తను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించేందుకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతి పౌరుడు వ్యాపారులు, విద్యా సంస్థలు, స్వయం సహాయక సంఘాలు,ఎన్జీవోలు, యువతతో పాటు సమాజంలోని ప్రతివర్గం పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. పరిశుభ్రత కేవలం పారిశుధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గురవాణ నారాయణరావు, దుప్పల పూడి శ్రీను, శాసపు రమేష్ కుమార్,హరి, తదితర కూటమి నాయకులు, మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ సీ హెచ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా కలిసిన గణపతి శర్మ

కోటబొమ్మాళి, మే 24 ప్రభాతవార్త : తల్లి ఆలయ ప్రధాన అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఎస్.గణపతి శర్మని కూటమి ప్రభుత్వం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులుగా నియమించిన నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిమ్మాడ క్యాం ప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన మంత్రి అచ్చెన్నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు ఎస్.గణపతి శర్మను శాలువాతో సన్మానించి అభినందించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

25-5Pg9th chel.qxd:25-5Pg9th chel.qxd 1/1/02 6:47 AM Page 1

వేడిలో చర్మం జాగ్రత్త !

పెరుగుతున్న ఎండ వేడి,చెమట. పొక్కులు, దద్దుర్లకు కారణమవుతాయి. నొప్పి, దురదతోపాటు చర్మమూ దెబ్బతింటుంది. వీటి బారిన పడొద్దంటే ఈ చిట్కాలు పాటించండి.

కోల్డ్ కంప్రెషర్ : ఎండ తగ్గేవరకూ ఇంట్లోనే ఉండటం అందరికీ సాధ్యం కాదు. కాబట్టి, బయటికి వెళ్లొచ్చాక చర్మం ఎర్రగా మారితే.. ఐస్ క్యూబ్‌లను మెత్తని వస్త్రంలో పెట్టి, సమస్య ఉన్నచోట మృదువుగా అద్దండి చాలావరకూ ఉపశమనం కలుగుతుంది.

ఓట్‌మీల్ స్నానం.. ఓట్‌మీల్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఎక్కువ. రోజూ ఒకపూట ఓట్‌మీ పౌడర్ రెండు స్పూన్లు స్నానం చేసే నీటిలో కలిపి, వాటితో స్నానం చేయండి. కావాల్సిన తేమ అందడమే కాదు చర్మ సమస్యలూ దరిచేరవు.

కుం హైడ్రేటెడ్‌గా ఉండాలి... శరీరానికి తగినన్ని నీరు అందకపోయినా సమస్యే! కనీసం 2 లీటర్లు తాగితే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. ఇంకా స్నానమయ్యాక కొన్ని చుక్కల కొబ్బరినూనెగానీ మాయిశ్చరైజర్‌గానీ తప్పక రాయండి. దద్దుర్లకు ఆస్కారం ఉండదు. వీటితోపాటు శరీరానికి గాలి తగిలేలా వదులుగా, లేతవర్ణాల్లో ఉండే దుస్తులనే ధరించాలి. ఎండలోకి వెళ్లాల్సి వస్తే రెండు గంటలకోసారి కనీసం ఎస్‌పీఎఫ్ 30 ఉండే సన్‌స్క్రీన్ లోషన్‌ను రాస్తుండాలి. □

అది టెక్స్‌లేషన్‌షిప్ మాత్రమే..

ఇరువురి మధ్య కేవలం ఫోన్‌లో సమాచారం ఇచ్చిపుచ్చుకొనే బంధం ఉంటే దాన్ని టెక్స్‌లేషన్‌షిప్ అని పిలుస్తున్నారు. అంటే రోజంతా ఎదుటివారి వివరాలను తెలుసుకోవడానికీ, తమ గురించి చెప్పడానికీ మెసేజ్‌లనే వాడుతున్న వారితో స్నేహం లేదా ప్రేమ బంధం ఉందని భావించొద్దంటున్నారు నిపుణులు. అలాంటి దాన్ని బలమైన బంధంగా ఊహించకోవద్దనీ హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా బంధాలేర్పడుతున్న ఈ కాలంలో కాలక్షేపం కోసం ఎదుటివారిని ఇలా మెసేజ్‌లతో మభ్యపెట్టే వాళ్లూ ఉంటారు.

ప్రతి చిన్న విషయాన్నీ మెసేజ్ చేస్తూ, మాట్లాడ టానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదంటే అవతలివారు మీతో ఎటువంటి బంధాన్నీ కొనసాగించడం లేదని ముందుగానే అర్థం చేసుకోవాలి. ఎదుటివారికి మీరు టైంపాస్ కావొచ్చు. లేదా మిమ్మల్ని తమ సమాచారంతో మాత్రమే మోసగిస్తూ.. దాన్ని స్నేహంగా చెప్పుకొంటూ ఉండొచ్చు. ఇటువంటి బంధాల నుంచి వీలైనంత త్వరగా బయటపడటం మంచిది.

స్నేహంతో కాదు.. ఉదయాన్నే 'హలో' పలకరింపుతో మొదలుపెట్టి రాత్రి నిద్రపోయేవరకూ మీ గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటే మీరు ఆలోచించాల్సిందే అవతలివారికి మీపై ప్రేమ ఉందనుకుంటే అది మీ అపోహే అవుతుంది. వర్చువల్‌గా మాత్రమే మీతో స్నేహం చేయడానికి వారు ఆసిక్తి చూపిస్తుంటారు. దాన్ని ప్రేమ అనుకుంటూ ఊహల్లోకి జారితే మాత్రం ఆ తర్వాత మీరు కుంగుబాటుకి గురవడం ఖాయం. ఎందుకంటే ఇలాంటి వాళ్లే, మీరు కలిసి మాట్లాడదామన్న వెంటనే సాకులు చెబుతారు. ఇలా వాళ్లు తప్పించుకున్నప్పుడు మీర తీవ్ర వేదనకు గురికావాల్సి ఉంటుంది. ఎన్నిసార్లు అడిగినా కలవడానికి ఆసిక్తి చూపించకుండా, ఫోన్‌లో సమాచారంతో మాత్రమే బంధాన్ని పెంచుకోవడానికి ప్రయత్నిస్తుంటే నమ్మకపోవడం. □

కుంగుబాటుకు దూరంగా ..!

ఎన్ని పనులున్నా ఏదోలా చేసుకుంటూ పోతాంగానీ ఏదో చిరాకు ఆవహించినట్లుం టుంది. నిజంచెప్పాలంటే ఏదీ తోచదు. అలాంటిది ఒక్కోసారి మనసంతా దిగులు ఆవరిస్తుంది. ఎందుకోసం కష్టపడుతున్నాం అనే నైరాశ్యం వెంటాడుతుంది. ఇవన్నీ మానసిక అలసటకు చిహ్నాలే. పనిలో పడితే మామూలే అనుకోకుండా..దీన్నుంచి బయటపడటం ఎలానో ఆలోచించండి.

తీరు మార్చుకుందాం : వైఫల్యాలు ఎదురవనిది ఎవరికి చెప్పండి? కొన్ని అపజయాలు ఎదురవగానే ఢీలా పడిపోవడం వల్లే ఇలా జరుగుతుంటుంది. దీనికి విరుగుడు మన ఆలోచనా ధోరణిని మార్చుకోవటమే. ఆడవాళ్లం మనం బలహీనులం అన్న భావనను పెంచుం టాం. దాన్ని పక్కన పెట్టాలి. మీపై మీరు నమ్మకాన్ని, సాను కూల దృక్పథాన్ని ఏర్పరచుకోవాలి. ఏదైనా చేయగలను, సాధించ గలను అని మీరు నమ్మితే.. దాన్ని ఆమార్చుకునే మార్గం కనిపిస్తుంది.

లక్ష్యాన్ని ఏర్పరచుకుని : బాగా చదవాలి, మంచి ఉద్యోగం సాధించాలి అనుకున్నారు. అవన్నీ సాధించారు. ఆ తర్వాత?.. ఒకలాంటి శూన్యం ఏర్పడుతుంది. అందు వల్లనే ఈ నిరాశ. ఇది దరిచేరొద్దంటే కొత్త లక్ష్యాలు ఏర్పరచుకోండి. అది చేరుకోవడానికి కష్టపడండి. అప్పుడు నిరాశకి చోటుండదు. మీరు ఏర్పరుచుకున్నది పెద్ద లక్ష్యం అయితే దాన్ని చిన్న చిన్న లక్ష్యాలుగా విభజించుకోండి. అప్పుడు సాధించడమూ తేలిక అవుతుంది.

నమ్మకాన్ని పెంచుకుని : పిల్లలు ఎన్నిసార్లు కింద పడుతుంటారు? ఇంకెన్నిసార్లు దెబ్బలు తగిలించుకుంటారు. అప్పుడేం చేస్తాం? దగ్గరకు తీసుకొని ఊరడిస్తాం, ధైర్యం చెబుతాం. మనకీ అలాంటి ప్రోత్సాహం అవసరమే! అలా ఓదార్పు నిచ్చేవారు మీకూ ఒకరుంటే మంచిది.అది భర్త కావొచ్చు. స్నేహితురాలు కావొచ్చు. ఎప్పుడూ ఇల్లు, ఆఫీసంటూ బిజీగా గడిపేయక అలాంటి ఆత్మీయులతో మాట కలపండి. మీ ఆలోచనలను పంచుకోండి. నిరంతర పనుల బడలిక కూడా మనసుని నీరు గారుస్తుంది. అలసి పోయేలా చేస్తుంది. ఫలితమే నాకే ఎందుకిలా అనే నిరాశ వగైరా.

మీలో ఉత్సాహన్ని నింపే.. మీ మాటలను మనసారా వినే వారితో గడిపితే తెలియని ఉత్సాహం మీలో వచ్చి చేరుతుంది. ఆందోళన, కుంగుబాటు వంటివి ఆమడ దూరంలో ఉంటాయి. ఇంకా సామాజిక బంధాలు బలపడతాయి. □

విభూతి

పార్వతీదేవి సమేతమై ఉన్న పరమేశ్వరుడికి నమస్కరించి వెనువెంటనే జరిగిన ఘోరం గురించి తెలిపారు యముడు.. కుంభీపాక నరకం ఉన్నట్లుండి స్వర్గధామంగా మారి పోయిందని, దానికి కారణమేమిటో తెలియడం లేదని, పావులంతా అలా స్వర్ణసుఖాలను అనుభవించటం ధర్మవిరుద్ధం కదా అని తెలిపారు.శివుడు వారి మాటలను విని..చిరునవ్వు నవ్వి.. దీనిలో వింత ఏమీ లేదు. నరకకూపం దగ్గరకు దూర్వాసుడు వెళ్లి లోనికి తొంగి చూసిన సమయంలో ముని నుదటి మీద ఉన్న మూడు విభూతి రేఖల్లోని కొన్ని అణువులు కెళ్లి ఆ కూపంలో పడ్డాయి. ఆ పవిత్ర అనువుల ప్రభావమే ఇది అని చెప్పారు. ఆ సమయంలోనే కుంభీపాక కూపంలో పడి ఉన్న ప్రాణి కోటి అంతా దివ్య విమానం అధిరోహించి కైలాసం చేరుకున్నారు. భరదగణాలు అనే పేరుతో ఇప్పటికీ వారక్కడే ఉంటున్నారు. పరమేశ్వరుడు ఆ కుంభీపాక కూపాన్ని పితృదేవతలకు పనికి వచ్చే ఉత్తమ తీర్థంగా మార్చారు. ఆ తీర్థం పక్కనే శివపర్వాతుల మూర్తులను ప్రతిష్ఠించమని చెప్పి ఆ మూర్తులు పూజలందుకుంటారని, ఆ ప్రాంతం పితృతీర్థంగా మారిపోతుందని చెప్పాడు. యముడు చేసేదిలేక పితృలోకానికి చాలా దూరంగా మళ్లీ ఒక కొత్త కుంభీపాక నరక కూపాన్ని నిర్మించి పరిసరాలకు విభూతి ధరించిన శివభక్తులెవరూ రాకుండా కట్టడి చేశాడు. విభూతిలోని కొన్ని కణాలకే అంతటి మహత్తర శక్తి ఉందని ఈ కథ తెలుపుతోంది. అందుకే విభూతిని ధరించటం మనతో పాటు ఇతరులకు శుభాన్ని అందిస్తుంది. □

గోబీ ఎంత మంచిదో !

క్యాలీఫ్లవర్. ఇది రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం. బంగాళదుంప, టొమాటో, బీన్స్, క్యారెట్, బఠాణీ.. ఇలా దేనితో కలిపి వండినా.. మహా రుచిగా ఉంటుంది. తాలింపు వేసి.. వేయించినా సూపర్ రుచిగా ఉండే ఆధరవు మనదవుతుంది. దీంతో చేసే ఊరగాయ పచనచడి కూడా చాలా బాగుంటుంది. ముఖ్యంగా ఫ్రైడ్‌రైస్, బిర్యానీలకు స్పెషల్ టేస్ట్ తెప్పిస్తుంది. క్యాలీఫ్లవర్ పకోడీలు చేస్తామా! ఒక్కటి కూడా మిగలదు. ఇంత నోరూరించే క్యాలీఫ్లవర్‌లో ప్రోటీన్లు, విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, సోడియం, పొటాషియం, ఫొలేట్, భాస్వరూం, మాంగనీస ఇలా మన శరీరానికి అవసరమైనవెన్నో ఉన్నాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్స్ అనారోగ్యాలను తరిమికొడితే.. ఇ-విటమిన్ కళ్ల కింది వలయాలను పోగొడుతుంది. ఇది మధుమేహాన్ని, క్యాన్సర్లను నిరోధిస్తుంది. ఊబకాయం రానివ్వదు. రక్తనాళాలు బిరుసెక్కడం, రక్తపోటు లాంటి సమస్యలను నివారిస్తుంది. ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంచుతుంది. చర్మం ముడతలు పడకుండా నిగారింపుతో ఉండేట్లు చేస్తుంది. రక్తం ఐరన్‌ను గ్రహిం చడంలో తోడ్పడుతుంది. క్యాలీఫ్లవర్ తినడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఎముకలు దృఢంగా ఉంటాయి. హిమెగ్లోబిన్ శాతం పెరుగుతుంది. జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది. జ్ఞాపకశక్తికి, నరాల వ్యవస్థకు కీలకమైన కోలిన్ ఇందులో విస్తారంగా ఉంది. □

చెలి సామాజిక పరిణామంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

'మర' పాతదే! కొత్త టచ్'తో

పాత తరం పిండిమరకి కొత్తతరం ఎలక్ట్రిక్ టచ్ ఇస్తే ఎలా ఉంటుందీ అనుకున్నారేమో తయారీదారులు ఇదిగో ఇక్కడున్న వుడ్ అండ్ గ్రానైట్ స్టోన్ ఎలక్ట్రిక్ గ్రైన్ మిల్‌ని తీసుకొచ్చారు. దీంతో పప్పులూ, ధాన్యాలూ ఇంట్లోనే పిండి పట్టుకోవచ్చు. మామూలు మిక్సర్, గ్రైండరు అయితే ధాన్యాలూ, పప్పులూ ఆడించి పిండి చేసుకోవడానికి వీలుగా ఉండవు. కానీ ఇంటి అవసరాల కోసమే తయారు చేసిన ఈ ఎలక్ట్రిక్ మిల్‌లో మాత్రం బయట మిల్లులో పట్టించినట్టే పిండి వస్తుంది. ఎన్నిరకాల

మిక్సీలు వచ్చినా కొందరు సంప్రదాయ పద్ధతుల్లో పట్టిన పిండే రుచిగా ఉంటుందంటారు. అలాంటి వారికి ఈ హోమ్ మిల్ మెషీన్ మంచి చాయిస్.. బయటికి వెళ్లే పని లేకుండా ఇంట్లోనే పిండిని పట్టుకోవచ్చు.□

'పెద్ది' అందరి మనసుని తాకుతుంది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు. 'పెద్ది కి ఆవాజ్' ఈవెంట్‌లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ.. మధ్యప్రదేశ్ ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు. నా మనసులో మీ అందరికీ ప్రత్యేకమైన స్థానం ఉంది. 'పెద్ది' ప్రమోషన్స్‌ను భోపాల్ నుంచి ప్రారంభించడం నాకు చాలా ఎమోషనల్‌గా అనిపిస్తోంది అన్నారు. జాన్వీ కపూర్ మాట్లాడుతూ.. 'మీ అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉంది.'పెద్ది'లో చాలా గొప్ప సందేశం ఉంది అన్నారు. ఎఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. 'మీ అందరి సమక్షంలో ఈ ప్రదర్శన ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. రవి కిషన్ మాట్లాడుతూ.. 'ఎఆర్ రెహమాన్ గారు వంటి లెజెండ్ సమక్షంలో ఈ వేడుక జరగడం నిజంగా ఒక అద్భుతమైన అనుభూతి అన్నారు. క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి విశ్వాస్ సారంగ్ మాట్లాడుతూ.. 'భోపాల్ ప్రజలు కళాకారులను ఎంతో ప్రేమిస్తారు, గౌరవిస్తారు అన్నారు. దివ్యేందు శర్మ మాట్లాడుతూ 'ఇది నాకు ఎంతో ముఖ్యమైన సినిమా. ఈ చిత్రంతోనే నేను తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నాను' అన్నారు. నిర్మాత వెంకట సతీష్ కిలారు మాట్లాడుతూ ..'నాకు ఈ నగరంతో ఎంతో ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇంజినీరింగ్ పూర్తయ్యాక ఉద్యోగం కోసం భోపాల్ వచ్చాను. ఇక్కడ దాదాపు ఐదేళ్లు గడిపాను. అందుకే మధ్యప్రదేశ్‌ను మా రెండో ఇల్లుగా భావిస్తాను. ఇంత పెద్ద వేడుక కోసం మళ్లీ ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది అన్నారు.

'చిరు158' రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో చిరు బాబీ2/చిరు 158 చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.'వాల్తేరు వీరయ' భారీ బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ విజయవంతమైన కాంబో మరోసారి చేతులు కలపడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాత వెంకట్ కె. నారాయణ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నిన్న పవర్ స్టార్ పవన్ కల్యాణ్‌తో పాటు పలువురు ప్రముఖుల సమక్షంలో ఈ చిత్రం ఘనంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. మేకర్స్ ప్రకటించినట్లుగానే నేడు హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. తొలి షెడ్యూల్‌లో చిరంజీవి, అనస్వర రాజన్‌లపై కీలక టాకీ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రబృందం బిటిఎస్ వీడియోను విడుదల చేసింది. ఇందులో సినిమా ప్రధాన సాంకేతిక బృందాన్ని పరిచయం చేశారు. వీడియోలో ఉత్సాహంగా కనిపించిన చిరంజీవి, 'లెట్స్ సెట్ ది బ్లడీ బెంచ్‌మార్క్' అంటూ సందడి చేశారు. దర్శకుడు బాబీ కొల్లి మరింత భారీ స్థాయిలో కథను సిద్ధం చేశారు. దశాబ్దాలుగా తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిరంజీవి ఈ చిత్రంలో తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్, ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన మరోసారి అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. అలాగే అనస్వర రాజన్ కూడా మెగాస్టార్‌తో కలిసి నటించబోతుండటం పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు టాప్ టెక్నికల్ టీం పని చేస్తోంది. సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తిక్ కన్నన్ చిత్రానికి అద్భుతమైన విజువల్స్ అందించనున్నారు. ప్రొడక్షన్ డిజైన్ అవినాశ్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్‌ను ఆంటోని ఎల్. రూబెన్ చేస్తున్నారు. కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందిస్తుండగా, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి ఆడిషినల్ స్క్రీన్‌ప్లే రచయితలుగా పనిచేస్తున్నారు. భాను-నందు ద్వయం సంభాషణలను అందిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయికతో పాటు ఇతర ప్రధాన తారాగణానికి సంబంధించిన వివరాలను త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.

శరవేగంగా 'స్వయంభూ' పోస్ట్‌ప్రొడక్షన్ పనులు



నిఖిల్ సిద్ధార్థ తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'స్వయంభూ'తో రాబోతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ భువన్, శ్రీకర్‌ల నిర్మాణంలో, టాగోర్ మధు సమర్పణలో భారీ పీరియడ్ యాక్షన్ చిత్రంగా రూపొందుతోంది. 'స్వయంభూ' భారతీయ సినిమా రంగంలోనే బిగ్గెస్ట్ ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. తాజాగా విడుదలైన వీడియోలో సినిమా పోస్ట్ ప్రొడక్షన్, ముఖ్యంగా వీఎఫ్‌ఎక్స్ పనుల విస్తృత స్థాయిని చూపించారు. ఇందులో హీరో నిఖిల్ సిద్ధార్థ, దర్శకుడు భారత్ కృష్ణమాచారి, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ కలిసి ప్రముఖ వీఎఫ్‌ఎక్స్ సంస్థ ఫాంటమ్ ఎఫ్‌ఎక్స్‌ను సందర్శించారు. భారీ యుద్ధ సన్నివేశాలు, విశాలమైన ప్రాచీన రాజ్యాలు, అద్భుతమైన విజువల్ ప్రపంచాన్ని రూపొందిస్తున్నారు. ఈ మాగ్నమ్ ఓపస్‌లో నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. 'స్వయంభు' గ్రాండియర్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయి విజువల్స్‌ను కేకే సెంథిల్ కుమార్ తన కెమెరాతో ఆవిష్కరిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. స్వయంభూ పాన్‌ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది.

రాయ్‌లక్ష్మి 'దేశీ మ్యాజిక్' మల్టీ కలర్ లెహాంగా

తన అందం, ఆకర్షణీయమైన రూపంతో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న ముద్దుగుమ్మ లక్ష్మీ ్మ రాయ్.తన అందం, ఆకర్షణీయమైన రూపంతో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న ముద్దుగుమ్మ లక్ష్మీ ్మ రాయ్. కేవలం వెండితెరపైనే కాకుండా, తన ఫిట్‌నెస్, స్టన్నింగ్ లుక్స్‌తో సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని బిహైండ్ ది సీన్స్ ఫొటోలు నెట్టింట మంటలు పుట్టిస్తున్నాయి. సాంప్రదాయ దుస్తుల్లోనే మోడ్రన్ కిక్ ఇస్తున్న ఆ ఫొటోషూట్ విశేషాలు మీకోసం.. ఇన్‌స్టాగ్రామ్‌లో 'దేశీ మ్యాజిక్' పోస్ట్: రాయ్ లక్ష్మీ ్మ చెన్నై లొకేషన్ నుండి తన అఫీషియల్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక క్రేజీ పోస్ట్ పెట్టింది, ఈ షూటింగ్ కోసం రాయ్ లక్ష్మీ ్మ గుజరాతీ స్టైల్‌లో ఉండే రంగురంగుల 'చనియా చోలి' ని ధరించింది. పింక్, ఎల్లో, బ్లూ, ఆరెంజ్ రంగులతో కూడిన చెకర్డ్ ప్యాటర్న్ ఈ డ్రెస్‌కు ప్రత్యేక లుక్‌ను ఇచ్చింది. ఇక దీనికి మ్యాచింగ్‌గా సాంప్రదాయ భారతీయ జ్యూవెలరీ, నుదుటిన మాంగ్ టిక్కా, పెద్ద చెవి రింగులు పెట్టుకుంది. డాన్స్ చేయడానికి వీలుగా దుపట్టా లేకుండా ఈ ఔట్‌ఫిట్‌ను డిజైన్ చేశారు.ఇప్పుడు ఆమె అవుట్ ఫిట్ వైరల్ అవుతుంది. నటి లక్ష్మీ ్మ రాయ్ రాఘవ లారెన్స్ సరసన బ్లాక్‌బస్టర్ హారర్‌కామెడీ చిత్రం 'కాంచన' (ముని 2) లో 'ప్రియా' పాత్రలో నటించి తెలుగు, తమిళ ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. కేవలం కాంచన మాత్రమే కాకుండా రాయ్ లక్ష్మీ ్మ ఖాతాలో మరికొన్ని క్రేజీ సినిమాలు ఉన్నాయి. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో రిలీజ్ కాబోతున్న యాక్షన్‌డ్రామా థ్రిల్లర్ 'జనతా బార్'చిత్రంతో పాటు సీనియర్ నటుడు శ్రీకాంత్‌తో కలిసి 'గర్జన' అనే తెలుగు యాక్షన్ సినిమాలో కూడా ఆమె నటిస్తోంది.

దుల్కర్ సల్మాన్ DQ41 కీలక షెడ్యూల్ పూర్తి

వర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం తన 41వ చిత్రం DQ41 షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. రవి నెలకుడితి దర్శకత్వంలో సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి తన ప్రతిష్టాత్మక ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బ్యానర్ నుంచి వస్తున్న 10వ చిత్రం SLV10గా రూపొందుతున్న ఈ మూవీపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. దుల్కర్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుండగా, అద్భుతమైన భావోద్వేగాలతో కూడిన అందమైన ప్రేమకథగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. తాజాగా చిత్ర బృందం మంచుతో కప్పుకున్న అద్భుతమైన ప్రకృతి మధ్య కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసింది. సెట్స్ నుంచి విడుదలైన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రానికి అనయ్ ఓం గోస్వామి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

మరణించిన వారి పేరు తో అగ్రిమెంట్లు ఎలా చేశారు..!

అక్రమ ఇసుక అనుమతులపై జాతీయ ఎస్టీ కమిషను ఆశ్రయిస్తాం..

కొమరాడ, మే 23 ప్రభాతవార్త : కొమరాడ మండలంలో రామభద్రపురం గ్రామ సమీపంలో ఉన్న నాగావళి నది ఇసుక ర్యాంపు అనుమతిలో పలు ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి. ఈ అనుమతులు పూర్తిగా అక్రమార్కులకు అధికారులు సహకరించారన్న ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఎందుకంటే పువ్వల రామయ్య అనే రైతు కొన్నేళ్ళ క్రితం మృతి చెందాడు అయినప్పటికీ జిల్లా ఇసుక కమిటీ అనుమతులు మంజూరు లో పువ్వుల రామయ్య పేరు తో అనుమతులు ఇచ్చారు. చనిపోయిన రామయ్య వచ్చి తన భూమిలో ఇసుక తీయడానికి అంగీకారాన్ని మన అధికారులకు ఇచ్చారా... అన్నది ఇక్కడ ఆశ్చర్యంగా ఉంది. అంటే ఇసుక అనుమతులలో అక్రమాలు జరిగాయి అన్నదానికి ఈ ఉదాహరణ నిదర్శనమని మాజీ ఎంపీటీసీ హిమరక బలరాం అన్నారు అధికారులు తప్పులు చేసి తిరిగి గిరిజనులను తప్పు తోవ పట్టించడంతోపాటు భయభ్రాంతులకు గురి చేసే విధంగా మాట్లాడడం సరైనది కాదని ఆయన అన్నారు. ఈనెల 20న పార్వతీపురం మన్యం జిల్లా మైన్స్ కార్యాలయంలో తమ భూములలో ఇసుకను తరలించేందుకు ఇచ్చిన అనుమతులు అక్రమమని ఫిర్యాదు చేయడం జరిగినప్పటికీ అధికారులు తమకు ఎవరు ఫిర్యాదు చేయలేదని చెప్పడం శోచనీయమని అన్నారు.కొరిశిల గ్రామ రెవెన్యూ లో సర్వే నెంబర్ 54- 2బి 54- 2 ఈ 54 -2 హెచ్ లలో ఇసుక తవ్వకాలకు త్రీలోక్ మైన్స్ పేరుతో అధికారులు ఇచ్చిన అనుమతులు పూర్తిగా అక్రమమని తక్షణమే అనుమతులు రద్దు చేసి గిరిజనులకు న్యాయం జరిపేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలా న్యాయం జరగని పక్షంలో జాతీయ ఎస్టీ కమిషన్, రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవలసి వస్తుందని ఆయన అన్నారు.

సిఏలో సత్తా చాటిన ప్రసన్న లక్ష్మి

గరివిడి ఖ్యాతి నిలిపిన విద్యా కుసుమం

గరివిడి, మే24, ప్రభాత వార్త: చార్టెడ్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా లో గరివిడి కి చెందిన వరపుల ప్రసన్న లక్ష్మిఅనే విద్యార్థిని సత్తా చాటారు. సి ఏ లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పట్టా పొందారు. కృషి,పట్టుదల, దృడదీక్ష అంకిత భావం తో నిత్య సాధన చేసిన ఈ విద్యా కుసుమం సి ఏ లో బంగారు పతకం అందుకొని అగ్రగామిగా నిలిచి కన్న వారి ఆశలను నెరవేర్చారు. ఉన్న ఊరు ఖ్యాతిని నిలిపారు. చదివే కళాశాల కీర్తిని దశ దిశలా వ్యాపింప జేశారు.తన భర్త కు తగ్గ చార్టెడ్ అక్కౌంటెంట్ నని నిరూపించారు. పెళ్లి అయిన తరువాత వంటింటి కే పరిమితం చేసే అత్తవారు ఉన్న ఈ సమాజంలో అత్తమామల ప్రోత్సహం, భర్త వెన్ను దన్నుతో నిరంతర కృషి, నిత్య సాధనతో సి ఏ పట్టా పుచ్చుకున్న గరివిడి ముద్దుబిడ్డ, పూర్వ ఫేకర్ జి ఎం టి.కమలాకర రావు కోడలు అయిన ప్రసన్న లక్ష్మి ప్రతిభ ప్రశంసనీయం. గరివిడి కి చెందిన ప్రసన్న లక్ష్మి హైదరాబాద్ లో చార్టెడ్ అక్కౌంటెంట్స్ ఆఫ్ ఇండియా లో సి ఏ అభ్యసించి,అత్యున్నత ప్రతిభ తో బంగారు పతాకాన్ని సాధించారు. సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు, సి ఏ శ్రీధర్ ముప్పల నుండి ప్రసన్న లక్ష్మీ పట్టాను స్వీకరించారు. కాగా ప్రసన్న లక్ష్మి భర్త తాడి ప్రకుల్ కంపెనీ సెక్రటరీ పరీక్షలో స్వర్ణ పతకం సాదించి, ఐ సి డబ్ల్యూ ఏ ,ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ లో ఐ ఆర్ పి పూర్తి చేసి అత్యుత్తమ ప్రతిభ చాటుకున్నారు. ప్రసన్న లక్ష్మి కు పూర్వ ఫేకర్ జి ఎం కమలాకర్ తో పాటు పలువురు విద్యావేత్తలు, మేధావులు అభినందనలు పాటు శుభాకాంక్షలు తెలిపారు.

మరడాశీలో ఉచిత వైద్య శిబిరం

దత్తిరాజేరు మే 24 ప్రభాత వార్త : మండల పరిధిలో గల మరడాశీ గ్రామంలో శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శివాలయం వద్ద ఆదివారం నిర్వహించారు 70 మంది రోగులు ఈ శిబిరంలో డాక్టర్ శైలజ వైద్య చికిత్సలు మరియు పరీక్షలు చేశారు . ఆర్థోపెటిక్ చెవి ముక్కు గొంతు జనరల్ మెడిసిన్ జనరల్ సర్జరీ యూరాలజీ న్యూరో సర్జరీ గైనకాలజీ న్యూరాలజీ కార్డియాలజీ వంటి వైద్య సేవలు మా హాస్పిటల్ నందు ఉచితంగా చేయబడతాయి అన్నారు నర్స్ సుస్మిత గ్రామ మాజీ సర్పంచ్ శంకర్రావు రోగులుపాల్గొన్నారు

పశువులు అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం

దత్తిరాజేరు మే 24 ప్రభాతవార్త : జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ ఆదేశాలతో బొబ్బిలి డి.ఎస్.పి గోవిందరావు పర్యవేక్షణలో గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితోపశువులు అక్రమ రవాణా పై ఉక్కు పాదం మోపారు గజపతినగరం సర్కిల్ పరిధిలో 9 ముఖ్యమైన ప్రదేశాలులో పశువుల అక్రమ రవాణా అరికట్టటకు గాను సిబ్బందితో చెక్కు పోస్టులను . ఏర్పాటు చేసి ఆ ప్రదేశాల్లో ప్రయాణించే వాహనాలను నిరంతరం తనిఖీ చేయడం జరుగుతుందని అదేవిధంగా పశువుల అక్రమ రవాణా చేయు అన్ని మార్గాలను దిగ్బంధించటం జరిగింది. మరియు పశువులను అక్రమ రవాణా చేయు వ్యాపారస్తులను పిలిచి అక్రమ రవాణా వంటి చేరాదని వెంటనే వారి ప్రవృత్తిని మార్చుకోవాలని పశువుల అక్రమ రవాణా చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించడం జరిగింది. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

రామభద్రపురం, మే 24 ప్రభాతవార్త: ఈనెల 27 28 తేదీల్లో రామభద్రపురం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెదేపా కార్యనిర్వాక మాజీ కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు స్థానిక దేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు క్లస్టర్ పరిధిలో మహానాడు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు రామభద్రపురం క్లస్టర్ పరిధిలో తెదేపా నాయకులు ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రామభద్రపురం తీదేపా క్లస్టర్ ఇంచార్జ్ వసంతల సన్యాసినాయుడు తేదాపా ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల మహేష్ మండల తేదాపా నాయకులు చింతల చిన్నమ్మ తల్లి పత్తి గుల్ల యోగి నాయుడు రవ్వ ఈశ్వరరావు మహంతి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్ జన్మదిన వేడుకలు

లక్క వరపు కోట, మే 24 ప్రభాత వార్త : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్ జన్మదిన వేడుకలు ఎల్.కోటలోని ఆయన నివాసంలో ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి భర్త అయిన బాలాజీ అప్పలరాంప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ నలుమూలల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు అభిమానులు ఎల్.కోటలోని ఆయన నివాసానికి పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యకర్తల కోలాహలం, శుభాకాంక్షల నడుమ ఆయన కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ వేడుకల్లో భాగంగా నియోజకవర్గ పరిధిలోని పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయనకు ప్రత్యేక అభినందనలు అందజేశారు. తమపై మరియు తమ కుటుంబంపై నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు చూపిస్తున్న అపారమైన ప్రేమాభిమానాలకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు నిరంతరం శ్రమిస్తున్న కార్యకర్తలే తమ బలమని, ఈ ఆదరాభిమానాలు రాబోయే రోజుల్లో ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో ముందుకు సాగడానికి కొండంత బలాన్ని ఇస్తాయని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

5 కోట్ల అక్రమ రిజిస్ట్రేషన్ పై నామ్ కే వాస్తే విచారణ ..!

- సార్లు సార్లు ఊళ్లు పంచుకొనే వ్యవహారం - రూల్స్‌కు విరుద్ధంగా సొసైటీ భూమి అమ్మకం

- మ్యూటేషన్ లో రెవెన్యూ చేతివాటం -అడ్డగోలు రిజిస్ట్రేషన్ అంతా వారిష్టం

సాలూరు మే 24 ప్రభాతవార్త : గతంలో వచ్చిన అపరిచితుడు సినిమాలో అవినీతి, చట్టాలను ఉల్లంగించిన వారిపై "గరుడపురణం"ప్రకారం కుంభీపాకం, శూలదండనం వంటి పలురకాల శిక్షలు విధించడం ప్రేక్షకుల కళ్లకు కట్టినట్టు చూసారు. అందులో రిజిస్టర్ ఆఫీస్‌లో డబ్బులు ఇస్తే అక్రమ రిజిస్ట్రేషన్ చేసేవారికి అపరిచితుడు శిక్ష వేస్తుంటాడు. అదేవిధంగా సాలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించారు.అలా సబ్ రిజిస్టర్ తో డాక్యుమెంట్ రైటర్స్ కాంట్రాక్ట్ లో ఉంటూ పని కానిస్తారు.ఇలాంటి వారిని ఏ అపరిచితుడు శిక్ష విధిస్తాడో అని టౌన్ లో టాక్ నడుస్తుంది. ఇంకా విషయానికి వస్తే పట్టణ జైపూర్ రోడ్డులో పక్కన ఉన్న చర్చికి సంబంధించిన సర్వే నంబర్ 175 / 1 లో 3.14 ఎకరాల భూమి ఉండగా ఈ భూమి విలువ ఇక్కడ ఎకరా 5 కోట్లు పలుకుంది.ఇది ఇలాఉంచితే పూర్వం 1978 లో దగ్లస్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసోసియన్ సొసైటీ పేరిట నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ జరిగింది.అయితే మళ్లీ 2025 లో మరో సొసైటీ పేరు సృష్టించి మార్కెట్ లో అమ్మకానికి పెట్టారు.ఈ మేరకు ఈ నెల 16న సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో రిజిస్ట్రేషన్ కూడా చేశారు.

జేసీ ఆదేశాలతో జిల్లా రిజిస్టర్ ఎంక్వైరీ :

సాలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో 5 కోట్ల అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందని కలక్టర్ గ్రీవెన్స్ సెల్ లో కంప్లైంట్ తో జేసీ యశ్వంత్ కుమార్ రెడ్డి విచారణ చేయాలని ఆదేశించారు.ఈ మేరకు జిల్లా రిజిస్టర్ పార్వతి శనివారం సబ్ రిజిస్టర్ ఆఫీస్‌లో విచారణ చేపట్టారు.ముందుగా ఫిర్యాదు చేసిన వారిని ఇంకా అమ్మకం కొనుగోలు దారులను అలాగే ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ రమణమూర్తి,రెగ్యులర్ సబ్ రిజిస్టర్ నాగరాజులను విచారించిన అనంతరం భూమిని పరిశీలించారు.ఆమె మీడియాతో మాట్లాడుతు రెవెన్యూ అధికారుల ఇచ్చిన వన్ బితో పాటు ఇతర ధ్రువపత్రాలు చూసి రిజిస్ట్రేషన్ క్లియర్ గా జరిగిందన్నారు.అలాగే సమగ్ర నివేదిక రిజిస్ట్రేషన్ డిఐజికి అందజేస్తామని తర్వాత నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి విఫలం

సార్ మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి, మే 24, ప్రభాతవార్త : పంటలను నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. ఆదివారం నాడు చీపురుపల్లి నియోజకవర్గంలో గాలివానలతో నష్టపోయిన పంటలను ఆయన పరిశీలించారు. చీపురుపల్లి మండలం పీకే పాలవలస పంచాయతీ పరిధిలోని మెట్టబడి, కలిశెట్టి బడి గ్రామాలలో ఇటీవల భారీ ఈదురుగాలుల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న అరటి, బొప్పాయి పంటలను శాసన మండలి ప్రతిపక్ష నాయకులు పెద్దలు బొత్స సత్యనారాయణ స్వయంగా పరిశీలించారు.ఆయనతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గారు మాట్లాడుతూ సుమారు100 ఎకరాలకు పైగా పంటలు నేలకొరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం తక్షణమే సరైన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ప్రతిపక్షంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతుంది అన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారి తరపున గళం వినిపిస్తూనే ఉంటాం అని ఈ సందర్భంగా హెచ్చరించారు. కష్టాల్లో ఉన్న రైతులకు ధైర్యంగా అండగా నిలబడటం మా బాధ్యత అని బొత్స సత్యనారాయణ రైతులకు భరోసా ఇచ్చారు.ప్రస్తుత ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోతే, వచ్చే తమ ప్రభుత్వంలో పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం రైతులను పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఇప్పిలి అనంత్ , వలిరెడ్డి శ్రీను మీసాల వరహాల నాయుడు , బెల్లాన వంశీ కృష్ణ , జనార్ధన్ నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

లక్షలు ఖర్చు చేసి భవనాలు కట్టి వదిలేసారు.. కుక్కలకి ఆవాసంగా మారిన వెల్ నెస్ కేంద్రం ఆర్ బి కె కేంద్రం

లక్క వరపు కోట, మే 24 ప్రభాత వార్త : మండలం లోని కిత్తన్న పేట గ్రామం లో సచివాలయం లో భాగంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం రైతులకోసం ఆర్ బి కె ఆలాగే రోగులకు చికిత్స అందించడం కోసం వెల్ నెస్ కేంద్రం ఈ రెండు భవనాలు దాదాపు 40 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు ఇప్పటికీ వినియోగం లోకి రాక చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి కుక్కలకు అవా సంగా మారడం పట్ల గ్రామ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు ఎందుకు కట్టారు ఎందుకు వదిలేసారు అని అధికారులను అరా తీస్తే విద్యుత్ కనెక్షన్ లేక ప్రారంభం చేయలేదు అని సమాధానం ఇవ్వడం గమనార్హమ్ కట్టి ఎన్నో ఏళ్ళు కావస్తున్నా ఇప్పటికి విద్యుత్ సప్లై ఏర్పాటు చేయక పోవడం అధికారులు అలాగే పాలక నాయకుల నిర్లక్ష్యం కి నిదర్శనం గా భావించాలి గ్రామం కి దూరం గా కట్టడం వలన అక్కడ వరకు విద్యుత్ లైన్ వేయడానికి ప్రత్యేక ప్రతి పాదనలు పెట్టినా అవి కాన్సల్ కావడం తో పంచాయతీ లో నిధులు లేక ఇప్పటికి విద్యుత్ సప్లై సంబందించిన భవనాలకు ఏర్పాటు కాలేదు అనేది అధికారులు చెప్పే మాట అయితే ఊరికి అంత దూరం లో కట్టడం వలన ఈ సమస్య ఏర్పడింది అని అయినా ఎదో లో నిధులు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వ వలసిన అధికారులు నాయకులు ఇన్నేళ్లు గడచినా సరైన ప్రయత్నం చేయలేదు అని గ్రామస్థులు పిర్యాదు చేస్తున్నారు 40 లక్షలు ప్రజాధనం ఇలా వృర్ధం అవడం ద్వారా ప్రజలకు అధికారులు ఏం మెసేజ్ ఇవ్వాలి అనుకుంటున్నారో చెప్పాలి ఎన్ని కారణాలు చెప్పినా వృర్థం అని ఎదో లా భవనాలు వినియోగం లోకి తేవడం ముఖ్యం అని ప్రజలు కోరుకుంటున్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

మెరకముడిదాం, మే 24 ప్రభాతవార్త : మండలంలో ఆదివారం మెరకముడిదాం గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గర్భాం మరియు బుధ రాయవలస వై జంక్షన్ వద్ద మండు వేసవిని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధ రాయవలస స్టేషన్ ఎస్ఐ జె. లోకేష్ కుమార్ చేతుల మీదగా ఈ మజ్జిగ చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ప్రయాణికుల సంక్షేమం దృష్ట్యా ఇలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల గ్రామీణ వైద్యుల సంఘాన్ని అంతా అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయనగరానికి చెందిన ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ శశిధర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఎ.ఎన్. శర్మ, ఎం వి రమణ, మారుతి ఆనంద్, తిరుమల, ఎ.పి.శర్మ, దుర్గాప్రసాద్, గౌరి నాయుడు, పి గౌర్నాయుడు, సత్యనారాయణ, తదితర గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీగా వరహాలరావుకు ఉద్యోగోన్నతి

-సారిపల్లి గ్రామస్తుల అభినందనలు

నెల్లిమర్ల, మే 24, ప్రభాత వార్త: మండలంలోని సారిపల్లి గ్రామానికి చెందిన ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (యస్.పి.ఎఫ్) కానిస్టేబుల్ పాలూరి వరహాలరావుకు హెడ్ కానిస్టేబుల్ గా ఉద్యోగోన్నతి లభించింది. అమరావతిలోని ఏపీ ఎస్పీఎఫ్ డీజీపీ కార్యాలయంలో ప్రమోషన్ లెటర్ అందుకున్నారు. వరహాలరావు గత 25 ఏళ్లుగా ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ గా సేవలందిస్తున్నారు. విజయవాడ, తిరుమల, కడప, కాకినాడ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు. గ్రామంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు పలు సబ్జెక్టులు బోధించారు. ప్రమోషన్ పొందిన వరహాలరావును గ్రామపెద్దలు బోనుమహంతి ఆదినారాయణ, మజ్జి రామారావు, సారిపల్లి బాబూరావు, సహోద్యోగులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

లక్క వరపు కోట మే 24 ప్రభాత వార్త : మండలం లోని కొట్యాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 2010-11 పదవ తరగతి చదువు కున్న పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం ఆదివారం కొట్యాడ పాఠశాలలో ఏర్పాటు చేయడం జరిగింది పూర్వ విద్యార్థులు అందరూ కలుసుకొని ఆనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు మరియు వారికి చదువు నేర్పిన గురువులందరినీ ఆహ్వానించి వారిని ఘనంగా సత్కరించారు ఆనాటి ఉపాధ్యాయులు సుమారు 15 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు ముఖ్యంగా వాళ్ళు చదువుకునే సమయం లో ఎచ్ ఏం గా వున్నా కీ. శే . ముత్యం మాస్టర్ని అందరూ గుర్తు చేసుకున్నారు ఆయన చిత్రపటానికి పూలమాలేసి కార్యక్రమం ప్రారంభించారు అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి సందేశాలు ఇచ్చారు విద్యార్థులు కూడా ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు ప్రస్తుతంఎవెరెవరు ఎంత వరకు ఉన్నత విద్య చదివారు వారు ఎలా ఎక్కడ స్థిర పడ్డారో తెలియజేసారు మధ్యాహ్న విందు భోజనం కూడా ఏర్పాటు చేశారు అనంతరం గ్రూప్ ఫోటో దిగి పూర్వ విద్యార్థులు ఆనందంగా ఈ గెట్ టుగెదర్ జరుపుకున్నారు . ఉపాధ్యాయులకి మంచి బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో అప్పటి ఉపాధ్యాయులు ప్రస్తుత ఉపాధ్యాయులు జగన్ మోహన్ బాబు పార్వతీసం మాస్టర్ మరియు గుమ్మడి శ్రీనివాసరావు కూడా హాజరయ్యారు . పాఠశాల అభివృద్ధికి తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు విద్యార్థులు చెప్పారు.

రజకుల సంఘం రాష్ట్ర సమావేశానికి జిల్లా నాయకులు

నెల్లిమర్ల, మే 24(ప్రభాతవార్త): పల్నాడు జిల్లా దాచేపల్లి మండలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజకుల ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో విజయనగరం జిల్లా రజక సంఘం అధ్యక్షులు తంగేటి భాస్కరరావు, జాయింట్ సెక్రటరీ సింహాచలం, సలహాదారు చల్లారావు, యువజన విభాగం అధ్యక్షులు సతీష్ , ఉపాధ్యక్షులు దేవుడు బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లాలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా రజకులను బీసీ ఏ నుంచి ఎస్సి జాబితా లోనికి మార్పు చేయాలన్న ప్రధాన డిమాండ్ పై తీర్మాణం చేసినట్లు జిల్లా అధ్యక్షులు తంగేటి భాస్కరరావు తెలిపారు.

మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ స్వల్ప సహాయం

సాలూరు, మే24 ప్రభాతవార్త : సాలూరు మండలం చిన్న బోరబంద గ్రామానికి చెందిన చిత్త సుఖేష్ (20) కు ఈమధ్యన రోడ్డు ప్రమాదంలో మెదడు బలంగా గాయపడింది.వెంటనే విశాఖపట్నం మెడికల్ హాస్పిటల్ కి తరలించగా అక్కడ వైద్యులు అతనికి వెంటనే ఆపరేషన్ చేయాలని సుమారుగా 2 నుంచి 3 లక్షల అవుతుందని చెప్పారు. దీంతో గౌరమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారు అండ్ మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ అధ్యక్షుడు ఇప్పిలి.దిలీప్ కుమార్ ఇంకా సభ్యులు సుఖేష్ నివాసానికి ఆదివారం వెళ్లి అతని కుటుంబ సభ్యులకు 10 వేలు రూ,,అందజే సారు.అలాగే ఇతరులు కూడా చిత్త.సుఖేష్‌కు ఆర్థిక సహాయం అందజేయాలని దీలీప్ కోరారు. క్రీస్తురాజు,కృష్ణవేణి,శ్యామల,రాజు పాల్గొన్నారు.

రాయల్‌గా ప్లే ఆఫ్‌లోకి రాజస్థాన్

***ఆర్చర్ ఆల్‌రౌండ్ షో * ముంబైపై విక్టరీ * పంజాబ్ కింగ్స్ ఆశలు గల్లంతు * తొలి ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్‌తో ఢీ ***

అందరి చూపు వాంఖడేపైనే. ఐపీఎల్‌లో ఇప్పటివరకు జరిగిన 68 మ్యాచ్‌లు ఒకెత్తయితే, ఇది నాలుగు జట్ల భవిష్యత్తును నిర్ణయించే మ్యాచ్. మైదానంలో ఆడుతున్న జట్లలో ముంబైకైతే గెలిచినా, ఓడినా పరక్ పడదు. గుజరాత్ రాయల్స్‌కైతే డూ ఆర్ డై, గెలిస్తేనే ముందుకు. ఆ జట్టుతో పాటు మరో మూడు జట్లు పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు మైదానంలో ఆడకున్నా ఈ ఫలితంపై వారి భవిష్యత్తు. చివరకు ఒక్క హాఫ్ సెంచరీ నమోదుకాకున్నా తలా ఓ చేయి వేసి మొదట ముంబైకు 206 టార్గెట్ ఇచ్చారు. 200 ప్లస్ దాకా రావడం అంటేనే గ్రేట్. అలాంటిది ఈ స్కోరును కాపాడుకుంటూ స్టార్ ఆటగాళ్లున్న ముంబైను ముకుతాడు వేశారు. అనుకున్నది సాధించారు. నాలుగో ప్లే ఆఫ్ బెర్త్‌ను అందుకున్నారు.

ముంబై: రాజస్థాన్ రాయల్స్ గెలిచి నిలిచింది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై 30 పరుగుల తేడాతో విజయం సొంతంచింది. మొదట 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసిన రాజస్థాన్ రాయల్స్... ఆ తర్వాత ముంబైని 20 ఓవర్లలో 9 వికెట్లకు 175 పరుగులకే పరిమితం చేసింది. పంజాబ్ కింగ్స్, కోల్‌కతా ఆశలపై నీళ్లు చల్లుతూ ప్లే ఆఫ్‌లోకి దూసుకెళ్లింది. 26న న్యూ చండీఘర్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడేందుకు సిద్ధమైంది.

లక్ష్య ఛేదనలో ముంబై ఇండియన్స్ మరోసారి తడబడింది. కనీసం పరుగుల ఖాతా కూడా ఓపెన్ చేయకుండానే మొదటి వికెట్ కోల్పోయింది. హిట్ మ్యాన్ రోహిత్‌శర్మను జోఫ్రా ఆర్చర్ డకౌట్ చేశాడు. అదే ఓవర్లో తన రెండో ఓవర్‌లో నమన్ ధీర్(6)ను అద్భుత బంతితో క్లీన్ బౌల్డ్ చేశాడు. మరో ఎండ్ నుంచి బర్గర్...రికెల్టన్(12)ను అవుట్ చేసి ముంబైని మరో దెబ్బతీశాడు. క్రీజులోకి వచ్చిన తిలక్(3) కూడా పెవిలియన్‌కు క్యూ కట్టాడు. దీంతో ముంబై 38 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది.

ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన విల్ జాక్స్ కిరాక్ షాట్లతో బెంబేలెత్తించాడు. 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సులతో 33 పరుగులు చేసిన జాక్స్ దూకుడుకు యుధ్‌వీర్ పుంజా ఫుల్ స్టాప్ పెట్టాడు. ఇక కెప్టెన్ హార్దిక్ పాండ్యా (15బంతుల్లో 34; 3 ఫోర్లు, 2 సిక్సులు) క్రీజులోకి రాగానే భారీ షాట్లతో రాయల్స్ జట్టులో ఆందోళన రేపాడు. మరో ఎండ్‌లో క్రీజ్‌లో నిలదొక్కుకున్న సూర్యకుమార్(42 బంతుల్లో 60; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కూడా భారీ షాట్లు ఆడుతూ ముంబై గెలిచే ఊపులో కనిపించింది. ఈ దశలో మరోసారి ఆర్చర్ మ్యాజిక్ చేశాడు. హార్దిక్ పాండ్యాను అవుట్ చేశాడు. మరో ఎండ్‌లో బర్గర్, యష్ పుంజా, బ్రిజేష్ వికెట్లు తీయడంతో ముంబై 175 రన్స్‌కే పరిమితమైంది. రాజస్థాన్ బౌలర్లలో ఆర్చర్ 3వికెట్లు.. బర్గర్, బ్రిజేష్, యష్‌రాజ్ రెండేసి వికెట్లు పడగొట్టారు.

ఆరంభంలో తడబడ్డ రాజస్థాన్

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్‌కు యశస్వీ జైస్వాల్(17 బంతుల్లో 27) ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. మూడు సిక్స్‌లతో విరుచుకుపడ్డ యశస్వీ.. స్పిన్నర్ విల్‌జాక్స్ బంతిని బాదే ప్రయత్నంలో అవుటయ్యాడు. జైస్వాల్ అవుట్ తర్వాత స్కోరు పెంచే ప్రయత్నంలో వైభవ్(4)కూడా అదేస్కోరు వద్ద చాహర్‌కు చిక్కాడు. దీంతో 33 పరుగుల వద్దే ఇద్దరు ఓపెనర్లు అవుటవడంతో రాజస్థాన్ తడబడింది. క్రీజ్‌లోకి వచ్చిన కెప్టెన్ రియాన్(14) రెండు ఫోర్లు,ఓ సిక్స్‌తో చెలరేగాడు. అదే క్రమంలో ఘజన్‌ఫర్ బంతిని స్టాండ్స్‌లోకి ఆడే ప్రయత్నం చేయగా, బౌండరీ లైన్ పైన అంతెత్తున ఎగిరి తిలక్ వర్మ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. దీంతో రాజస్థాన్ 54 పరుగులకే 3 టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయింది.

మిడిల్ ఓవర్లలో పుంజుకుని...

కష్టాల్లో పడ్డ రాజస్థాన్‌ను ధ్రువ్ జురెల్(26 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), దాసున్ షనక(15 బంతుల్లో 29; 3 సిక్స్‌లు)లు కాసేపు వికెట్ల పతనానికి అడ్డుగా నిలిచారు. ముఖ్యంగా షనక... ధాటిగా ఆడుతూ స్కోరును పరిగెత్తించాడు. వందకు చేరువవుతున్న దశలో లేని పరుగుకు యత్నించి రనౌటయ్యాడు. దీంతో 45 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. షనక అవుటైన తర్వాత జురెల్ గేర్ మార్చి ఆడే ప్రయత్నం చేశాడు. కార్బిన్ బాష్ యార్కర్ లెంగ్త్ బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. క్రీజ్‌లోకి వచ్చిన డోనోవన్ ఫెరీరా (18) దీపక్ చాహర్ బౌలింగ్‌లో, శుభమ్ దూబే (5) శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో వరుసగా అవుట్ అవుటయ్యారు.

స్లాగ్ ఓవర్లలో ఆర్చర్ మెరుపులు

స్లాగ్ ఓవర్లలో టెయిలెండర్లు దూకుడు చూపారు. జోఫ్రా ఆర్చర్(15 బంతుల్లో 32; 1ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. ముంబై బౌలర్లపై సిక్స్‌లతో విరుచుకుపడుతూ రాజస్థాన్ స్కోరును 175 దాటించాడు.ఇక ఇంపాక్ట్ ప్లేయర్‌గా క్రీజ్‌లోకి వచ్చిన రవీంద్ర జడేజా(11 బంతుల్లో 19), నండ్రె బర్గర్(3 బంతుల్లో 10) చివరి ఓవర్లలో 30పరుగులు జోడించడంతో రాజస్థాన్ స్కోరు 200 పరుగులు దాటింది. మిడిల్ ఓవర్లలో పుంజుకుని.. గట్టిగా నిలబడి రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగులు భారీ స్కోరు చేసింది. ముంబై బౌలర్లలో దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

విజయంతో ముగించిన ఢిల్లీ క్యాపిటల్స్

కోల్‌కతా: ఐపీఎల్ ఈ సీజన్‌లో ప్లే ఆఫ్ చేరడంలో విఫలమైన ఢిల్లీ క్యాపిటల్స్ గెలుపుతో ముగించింది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన నామమాత్ర మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను 40 పరుగుల తేడాతో ఓడించింది. మొత్తం ఏడు విజయాలతో 14 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. కోల్‌కతా 13 పాయిట్లతో ఏడో స్థానం పొందింది. రెండు జట్లు కూడా ప్లే ఆఫ్ చేరకుండానే ఐపీఎల్ నుంచి నిష్క్రమించాయి.

మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. అభిషేక్ పొరెల్(18బంతుల్లో 22)తో కలిసి కెఎల్ రాహుల్ (30 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఫ్లయింగ్ స్టార్ట్ అందించాడు. పొరెల్ ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. అతను అవుటైన తర్వాత రాహుల్ ఎదురుదాడికి దిగాడు. తన క్లాసీ షాట్లతో అలరించాడు. కోల్‌కతా బౌలర్లను చితక్కొడుతూ 24 బంతుల్లోనే 3 ఫోర్లు, 4 సిక్స్‌ల సహాయంతో మెరుపు హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. చివరకు రాహుల్ ఇన్నింగ్స్‌కు అనుకుల్ రాయ్ తెరదించాడు. మరోవైపు క్రీజ్‌లోకి వచ్చిన సాహిల్ పారిఖ్(17 బంతుల్లో 24), అక్షర్ పటేల్(25 బంతుల్లో 39), డేవిడ్ మిల్లర్ (19 బంతల్లో 28), అషుతోష్ శర్మ(11 బంతుల్లో 18) ధాటిగా ఆడడంతో ఢిల్లీ స్కోరు 200 మార్కు దాటింది.

అనంతరం లక్ష్యఛేధనలో తడబడ్డ కోల్‌కతా 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది. ఢిల్లీ బౌలర్లు కోల్‌కతా ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ముఖ్యంగా కుల్‌దీప్ స్పిన్ తిప్పేశాడు. చివరి నాలుగు వికెట్లు 9 పరుగులకే పడ్డాయి. కెప్టెన్ రహానే 63 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కోల్‌కతా బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్, ఎంగిడి మూడేసి వికెట్లు, స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టారు.



100 మీటర్లలో సరికొత్త రికార్డు

అథ్లెటిక్స్‌లో నయా చిరుత

రాంచీ: భారత అథ్లెటిక్స్‌లోకి సరికొత్త చిరుత దూసుకువచ్చింది. రాంచీలో జరుగు తున్న 2026 అథ్లెటిక్స్ ఫెడరేషన్ కప్‌లో పంజాబ్‌కు చెందిన 25 ఏళ్ల గురిందర్‌వీర్ చిరుతలా పరుగెత్తాడు. పురుషుల 100 మీటర్ల ఫైనల్‌లో కేవలం 10.09 సెకన్లలోనే గమ్యాన్ని చేరి సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. స్వర్ణాన్ని అందుకున్నాడు. అనిమేష్ కుజుర్ (10.20 సెకన్లు) రజతం, ప్రణవ్ గురవ్ (10.29 సెకన్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు.

తన అద్భుత ప్రదర్శనతో గురిందర్‌వీర్ భారత అథ్లెటిక్స్ చరిత్రలో ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించాడు. 10.10 సెకన్ల కంటే తక్కువ సమయంలో 100 మీటర్ల దూరాన్ని పూర్తి చేసిన మొట్టమొదటి భారత అథ్లెట్‌గా నిలిచాడు. సెమీఫైనల్లో 10.17 సెకన్ల టైమింగ్ నమోదుచేసిన గురిందర్ సింగ్... తన రికార్డును మరింత మెరుగుపర్చుకున్నాడు.

అద్భుతమైన టైమింగ్‌తో గురిందర్‌వీర్ 2026 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించాడు. కామన్వెల్త్ క్రీడల అర్హత మార్క్ 10.16 సెకన్లు కాగా.. దాన్ని గురిందర్‌వీర్ సునాయాసంగా అధిగమించాడు. ఇక విశాల్ 400 మీటర్ల పరుగులో 44.98 సెకన్లతో జాతీయ రికార్డు నెలకొల్పాడు.

500 బిలియన్ డాలర్ల దిగుమతులకు అంగీకారం

ఐదేళ్లపాటు అమెరికా ఉత్పత్తుల కొనుగోళ్లు

న్యూఢిల్లీ, మే 24: అమెరికా ఉత్పత్తులను వచ్చే ఐదేళ్లపాటు 500బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు కొనుగోలు చేసేందుకు భారత్ డీల్ కుదిరిందని, ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయం రంగాలే ప్రధానంగా భారత్‌తో చర్చలు కూడా పూర్తి చేసినట్లు విదేశాంగమంత్రి మార్కో రుబియో అన్నారు. వాణిజ్యం, భద్రత, ప్రాంతీయ అంశాలవారీగా భారత ప్రతినిధి బృందంతో అమెరికా బృందం సమగ్ర చర్చలుజరిగాయన్నారు. క్వాడ్ మంత్రుల సమావేశాలో పాల్గొనేందుకు భారత్‌లో నాలుగు రోజుల పర్యటనకు వచ్చిన రుబియో ఇంధన భద్రత, వాణిజ్య రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. భారత్‌నుంచి అమెరికాకు ఎగుమతులతో పాటు అమెరికానుంచి భారత్‌కు వచ్చే దిగుమతులపైనా ఎక్కువ చర్చలుజరిగాయి. ఇందుకోసం తమకు భారత ప్రభుత్వంనుంచి 500 బిలియన్ డాలర్లమేర ఉత్పత్తుల కొనుగోలుకు అంగీకార ఒప్పందం జరిగిందని రుబియో చెప్పారు. అలాగే అమెరికా భారత్‌లమధ్య వాణిజ్య ఒప్పందం సత్వరమే ఖరారవుతుందన్న విశ్వాసం ప్రకటించారు. చర్చల్లో సానుకూలత పెరిగిందని, తుదిదశకు వాణిజ్య ఒప్పందం చేరుకుంటున్నట్లు ఆదేశ విదేశాంగమంత్రి వెల్లడించారు. వాణిజ్యం, ఇతర రాంగాల్లో కేవలం మిత్రలుగానే కాకుండా వ్యూహాత్మక మైత్రీబంధం రెండుదేశాలమధ్య పెరుగుతున్నదని రుబియో ఆశాభావం వ్యక్తంచేసారు.

భారీ డివిడెండ్ ప్రకటించిన 3ఎం ఇండియా

ముంబయి, మే 24: టెక్నాలజీ అండ్ సైన్స్ దిగ్గజ కంపెనీ 3ఎం ఇండియా ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం ఫలితాల్ని ప్రకటించడంతో పాటు డివిడెండ్ కూడా ప్రకటించింది. ఫైనల్ డివిడెండ్ రూ. 160 తో పాటు రూ.346 స్పెషల్ డివిడెండ్ కూడా ప్రతిపాదించింది.మొత్తంగా చూస్తే ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.506 చొప్పున డివిడెండ్ అందించనుంది. రూ. 10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుకు ఈ స్థాయిలో అర్హులైన షేర్ హోల్డర్లకు డివిడెండ్ ఇవ్వనుంది. ఇక ఈ డివిడెండ్ చెల్లింపులకు జులై 17 రికార్డ్ డేట్‌గా ప్రకటించింది. ఆ తేదీలోపు ఈ సంస్థ షేర్లను కలిగి ఉన్న వారు డివిడెండ్ పొందేందుకు అర్హులు అన్నమాట. ఆగస్టులో జరగనున్న తమ 39వ వార్షిక సర్వసభ్య సమావేశంలో బోర్డు, షేర్ హోల్డర్ల ఆమోదానికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని స్పష్టం చేసింది. ఇక్కడ ఆమోదం లభిస్తే అప్పటి నుంచి 30 రోజుల్లోగా డివిడెండ్ చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొంది. ఈ కంపెనీ ఈ స్థాయిలో డివిడెండ్ ప్రకటించడం ఇదేం తొలిసారి కాదు. ఇలా భారీ డివిడెండ్స్ గతంలోనూ ఆఫర్ చేసింది. 2025 జులైలో ఫైనల్ డివిడెండ్, స్పెషల్ డివిడెండ్ కలిపి రూ. 535 చొప్పున చెల్లించగా దానికి ముందటి ఏడాది రూ. 685 అందించింది. 2023 జులైలో రూ. 100 డివిడెండ్ ఆఫర్ చేయగా 2022 నవంబరులో స్పెషల్ డివిడెండ్ ఏకంగా రూ. 850 ఆఫర్ చేయడం విశేషం.

టాప్10 బిలియనీర్ల సంపద 3.93 లక్షల కోట్లు

ముంబై: ఫోర్బ్స్ 2026 ప్రపంచ బిలియనీర్ల జాబితాలో భారత రియల్ ఎస్టేట్ రంగం తన సత్తా చాటింది. ఈ జాబితాలో 13 మంది భారత రియల్టీ దిగ్గజాలు స్థానం సంపాదించగా, వారిలో హైదరాబాద్‌కు చెందిన మై హోమ్ గ్రూప్ అధినేత జుపల్లి రామేశ్వర్ రావు మరోసారి తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. మొదటిస్థానంలో ఎప్పటిలాగే డిఎల్‌ఎఫ్ నిలిచింది. మాజీ ఛైర్మన్ సిఇఒ కుశాల్ సింగ్ అగ్రస్థానంలో నిలిస్తే లోథాగ్రూపు, రహేజాకార్ప్ వరుసగా రెండుమూడు స్థానాల్లో నిలిచాయి. గత ఏడాదితో పోలిస్తే రియల్టీ బిలియనీర్ల సంఖ్యలో మార్పులేదు. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం, మైహోమ్స్ రామేశ్వర్ రావు భారత రియల్టీ బిలియనీర్ల జాబితాలో ఆయన 6వ స్థానంలో నిలిచారు. ఆయన సంపద రూ.22,011కోట్లుగా ఉంది. సకాలంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం వల్లే భారత రియల్టీ వ్యాపారులు తమ సంపదను కాపాడుకోగలిగారని ఫోర్బ్స్ ఇండియా విశ్లేషించింది.

మైహోమ్స్‌తో పాటు డిఎల్‌ఎఫ్ మాజీ సిఇఒ కుశాల్‌పాల్ సింగ్, లోథా గ్రూప్ వ్యవస్థాపకుడు మంగళ్ ప్రభాత్ లోథా, కె.రహేజా కార్ప్ ఛైర్మన్ చంద్రు రహేజా, ఒబరాయ్ రియాల్టీ ఛైర్మన్ వికాస్ ఒబెరాయ్, ఫోనిక్స్ మిల్స్ అతుల్ రూయా, ఫైవ్ హోల్డింగ్స్ ఛైర్మన్ కబీర్ ముల్చందానీ, కల్పతరు ఫౌండర్ మొఫత్‌రాజ్ మునోత్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ నుంచి రెజ్వాన్ ఇర్ఫాన్, నోమన్‌రజాక్‌లు బిలియనీర్స్ టాప్ టెన్ జాబితాలో చేరారు. మొత్తం టాప్‌టెన్ రియాల్టీ బిలియనీర్ల సంపద భారత్‌వరకే రూ.3.93 లక్షలకోట్లకుపైగా ఉన్నట్లు ఫోర్బ్స్ వెల్లడించింది.

పెట్రోలుపై రూ.13, డీజిల్‌పై రూ.38 చొప్పున నష్టం

చమురు కంపెనీలకు ఇప్పటికీ నష్టాలే

ముంబయి, మే 24: పదిరోజుల్లోపే వరుసగా మూడుసార్లు పెట్రోలుడీజిల్‌ధరలు పెంచినప్పటికీ చమురు మార్కెటింగ్‌కంపెనీలకు ఇంకా నష్టాలు ఎదురవుతూనే ఉన్నాయి. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో చమురు సరఫరాలో ఆటంకాలు, ముడిచమురు కొరతకారణంగా ధరలు పెంచుతున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో కూడా ముడిచమురు బ్యారెల్‌కు 100 డాలర్లకుపైబడటంతో చమురుశుద్ధి కంపెనీలకు ఈ భారం మరింత పెరుగుతోంది. ఇప్పటికీ కూడా పెట్రోలుపై లీటరుకు 13, డీజిల్‌పై రూ.38 చొప్పున నష్టాలు భరించాల్సి వస్తోందని చెపుతున్నాయి. సర్దుబాట్లు జరుగుతున్నప్పటికీ చమురు కంపెనీలకు నష్టాలభారం రూ.1.98 లక్షలకోట్లు అని ఇప్పటికే ప్రకటించాయి. ఈ ధరల పెంపును ప్రకటించకముందు కేంద్ర పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్‌పూరి మాట్లాడుతూ రోజుకు రూ.1000 కోట్లు నష్టం ఎదుర్కొంటున్నాయని, పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ సిలిండర్లను తక్కువధరలకే అందిస్తున్నట్లు గుర్తుచేసారు. సమిష్టిగా ఈ మూడు విభాగాల్లో రూ.1.98 లక్షలకోట్లు నష్టం వస్తోందని చెప్పిన సంగతి తెలిసిందే.

పెట్రోలు డీజిల్‌దరలు రూ.3 చొప్పున పెంచిన తర్వాత కూడా ఇక్రారేటింగ్స్ అంచనాలప్రకారం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు రోజుకు రూ.500 కోట్లు నష్టం ఎదుర్కొనక తప్పదని అంచనా వేసాయి. అందువల్ల భవిష్యత్తులో మరిన్ని రేట్లపెంపు ఉంటాయనికూడా హెచ్చరించింది. ఇప్పటికి మూడుసార్లు ధరలు పెంచిన పెట్రో డీజిల్‌కంపెనీలు భవిష్యత్తులో నష్టాలను పూర్తిగా భర్తీచేసుకునేందుకు రేట్లపెంపు ఒక్కటే మార్గమని సంకేతాలిస్తున్నాయి. హార్ముజ్ జలసంధి ఉద్రిక్తతలు, పశ్చిమాసియా యుద్ధ విరమణ అంటూ జరిగితే కొంతమేర ఉపశమనం లభిస్తుందని, లేనిపక్షంలో ధరల పెరుగుదల ఒక్కటే మార్గమని కూడా రేటింగ్ సంస్థలు అంచనావేసాయి.

భారీగా ఆరు కంపెనీల మార్కెట్

రూ.74,112కోట్ల ఎంక్యాప్ వృద్ధి

ముంబయి, మే 24: దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారంలో సానుకూలంగా స్పందించడంతో దేశంలోని టాప్10 కంపెనీలలో ఆరు కంపెనీల మార్కెట్ విలువ భారీగా పెరిగింది. ఈ ఆరు కంపెనీల సంయుక్త మార్కెట్ విలువలు ఏకంగా రూ.74,111.57 కోట్లు వృద్ధి చెందింది. ఈక్విటీ మార్కెట్లలో సానుకూల ధోరణి కనిపించడంతో ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్, ఎల్‌ఐసీ వంటి దిగ్గజాలు లాభాల్లో పయనించాయి. గడిచిన వారంలో లాభపడిన కంపెనీలలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అగ్రస్థానంలో నిలిచింది. టీసీఎస్ మార్కెట్ విలువ అత్యధికంగా రూ.19,338.68 కోట్లు పెరిగి రూ.8,38,401.33 కోట్లకు చేరింది. ఆ తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.14,515.93 కోట్లు ఎగబాకి రూ.9,06,901.32 కోట్లకు చేరుకుంది.లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎల్‌ఐసీ మార్కెట్ విలువ రూ.9,076.37 కోట్లు పెరిగి రూ.5,14,443.69 కోట్లకు చేరగా, బజాజ్ ఫైనాన్స్ విలువ రూ.3,797.83 కోట్లు పెరిగి రూ.5,70,515.57 కోట్లకు చేరుకుంది. లార్సెన్ అండ్ టూబ్రో సంపద కూడా రూ.2,685.87 కోట్లు పెరిగి మొత్తం రూ.5,40,228.21 కోట్లుగా నమోదైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) తమ మార్కెట్ విలువలు కొంతమేర కోల్పోయాయి. అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ క్యాప్ రూ.20,229.67 కోట్లు తగ్గి రూ.11,40,295.49 కోట్లకు పడిపోయింది. హిందుస్థాన్ యూనిలీవర్ విలువ రూ.16,212.18 కోట్లు,ఎస్బీఐ విలువ రూ.12,784.4 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలువ రూ.2,094.35 కోట్లు చొప్పున తగ్గాయి. దేశంలో అత్యంత విలువైన కంపెనీల ర్యాంకింగ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆ తర్వాత భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్బీఐ, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్ ఉన్నాయి.

ఐపిఒకు వస్తున్న ఎస్ఎంఆర్ జ్యూయెల్స్

ముంబయి, మే 24: లిస్టింగ్ గెయిన్స్ పొందాలనుకునే స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్ల కోసం కొత్త ఎస్ఎంఈ ఐపీఓ అందుబాటులోకి వస్తోంది. సాంప్రదాయ బంగారు ఆభరణాలతోపాటు హెరిటేజ్ డిజైనర్ నగల తయారీ, పెళ్లిళ్లు, పండగల కోసం సరికొత్త డిజైన్లను రూపొందించే కంపెనీ ఎస్ఎంఆర్ జ్యూవెల్స్ లిమిటెడ్ పబ్లిక్‌ఇష్యూకు వస్తోంది. ఈ ఐపీఓ సబ్‌స్క్రిప్షన్ మే 26వ తేదీన ప్రారంభమవుతోంది. ఈ కొత్త పబ్లిక్ ఇష్యూ 29వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఈ ఐపీఓ ద్వారా ఎస్ఎంఆర్ జ్యూయెల్స్ కంపెనీ మొత్తం రూ. 67.23 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఐపీఓ ప్రైస్ బ్యాండ్ ఒక్కో ఈక్విటీ షేరుకు రూ. 128 నుంచి రూ. 135గా నిర్ణయించింది. ఈ ఐపీఓలో పాల్గొనాలనుకునే వారు కనీసం 1000 షేర్లు కొనుగోలు చేయాలి అంటే రూ. 2.70 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇక కంపెనీ షేర్లు జూన్ 3వ తేదీన బీఎస్ఈ సహా ఎస్ఎంఈలో లిస్టింగ్ కానున్నాయి.ఈ ఐపీఓ ద్వారా కంపెనీ రూ. 10 ఫేస్ వ్యాల్యూ ఉన్న 2.49లక్షల షేర్లు విక్రయిస్తోంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.3 కోట్లు సమీకరించనుంది.



పబ్లిక్‌కి రూ. 10 ఫేస్ వ్యాల్యూ గల 47.31లక్షల షేర్లను విక్రయించనుంది. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.64 కోట్లు పొందనుంది. ఈ ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం, సాధారణ కార్పొరేట్ అవసరాలు, అదే విధంగా కంపెనీ తీసుకున్న లోన్స్ పూర్తిగా లేదా పాక్షికంగా పేమెంట్ చేసేందుకు ఉపయోగించాలని తెలిపింది.

చివరగా మూలధన వ్యయం అవసరాల కోసమూ వినియోగించనుందని తెలిపింది. ఇష్యూకు పూర్వ షేర్ రిజిస్ట్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరించనుండగా, వెల్త్ మైన్ నెట్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఐపీఓ బుక్ రన్నింగ్ లీడ్ మ్యానేజర్‌గా వ్యవహరించనుంది. ఐపీఓలో రిటైల్ ఇన్వెస్టర్లకి 47.49 శాతం ఎన్ఐఐలకి 38.01 శాతం వాటా,మార్కెట్ మేకర్స్‌కి 5 శాతం వాటా, చివరగా క్యూఐబీలకి 9.50 శాతం వాటాని కంపెనీ కేటాయించింది. ఈ ఐపీఓ డేట్స్ పరిశీలిస్తే జూన్ 1 షేర్స్ ఎలాట్మెంట్ ఉండనుంది. జూన్ 2వ తేదీన ఎలాట్మెంట్ వచ్చిన వారికి డీమ్యాట్ అకౌంట్లోకి షేర్లు క్రెడిట్ అవుతాయి. అలాగే ఈ కంపెనీ షేర్లు జూన్ 3వ తేదీన బీఎస్ఈ ఎస్ఎంఈలో లిస్టింగ్ అవుతుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.